ఈనాడు



విజయవాడ 10-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 151


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 24

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




R.S. Brothers™
MEGA SHOPPING MALL
RUPEE SALE
1 RUPEE 2000
PURE LINEN COTTON @ ₹499 GET 2ND SAREE@ ₹1
AMBANI SAREE @ ₹798 GET 2ND SAREE@ ₹1
PURE BANARASI @ ₹850 GET 2ND SAREE@ ₹1
PURE SAIYAARA @ ₹1195 GET 2ND SAREE@ ₹1
KEERTHY SILK @ ₹1250 GET 2ND SAREE@ ₹1
BANARASI KATAN SILK @ ₹2495 GET 2ND SAREE@ ₹1
సంక్రాంతి ఆఫర్లు
SUBHASH
పట్టు చీరలపై ప్రత్యేకమైన ఆఫర్లు మీకోసం...
BUY 3 @ ₹500 RANG COTTON SAREE
BUY 3 @ ₹550 TURKEY SILK
BUY 3 @ ₹598 LINEN COTTON SAREE
KANJIVARAM BROCADE SAREE ₹1198 ₹599 50% OFF
₹325 ₹199 KAVERI PRINT SAREE
₹478 ₹295 SINDOOR SILK SAREE
₹795 ₹350 MOKSHA PATTU SAREE
₹850 ₹395 DEEPIKA WORK SAREE
₹895 ₹450 BANGLORE SILK SAREE
₹950 ₹495 SRI VALLI SAREE
₹1395 ₹650 CHINNON PATTU SAREE
50% OFF ₹398 ₹199 NAVYA TISSUE SAREE
50% OFF ₹550 ₹275 RICCO PATTU SAREE
50% OFF ₹596 ₹298 VISTHARA PRINT SAREE
50% OFF ₹598 ₹299 DOLA PRINT SAREE
50% OFF ₹650 ₹325 VISCOS PRINT SAREE
50% OFF ₹698 ₹349 GATTU SILK SAREE
50% OFF ₹798 ₹399 TUSSER SILK SAREE
50% OFF ₹950 ₹475 DHARMAVARAM SILK SAREE
50% OFF ₹1198 ₹599 TISSUE PATTU SAREE
50% OFF ₹1250 ₹625 BANARASI PATTU SAREE
50% OFF ₹1498 ₹749 MAHESHWARI PATTU SAREE
50% OFF ₹1550 ₹775 JOHRIVAAJ CATALOG SAREE
SAREES
*Conditions Apply
PATTU SAREE
BUY 1 MEENAKARI PATTU SAREE @4995 & GET 2ND SAREE @ ₹49
BUY 1 POCHAMPALLY WORK SAREE @3995 & GET 2ND SAREE @ ₹39
LADIES WESTERN & LEISURE WEAR
BUY 5 @ ₹500 DUPATTAS
BUY 4 @ ₹500 COTTON NIGHTY
BUY 3 @ ₹555 PRINTED PLAZO
UPTO 50% OFF ₹595 KURTHIS
UPTO 50% OFF ₹695 KURTHIS
UPTO 50% OFF ₹695 STRAGHIT PANTS
UPTO 50% OFF ₹795 KURTHIS
BUY 2 @ ₹799 ALPINE NIGHY
UPTO 50% OFF ₹895 KURTHIS
UPTO 50% OFF ₹995 KURTHIS
UPTO 50% LADIES JEANS
UPTO 30% OFF HEAVY WORK LEHENGAS
BUY 3 @ ₹1199 NIGHT DRESS
BUY 2 @ ₹1499 COTTON PATIYALA SUIT
BUY 2 @ ₹2599 FANCY LEHENGAS
GIRLS WEAR
UPTO 50% OFF ₹495 GIRLS SKIRTS
BUY 4 @ ₹500 GIRLS SHORTS
BUY 4 @ ₹500 GIRLS PYJAMA
BUY 4 @ ₹550 GIRLS PYJAMA
BUY 4 @ ₹550 GIRLS T-SHIRTS
BUY 4 @ ₹600 GIRLS TRACK PANT 3/4
BUY 3 @ ₹695 GIRLS COTTON FROCKS
BUY 3 @ ₹895 GIRLS COTTON FROCKS
BOYS WEAR
BUY 4 @ ₹550 BOYS T-SHIRTS
BUY 4 @ ₹595 BOYS T-SHIRTS
BUY 4 @ ₹600 BOYS T-SHIRTS
UPTO 50% OFF ₹645 BOYS SHIRTS
UPTO 50% OFF ₹695 BOYS SHIRTS
BUY 3 @ ₹745 BOYS T-SHIRTS -NECKER
UPTO 50% OFF ₹995 PANTS
UPTO 50% OFF ₹1095 PANTS
UPTO 50% OFF ₹1195 PANTS
MENS WEAR
spykar BUY 1 @ 40% OFF BUY 2 @ 50% OFF
Allen Solly BUY 3 @ 40% OFF BUY 3, GET 3 FREE
VAN HEUSEN BUY 1 @ 20% OFF BUY 2 @ 40% OFF BUY 1, GET 1 FREE
MUFTI BUY 1 @ 25% OFF BUY 2 @ 50% OFF
INDIAN TERRAIN BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 3 @ 40% OFF
U.S. POLO ASSN. BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 2, GET 2 FREE
parx ARROW BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 2, GET 2 FREE
KILLER BUY 1 @ 30% OFF BUY 2 @ 40% OFF BUY 3 @ 50% OFF
Levi's BUY 1 @ 20% OFF BUY 3 @ 40% OFF BUY 5 @ 50% OFF BUY 2, GET 2 FREE
HOME FURNISHING
BUY1 GET 1 ₹295 BLANKETS
BUY 4 ₹199 TOWELS
BUY 4 ₹499 SINGLE BEDSHEETS SET
BUY 3 ₹999 DOUBLE BEDSHEETS SET
R.S. Brothers™
MEGA SHOPPING MALL
TOLL FREE 1800 570 1999
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia
The withdrawal of offers and schemes is solely at the discretion of management

ఈనాడు

విజయవాడ 10-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 151
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 24
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఆదివారమైనా 1నే బడ్జెట్!

ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ఈనాడు, దిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా మాదిరిగానే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1నే ప్రవేశపెట్టనుంది. ఆ రోజు ఆదివారమైనా లోక్‌సభ సమావేశం కానుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 బడ్జెట్‌ను సభకు సమర్పిస్తారు. పార్లమెంటు సమావేశాల తాత్కాలిక షెడ్యూలుకు పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. పార్లమెంటు సమావేశాల తొలి రోజున ఉభయ సభలనుద్దేశించి (మిగతా 6లో)



నేలా, నీరూ యూరియానే

- పైరు ఎదుగుదల కోసం ఇష్టారాజ్యంగా వాడకం
- భూగర్భ జలాల్లో పరిమితికి మించిన నైట్రేట్
- తాగే నీటిలో చేరి మన శరీరాల్లోకి
- అగ్రస్థానంలోని ఐదు రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణ

ఈనాడు – అమరావతి

యూరియా ఎంత ఎక్కువ వేస్తే పైరు అంత ఏపుగా పెరుగుతుందని, అధిక దిగుబడి వస్తుందనే అపోహతో పొలాల్లో పరిమితికి యూరియా (నత్రజని) చల్లుతున్నాం. దీంతో నేలలో ఆమ్లత్వం పెరుగుతోంది. మొక్క నీటిని పీల్చుకునే అవకాశం కూడా లేని పరిస్థితి తలెత్తుతోంది. అంతేకాదు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. నత్రజని కలిసిన నీటిని తాగుతున్న మనం తెలియని ప్రమాదాల బారిన పడుతున్నాం. అధిక యూరియా వాడకం అభంశుభం తెలియని పిల్లల ఆరోగ్యంపైనా తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. భూగర్భ జలాల్లో పరిమితికి మించి నత్రజని (లీటరు నీటిలో 45 మి.గ్రా. కంటే ఎక్కువ ఉంటే తాగడానికి పనికిరావు) ఉన్న తొలి 5 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (మిగతా 6లో)

భూగర్భ జలాల్లో పరిమితికి మించి నత్రజని

సీజీడబ్ల్యూబీ ఎంపిక చేసిన ప్రాంతాల్లో భూగర్భజలాలను రుతుపవనాలకు ముందు, తర్వాత సేకరించి పరీక్షించగా వచ్చిన ఫలితాలివి..

రాష్ట్రం	మొత్తం నమూనాలు	రుతుపవనాలకు ముందు	తర్వాత
మహారాష్ట్ర	335	178	220
మధ్యప్రదేశ్	577	141	152
ఆంధ్రప్రదేశ్	313	129	143
తెలంగాణ	363	130	130
కర్ణాటక	267	123	140
తమిళనాడు	286	103	131


మీ భూమికి మాదీ పూచీ

రైతులకు పొలంతో భావోద్వేగ బంధం ఉంటుంది

సీఎం: సాయిబాబుగారూ పట్టాదారు పాస్‌పుస్తకం ఎలా ఉంది?
సాయిబాబు: రాజముద్రతో.. చాలా బాగుంది సార్

- ప్రతి నెలా గ్రామసభలు, పాస్ పుస్తకాల పంపిణీ
- రాయవరంలో 'మీ భూమి.. మీ హక్కు' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, రాయవరం: భూమితో రైతులకు భావోద్వేగ బంధం ఉంటుందని, ప్రాణాలు పోయినా దానిని వదులుకోడానికి సిద్ధపడరని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భూములపై సమగ్ర హక్కులు, భద్రత కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తూర్పు గోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరంలో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి.. మీ హక్కు' సభలో ఆయన మాట్లాడారు. ఆధునిక, సాంకేతిక పద్ధతులతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని వెల్లడించారు. దీనిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే భూమి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. వాటిని ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రూపొందించామన్నారు. కొవిడ్ సమయంలో అందరూ విశ్రాంతి తీసుకున్నా.. రైతు మాత్రం పని చేశాడని గుర్తు చేశారు. ప్రతి నెలా 2 నుంచి 9 వరకు గ్రామసభలు నిర్వహించి భూ వివరాలన్నీ చదివి వినిపిస్తారని, భూయజమానులు సంతృప్తి చెందితేనే ఈకేవైసీ చేసి, 9న పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారని చెప్పారు. ఆ రోజు కార్యక్రమానికి తాను హాజరవుతానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని గుర్తు చేశారు. (మిగతా 6లో)


రాయవరంలో పొలం వద్ద రైతు సాయిబాబుకు పట్టాదారు పాస్‌పుస్తకం అందిస్తున్న సీఎం చంద్రబాబు

ప్రైవేటు బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలుచేస్తే చర్యలు

బస్సులన్నింటిలో రవాణాశాఖ హెల్ప్‌లైన్ నంబరు డిస్‌ప్లే చేయాలి

రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా 6లో

దొంగచాటుగా సంతకాలు చేయడానికి సిగ్గులేదా?

జీతాలు, భత్యాలు కావాలి కానీ.. అసెంబ్లీకొచ్చి ప్రజాసమస్యలు చర్చించరా?

జగన్‌పై మంత్రి రామనారాయణరెడ్డి ధ్వజం



ఈనాడు, అమరావతి: మీ పార్టీ ఎమ్మెల్యేలు దొంగచాటుగా అసెంబ్లీ రిజిస్టర్‌లో సంతకాలు చేయడానికి సిగ్గనిపించడం లేదా అని వైకాపా అధినేత వైఎస్ జగన్‌ను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. సభకొచ్చి ప్రజా సమస్యలు చర్చించరు కానీ, వారి పన్నుల ద్వారా వచ్చే జీతాలు, భత్యాలు మాత్రం (మిగతా 6లో)

కూటమిని బలహీనపర్చే పనులొద్దు

- ముఖ్యమంత్రికి, నాకు మధ్య అరమరికలే లేవు
- పిఠాపురంలో గొడవలు పెడదామనుకుంటే ఏరేస్తా
- 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' సభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్


పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల్లో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న పవన్‌కల్యాణ్

ఈనాడు– కాకినాడ, న్యూస్‌టుడే– పిఠాపురం: 'కేంద్రం, రాష్ట్రంలో పార్టీలతో కూటమిని నిర్మించడం కష్టం.. విడగొట్టడం చాలా సులువు. కొంతమంది అదే చేయాలని చూస్తున్నారు. దయ చేసి మన కూటమిని బలహీనపర్చేలా ఎవరూ వ్యవహరించొద్దు' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో శుక్రవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలను ఆయన ప్రారంభించారు. ప్రజలకు సుస్థిర పాలన అందివ్వాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. సీఎం చంద్రబాబుకు, తనకు మధ్య (మిగతా 7లో)

కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం

నేడు, రేపు రాష్ట్రానికి వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. శుక్రవారం ఇది తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం తొలుత అంచనా వేసినా.. పరిస్థితులు అనుకూలించకపోవడంతో బలపడలేదని వాతావరణ నిపుణులు చెప్పారు. తీవ్ర వాయుగుండం ప్రస్తుతం వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంకలో ట్రింకోమలి, జాఫ్నా మధ్యలో శనివారం మధ్యాహ్నానికి తీరం దాటుతుందని ఐఎండీ అంచనా వేసింది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు (మిగతా 6లో)

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 10-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 151 రూ. 6-50 పేజీలు 24 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

వర్సిటీల్లో క్వాంటమ్‌పై కోర్సులు

- సెమీకండక్టర్‌పై కూడా..
- క్లస్టర్ ఆధారిత పరిశోధనలు
- ఒక్కో రంగంపై ప్రత్యేక పరిశోధన కేంద్రం
- రాష్ట్ర వర్సిటీల మధ్య క్రెడిట్ల బదిలీ



ఈనాడు - అమరావతి

వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచి ఉన్నతవిద్యలో పలు మార్పులు తీసుకొచ్చేందుకు ఉన్నత విద్యామండలి చర్యలు చేపట్టింది. విశ్వ విద్యాలయాల్లో క్లస్టర్ ఆధారిత పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఒక్కో విశ్వవిద్యాలయం ఒక్కో రంగానికి చెందిన పరిశోధనలో నైపుణ్యం సాధిస్తుంది. ఆటోమొబైల్ రంగంలో ఒక వర్సిటీ పరిశోధనలు చేస్తే.. మరో వర్సిటీ ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశోధన సాగిస్తుంది. వర్సిటీల్లో పరిశోధలను మెరుగుపర్చడంతో పాటు ఏదో ఒక రంగంలో ప్రత్యేకతను సాధించేందుకు ఈ విధానం ఉపయోగపడనుంది. కావలసిన రంగాన్ని వర్సిటీలే ఎంపిక చేసుకోవచ్చు. వాటితో కంపెనీలను అనుసంధానం చేస్తారు. పరిశ్రమల సమస్యలకు వర్సిటీలు ఇలా పరిష్కార మార్గాలు చూపుతాయి.

■ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో నిపుణులను తయారు చేసేందుకు వర్సిటీలు బీటెక్‌లో డిగ్రీలను అందుబాటులోకి తేనున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఈ ఏడాది బీటెక్ ప్రారంభించగా.. వచ్చే ఏడాది శ్రీవేంకటేశ్వర వర్సిటీ క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు పెట్టబోతోంది. ఆంధ్ర వర్సిటీ ఎంటెక్‌లో సెమీకండక్టర్ కోర్సును తీసుకురానుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సెమీకండక్టర్, క్వాంటమ్‌లలో ఈ కోర్సులను తీసుకొస్తున్నారు. మరికొన్ని విశ్వవిద్యాలయాలు సైతం వీటిపై దృష్టిసారించాయి.

■ వైసర్ సంస్థ నుంచి క్వాంటమ్‌లో నాలుగు వారాల ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు ఒక క్రెడిట్ కేటాయించనున్నారు. ఎన్‌పీటీఎల్‌లో ఐఐటీ, మద్రాస్ క్వాంటమ్‌పై కోర్సును అందిస్తోంది. దాన్ని పూర్తి చేస్తే మరో క్రెడిట్ ఇస్తారు. నాలుగు వారాల పాటు ఈ కోర్సు ఉంటుంది. క్వాంటమ్‌పై ప్రాథమిక భావనలు నేర్పిస్తారు. దీనిని ఈనెల 19న ప్రారంభించనున్నారు.

ఆన్‌లైన్ కోర్సులతో మైనర్ నుంచి మేజర్..

■ కొన్ని సబ్జెక్టులు ప్రస్తుతం డిగ్రీ, బీటెక్‌లో మైనర్ డిగ్రీలుగా ఉన్నాయి. వాటిలో ఎక్కువ క్రెడిట్లు సంపాదించేందుకు ఆన్‌లైన్‌లో కోర్సులు పూర్తి చేసుకునేలా విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఎన్‌పీటీఎల్, ఇతరత్రా ఆన్‌లైన్ కోర్సుల్లో ఎక్కువ క్రెడిట్లు సాధిస్తే వీటిని మేజర్‌గా చూపి, ఎంటెక్, పీజీల్లో ఆయా సబ్జెక్టుల్లో ప్రవేశాలు పొందొచ్చు.

■ ఒక వర్సిటీ నుంచి మరో వర్సిటీకి క్రెడిట్లు బదిలీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి తెలిపారు. ఈ అవకాశం ఉంటే ఎవరైనా ఎక్కడి నుంచైనా నచ్చిన కోర్సు చదువుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

■ రాష్ట్ర వర్సిటీలు అందిస్తున్న కోర్సులు, వాటి ప్రాధాన్యతపై యువతకు వివరించేందుకు వెబ్‌సైట్లు నవీకరించడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వంటి కార్యకలాపాలు చేపట్టనున్నారు.

■ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో వర్సిటీలపై ప్రజల అభిప్రాయాలకు కొన్ని పాయింట్లు ఉన్నాయి. రాష్ట్ర వర్సిటీలు వాటిని అందుకోలేకపోతున్నాయి. ఇందుకోసం యువతకు చేరువయ్యేలా అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మార్చి 28, 29 తేదీల్లో ఏపీ సెట్



బ్రోచర్ విడుదల చేస్తున్న రాజశేఖర్. చిత్రంలో రాంబాబు, రాజు, రాజేంద్రప్రసాద్

విశాఖపట్నం (ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించిన రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష (ఏపీ సెట్-2025)ను మార్చి 28, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సెట్ బ్రోచర్‌ను ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య జీపీ రాజశేఖర్ శుక్రవారం విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 9 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య జీఎంజీ రాజు తెలిపారు. జనరల్ అభ్యర్థులు రూ.1600, బీసీ, ఈడబ్ల్యూఎస్ రూ.1300, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఇతరులు రూ.900 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. https://www.apset.net.in/ వెబ్‌సైట్ నుంచి పూర్తి సమాచారం పొందవచ్చన్నారు. హాల్ టికెట్లను మార్చి 19 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ఏపీ సెట్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆచార్య కె.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్స్

బెంగళూరు విజయానికి చివరి ఓవర్లో 18 పరుగులు అవసరం. తొలి రెండు బంతులకు పరుగే ఇవ్వలేదు నాట్ సీవర్. మహిళల క్రికెట్లో 4 బంతుల్లో 18 పరుగులంటే గెలవడం కష్టమే. కానీ దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ నడైన్ డిక్లెర్క్.. ఆఖరి నాలుగు బంతుల్లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. వరుసగా 6, 4, 6, 4 బాదేసి మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ తొలి మ్యాచ్‌లో తన జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు అద్భుత విజయాన్నందించింది. బ్యాటుతో విధ్వంసక అర్ధశతకం సాధించిన ఆమె.. అంతకుముందు బంతితోనూ విజృంభించి నాలుగు వికెట్లు తీయడం విశేషం.

విధ్వంసక ఇన్నింగ్స్‌తో ముంబయికి చెక్

నడైన్.. దంచేసెన్

- బౌలింగ్‌లోనూ మెరుపులు
- డబ్ల్యూపీఎల్-4లో ఆర్సీబీ శుభారంభం



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ నడైన్ డిక్లెర్క్ 63* (7×4, 2×6)

ముంబయి

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ తొలి మ్యాచే అభిమానులకు బోలెడంత వినోదాన్ని పంచింది. శుక్రవారం చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఆర్సీబీ 3 వికెట్ల తేడాతో ముంబయిపై అనూహ్య విజయాన్నందుకుంది. ఆశల్లేని స్థితిలో నడైన్ డిక్లెర్క్ (63 నాటౌట్; 44 బంతుల్లో 7×4, 2×6) సంచలన ఇన్నింగ్స్ ఆడడంతో ఆర్సీబీ 7 వికెట్లు కోల్పోయి సరిగ్గా 20 ఓవర్లలో 155 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. ముంబయి బౌలర్లలో అమేలియా కెర్ (2/13), నికోలా కేరీ (2/35) రాణించారు. మొదట సజీవన్ సజన (45; 25 బంతుల్లో 7×4, 1×6), నికోలా కేరీ (40; 29 బంతుల్లో 4×4) మెరుపులతో ముంబయి 6 వికెట్లకు 154 పరుగులు చేసింది. నడైన్ (4/26) బౌలింగ్‌లోనూ అదరగొట్టింది. డబ్ల్యూపీఎల్‌లో ఆమెకిది రెండో మ్యాచ్ మాత్రమే.

ఓటమి ఖాయమనుకుంటే..: రెండు నెలల కిందట వన్డే ప్రపంచకప్‌లో విశాఖపట్నంలో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాకు ఓటమి ఖాయమనుకున్న మ్యాచ్‌లో నడైన్ డిక్లెర్క్ (84 నాటౌట్) ఎలా చెలరేగిపోయిందో తన జట్టును ఎలా గెలిపించిందో భారత అభిమానులకు గుర్తుండే ఉంటుంది. ఆ టోర్నీలో బంగ్లాదేశ్‌తో మరో మ్యాచ్‌లోనూ నడైన్ అలాంటి ఇన్నింగ్సే ఆడింది. ఇప్పుడు డబ్ల్యూపీఎల్‌లోనూ ఆర్సీబీకి ఓటమి తప్పదనుకున్న స్థితిలో ఆమె విధ్వంసక ఇన్నింగ్స్ ఆ జట్టుకు విజయాన్నందించింది. ఆమె బ్యాటింగ్‌కు వచ్చిన ఓవర్ పూర్తయ్యేసరికి ఆర్సీబీ స్కోరు 65/5. గ్రేస్ హారిస్ (25), స్మృతి మంధాన (18) జట్టుకు మెరుపు ఆరంభాన్నే ఇచ్చినప్పటికీ.. 25 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ పీకల్లోతు కష్టాల్లో పడింది. గొప్పగా బౌలింగ్ చేసిన అమేలియా.. ఎనిమిదో ఓవర్లో 2 పరుగులే ఇచ్చి రాధ యాదవ్ (1), రిచా ఘోష్ (6)లను ఔట్ చేయడంతో ఆర్సీబీ ఓటమి బాటలో సాగింది. అయితే అరుంధతి (20)తో కలిసి పోరాడిన నడైన్.. జట్టును పోటీలోకి తెచ్చింది. 16 ఓవర్లకు 117/5తో ఆర్సీబీ మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ తర్వాతి ఓవర్లో నికోలా కేరీ.. 4 పరుగులే ఇచ్చి అరుంధతి, శ్రేయాంక (1)లను ఔట్ చేయడంతో సమీకరణం కఠినంగా మారింది. తర్వాతి 2 ఓవర్లలో 16 పరుగులే రావడం, అనుభవజ్ఞురాలైన నాట్ సీవర్ చివరి ఓవర్‌ను రెండు వరుస డాట్స్‌తో మొదలుపెట్టడంతో ముంబయి గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ చివరి నాలుగు బంతులకు నడైన భారీ షాట్లు ఆడి ఆర్సీబీకి అనూహ్య విజయాన్నందించింది.



నికోలా కేరీ

మెరిసిన నికోలా, సజన: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయి ఇన్నింగ్స్‌ను పేలవంగా మొదలుపెట్టింది. డబ్ల్యూపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఇంగ్లాండ్ ఫాస్ట్‌బౌలర్ లారెన్ బెల్ అద్భుత బౌలింగ్‌తో ఆర్సీబీకి అదిరే ఆరంభాన్నిచ్చింది. దూకుడుగా ఆడే అమేలియా కెర్ బ్యాటింగ్ చేస్తుండగా తొలి ఓవర్‌ను లారెన్ మెయిడెన్ వేయడం విశేషం. లారెన్ వేసిన తర్వాతి ఓవర్లోనూ తడబాటు కొనసాగించిన అమేలియా (15 బంతుల్లో 4).. అరుంధతికి తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ప్రమాదకర నాట్ సీవర్ (4) నడైన్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయిపోయింది. అయితే మరో ఎండ్‌లో దూకుడుగా ఆడుతున్న కమలిని (32; 28 బంతుల్లో 5×4)కి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (20) తోడవడంతో ముంబయి 63/2తో పుంజుకుంది. ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో ఔటైపోవడంతో ముంబయికి మళ్లీ ఇబ్బందులు తప్పలేదు. పరుగుల వేగం కూడా పడిపోవడంతో 14 ఓవర్లకు 85/4తో నిలిచిన ముంబయి.. 130 పరుగులకు మించేలా కనిపించలేదు. కానీ క్రీజులో కుదురుకున్న నికోలా, సజన చివరి ఓవర్లలో చెలరేగిపోవడంతో స్కోరు అనూహ్యంగా 150 దాటింది. ఆ జట్టు ఇంకా ఎక్కువ స్కోరే చేయాల్సింది. కానీ నడైన్ చివరి ఓవర్లో 5 పరుగులే ఇచ్చి వీళ్లిద్దరినీ ఔట్ చేసింది.

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: అమేలియా (సి) అరుంధతి (బి) లారెన్ 4; కమలిని (బి) శ్రేయాంక 32; నాట్ సీవర్ (స్టంప్డ్) రిచా (బి) నడైన్ 4; హర్మన్‌ప్రీత్ (సి) రిచా (బి) నడైన్ 20; నికోలా (సి) హేమలత (బి) నడైన్ 40; సజన (సి) స్మృతి (బి) నడైన్ 45; అమన్‌జ్యోత్ నాటౌట్ 0; పూనమ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 154; వికెట్ల పతనం: 1-21, 2-35, 3-63, 4-67, 5-149, 6-154; బౌలింగ్: లారెన్ బెల్ 4-1-14-1; లిన్సీ స్మిత్ 2-0-23-0; అరుంధతి రెడ్డి 4-0-37-0; నడైన్ డిక్లెర్క్ 4-0-26-4; శ్రేయాంక పాటిల్ 4-0-32-1; రాధ యాదవ్ 2-0-21-0

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) షబ్నిమ్ (బి) నాట్ సీవర్ 25; స్మృతి మంధాన (సి) పూనమ్ (బి) షబ్నిమ్ 18; హేమలత ఎల్బీ (బి) అమన్‌జ్యోత్ 7; రిచా ఘోష్ (సి) నికోలా (బి) అమేలియా 6; రాధ యాదవ్ (బి) అమేలియా 1; నడైన్ నాటౌట్ 63; అరుంధతి (సి) అమేలియా (బి) నికోలా 20; శ్రేయాంక (బి) నికోలా 1; ప్రేమ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 157;** వికెట్ల పతనం: 1-40, 2-47, 3-62, 4-63, 5-65, 6-117, 7-121; బౌలింగ్: నాట్ సీవర్ 4-0-47-1; షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-26-1; నికోలా కేరీ 4-0-35-2; అమన్‌జ్యోత్ 3-0-18-1; అమేలియా కెర్ 4-0-13-2; సైకా ఇషాక్ 1-0-13-0

సెమీస్‌లో సింధు

- ముగిసిన సాత్విక్ జోడీ పోరాటం
- మలేసియా ఓపెన్



సింధు

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి పి.వి.సింధు సెమీఫైనల్లో అడుగుపెట్టింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 21-11 (రిటైర్డ్)తో మూడో సీడ్ అకానె యమగూచి (జపాన్)పై విజయం సాధించింది. తొలి గేమ్ అనంతరం మోకాలి గాయంతో యమగూచి మ్యాచ్ నుంచి వైదొలిగింది. సెమీస్‌లో రెండో సీడ్ వాంగ్ జి యి (చైనా)తో సింధు తలపడనుంది. మరోవైపు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి జోడీ పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో భారత ద్వయం 10-21, 21-23తో ఫజర్ అల్ఫియాన్- మహ్మద్ షోహిబుల్ ఫిక్రి (ఇండోనేసియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

అవి విహార యాత్రలు కావు

క్రీడాధికారులకు కేంద్రం హెచ్చరిక

అహ్మదాబాద్: ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో భారత క్రీడాకారులకు అండగా నిలవాల్సిన అధికారులు.. ఆ పర్యటనలను తమ కుటుంబంతో గడిపే విహార యాత్రలుగా భావిస్తే సహించేది లేదని కేంద్ర ప్రభుత్వం గట్టిగా హెచ్చరించింది. ఆసియా క్రీడల కోసం భారత క్రీడాకారుల పేర్లను ఈనెల 15లోపు ఖరారు చేయాలని ఆదేశించింది. శుక్రవారం జరిగిన క్రీడా పాలన సదస్సులో కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, క్రీడల కార్యదర్శి హరిరంజన్ రావు, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), జాతీయ క్రీడా సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు. "టోర్నీలకు పెద్ద ఎత్తున అధికారులు వెళ్తున్నప్పటికీ.. అక్కడ అవసరమైన సమయంలో ఒక్కరు కూడా అందుబాటులో లేకపోతుండటం సిగ్గుచేటు. క్రీడాకారుల కోసం అధికారులు 100 శాతం అందుబాటులో ఉండాలి. ఒకవేళ టీమ్ బృందంతో వెళ్లే సరదా పర్యటనగా భావిస్తే.. దయచేసి వెళ్లకండి. మాకు అలాంటి వారి అవసరం లేదు" అని హరిరంజన్ రావు స్పష్టంచేశారు. హాంగ్జౌలో 106 పతకాలు గెలిచాం. ఈసారి 111 లక్ష్యమని హరిరంజన్ రావు తెలిపారు. చైనా 'ప్రాజెక్ట్ 119' తరహాలో అథ్లెటిక్స్, స్విమ్మింగ్ వంటి క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. పుల్లెల గోపీచంద్ కమిటీ సూచనల మేరకు కోచింగ్ సర్టిఫికేషన్ బోర్డు, ఏకీకృత ప్రతిభ గుర్తింపు వ్యవస్థ, ప్రత్యేక శిక్షణ కేంద్రాల ఏర్పాటు వంటి సంస్కరణలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2036 ఒలింపిక్స్‌లో టాప్-10లో ఉండాలంటే 12-14 స్వర్ణాలు (మొత్తం 30-35 పతకాలు) సాధించాలని.. 2048 క్రీడల్లో 35-40 స్వర్ణాల సహా మొత్తం 100 పతకాలు గెలవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు జపాన్‌లోని ఐచి-నగోయాలో ఆసియా క్రీడలు జరగనున్నాయి.

ఫైనల్లో నిఖత్



నిఖత్ జరీన్

గ్రేటర్ నోయిడా: జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్లు నిఖత్ జరీన్, మహ్మద్ హుసాముద్దీన్ ఫైనల్లో దూసుకెళ్లారు. శుక్రవారం మహిళల 51 కేజీల విభాగం సెమీఫైనల్లో నిఖత్ 4-1తో కుసుమ్ బాగెల్ (ఉత్తరప్రదేశ్)ను ఓడించింది. తుది పోరులో మాజీ ప్రపంచ ఛాంపియన్ నీతుతో నిఖత్ తలపడనుంది. 75 కేజీల్లో లవ్లీనా 5-0తో ఇఫ్రా ఖాన్ (ఉత్తర్‌ప్రదేశ్)ను చిత్తు చేసింది. 48 కేజీల్లో మలైకా మోరోస్ మీనాక్షి హుడా ఓడించింది. పురుషుల 60 కేజీల విభాగం సెమీఫైనల్లో హుసాముద్దీన్ విజయాన్ని అందుకున్నాడు. జాదుమణి సింగ్ (55 కేజీ).. స్టార్ బాక్సర్ అమిత్ పంఘాల్‌కు షాకిచ్చాడు.



శుక్రవారం వడోదరలో టీమ్‌ఇండియా ప్రాక్టీస్ సందర్భంగా జైస్వాల్‌కు సూచనలిస్తున్న కోహ్లి

ర్యాపిడ్ విజేత నిహాల్

టాటా స్టీల్ చెస్



నిహాల్

కోల్‌కతా: యువ గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరిన్ టాటా స్టీల్ చెస్ ర్యాపిడ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 9 రౌండ్ల నుంచి 6.5 పాయింట్లతో అతడు అగ్రస్థానం సాధించాడు. అతడు శుక్రవారం తొమ్మిదో రౌండ్లో ఆనంద్‌ను నిలువరించాడు. నిహాల్ తాత గురువారం కన్నుమూశారు. నిహాల్‌కు చెస్‌ను పరిచయం చేసింది ఆయనే. ఈ టైటిల్‌ను తన తాతకు అంకితమిస్తున్నట్లు నిహాల్ చెప్పాడు. ఆనంద్ (6) రెండో స్థానంలో నిలవగా.. అర్జున్ ఇరిగేశి 5 పాయింట్లతో మూడో స్థానం సాధించాడు. ప్రజ్ఞానంద 4.5 పాయింట్లతో ఆరో స్థానంతో ముగించాడు. మహిళల విభాగంలో కేతరినా (6.5), గోర్యచ్కినా (5) తొలి రెండు స్థానాల్లో నిలవగా.. దివ్య దేశ్‌ముఖ్ (4.5) మూడో స్థానం దక్కించుకుంది.

ఈనాడు సినిమా

అత్తగారింట్లో బంగారం



సమంత

ఉండిపోదాం అనుకుని అత్తగారింట్లోకి అడుగు పెట్టింది కోడలు. వారం రోజుల్లో అందరితోనూ కలిసి పోతాననీ భర్తతో చెప్పింది. మరి అంతా ఆ కోడలు పిల్ల అనుకున్నట్టే జరిగిందా? అత్తారింట్లోకి అడుగు పెట్టిన తర్వాత ఆమెకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? తదితర విషయాలు తెలియాలంటే 'మా ఇంటి బంగారం' చూడాల్సిందే. సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ... తన భర్త రాజ్ నిడిమోరుతోపాటు హిమాన్ష్ దువ్వూరుతో కలిసి నిర్మిస్తున్న చిత్రమిది. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుషా కీలక పాత్రధారులు. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. అందులో సమంత అమాయకమైన వ్యక్తిత్వంతో పరిచయమై, ఆ తర్వాత తనలోని యాక్షన్ కోణాన్ని బయటకు తీసుకొచ్చింది. ఆ రెండు కోణాలు టీజర్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'ఓ బేబీ' తర్వాత సమంత - నందినిరెడ్డి కలయికలో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోశ్ నారాయణన్.

కేఎల్ యూనివర్సిటీలో ఈటీవీ విన్.క్లబ్ ప్రారంభం



ఏవీఎస్ ప్రసాద్, పి.సారధి వర్మ, సాయి కృష్ణ

కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్న ప్రముఖ ఓటీటీ ఈటీవీ విన్.. ఆంధ్రప్రదేశ్‌లోని కేఎల్ యూనివర్సిటీలో 'విన్.క్లబ్'ను ప్రారంభించింది. విద్యార్థులకు సృజనాత్మక రంగాలతో పాటు సినీ పరిశ్రమకు సంబంధించిన పలు రంగాల్లో వారికున్న ప్రతిభను గుర్తించి తగిన అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఈటీవీ విన్ సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.సారధి వర్మ, ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏవీఎస్ ప్రసాద్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈటీవీ విన్ హెడ్ సాయి కృష్ణ కొయిని, మార్కెటింగ్ హెడ్ యువకాంత్, విన్.క్లబ్ కోఆర్డినేటర్ వి.దివ్యదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఆస్కార్ రేసులో భారతీయ చిత్రాలు



'మహావతార్: నరసింహ'



'కాంతార: చాప్టర్ 1'

98వ ఆస్కార్ పండగకి రంగం సిద్ధమవుతోంది. భారతీయ సినిమాలు కూడా ఆ అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటడానికి సన్నద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ 'రిమైండర్ లిస్ట్' పేరుతో ఓ జాబితాను విడుదల చేసింది. 201 చిత్రాలతో కూడిన ఈ లిస్ట్‌లో నిలిచిన సినిమాలు ఉత్తమ చిత్రం విభాగంలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో భారత్ నుంచి ఏకంగా ఐదు చిత్రాలు చోటు దక్కించుకోవడం విశేషం. ఇప్పటికే ఆస్కార్ బరిలో ఉన్న కన్నడ హీరో రిషబ్ శెట్టి నటించిన 'కాంతార: చాప్టర్ 1', 'మహావతార్: నరసింహ' ఈ జాబితాలో చోటు దక్కించుకొని మరో ముందడుగు వేశాయి. వీటితో పాటు అనుపమ్ ఖేర్ తెరకెక్కించిన హిందీ చిత్రం 'తన్వీ ది గ్రేట్', రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్', ఎంతో మందిని కదిలించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా అకాడమీ రేసులో నిలిచి సినీప్రియుల దృష్టిని ఆకర్షించాయి. ఆస్కార్ నామినేషన్లను ఈ నెల 22న ప్రకటించనున్నట్లు అకాడమీ వెల్లడించింది. మరోవైపు భారత్ తరఫున దర్శకుడు నీరజ్ ఘైవాన్ తెరకెక్కించిన 'హోమ్‌బౌండ్' చిత్రం ఇప్పటికే 'ది ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరిలో టాప్ 15 షార్ట్‌లిస్ట్‌లో చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే.

కామెడీ చేయడం కత్తిమీద సామే!



రామ్ అబ్బరాజు

"అసభ్యతకు తావులేని మంచి వినోదాత్మక కుటుంబ కథా చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించడం నాకిష్టం. 'నారీ నారీ నడుమ మురారి' కూడా అలాంటి స్వచ్ఛమైన వినోదంతోనే అందర్నీ నవ్విస్తుంది" అన్నారు దర్శకుడు రామ్ అబ్బరాజు. 'సామజవరగమన' విజయం తర్వాత ఆయన నుంచి వస్తున్న ఈ సినిమాలో శర్వానంద్ హీరోగా నటించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య నాయికలు. ఈ చిత్రం ఈ నెల 14న రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు రామ్ అబ్బరాజు.

◆ "ఇది పండగ చిత్రమే కానీ.. తొలుత సంక్రాంతికి తీసుకురావాలన్న ఆలోచనైతే లేదు. దసరా, దీపావళి ఇలా ఏదోక పండగ సీజన్‌కు రావాలనుకున్నాం. ఆఖరికి అది సంక్రాంతికి కుదిరింది. నిజానికి దీనికి ముందు శర్వానంద్ 'బైకర్' చిత్రం విడుదల కావాల్సింది. కొన్ని కారణాల వల్ల అది వాయిదా పడటంతో మాకు పండక్కి వచ్చే అవకాశం దొరికింది. చిన్నప్పటి నుంచి సంక్రాంతికి ఎన్నో చిత్రాలు చూస్తూ పెరిగా. ఇప్పుడు దర్శకుడిగా తొలిసారి పండక్కి నా సినిమా రావడమన్నది చాలా ఆనందాన్నిస్తోంది".

◆ "ఇది మంచి యూత్‌ఫుల్ ఫన్ ఎంటర్‌టైనర్. కుటుంబంతో కలిసి హాయిగా చూసి నవ్వుకునేలా ఉంటుంది. ఒకే ఆఫీస్‌లో ఇటు ప్రేయసికి.. అటు మాజీ ప్రేయసికి మధ్య నలిగిపోయే కుర్రాడి కథ ఇది. నిజానికి ఇలా ఇద్దరమ్మాయిలు, ఒకబ్బాయి అనగానే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ, దీంట్లో 'సామజవరగమన'లో ఉన్నట్లు చాలా కొత్త పాయింట్ ఉంది. అదేంటన్నది వెండితెరపై చూడాల్సిందే. శర్వానంద్ వినోదాత్మక చిత్రాల్లో అదరగొట్టేస్తారు. 'రన్ రాజా రన్', 'మహానుభావుడు' లాంటి వినోదాత్మక చిత్రాల తర్వాత తన నుంచి వస్తున్న ఎంటర్‌టైనర్ ఇది".

◆ "ఈ రోజుల్లో కామెడీ చేయడం కత్తి మీద సాము. కథలో సందర్భానుసారంగా కామెడీ వస్తే ఆటోమెటిక్‌గా ప్రేక్షకుల మోముల్లో నవ్వులు పూస్తాయి. అలాంటి వినోదం ఈ చిత్రంలో ఉంది. ద్వితీయార్ధంలో భావోద్వేగాలు చక్కగా పండాయి. సత్య, సుదర్శన్, వెన్నెల కిశోర్ పాత్రలు ఫన్నీగా ఉంటాయి. ఈ చిత్రంలో శ్రీవిష్ణు అతిథి పాత్రలో అలరిస్తారు. సంయుక్త, వైద్య పాత్రలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది".

ఈతరానికి చేరువయ్యే కథ

ఈ సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాతో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు రవితేజ. కిశోర్ తిరుమల తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 13న రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు ఆషిక - డింపుల్.



ఇంత వరకూ పోషించని బోల్డ్ పాత్ర - ఆషికా రంగనాథ్

"నేను గతంలోనే కిశోర్ తిరుమలతో ఓ సినిమా చేయాల్సింది. కానీ, కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. ఆ తర్వాత రవితేజతో సినిమా చేస్తున్నానని చెప్పి ఈ కథ వినిపించారు. దీంట్లో ఇద్దరు కథానాయికలున్నా రెండు పాత్రలకు చాలా ప్రాధాన్యముంది. కిశోర్ కథ చెప్పాక ఆ రెండింటిలో ఏ పాత్ర చేస్తారని అడిగారు. నేను ఇప్పటికే 'నా సామిరంగ'లో పల్లెటూరి అమ్మాయిగా సంప్రదాయ పాత్రలో కనిపించా. అందుకే ఈ సినిమాలో బోల్డ్‌గా కనిపించే రవితేజ ప్రియురాలు పాత్ర చేస్తానని చెప్పా. ఈ సినిమాలో రవితేజ పాత్ర అందరికీ రిలేట్ అయ్యేలా ఉంటుంది. ప్రతిఒక్కరి జీవితంలోనూ కొన్ని పొరపాట్లు ఉంటాయి. వాటిని తనెలా డీల్ చేశాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఈతరం ఆధునిక అమ్మాయిల్ని ప్రతిబింబిస్తూ వాళ్లకు కనెక్ట్ అయ్యేలా ఉంటుంది నా పాత్ర. ఇంతవరకూ నేను ఇలాంటి బోల్డ్ పాత్రను పోషించలేదు. ఇది నాకు కొత్త ఇమేజ్‌ను తీసుకొస్తుందని నమ్మకం ఉంది".

ఇందులో ఓ సర్‌ప్రైజ్ - డింపుల్ హయాతి

"దర్శకుడు కిశోర్ నాకీ కథ చెప్పినప్పుడు రవితేజ దీంట్లో హీరోగా చేస్తున్నారని ఏమీ చెప్పలేదు. ఇద్దరు హీరోయిన్లు ఉన్న కథ అని చెప్పేసరికి నేను ఇది వరకే చాలా చేశానని చెప్పా. కానీ, ఆయన ముందు కథ వినమని చెప్పి.. రెండు పాత్రల్ని వివరించారు. అది విన్నాక కథలో రెండూ చాలా బలమైన పాత్రలని అర్థమైంది. దీంట్లో ఆషిక పోషించిన లాంటి పాత్రను నేను గతంలో చేసేశా. అందుకే బాలామణి అనే భార్య పాత్ర పోషించాలనుకుంటున్నానని చెప్పా. అదైతేనే నటిగా నాకు వైవిధ్యత చూపించే ఆస్కారం దొరుకుతుందనిపించింది. నేను నా మనసులో మాట చెప్పాకే.. దీంట్లో రవితేజ హీరోగా చేస్తున్నట్లు కిశోర్ బయట పెట్టారు. అది నాకు సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. ఈ కథ ప్రధానంగా మా ఇద్దరి చుట్టూనే తిరుగుతుంది. ఆ తర్వాత మా జీవితాల్లోకి ఆషిక పాత్ర ప్రవేశిస్తుంది. ఓ సినిమాలో ఇద్దరమ్మాయిలు ఉన్నారంటే హీరోకి వాళ్లకు మధ్య ముక్కోణపు ప్రేమకథ సాగుతుంటుంది.. ఒకరినొకరు కొట్టేసుకుంటుంటారు అనుకుంటారు. కానీ, దీంట్లో మా పాత్రలేవీ అలా ఉండవు. ఈతరం ఆలోచనలకు తగ్గట్లుగానే ఉంటాయి. దీంట్లో ఓ సర్‌ప్రైజ్ అంశం కూడా ఉంది. అదేంటన్నది తెరపై చూడాల్సిందే".

హీరోలకంటే బాణీలే ప్రభావితం చేస్తాయి



కేకే

శ్రోతలు అర్థం చేసుకుంటారో లేదో అని, పాటలో మనవైన పదాల్ని రాయడం ఆపేస్తే కొన్ని రోజులకి భాష కనుమరుగయ్యే ప్రమాదం ఉందంటున్నారు గీత రచయిత కేకే. ట్రెండ్‌కి తగ్గట్టుగా రాయడం తప్పు కాదు కానీ... స్వచ్ఛమైన తెలుగు పదాలతో పాట రాయడానికే తాను ప్రాధాన్యం ఇస్తానన్నారు. పుష్కరకాలంగా సినీ ప్రయాణం కొనసాగిస్తూ వందలకొద్దీ విజయవంతమైన గీతాల్ని రాసిన రచయిత ఈయన. శనివారం కేకే పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "ఎప్పట్లాగే గతేడాది కూడా విజయవంతంగా నా సాహిత్య ప్రయాణం కొనసాగింది. యాభైకిపైగా సినిమాలకి పాటలు రాశా. అందులో 22 సినిమాలు, నేను రాసిన 45 పాటలు విడుదలయ్యాయి. ఈ ఏడాది కూడా సంఖ్య అదే స్థాయిలోనే ఉంటుంది. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఫౌజీ', ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కలయికలోని సినిమా సహా పలు ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులకు పాటలు రాస్తున్నా. పాట రచన విషయంలో ఏ హీరో సినిమా అయినా ఒకే రకమైన కసరత్తులు చేస్తుంటా. హీరోల కంటే కూడా బాణీలే ఎక్కువగా నన్ను ప్రభావితం చేస్తుంటాయి. మనపాట అచ్చమైన మన తెలుగు పదాలతో వినిపించాలనే నియమాన్ని ఎప్పుడూ మరిచిపోను" అని చెప్పారు.

మగజాతి ఆణిముత్యాలు



వీరు ఉలవల, బుచ్చిబాబు

ఎన్ని యుద్ధాలు చేసినా... ఎక్కడో శత్రుశేషం మిగిలిపోయిందన్న వెలితి ఆ ముగ్గురిలోనూ అలా ఉండిపోయింది. ఇంతకీ ఆ ముగ్గురు ఎవరు? ఎవరిపై యుద్ధం చేశారు? మగజాతి గర్వించదగ్గ ఆణిముత్యాలు అని వాళ్లని ఎందుకన్నారో తెలియాలంటే 'పురుష:' చూడాల్సిందే. పవన్ కల్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కుమార్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ కథానాయికలుగా నటించారు. వీరు ఉలవల దర్శకుడు. బత్తుల కోటేశ్వరరావు నిర్మాత. పెళ్లి తర్వాత ముగ్గురు యువకులు పడిన అవస్థల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా టీజర్‌ని ఇటీవల ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేశారు.



లైక్.. షేర్.. సర్వైవ్

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

ఈనాడు

విజయవాడ 10-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 151

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 24 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కేంద్రంతో మమత ఈఢీ!

దక్షిణ కోల్‌కతాలో కదం తొక్కిన తృణమూల్ నేతలు, కార్యకర్తలు

అమిత్ షా కార్యాలయం ఎదుట ఎంపీల ఆందోళన

- కలకత్తా హైకోర్టులో గందరగోళం
- విచారణను 14కు వాయిదా వేసిన న్యాయమూర్తి
- మమత ఫిర్యాదుతో ఈడీపై ఎఫ్ఐఆర్‌లు
- మమత, పోలీసు ఉన్నతాధికారులపై సీబీఐ దర్యాప్తునకు ఈడీ విజ్ఞప్తి

కోల్‌కతా, దిల్లీ



కోల్‌కతాలో శుక్రవారం నిర్వహించిన భారీ ర్యాలీలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

బొగ్గు కుంభకోణంలోని మనీలాండరింగ్ కేసుకు సంబంధించి కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంతోపాటు ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహించిన సోదాలపై కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత ముదిరింది. కేంద్రం, ఈడీల తీరును నిరసిస్తూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రోడ్డెక్కారు. ఐ-ప్యాక్‌లో సోదాల పేరుతో తృణమూల్ కార్యకర్తల డేటాను కేంద్రం తస్కరించిందని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. ఈడీ చర్యను నిరసిస్తూ శుక్రవారం దక్షిణ కోల్‌కతాలో మమత భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో పార్టీ నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. 8బీ బస్టాండు నుంచి హజ్రా మోర్ వరకూ ప్రదర్శనగా వెళ్లారు. ఈ ర్యాలీలో బెంగాలీ సంస్కృతిని ప్రదర్శించారు.

■ ఐ-ప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలు.. తమ ఎన్నికల వ్యూహాన్ని దొంగిలించేందుకేనని మమతా బెనర్జీ ఆరోపించారు. తాను సోదాల ప్రాంతానికి వెళ్లడంలో తప్పేమీ లేదని స్పష్టం చేశారు. బొగ్గు కుంభకోణం ద్వారా అమిత్ షా సహా భాజపా నేతలు లబ్ధి పొందారని పేర్కొన్నారు. తాను తృణమూల్ అధినేతగా ఐ-ప్యాక్ కార్యాలయానికి వెళ్లానని, ముఖ్యమంత్రిగా కాదని స్పష్టం చేశారు. 'నన్ను ఎవరైనా చంపడానికి వస్తే కాపాడుకునే హక్కు నాకు లేదా' అని ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణంలో సొమ్ము.. జగన్నాథ్ నుంచి సువేందుకు.. ఆయన నుంచి అమిత్ షా వద్దకు చేరిందని ఆరోపించారు. తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు బయటపెడతానని తెలిపారు. మహారాష్ట్ర, హరియాణా, బిహార్‌లలో భాజపా అధికారాన్ని చెరబట్టిందని విమర్శించారు. అలా బెంగాల్‌ను చెరబట్టాలనుకుంటే కుదరదని తేల్చి చెప్పారు.

■ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వానిషింగ్ (మాయం చేసే) కుమార్‌గా అభివర్ణించారు. ఆయన ఓటర్లను మాయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

దిల్లీలో ఉద్రిక్తత

దేశ రాజధానిలోని హోం మంత్రి అమిత్ షా కార్యాలయం ఎదుట తృణమూల్ ఎంపీలు ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. దర్యాప్తు సంస్థను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. వారు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని, పార్లమెంటు వీధి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం 3 గంటల సమయంలో వారిని వదిలిపెట్టారు.

కోర్టులో ఇబ్బందికర పరిస్థితి

ఐ-ప్యాక్ కార్యాలయంలో సోదాలపై దాఖలైన పిటిషన్‌తోపాటు మమతపై సీబీఐ దర్యాప్తు కోరుతూ ఈడీ వేసిన పిటిషన్‌పై విచారణను కలకత్తా హైకోర్టు ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది. శుక్రవారం మమతా బెనర్జీ, ఈడీ దాఖలు చేసిన పిటిషన్లు జస్టిస్ సువ్రా ఘోష్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. కేసులకు సంబంధంలేనివారు రావడంతో కోర్టు హాలులో గందరగోళం వాతావరణం నెలకొంది. వారంతా బయటకు వెళ్లాలని న్యాయమూర్తి విజ్ఞప్తి చేసినా ఎవరూ వినలేదు. దీంతో ఆమె సీట్లో నుంచి వెళ్లిపోయారు. ఆ వెంటనే తాము దాఖలు చేసిన పిటిషన్ విచారణను శుక్రవారమే చేపట్టాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్‌కు ఈడీ విజ్ఞప్తి చేసింది. అయితే ఆయన అంగీకరించలేదు. జస్టిస్ ఘోష్ ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పారు.

ఈడీపై కేసులు

ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన ఫిర్యాదులతో ఈడీ అధికారులపై శుక్రవారం పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గుర్తు తెలియని ఈడీ అధికారులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై షేక్‌స్పియర్ సారణి పోలీస్ స్టేషన్‌లో, గుర్తు తెలియని ఈడీ సిబ్బందిపై ఎలక్ట్రానిక్ కాంప్లెక్స్ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో కేసులు నమోదయ్యాయి.

■ తమ విధులకు ఆటంకం కలిగించిన మమతా బెనర్జీ, సీనియర్ పోలీస్ అధికారులు, ఇతరులపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఈడీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. తాము సోదాలు జరిపిన ప్రాంగణం నుంచి ఎత్తుకెళ్లిన డిజిటల్ పరికరాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, స్టోరేజీ మీడియా, డాక్యుమెంట్లను సీజ్ చేయించాలని, ఫోరెన్సిక్ ప్రిజర్వేషన్‌కు ఆదేశించాలని కోరింది.

■ సమాఖ్య వ్యవస్థ ఈడీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడిందని, కేవలం సుప్రీం కోర్టే దీనిని నిలువరించగలదని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న ప్రతి రాష్ట్రంలో, ప్రతి నేతను ఈడీ వేధిస్తోందని అభిప్రాయపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఘటన తీవ్ర ఆందోళనకరమని వ్యాఖ్యానించారు.

■ ఈడీ సోదాల సందర్భంగా మమతా బెనర్జీ కీలక సమాచారాన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నించారని భాజపా ఆరోపించింది. ఈడీ అధికారులపై బెదిరింపులకు దిగారని, వారి నుంచి పత్రాలను లాక్కెళ్లారని ఆ పార్టీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

న్యాయస్థానాలు వద్దు.. మనమే కూర్చుని చర్చిద్దాం

జల వివాదాలను శాశ్వతంగా పరిష్కరించుకుందాం

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు నీటి అంశాలపై రాజకీయాలు మానుకోవాలని హితవు



ఈనాడు, హైదరాబాద్: 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలను శాశ్వతంగా పరిష్కరించుకుందాం.. ఈ అంశాలపై పంచాయితీలు, న్యాయస్థానాలు వద్దు.. మనమే కూర్చుని చర్చిద్దాం' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం లోని ఫ్యాబ్‌సిటీలో సుజెన్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఐవీ ఫ్లూయిడ్స్ తయారీ సంస్థను శుక్రవారం ప్రారంభించిన ఆయన.. స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. "నీళ్ల వివాదాలపై పదేపదే చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయంలో రాజకీయాలకతీతంగా మాట్లాడుకుందాం. న్యాయస్థానాల వద్దకు, పెద్దమనుషుల పంచాయితీలకు వెళ్లాల్సిన అవసరం లేదు. కృష్ణా నదిపై ఉన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, డిండి, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు వంటివి ఉమ్మడి రాష్ట్రంలోనే మంజూరైన ప్రాజెక్టులు. వీటికి అభ్యంతరాలు వ్యక్తం చేయకండి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నా.. నీటి అంశాలు, నీళ్ల వివాదాల ముసుగులో రాజకీయ ప్రయోజనాలను కోరుకోవద్దు. కృష్ణా జలాల అంశాన్ని రాజకీయ లబ్ధికి వినియోగించుకోవద్దు. దానివల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉండవు.

మీరు ఒక అడుగు ముందుకు వేస్తే.. మేం పది అడుగులు ముందుకు వేస్తాం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంజూరైన సాగునీటి ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం అడ్డు పడడం వల్ల మాకు పర్యావరణ, ఇతర అనుమతులు రావడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ సైతం ఆగిపోయాయి. సాగునీటి ప్రాజెక్టులకు 60 శాతం నిధులు కేంద్రం నుంచి రాకపోవడంతో.. రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. తెలంగాణ రాష్ట్రానికి పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని అడిగితే నీళ్లే కావాలని కోరుకుంటా. వివాదం కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని బదులిస్తా. వివాదాలు పరిష్కారమైతే ప్రజలు, రైతులు, పెట్టుబడిదారులకు ప్రయోజనాలు చేకూరుతాయి. తెలంగాణలో డేటా సెంటర్ల ఏర్పాటుకు చాలా సంస్థలు ముందుకు వస్తున్నాయి. వాటికి నీరు, విద్యుత్తు అవసరం. నీళ్లు కావాలంటే కృష్ణా జలాల వివాదం పరిష్కారం కావాలి. మనకు తగినన్ని నీళ్లు లేవు... ఓడరేవు లేదు. ఈ నేపథ్యంలో భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం వరకు 12 వరుసల రహదారితోపాటు దానికి సమాంతరంగా రైల్వేలైన్ ఉండేలా అనుమతులివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాం. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం కావాలి. మాకు ఏపీ సహకరిస్తే.. అమరావతి నిర్మాణానికి మేం సహకరిస్తాం. ఎందుకంటే భవనాలు కడితే సరిపోదు.. భవనాల్లో పరిశ్రమలు రావాలి.. తెలంగాణలో సాంకేతిక నైపుణ్యాలున్న మానవ వనరులు ఉన్నాయి. ఇందుకోసం రెండు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకొనేలా చర్చలు కొనసాగుతాయి. ఏపీతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతోనూ కృష్ణాజలాల అంశంపై చర్చలు కొనసాగించనున్నాం. మీరు ఒక అడుగు ముందుకు వేస్తే.. మేం పది అడుగులు వేస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.



హైకోర్టు ఆదేశాల మేరకే జగన్ అక్రమాస్తులపై కేసు

'దాల్మియా సిమెంట్స్' పిటిషన్‌పై సీబీఐ వాదనలు

ఈనాడు, హైదరాబాద్: ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో హైకోర్టు బెంచ్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకే వైఎస్ జగన్‌కు చెందిన అక్రమాస్తులపై కేసు నమోదైందంటూ సీబీఐ శుక్రవారం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. ఇందులో భాగంగా నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా పలు కేసులు నమోదయ్యాయని పేర్కొంది. దాల్మియా వ్యవహారంలోనూ సీబీఐ దాఖలు చేసిన అభియోగ పత్రాన్ని పరిశీలించి, ఆధారాలున్నందున న్యాయస్థానం పరిగణనలోకి (కాగ్నిజెన్స్) తీసుకుందని తెలిపింది. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో.. అక్రమంగా లీజులు పొందినందుకు ప్రతిఫలంగా జగన్ కంపెనీల్లో రూ.95 కోట్ల పెట్టుబడులు పెట్టిందన్న ఆరోపణలపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. సీబీఐ తరఫు న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు ఆదేశాల మేరకు కేసులు నమోదయ్యాయని, ఇందులో నిజమైన పెట్టుబడిదారులు ఎవరో గుర్తించి, వారిని మినహాయించాలని న్యాయస్థానం చెప్పిందన్నారు. ఈ ఆదేశాల ప్రకారం.. జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన పలువురిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు.

సున్నపురాయి నిక్షేపాల కోసం..

కడప జిల్లా మైలవరం మండలం తలమంచిపట్నం, నవాబ్‌పేట గ్రామాల్లో 407.05 హెక్టార్లలో సున్నపురాయి నిక్షేపాల కోసం జయా మినరల్స్ పెట్టిన లీజు దరఖాస్తును మూడు నెలల్లో ఈశ్వర్ సిమెంట్స్‌కు బదిలీ చేయాలన్న షరతుతో అప్పటి ప్రభుత్వం ఆమోదించిందని సీబీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. పూర్తి వివరాలతో అదనపు కౌంటరు దాఖలు చేశామని చెప్పగా, న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. క్రిమినల్ పిటిషన్‌లో కౌంటరు ఎలా దాఖలు చేస్తారని, ఆ నిబంధన ఎక్కడ ఉందని ప్రశ్నించారు. సీబీఐ న్యాయవాది సమాధానమిస్తూ.. గతంలో విచారించిన మరో బెంచ్ ఆదేశాలతో కౌంటరు దాఖలు చేశామన్నారు. పిటిషనర్.. రికార్డులో లేని డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించారని, వాటికి సమాధానం ఇవ్వడానికి కౌంటరు దాఖలు చేశామని తెలిపారు. పిటిషనర్ లేవనెత్తిన పలు అంశాలను ఇదే హైకోర్టు గతంలో ఇతర కేసుల్లో తేల్చివేసిందని గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన అభియోగ పత్రాన్ని విచారణ నిమిత్తం పరిగణనలోకి (కాగ్నిజెన్స్) తీసుకోవడాన్ని హైకోర్టు సమర్థించిందన్నారు.

మేం కాగ్నిజెన్స్‌ను సవాలు చేయలేదు..

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తాము కాగ్నిజెన్స్‌ను సవాలు చేయలేదన్నారు. సీబీఐ ఆరోపించినట్లు దాల్మియా సిమెంట్స్ నిబంధనలను ఎక్కడా ఉల్లంఘించలేదన్నారు. వాస్తవ పెట్టుబడదారులను గుర్తించాలని హైకోర్టు పేర్కొన్నప్పటికీ.. దానికి విరుద్ధంగా సీబీఐ కేసు నమోదు చేసిందన్నారు. గతంలో కొందరి పిటిషన్లను ఇదే హైకోర్టు కొట్టివేసిందని, మరికొన్నింటిని అనుమతించిందన్నారు. వాటి ఆధారంగా ఈ పిటిషన్‌ను కొట్టివేయాలనడం సరికాదని, ఇందులో అంశాలు వేరుగా ఉన్నాయనగా... న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. పూర్తిస్థాయి వాదనల నిమిత్తం విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

మదనపల్లె రెవెన్యూ దస్త్రాల దహనం కేసు

విచారణాధికారిగా జేసీ ఆదర్శ్

- ఆరు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించిన రెవెన్యూశాఖ
- అప్పటి ఆర్డీవో హరిప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

ఈనాడు, అమరావతి: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో రెవెన్యూ దస్త్రాల దహనం కేసు విచారణాధికారిగా అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ని ప్రభుత్వం నియమించింది. ఈ కేసులో అప్పటి ఆర్డీవో హరిప్రసాద్, పూర్వ ఆర్డీవో మురళి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ నాయుడిపై నమోదైన అభియోగాలపై విచారించి, ఆరు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న పూర్వ ఆర్డీవో హరిప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. 2024 జులై 21న మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో కీలక రెవెన్యూ దస్త్రాలు దహనమయ్యాయి. చుక్కల భూములు, డి.పట్టా, 22ఏ సంబంధించిన దస్త్రాలు కాలిపోయాయి. భూవ్యవహారాలకు సంబంధించి అవినీతి, కార్యాలయ సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవడం, నేరపూరిత నిర్లక్ష్యం తదితర కారణాలతో అప్పటి ఆర్డీవో హరిప్రసాద్, పూర్వ ఆర్డీవో మురళి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. దగ్ధమైన ఫైళ్ల వ్యవహారంతో తనకు సంబంధం లేదని, ఉద్దేశపూర్వక రికార్డుల దహనానికి తాను బాధ్యుణ్ని కాదని హరిప్రసాద్ వివరణ ఇచ్చారు. పరిశీలించిన ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన విచారణకు భంగం కలగకూడదని పేర్కొంది.

మాజీ మంత్రి పెద్దిరెడ్డి పీఏ, అనుచరుడి పాత్ర

రెవెన్యూ దస్త్రాల దహనంపై ప్రభుత్వం అప్పుడే సీఐడీ విచారణకు ఆదేశించింది. ఉద్దేశపూర్వకంగానే రెవెన్యూ రికార్డులు దహనం చేశారని.. అందులో వైకాపా సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల ప్రమేయం ఉన్నట్లు సీఐడీ గుర్తించింది. డీపట్టా, ఫ్రీహోల్డ్ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఆధారాలు ధ్వంసం చేసేందుకే పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, సన్నిహితుడు మాధవరెడ్డి కలిసి సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ సాయంతో దస్త్రాలకు నిప్పు అంటించినట్లు దర్యాప్తులో తేల్చింది. పెద్దిరెడ్డి, ఆయన అనుచరుల మధ్య ఫోన్‌కాల్స్ వివరాలతో సహా ఆధారాలు సంపాదించింది. ఈ కేసులో ఆర్డీవో మురళిని సీఐడీ విచారించింది. నిబంధనలకు విరుద్ధంగా సుమారు 22 వేల ఎకరాలకు పైగా భూముల్ని ఆయన ఫ్రీహోల్డ్ చేసినట్లు వెల్లడైంది. వాటికి సంబంధించిన ఆధారాల్ని నాశనం చేయాలనే ఉద్దేశంతోనే గౌతమ్‌తేజ, మాధవరెడ్డి, తుకారంతో కలిసి నిప్పు పెట్టించినట్లు తేల్చింది. ఈ కేసులో ఆర్డీవో మురళి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజలను సీఐడీ అరెస్టు చేసింది.

సీఎం సభకు ఆహ్వానిస్తే.. గృహనిర్బంధం చేస్తారా?

- ఎమ్మెల్సీ ఏమైనా రౌడీషీటరా.. తీవ్రవాదా?
- మా నోటీసులకు సమాధానం ఇవ్వరా?
- దివంగత మాజీ ఎమ్మెల్సీ సాబ్జీని అవమానించిన సీఐని నిలదీసిన మండలి ప్రివిలేజెస్ కమిటీ
- ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డిని అవమానించిన కేసులో నెల్లూరు కలెక్టర్‌ను పిలిపించాలని నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్సీల హక్కులకు భంగం కలిగిస్తూ వారిపట్ల అవమానకరంగా వ్యవహరించిన అధికారులపై శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు, మరో నలుగురు ఎమ్మెల్సీల ఫిర్యాదులపై శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాలులో ఈ కమిటీ సమీక్షించింది. ఛైర్మన్ బీటీ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు పండుల రవీంద్రబాబు, పి.చంద్రశేఖర్ రెడ్డి, రమేష్‌యాదవ్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఎలా గృహనిర్బంధం చేస్తారు?

దివంగత మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతంలో ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఏలూరు మూడో పట్టణ పోలీసుస్టేషన్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్‌ను కమిటీ విచారించింది. 2023 మార్చిలో నాటి సీఎం జగన్ దెందులూరులో నిర్వహిస్తున్న సభకు రావాలని అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న సాబ్జీకి ఆహ్వానం పంపారు. వెళ్లే సమయానికి ఆయన్ను సీఐ ఆపి గృహనిర్బంధం చేశారు. అలా ఎందుకు చేశారని ఛైర్మన్ నాయుడు సీఐని ప్రశ్నించారు. సీఎం సభలో ఆయన గొడవ చేస్తారని ఆపామని సీఐ చెప్పగా.. గృహనిర్బంధం ఎలా చేస్తారు? సాబ్జీ ఏమైనా రౌడీషీటరా? మావోయిస్టులతో సంబంధాలున్న వ్యక్తా? అని ఛైర్మన్ నిలదీశారు. ఎస్పీ ఆదేశాలతో చేశానని సీఐ చెప్పగా.. వచ్చే సమావేశానికి ఎస్పీని పిలిపించాలని ఛైర్మన్ ఆదేశించారు. కమిటీకి ఫిర్యాదు చేశాక కొంతకాలానికి సాబ్జీ చనిపోయారని, వివరణ ఇవ్వాలని కమిటీ మూడుసార్లు లేఖలు పంపినా ఎందుకు స్పందించలేదని సీఐని ఛైర్మన్ నాయుడు ప్రశ్నించారు.

మీరు ఉద్యోగా... పార్టీ మనిషా

వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేటలోని శ్రీ గండి వీరాంజనేయస్వామి ఆలయంలో 2023లో నిర్వహించిన బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలో వైకాపా మండలాధ్యక్షుల పేర్లు, ఫొటోలు వేసి ఎమ్మెల్సీగా నా పేరు రాయలేదు' అని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై నాటి ఈఓ ముకుందరావును కమిటీ విచారించింది. 'ఎమ్మెల్సీ అడిగితే మా ప్రభుత్వం మా ఇష్టమన్నారంటే మీరు ప్రభుత్వ ఉద్యోగా? అధికారపార్టీ మనిషా' అని కమిటీ నిలదీసింది. అప్పట్లో ఉన్న పరిస్థితుల దృష్ట్యా పొరపాటు జరిగిందని ముకుందరావు చెప్పగా.. చేసిందంతా చేసి, ఇప్పుడు పొరపాటు అయిపోయిందంటే సరిపోయిందా అని కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

శాసనమండలి ఛైర్మన్ వచ్చినా రాలేదంటారా?

మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు ఫిర్యాదుపై భీమవరం సబ్‌రిజిస్ట్రార్ టి.ప్రసాదరెడ్డిని కమిటీ విచారించింది. 'ఒక స్థలం రిజిస్ట్రేషన్ కోసం మోషేనురాజు వస్తే కనీసం స్పందించరా? శాసనమండలి ఛైర్మన్ అనే కనీస గౌరవం కూడా ఆయనకు ఇవ్వరా? మీ కార్యాలయంలోనే మరో అధికారి వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుని వెళ్లారంటే... ప్రజాప్రతినిధులంటే మీకెంత చులకనో అర్థమవుతోంది' అని ఛైర్మన్ నాయుడు ప్రశ్నించారు. 'ఛైర్మన్ మా కార్యాలయానికి రాలేదు. అలాంటప్పుడు నేను పలకరించకపోవడం ఏముంటుంది' అని చెప్పగా.. ఛైర్మన్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని, ఆయన రాలేదని మీరెలా చెబుతారని కమిటీ నిలదీసింది.

పేరు రాయకుండా ఒకసారి.. స్టిక్కర్ వేసి మరోసారి

నెల్లూరులో టిడ్కో ఇళ్ల సముదాయంలో ఆలయ నిర్మాణం చేపట్టేందుకు వేసిన శిలాఫలకంలో ఎమ్మెల్సీగా తన పేరు రాయకపోగా, తనను ఆహ్వానించలేదని ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి చేసిన ఫిర్యాదుపై బాధ్యులైన ఏడుగురు అధికారులను కమిటీ విచారించింది. శిలాఫలకంపై ఎమ్మెల్సీ పేరుతో స్టిక్కర్ అతికించామని అధికారులు చెప్పగా.. ముందు పేరు రాయకుండా చేసిన అవమానం కంటే స్టిక్కర్ వేయడం ఇంకా పెద్దదని, ఇలా చేయాలని మీకెవరు చెప్పారని ఛైర్మన్ నాయుడు ప్రశ్నించారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు చేశామని అధికారులు చెప్పగా.. వచ్చే సమావేశానికి కలెక్టర్‌ను పిలవాలని ఛైర్మన్ ఆదేశించారు.




హెలికాప్టర్ నుంచి బ్లోఅవుట్ ప్రదేశాన్ని వీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ ఇరుసుమండ వద్ద బ్లోఅవుట్‌పై కొనసాగుతున్న నీటి గొడుగు ప్రక్రియ

బ్లోఅవుట్‌ను హెలికాప్టర్ నుంచి వీక్షించిన సీఎం

- ఇరుసుమండలో తగ్గుతున్న మంటల ఉద్ధృతి
- కొలిక్కి వచ్చిన శకలాల తొలగింపు

మలికిపురం, పి.గన్నవరం, మామిడికుదురు, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలోని ఓఎన్జీసీ బావి వద్ద తలెత్తిన బ్లోఅవుట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం హెలికాప్టర్ నుంచి వీక్షించారు. అనంతరం మండపేట నియోజకవర్గం రాయవరంలో కలెక్టర్ మహేష్‌కుమార్, అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఓఎన్జీసీ అధికారులతో సమీక్షించారు. బ్లోఅవుట్‌కు దారితీసిన పరిస్థితులు, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం వంటి చర్యలను సీఎంకు వారు వివరించారు. ప్రజలు, రైతులకు నష్టపరిహారం అందించే చర్యలపై చర్చించారు. మరోవైపు.. కేంద్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ బృందం బ్లోఅవుట్ ప్రదేశాన్ని పరిశీలించింది.

కొనసాగిన మంటలు

బ్లోఅవుట్ మంటలు ఐదోరోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. మంటల ఉద్ధృతి తగ్గుతోంది. శక్తిమంతమైన పైపులతో అంబ్రెల్లా విధానంలో నీటిని చల్లుతున్నారు. కాలిపోయిన యంత్రాల శకలాలను తొలగించారు. ఈ ప్రక్రియ శుక్రవారం రాత్రికి దాదాపు పూర్తయింది. శనివారం బావి ముఖద్వారానికి క్యాపింగ్ చేపడతారు. ఇది ఒక్కరోజులోనే ముగుస్తుందని భావిస్తున్నారు.

12న ఫ్లెమింగో ముగింపు ఉత్సవాలకు చంద్రబాబు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఈ నెల 12న నిర్వహించే 'ఫ్లెమింగో ఫెస్టివల్' ముగింపు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. నేలపట్టు, అటకానితిప్ప ప్రాంతాల్లో ఫ్లెమింగో వ్యూ పాయింట్లను సందర్శించి, స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాల మైదానంలో నిర్వహించే ఉత్సవంలో సీఎం పాల్గొంటారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. పులికాట్ సరస్సు తీరంలో ఈ నెల 10, 11, 12వ తేదీల్లో 'ఫ్లెమింగో ఫెస్టివల్' నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ పక్షుల పండగను ముందుగా రెండు రోజులే నిర్వహించాలనుకున్నా.. సందర్శకుల రద్దీ దృష్ట్యా మరో రోజుకు పెంచినట్లు చెప్పారు. ఉత్సవాలు నిర్వహించే జిల్లా పరిషత్తు పాఠశాల మైదానంలో ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ సుబ్బరాయుడు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు సెల్వం తదితరులు పాల్గొన్నారు.



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్




కాలిన పత్రాలను జాయింట్ కలెక్టర్‌కు చూపిస్తున్న తహసీల్దారు ★ సగం కాలిన పత్రాలను భద్రపరుస్తున్న రెవెన్యూ సిబ్బంది

కంచికచర్ల తహసీల్దారు కార్యాలయంలో అగ్నిప్రమాదం

- 15 ఏళ్ల నాటి దస్త్రాలు దగ్ధం

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించి, వందల రికార్డులు దగ్ధమయ్యాయి. కార్యాలయం ప్రధాన ద్వారం పక్కనే ఉన్న గదిలో మంటలు చెలరేగి పొగలు వ్యాపించడంతో అక్కడే ఉంటున్న భద్రత సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ గదిలో సుమారు 15 సంవత్సరాల నాటి రికార్డులు, పలు రకాల ధ్రువీకరణ పత్రాలున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన గది పక్కనే ఉన్న ముఖ్య రికార్డులు భద్రపరిచే గదికి మంటలు వ్యాపించి ఉంటే పెద్ద నష్టమే జరిగేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాద తీరుపై ఆరా తీశారు. షార్ట్ సర్క్యూట్ లేదా కార్యాలయం పక్కనే వేసిన చలి మంటలు అగ్ని ప్రమాదానికి కారణాలుగా భావిస్తున్నామని జాయింట్ కలెక్టర్‌కు నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తహసీల్దారు నరసింహారావు వివరించారు. ఘటనపై పూర్తి విచారణ జరిపిస్తామని, కాలిపోయిన దస్త్రాలు 15 సంవత్సరాల నాటివని, అవి డిస్పోజ్ చేయడానికి అనుమతి కోసం ఉంచారని జేసీ తెలిపారు. ఘటనపై తహసీల్దారు నరసింహారావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందం ఆధారాలు సేకరించింది.



ప్రమాదానికి కారణంగా భావిస్తున్న చలి మంట వేసిన ప్రాంతం

ఈ ఏడాది 73 మంది రాజ్యసభ సభ్యుల పదవీ విరమణ

ఈనాడు, దిల్లీ: ఈ ఏడాది మార్చి నుంచి నవంబర్ మధ్య 73 మంది రాజ్యసభ సభ్యులు పదవీవిరమణ చేయనున్నారు. దీనిపై రాజ్యసభ సచివాలయం శుక్రవారం బులిటెన్ విడుదల చేసింది. అత్యధికంగా యూపీ నుంచి 10 మంది, మహారాష్ట్ర నుంచి ఏడుగురు, తమిళనాడు నుంచి ఆరుగురు, పశ్చిమబెంగాల్, బిహార్‌ల నుంచి ఐదుగురి చొప్పున, ఏపీ, ఒడిశా, గుజరాత్, కర్ణాటకల నుంచి నలుగురి చొప్పున, అస్సాం, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి ముగ్గురి చొప్పున, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, హరియాణా, ఝార్ఖండ్‌ల నుంచి ఇద్దరి చొప్పున, హిమాచల్‌ప్రదేశ్, మణిపుర్, మేఘాలయ, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల నుంచి ఒక్కొక్కరి చొప్పున పదవీవిరమణ చేస్తారు.

తెలుగు రాష్ట్రాల నుంచి వీరే: ఏపీ నుంచి వైకాపా సభ్యులు అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో పాటు, తెదేపా సభ్యుడు సానా సతీష్‌బాబు ఈ జాబితాలో ఉన్నారు. ఈసారి ఏపీ నుంచి 4స్థానాలూ కూటమికి దక్కనున్నాయి. తెలంగాణ నుంచి భారాస సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కేశవరావు రాజీనామాతో జరిగిన ఉప ఎన్నికలో ఎన్నికైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ పదవీవిరమణ చేస్తారు. తెలంగాణలో రెండు స్థానాలనూ కాంగ్రెస్ గెలుచుకోవడానికి వీలుంది.

మరోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మళ్లీ బెంగళూరుకు వెళ్లారు. గత నెల 19న బెంగళూరుకు వెళ్లిన ఆయన ఈ నెల 5న తాడేపల్లికి తిరిగొచ్చారు. శుక్రవారం మళ్లీ బెంగళూరుకు వెళ్లారు.



రప్పా.. రప్పా.. అంటూ కత్తులతో తిరిగితే చర్యలు తప్పవు

- హోం మంత్రి అనిత హెచ్చరిక

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఇక నుంచి రప్పా.. రప్పా.. నరుకుతామంటూ కత్తులతో రోడ్లపై తిరుగుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై చర్యలు తప్పవని రాష్ట్ర హోం మంత్రి అనిత హెచ్చరించారు. నేరం చేసిన వారిని రోడ్లపై నడిపించుకుంటూ ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోలీసులు రాష్ట్రంలోనే కొత్త సంస్కృతిని తీసుకువచ్చారంటూ వారిని అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల పోలీసులు ఇదే విధానాన్ని కొనసాగించడం శుభపరిణామన్నారు. నేరం చేయాలంటే భయపడే విధంగా చర్యలు తీసుకోవడం బాగుందన్నారు. శుక్రవారం ఆమె నెల్లూరులో ఆకస్మికంగా పర్యటించారు. తొలుత జిల్లా కేంద్ర కారాగారాన్ని తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర కారాగారం పనితీరు బాగుందని మంత్రి కితాబిచ్చారు. ఖైదీలు పేస్టులు, షాంపూలు, నూనె, బీరువాలు, స్కూలు బెంచీలు తయారు చేస్తున్నారని.. నెలకు ఏడెనిమిది వేల రూపాయలు సంపాదించేలా ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. అనంతరం పోలీసు అతిథి గృహానికి చేరుకుని.. జిల్లా పోలీసు అధికారులతో పలు విషయాలపై చర్చించారు. తర్వాత విలేకర్లతో మాట్లాడారు. గతంలో రౌడీషీటర్లు, పీడీయాక్ట్ ఉన్నవారు దర్జాగా బయట తిరుగుతూ రౌడీయిజం చేసేవారని.. ఇక నుంచి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో జైలు, అగ్నిమాపక శాఖల్లో ఖాళీలు భర్తీ చేయలేదని, కూటమి ప్రభుత్వంలో త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నియామకాలు చేపడతామని తెలిపారు. మంత్రి వెంట ఎస్పీ అజిత వేజెండ్ల, అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, కేంద్ర కారాగార సూపరింటెండెంట్ సన్యాసిరావు, ఇతర అధికారులు ఉన్నారు.



నెల్లూరు కేంద్ర కారాగారంలో చేపట్టిన కార్యక్రమాలు బాగున్నాయంటూ పుస్తకంలో రాస్తున్న హోం మంత్రి అనిత

బ్యాటింగ్ చేసి వచ్చాడు.. కుప్పకూలిపోయాడు!

క్రికెట్ టోర్నీలో యువకుడి మృతి



రాజు

దేవీపట్నం, న్యూస్‌టుడే: క్రికెట్ ఆడి బయటకు వచ్చిన ఓ యువకుడు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. ఈ విషాద ఘటన పోలవరం జిల్లాలో చోటు చేసుకుంది. దేవీపట్నం మండలం పెదభీంపల్లి ఆర్‌అండ్‌ఆర్ పునరావాస-1 కాలనీలో ఆదివాసీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నారు. టోర్నీలో భాగంగా డి.రావిలంక యువకుడు పందిరి రాజు(30) శుక్రవారం బ్యాటింగ్ చేసిన తర్వాత మైదానం బయటకు వచ్చాడు. అక్కడే మంచినీళ్లు తాగి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి క్రీడాకారులు వెంటనే రాజుకి సీపీఆర్ చేసి, గోకవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలిపారు.



దివ్యాంగురాలి హత్య కేసులో క్రీడాకారుడి అరెస్టు

- పెళ్లికి ఒత్తిడి చేయడంతో దారుణం!
- చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ వెల్లడి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: అతడు ఎస్‌బీఐలో సహాయ మేనేజర్.. దివ్యాంగుల క్రికెట్ టీమ్‌లో క్రీడాకారుడు. ప్రేమించి, కలిసి తిరిగిన దివ్యాంగురాలు పెళ్లికి ఒత్తిడి చేసిందని దారుణంగా హతమార్చి పోలీసులకు చిక్కాడు. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. చిత్తూరుకు చెందిన దివ్యాంగురాలు కవిత గతేడాది డిసెంబరు 31 నుంచి కనిపించకపోవడంతో కుటుంబీకులు ఆందోళనతో వెతకడం మొదలుపెట్టారు. తాను గణేష్ అనే వ్యక్తితో వెళ్తున్నట్లు ఆమె తన సోదరుడికి అదేరోజున వాట్సప్‌లో వాయిస్ సందేశం పంపింది. తనకేమైనా జరిగితే గణేష్‌దే బాధ్యత అని వెంటనే మరో సందేశం పంపింది. వాటిని ఆలస్యంగా గుర్తించిన కుటుంబీకులు జనవరి 2న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏడో తేదీన గంగాధర నెల్లూరులో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అప్పటికే గణేష్ పరారీలో ఉన్నాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడే హత్య చేసినట్లు వెల్లడైంది.

ఇన్‌స్టాలో పరిచయమై..

కవితకు గతంలో ఓ వ్యక్తితో వివాహం కాగా, విడాకులు తీసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో గణేష్‌తో పరిచయమైంది. తర్వాత అది ప్రేమగా మారింది. 2024లో అతడు క్రీడా కోటాలో ఎస్‌బీఐలో అసిస్టెంట్ మేనేజరుగా ఉద్యోగం పొందాడు. అప్పటి నుంచి తనను పెళ్లి చేసుకోవాలంటూ ఆమె ఒత్తిడి చేయగా అతడు ఒప్పుకోలేదు. వివాదం రెండు, మూడుసార్లు పోలీస్ స్టేషన్‌కు రాగా, పెద్దల సమక్షంలో రాజీ చేశారు. అయినా పెళ్లి గురించి ఒత్తిడి పెంచడంతో గణేష్ డిసెంబరు 31న ఆమెను హత్య చేయాలనే ఉద్దేశంతో రాణా కూడలి వద్దకు రావాలని పిలిచాడు. అక్కడ వంతెన కిందకు తీసుకెళ్లి, దివ్యాంగుల వాహనానికి ప్రత్యేకంగా అమర్చిన ఫుట్‌రెస్ట్ కమ్మీకి ఆమె తలను మోదాడు. కొనఊపిరితో ఉన్న ఆమెను వంతెన పైకి తీసుకొచ్చి అక్కడి నుంచి కిందకు తోసేయడంతో చనిపోయింది.

ఎన్.ఐ.టీలో చదివి..

చదువులో రాణించిన గణేష్.. జేఈఈ మెయిన్‌లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించి, ఎన్.ఐ.టి. తిరుచ్చిలో చదివాడు. క్రికెట్‌లో పట్టు ఉండటంతో జాతీయ స్థాయికి చేరాడు. 2021లో దివ్యాంగుల క్రికెట్ లీగ్‌లో రాజస్థాన్ రాజ్‌వాడ్స్ తరపున ఆడిన అతడు 2023లో ఇండియన్ ఇంటర్నేషనల్ దివ్యాంగుల టీమ్‌కు ఎంపికై ఇండియా-నేపాల్ మ్యాచ్‌లో ఆడాడు.



ఈనాడు

ఆధిపత్యవాదమే ట్రంప్ సిద్ధాంతం

నైతిక ప్రమాణాల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటానంటూ తాజాగా సెలవిచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- తననుతాను గొప్ప ధర్మ మూర్తిగా అభివర్ణించుకున్నారు. కానీ, ఆయన మాటలకూ చేతలకూ పొంతన ఉండదన్నది జగమెరిగిన సత్యం. చమురు నిక్షేపాలను కొల్లగొట్టడమే లక్ష్యంగా వెనెజువెలాపై దండెత్తిన ట్రంప్- అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఉల్లంఘించి ఆ దేశాధ్యక్షుడు మదురో, ఆయన సతీమణిని బంధించారు. తద్వారా పశ్చిమార్ధ గోళం అమెరికా హక్కుభుక్తమని, చైనా రష్యా సహా మరెవరికీ అక్కడ తావులేదని తేల్చిచెప్పారు. ఇప్పుడేమో గ్రీన్‌లాండ్‌పై గురిపెట్టారు. సైనికంగా, సాంకేతికంగా బలమున్నంత మాత్రాన దేశాలన్నీ తమకు తలొగ్గి ఉండాలని హుంకరించడమేనా ధర్మనిరతి? గతంలో ఇరాక్, అఫ్గానిస్థాన్‌లలో అడుగుపెట్టిన అగ్రరాజ్యం వాటి తలరాత మార్చకపోగా, పరిస్థితులను మరింత కల్లోలపరచి తనదారి తాను చూసుకుంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో వెనెజువెలా గతేమవుతుందన్నది ఎవరికీ అంతుపట్టడం లేదు! తన ఏలుబడిలో అమెరికా అంటే అందరూ భయపడేలా చేశానని జబ్బలు చరుచుకుంటున్న ట్రంప్- ఆధిపత్య భావజాలంతో ప్రపంచాన్ని మళ్ళీ వలసవాద యుగంలోకి లాక్కుపోతుండటం కలవరపరుస్తోంది!

పరిశీలనల ప్రకారం, 1991-2022 మధ్యలో అమెరికా విదేశాల్లో 251 సార్లు సైనిక జోక్యాలకు తెగబడింది. లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతాల్లో ఏ దేశాన్నీ ప్రశాంతంగా నిద్రపోనీయలేదు. ఆఫ్రికా, పశ్చిమాసియాల్లోనూ బీభత్సం సృష్టించింది. తనకు నోబెల్ బహుమతి ఎందుకివ్వరంటూ ప్రశ్నిస్తున్న ట్రంప్- సరైన ఆధారాలు లేకుండానే అణ్వాయుధాలు ఉన్నాయనేసి ఇరాన్‌పై నిరుడు బాంబులు కురిపించారు. ముష్కరుల పనిపడతామంటూ ఇరాక్, నైజీరియా, సోమాలియా, సిరియాలపైనా ఏకపక్షంగా దాడులు జరిపించారు. గాజాలో జాతిహననానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్‌కు దండిగా ఆయుధ సాయం చేస్తున్నారు. గ్రీన్‌లాండ్‌ను గుప్పిట పట్టేందుకు బలప్రయోగానికీ వెనకాడబోమని సంకేతాలు పంపుతున్నారు. అదే జరిగితే 'నాటో' కుప్పకూలుతుందన్న ఐరోపా హెచ్చరికలనూ ట్రంప్ లెక్కచేయట్లేదు. ఆర్కిటిక్ ప్రాంతంలో చైనా పాగా వేసిన దరిమిలా తమ భద్రతకు గ్రీన్‌లాండ్ ముఖ్యమని ట్రంప్ చెబుతున్నారు. కానీ అక్కడి విలువైన ఖనిజాలను హస్తగతం చేసుకోవాలన్నదే ఆయన ఉద్దేశమన్నది బహిరంగ రహస్యం!

వాతావరణ మార్పులు బూటకమంటూ 'పారిస్' ఒప్పందాన్ని కాలదన్నిన ట్రంప్- 66 అంతర్జాతీయ సంస్థలు, కూటములు, ఒడంబడికల నుంచి అగ్రరాజ్యాన్ని తాజాగా వెనక్కితెచ్చారు. తమ అణ్వాయుధాలతో పుడమిని 150 సార్లు పేల్చేయగలమన్న ఆయన ప్రేలాపనలు- అగ్రరాజ్యాధిపతి పదవికి ఏమాత్రం తగనివి. ఉక్రెయిన్‌పై మాస్కో దండయాత్రను విరమింపజేస్తానన్న మాటను నిలబెట్టుకోలేకపోయిన ట్రంప్- రష్యా జెండాతో వెళ్తున్న చమురు నౌకను నిర్బంధింపజేసి ఉత్తర అట్లాంటిక్‌లో ఉద్రిక్తతలకు కారణమయ్యారు. మాస్కో నుంచి ఎవరు చమురు కొన్నా సహించబోమని పళ్లుకొరుకుతున్నారు. ఈ విషయంలో తనను సంతోషపెట్టకపోతే ఇండియాపై సుంకాల మోతను పెంచుతానన్న ట్రంప్ హెచ్చరిక- తననుతాను చక్రవర్తిగా భావించుకుంటున్న ఆయన విపరీత మనస్తత్వానికి ప్రతీక! రష్యా నుంచి చమురు తెప్పించుకునే దేశాలపై 500శాతం టారిఫ్‌లు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ సమ్మతి తెలపడమూ విస్మయపరిచేదే. స్వతహాగా వ్యాపారవేత్త అయిన ట్రంప్- ప్రపంచం ఏమైపోయినా తమ ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యమన్నట్లు ప్రవర్తిస్తున్నారు. విశ్వశ్రేయానికి చేటుచేస్తున్న ఆయన పోకడలు అంతిమంగా అమెరికాకే నష్టంచేస్తాయి!



వ్యవసాయానికి సాంకేతిక సాయం!

వరుణుడి కరుణ, పెద్దల సూచనలు, ఆరుగాలం శ్రమించడం- శతాబ్దాలుగా మన వ్యవసాయాన్ని నడిపిస్తున్న సూత్రాలివి. కానీ నేడు అత్యాధునిక యంత్రాలు, డ్రోన్లు, భూసారాన్నీ తేమనూ లెక్కగట్టే సెన్సర్లు, కృత్రిమ మేధ అన్నదాతలకు అడుగడుగునా తోడ్పడుతూ సేద్యాన్ని కొత్తపుంతలు తొక్కిస్తున్నాయి. దీన్నే వ్యవసాయ సాంకేతిక(అగ్రిటెక్) విప్లవం అంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు, విస్తృత మార్కెట్ సాధించడానికి ఇది తోడ్పడుతోంది. ఈ ఫలాలను అందుకునేలా ప్రతి రైతుకూ శిక్షణ ఇవ్వడంతో పాటు సాంకేతిక వసతులను సమకూర్చాల్సి ఉంది.

నేడు దేశంలో వ్యవసాయం కేవలం విత్తనాలు, భూసారం, వర్షాల మీదే ఆధారపడి లేదు. ఇప్పుడు సేద్యానికి డేటా కూడా కీలకమవుతోంది. సెన్సర్లు నేలలోని తేమ, పోషకాల శాతం వంటి సమాచారాన్ని రైతుకు అందిస్తున్నాయి. పొలం మీద ఎగిరే డ్రోన్లు పంటను ఆశించిన తెగుళ్ల గురించీ, ఎక్కడెక్కడ నీరు పెట్టాలనేదాని గురించీ తెలియజేస్తున్నాయి. మొబైల్ యాప్స్ సేద్యానికి సాధనాలయ్యాయి. ఎరువులు, క్రిమి నాశనులను ఎప్పుడు ఏ మోతాదులో వాడాలి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పుడు ఏ పంటలు వేయాలనే అంశాలను శాస్త్రీయంగా బేరీజు వేసి నిర్ణయాలు తీసుకునే అవకాశం అన్నదాతల ముంగిటకొచ్చింది. ఇలాంటి ఆధునిక సాంకేతిక విధానాలు సేద్యాన్ని లాభసాటిగా, ప్రకృతిహితంగా మారుస్తున్నాయి. ఈ నూతన సేద్య సాంకేతికతలు చిన్న, మధ్యతరహా రైతులకు సైతం అందుబాటులో ఉండేలా చూడటం తక్షణావసరం. ఖరీదైన డ్రోన్లు, కొత్త యంత్రాలు, సెన్సర్లను కొనే స్తోమత అందరికీ ఉండదు. కాబట్టి వాటిని గ్రామస్థాయిలోనో, లేదంటే కొన్ని గ్రామాల వారు కలిసి సమకూర్చుకోవడం ఉత్తమం. కమ్యూనిటీ కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా డ్రోన్లు, భూసార పరీక్ష కిట్‌లు, మందు చల్లే యంత్రాలు వంటి వాటిని రైతులకు అద్దెకు ఇవ్వవచ్చు.



ప్రభుత్వాల బాధ్యత ఇదీ!

ఆధునిక డిజిటల్ సేద్యం చేయడానికి అవసరమైన భాషాపరమైన, విద్యాపరమైన నైపుణ్యాలు మన రైతులందరికీ ఉండవు. చిన్న, సన్నకారు రైతులకు డిజిటల్ సాక్షరత ఉండకపోవచ్చు. మొబైల్ యాప్స్‌లో ఆంగ్లంలో వచ్చే సందేశాలను వారు అర్థం చేసుకోవడం కష్టమే. కాబట్టి, స్థానిక భాషల్లో ఆ సందేశాలు వచ్చేలా చూడాలి. సంక్లిష్టమైన గణాంకాలతో కాకుండా రంగులూ చిత్రాలతో రైతులకు సమాచారం అందించాలి. ఉదాహరణకు, పంటలు ఎండిపోతున్న పొలాలను ఎరుపు రంగులో, పంటలు ఏపుగా పెరుగుతుంటే హరిత వర్ణంలో చూపాలి. ఇలాంటి చిత్రాలు రైతులకు సులువుగా అర్థమవుతాయి. డ్రోన్లు, డిజిటల్ సాధనాలను వినియోగించడంలో రైతులకు సాంకేతిక శిక్షణ ఇవ్వాలి. వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక వాలంటీర్లు మార్గదర్శకులుగా, అగ్రిటెక్ సహాయకులుగా ఈ బాధ్యతను తీసుకోవాలి. వారు పొలాలకు వెళ్లి, అక్కడ డిజిటల్ సాధనాలను ఉపయోగించడమెలా, మొబైల్ తదితర మార్గాల్లో అందే సమాచారాన్ని అర్థం చేసుకోవడమెలా అన్నది రైతులకు నేర్పాలి. కర్షకులకు ఆధునిక సేద్య రీతులపై అవగాహన ఏర్పడి ఆత్మవిశ్వాసం కలిగితే, ఇక వారంతటవారే స్మార్ట్ సేద్యాన్ని చేపడతారు. గ్రామాల్లో అరకొర ఇంటర్నెట్ అనుసంధానత, మొబైల్ టవర్ల కొరత, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు డేటా ప్రవాహాన్ని అడ్డుకుని అగ్రిటెక్ విప్లవానికి అడ్డంకులుగా పరిణమిస్తాయి. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు ఈ లోపాలను సరిదిద్దాలి. డ్రోన్లు, సెన్సర్ల మరమ్మతు సౌకర్యాలను స్థానికంగానే అందించాలి. ఈ విధంగా ఆధునిక డిజిటల్ సాంకేతికతలనూ పరికరాలనూ రైతులు సమర్థంగా ఉపయోగించగలిగినప్పుడు వారి ఆదాయాలు ఎంతో మెరుగుపడతాయి.

మండల, జిల్లాస్థాయుల్లో అగ్రిటెక్ కేంద్రాలను ఏర్పాటుచేసి, వాటి ద్వారా డ్రోన్లు, భూసార పరీక్ష ల్యాబ్‌లు, స్మార్ట్ సేద్య సాధనాలను అద్దెకు ఇచ్చే ఏర్పాట్లు చేయడం ప్రభుత్వాల బాధ్యత. వీటిని సమర్థంగా ఉపయోగించి ఆశించిన ఫలితాలను సాధించగలిగేలా రైతులకు నైపుణ్యాభివృద్ధి కోర్సులను అందించాలి. వారిలో కొంతమంది అగ్రిటెక్ నిపుణులుగా ఎదిగి తోటి రైతులకు తోడ్పడగలుగుతారు. అన్నదాతలు డిజిటల్ సేద్య సాధనాలను కొనడానికీ, అద్దెకు తీసుకోవడానికీ బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా రుణాలు అందించడం ముఖ్యం. స్మార్ట్ సేద్య సాధనాలు, సౌర పంపులు, ఆటోమేటిక్ స్ప్రేయర్ల కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వాలి. ఈ కార్యక్రమాల్లో బీమా కంపెనీల భాగస్వామ్యం ఎంతో కీలకం. అన్ని కంపెనీల పరికరాలు నిర్దేశిత ప్రమాణాలను పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పరస్పరం అనుసంధానం కాని, డేటాను పంచుకోని సాధనాలతో రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు సరికదా, నష్టమే జరుగుతుంది. కాబట్టి, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ... టెక్నాలజీ చిన్న, సన్నకారు రైతులకు కూడా మంచి నేస్తమనే నమ్మకాన్ని కలిగించాలి.

యువతరాన్ని ఆకర్షించాలంటే...

దేశ జనాభాలో సగంమందికి ఇప్పటికీ వ్యవసాయమే జీవనాధారం. నూతన సాంకేతికతలు తెస్తున్న మార్పులను మన రైతులు అందిపుచ్చుకోగలిగితేనే దేశానికి దివ్యమైన భవిష్యత్తు ఉంటుంది. భారతీయ రైతు సంప్రదాయ విజ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతలతో సమర్థంగా మేళవించగలగాలి. తద్వారా సాధారణ రైతుగా మిగిలిపోకుండా నవీకరణ సాధకుడిగా రూపాంతరం చెందగలుగుతాడు. సస్య సంరక్షణ, అధిక దిగుబడులను ఆధునిక సాంకేతికతలతో కచ్చితంగా అంచనా వేసి, పక్కాగా సాధించగల లక్ష్యాలుగా మార్చుకోవాలి. అలా చేసినప్పుడే యువత సేద్యంవైపు ఆకర్షితమవుతుంది. ఆధునిక సాంకేతికతలతో సేద్యం లాభసాటిగా ఉంటుందనే భరోసా ఏర్పడితే యువతీ యువకులు ఉపాధి కోసం పట్టణాలు, నగరాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉంటూ తమ జీవితాలను సుసంపన్నం చేసుకోగలుగుతారు. పొలం మీద ఎగురుతున్న డ్రోన్, మొబైల్ ఫోన్‌లో పంట తీరును పరిశీలిస్తున్న రైతు నిత్య దృశ్యాలైనప్పుడు- గ్రామీణ అభ్యుదయం తప్పక సిద్ధిస్తుంది. భారతీయ వ్యవసాయం స్వావలంబన సాధిస్తుంది. అటువంటి స్మార్ట్ సేద్యం దిశగా భారతీయ రైతు స్థిరంగా పడివడిగా ముందడుగు వేస్తాడని ఆశిద్దాం.



నాగళ్ల శివప్రసాద్

విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ-మద్రాసు

వెంకట్ పంచాయతీ సెక్రటరీ. ప్రతినెలా అయిదో తారీఖున జీతం వస్తుంది. అప్పులు తీర్చేయగా వారంలో ఖాతా ఖాళీ అవుతుంది. ఆ సమయంలో తీరని కల ఒకటి గుర్తుకొస్తుంది. 'ఇంకాస్త చదివి, గెజిటెడ్ ఉద్యోగం సాధిస్తే బాగుండేదని'. ఓ రోజు బాల్యమిత్రుడి నుంచి మెసేజ్ వచ్చింది. 'గ్రూప్స్ నోటిఫికేషన్ వచ్చింది.. రాద్దాం' అని. దాన్ని చూడగానే తన కోరిక నెరవేరే సమయం వచ్చిందనుకున్నాడు వెంకట్. గోడ మీద క్యాలెండర్‌లో ఆ తేదీని ఎర్రపెన్నుతో మార్క్ చేశాడు. 'ఇది గుర్తుండిపోయే రోజు. ఇవాళ్టినుంచి జీవితం మారాలి' అనుకున్నాడు.

అప్పట్నుంచి ప్రతిరోజూ సాధించిన ప్రగతిని క్యాలెండర్ తేదీ కింద రాయడం నియమంగా పెట్టుకున్నాడు. 'మూడు గంటలు చదివా. ఈ రోజు మిస్సయ్యా. గంటైనా పుస్తకం



మార్పు కోసం... ఒక తేదీ!

పట్టలేదు. హమ్మయ్య! ఇవాళ మెయిన్ టాపిక్ పూర్తయింది'.. అనే చిన్న చిన్న వాక్యాలు జతకూడుతూ ఒక్కో నెల పూర్తవసాగింది. ఓ రోజు రాత్రి 11.30 గంటలకు ఫోన్‌లో రీల్స్ చూస్తూ ఎందుకో హఠాత్తుగా తలెత్తాడు. ఎదురుగా క్యాలెండర్ కనపడింది. ఆ రోజు తేదీ ఖాళీగా ఉంది! 'ఇలా అయితే, పరీక్ష ఫలితమూ ఖాళీయే' అనుకున్న వెంకట్ వెంటనే సోఫాలోంచి లేచి పుస్తకం పట్టుకున్నాడు. అదేమీ అంతగా చదివిన రోజు కాదు. కానీ, తనను తాను గెలిచిన రోజు అనిపించింది. తరవాత నెలలు, సంవత్సరాలు మారాయి. పరీక్ష ఫలితాలు వెల్లడయ్యే రోజు రానే వచ్చింది. విజేతల జాబితాలో పేరు చూసుకుని కష్టం ఫలించిందనుకున్నాడు వెంకట్.

మనందరమూ ఏదో ఒక సందర్భంలో క్యాలెండర్‌లో ఏదో ఒక తేదీని పెన్నుతో చుట్టిన వాళ్లమే. ఉద్యోగ ప్రయత్నాలు, సొంత వ్యాపారం, వ్యాయామం చేయడం... లాంటి లక్ష్యాల సాధనకు ప్రయత్నం మొదలెట్టే ఉంటాం. దాన్ని కొనసాగించడంలోనే ఒక్కొక్కరిదీ ఒక్కో తీరవుతుంది. జీవితం మనం నిర్ణయం తీసుకోగానేనో, పని మొదలు పెట్టగానేనో మారదు. అలుపెరగని ప్రయత్నం కొనసాగాలి. ప్రతిరోజూ నిన్నటికన్నా నేడు మెరుగ్గా సాగిందనుకోగలగాలి. ఏం సాధించామన్నది క్యాలెండర్ తేదీ గడిలో చిన్న వాక్యంగా రాసుకోవాలి. గోడ మీద క్యాలెండర్ కాకపోతే స్మార్ట్‌ఫోనులో డిజిటల్ క్యాలెండర్‌లో రాసుకోండి. క్యాలెండర్‌లో పేజీ మాత్రమే మారిందా? నేనూ మారానా... అని నెలాఖర్లో వెనక్కి తిరిగి చూసుకోవడం మరవద్దు. ఖాళీ గడులను నిజాయతీగా గుర్తుంచుకోవాలి. అవే మనల్ని తిరిగి ట్రాక్ మీదకు తెచ్చే అలారంలా పనిచేస్తాయి. ప్రతి తేదీకీ సార్థకత ఇవ్వడం మన చేతుల్లోనే ఉంది. మనం చిత్తశుద్ధితో ఏం చేస్తామో.. అదే చివరి ఫలితమై తిరిగొస్తుంది. ప్రతి ఒక్కరి జీవిత క్యాలెండర్‌లో.. ఒక్కో తేదీ ఓ కథ చెప్పాలి. ఎక్కడ అలసిపోయాం? ఎక్కడ బలంగా నిలిచాం? ఎక్కడ పడిపోయాం? ఎక్కడ తిరిగి లేచాం... అని! ఆ ఎరుకే జీవితాన్ని గెలుపుబాటలో నడిపిస్తుంది.

– గోపయ్య మాడుగుల



సరైన సమయంలో సరైన ప్రశ్న... ఒక సంక్షోభం తలెత్తకుండా ఆపగలదు. ఒక సమస్యకు ముగింపు పలకగలదు. అందుకే ప్రశ్నించండి... ఒక్కోసారి గట్టిగా, ఒక్కోసారి మృదువుగా... ప్రశ్నించడం మాత్రం మానకండి.

– నిఖిల్ డే

ఆర్టీఐ ఉద్యమకారులు, సామాజిక కార్యకర్త



అలక్ష్యం ప్రాణాంతకం

గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ ఏటా ఎంతోమందిని పొట్టన పెట్టుకుంటోంది. ఐసీఎంఆర్ అంచనాల ప్రకారం 2014లో ఆ క్యాన్సర్ బారిన పడి ఇండియాలో 28 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఆ సంఖ్య 35 వేలకు పైబడింది. వాస్తవ మరణాలు అంతకు రెట్టింపు ఉంటాయని అంతర్జాతీయ పరిశీలనలు చెబుతున్నాయి. అయినప్పటికీ సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు మన దేశంలో అరకొరగానే జరుగుతున్నాయి. దాంతో వ్యాధి ముదిరి మరణం అనివార్యమవుతోంది.

ఆయా ఆర్థిక సంవత్సరాల్లో ముప్పై ఏళ్లు పైబడిన మహిళల్లో దేశవ్యాప్తంగా ఎంతమందికి సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారంటే... (కోట్లలో)	2020-21	2021-22	2022-23	2023-24	2024-25	2025-26	(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)
	0.21	0.59	1.86	1.15	1.75	1.27 (నవంబర్ వరకు)	

భగవన్నామ స్మరణ

ఎల్లప్పుడూ ఆ పరమాత్ముడి నామాన్ని గుర్తు చేసుకోవడమే స్మరణం. నారదుడు ఉపదేశించిన తొమ్మిది భక్తి మార్గాలలో ఒకటైన స్మరణం ఎంతో ఫలప్రదమైనది. ఎంత పెద్ద సముద్రాన్నయినా ఒక చిన్న పడవతో దాటి ఒడ్డుకు చేరుకున్నట్లుగా, భక్తి అనే నావతో మోహ సంద్రాన్ని దాటి, మోక్ష తీరానికి చేరుకోవచ్చు.

మంత్రోపాసనకు ఉన్నట్లు నామస్మరణకు ఎటువంటి నియమ నిబంధనలు లేవు. ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా చేసుకోవచ్చు. అత్యంత సులభమైన నామ మననం వల్ల కూడా అదే ఫలితం లభిస్తుంది. కలియుగంలో భగవన్నామ స్మరణమే భవ రోగాలను అంతమొందించి, భవ బంధాల నుంచి విడిపించే దివ్యౌషధం. నీరు మురికిని శుభ్రపరచినట్లుగా, భగవన్నామం హృదయంలోని దోషాల్ని శుభ్రపరచి, పవిత్రం చేస్తుంది. భక్తి తత్వాన్నంతటినీ కాచి వడపోసి, పోతపోసిన పోతన భాగవతంలో వివరించినట్లుగా మంచినీరు తాగేటప్పుడు, తినేటప్పుడు, నడుస్తున్నప్పుడు, నవ్వుతున్నప్పుడు, ఆఖరికి నిద్రించేటప్పుడు కూడా ఆ శ్రీహరినే కలవరించాలి. భగవంతుడు, భగవన్నామం వేర్వేరు కాదు. వాగర్థాల మాదిరి రెండూ ఒక్కటే. భగవంతుడు మాధుర్య మూర్తి అయితే భగవన్నామం మాధుర్య దీప్తి. కష్టాల్ని సులభంగా తొలగించుకునేందుకు, ఇష్టాల్ని సాధించుకునేందుకు మార్గమైన ఈ నామం సత్యమైనది, శివమైనది, సుందరమైనది. గజేంద్రుడి మొర విన్న వెంటనే పరుగు పరుగున వచ్చి కాపాడిన విధంగా ఏకాగ్ర చిత్తంతో నన్నే నిరంతరం స్మరిస్తూ, సేవించే నా భక్తుల యోగక్షేమాల్ని నేనే స్వయంగా చూసుకుంటానని అభయమిచ్చాడు గీతాకారుడు.



అంతర్యామి

ఓ వస్తుప్రదర్శనశాల వారు సందర్శకులు తమకు నచ్చిన ఏదో ఒక వస్తువును ఉచితంగా పొందవచ్చని బోర్డు పెట్టారు. ఒకసారి తీసుకున్న వస్తువును మార్చుకోవడానికి వీల్లేదన్నది షరతు. మొదటి అంతస్తులో రాతి విగ్రహాలుంటే, రెండోదాంట్లో ఇత్తడి, మూడో అంతస్తులో పుత్తడి విగ్రహాలు ఉన్నాయి. నచ్చి ఏదో ఒకటి తీసుకెళ్లిన వాళ్లంతా 'తొందరపడి తక్కువ విలువ గల వాటిని తెచ్చుకున్నాం. ఇంకా ఎక్కువ విలువగల వాటిని తెచ్చుకుంటే బాగుండేది' అని బాధపడ్డారు.

ఒక తెలివైన అమ్మాయి మాత్రం ఓపిగ్గా చివరి అంతస్తు చివరిదాకా వెళ్లి చూసింది. అక్కడ కూర్చుని ఉన్న సహజ సుందరాకారుడైన ప్రదర్శనశాల యజమానిని ఇష్టపడింది. పెళ్లి చేసుకుని హాయిగా జీవించింది. మన ఆండాళ్ తల్లి కూడా ప్రాపంచిక వస్తువిషయాల పట్ల ఆసక్తి చూపకుండా, ఆ శ్రియఃపతినే మతిలో తన పతిగా, శరణాగతిలో తన గతిగా ఇష్టపడి, కష్టపడి సొంతం చేసుకుంది. ప్రాతఃస్మరణీయురాలై, జీవన్ముక్తికి మార్గనిర్దేశనం చేసింది.

ఆ పరమాత్ముడి ఒక్కొక్క నామం ఒక్కొక్క కల్యాణ గుణాన్ని తెలియజేస్తుంది. ఆ దివ్యమైన, భవ్యమైన గుణాల్ని స్మరించడం మాత్రమే కాకుండా, ఆచరించినట్లయితే మనం కూడా ఆ అద్వైత సిద్ధిని, అమరత్వ లబ్ధిని పొందవచ్చు కదా!

– గుజ్జుల వీరనాగిరెడ్డి

బండికట్టురా! బండికట్టురా! గండికోటకీ...

తమిళనాట కొన్ని ప్రాంతాల్లో మట్టిని పూజించే సంప్రదాయం ఉంది. రాయలసీమలోని గండికోట ప్రాంతంతో ఆ ఆచారానికి ప్రత్యేక అనుబంధం ఉంది. రేపటి నుంచి మూడు రోజుల పాటు గండికోట ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ 'మట్టి' విశేషాలేంటో చూద్దాం!

జమ్మలమడుగు నుంచి 11 కిలోమీటర్ల దూరంలో గండికోట ఉంటుంది. దీనికి దక్షిణ భారతదేశ చరిత్రలో చారిత్రక ప్రాధాన్యం ఉంది. పదకొండో శతాబ్దంలో మలికినాడు సీమకు సంరక్షకుడైన కాకరాజు పెన్నానదికి 300 అడుగుల ఎత్తులో మట్టితో ఈ కోటను నిర్మించారు. సహజసిద్ధంగా పెన్నానది పారుతూ ఏర్పడిన గండి వలన ఈ కోటకు 'గండికోట' అనే పేరు వచ్చింది. జలదుర్గం, వనదుర్గం, గిరిదుర్గం అనీ పేర్లున్నాయి. విజయనగర సామ్రాజ్యానికి ఈ కోట వెన్నుదన్నుగా నిలిచింది. కోట లోపల రాయల కాలంనాటి అద్భుతమైన శిల్పసంపదను బట్టి దీన్ని రెండో హంపిగా పిలుస్తారు. గండికోట అందాలు అమెరికాలోని 'గ్రాండ్ కెన్యాన్'కు ఏమాత్రం తీసిపోవు. పరాయి పాలకుల దండయాత్రలో ఇక్కడి ఆలయాలు దెబ్బతిన్నాయి.

పెన్నా నుంచి కావేరి తీరానికి...

విజయనగర సామ్రాజ్యంలో రాయలసీమ 'రత్నాలసీమ'గా ఖ్యాతికెక్కింది. కొసరాజు రాఘవయ్య తన 'గండికోట యుద్ధం' కావ్యంలో 'చేటల వజ్రాలు చెరిగెడు చోట్లు/ గోనెల వరహాలు కూండెడి యూళ్లు...' అంటూ ఆనాటి వైభవాన్ని కళ్లకుకట్టారు. విలువైన ఖనిజ సంపదతో పాటు, పాడిపంటలతో తులతూగుతున్న రాయలసీమపై శత్రువుల కన్నుపడింది. గండికోట పరాయి పాలకుల వశమైంది. విజయనగర సామ్రాజ్య అంతానికి కారణమైన తళ్లికోట యుద్ధానంతరం శత్రు సైన్యాల దాడి తట్టుకోలేక గండికోట వాసులు, పాలకులు కొందరు కావేరి తీరానికి చేరి విశ్వనాథ నాయకుడి ఆశ్రయం పొందారు. విశ్వనాథ నాయకుడు పెమ్మసాని వారిని కురివికుళం సంస్థానానికి, రావెళ్ల వారిని ఇళయరసనేందళ్ సంస్థానానికి అధిపతులుగా నియమించాడు. నేటి తమిళనాడులోని విరుదునగర్, తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో కొన్ని ప్రాంతాలను వారికి అప్పగించాడు. అలా వచ్చిన వారి వారసులను కొందరిని నేటికీ 'గండికోట వారు' అనే పేరుతోనే స్థానికులు వ్యవహరిస్తున్నారు. తెలుగువారు దక్షిణాదికి వలస వెళ్లేటప్పుడు వారితో పాటు వీలైనన్ని పాడిపశువులతో పాటు ఒకానొక 'విలువైన' వస్తువును తమ వెంట తీసుకొనివెళ్లారు. అదే 'పిడిమన్ను'! అంటే తాము పుట్టిన గడ్డ నుంచి తీసిన పిడికెడు మట్టి. దానికి గుడికట్టి పూజిస్తున్నారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి రోజున తిరునాళ్లు జరుపుతున్నారు. ఈ సంప్రదాయం నేటికీ విరుదునగర్, చుట్టుపక్కల జిల్లాల్లో చాలాచోట్ల కనిపిస్తుంది. శివకాశి సమీపంలోని వరగనూర్ గ్రామస్థులు తల్లిలాంటి తెలుగు భాషను, తమవారిని మరవలేమని అంటారు. 'తెలుగునాడు నుంచి మా తాతలు దక్షిణాదికి వచ్చేటప్పుడు వారు ఎత్తుకొని వచ్చిన పెట్టె ఈడ కిందాల పడింది. దానితో 'ఇదే మనం ఉండబోయే తావు' అని నిర్ణయించుకుని చెట్లు కొట్టి సాగు చేస్తిరి. తాము వచ్చినప్పుడు తెచ్చిన పిడిమన్నుదా కులదైవంగా ఎంచేరు. మామూ ఆ మట్టినే నేటికీ మొక్కేము' అంటారు వరగనూర్‌కు చెందిన ఏనుగు సరస్వతీ శ్రీనివాస్. విరుదునగర్ జిల్లాలోని ఆలంకుళం తాలూకా కరిశల్‌కుళం గ్రామానికి చెందిన బాలగణేశన్ చెన్నై ఐఐటీలో అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి ఏటా మహాశివరాత్రి రోజు తిరునాళ్లకు సొంతూరికి వెళ్లి మట్టిగుడికి మొక్కుతారు. వారి ఇంటి భాషగా తెలుగు ఇప్పటికీ నిలిచి ఉంది. ఇలాంటి వారు అక్కడ ఎంతో మంది ఉన్నారు.



ఇప్పటికీ అదే మమకారం!

బ్రిటిష్ పాలనా కాలంలోనూ తల్లి నేలను విడిచి వెళ్లేటప్పుడు నలభై ఊళ్లకు చెందిన మట్టిని తమతోపాటు తీసుకొచ్చి కొందరు కీళ్చేరు ప్రాంతంలో పూడ్చిపెట్టి దానిపై స్మారక స్థూపం నిర్మించి నేటికి భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు. తమకు అన్నేళ్లపాటు అన్నం పెట్టిన నేల తల్లితో అనుబంధాన్ని వీడలేక తలాపిడికెడు మట్టిని తమతో పాటు మూటకట్టుకుని తీసుకొనివెళ్లి పూజిస్తున్నారు. ప్రస్తుతం తమిళనాడులో స్థిరపడిన పలువురు వందల ఏళ్ల కిందట తమ పూర్వులు గండికోట నుంచి వలసవచ్చినట్లు గుర్తు చేసుకుంటారు. తమ మాతృభూమిని చూడాలనీ, దాని గురించి మరింత తెలుసుకోవాలని ఆరాటపడుతుంటారు. నేటికీ 'బండికట్టురా! బండికట్టురా! గండికోటకీ/ బండికట్టురా! బండికట్టురా! జన్మభూమికీ' అని పాడుకుంటూ ఉంటారు. ఇంటిపేర్లు, గోత్రాల ద్వారా వారి స్వస్థలాలకు సంబంధించి కొంత లోతైన సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది. 'ఈ మట్టి మనకు ఎన్నో కథలు చెబుతుంది! ఈ చరిత్ర ఎన్నో విశేషాలు గుర్తుచేస్తుంది! ఆ కథలను వినండి' అంటూ ఇలాంటి వారందరినీ గండికోట ఉత్సవాలకు ఏపీ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది.

– డాక్టర్ సగిలి సుధారాణి, జానపద, భాషా పరిశోధకులు

మిణుగురుల మిలమిల..!

హాయ్ నేస్తాలు! మనం చాలా రకాల కీటకాలను చూస్తూ ఉంటాం. వాటిని చూస్తేనే చిరాకు పడతాం. కానీ మిణుగురులను చూస్తే మాత్రం 'వావ్.. భలేగా మెరుస్తున్నాయే!' అనుకుంటాం కదా! అవెక్కడ ఎక్కువగా ఉంటాయి.. ఎందుకు మెరుస్తాయి? ఆ విశేషాలన్నీ తెలుసుకుందామా!

మిణుగురు పురుగులను ప్రత్యక్షంగా చూడకపోయినా టీవీలోనైనా ఎప్పుడో ఒకసారి చూసుంటాం. లైట్లలా చక్కగా వెలగడమే వీటి ప్రత్యేకత. లైట్లకు కరెంట్ కనెక్షన్ ఉంటుంది కాబట్టి వెలుగుతాయి. మరి ఈ కీటకాలు ఎలా? అనే సందేహం మీకు వచ్చింది కదా నేస్తాలూ! మిణుగురు పురుగుల శరీరంలో లూసిఫెరిన్ అనే ప్రత్యేక రసాయన పదార్థం ఉంటుంది. అది గాలిలోని ఆక్సిజన్‌తో కలిసినప్పుడు వెలుగు పుడుతుందన్నమాట.



అలా దాని శరీరం వెలుగును ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రక్రియను బయోల్యూమినిసెన్స్ అంటారు.

మనం ఎవరినైనా పిలవాలంటే మాటలతో లేదంటే సైగలతో పిలుస్తాం కదా! మిణుగురులు వాటి వెలుతురుతో స్నేహితులకు సంకేతాలిస్తూ పిలుస్తాయట. అంతేకాకుండా శత్రువుల నుంచి తప్పించుకోవడానికీ ఆ వెలుగుని ఉపయోగించుకుంటాయి. మరో విషయం ఏంటంటే మిణుగురులు అన్నీ ఒకే రంగులో మెరవవు. వాటి జాతిని బట్టి.. పసుపు, ఆకుపచ్చ, నారింజ రంగుల్లో కాంతిని వెదజల్లుతాయి.

హాయ్! బుజ్జీ!!

మిణుగురులు ఎక్కువగా పల్లెల్లో చెరువులూ వాగుల దగ్గర తేమ ఎక్కువగా ఉన్న చోట కనిపిస్తాయి. కాలుష్యం ఉన్న చోట అస్సలు ఉండవట. అందుకే వీటిని పర్యావరణ స్వచ్ఛతకు గుర్తులుగా పరిగణిస్తారు. ఇవి వర్షాకాలంలో ఎక్కువగా ఉంటాయి. మిణుగురులు ఉన్న ప్రాంతం వేడిగా ఉండదట.. అందుకే వాటిని 'కోల్డ్‌లైట్' అని పిలుస్తారు.

– ప్రశాంత్ కందా

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతోంది. ఓసారి ప్రయత్నించండి.

1. MOU☐☐VEN
2. FLO☐☐ANGE
3. WAT☐☐ECK
4. TI☐☐CHANIC
5. FL☐☐AIN

జవాబు: 1. MOUSE, SEVEN 2.FLOOR, ORANGE 3.WATCH, CHECK 4.TIME, MECHANIC 5.FLAG, AGAIN



సంక్రాంతికి షాపింగ్ మొత్తం ఇప్పుడు బడ్జెట్‌లో ఉంది

DMart®
Daily Discounts Daily Savings

షాప్ ఆన్‌లైన్ — DMart ready — GET IT ON Google Play — Download on the App Store

₹34* మాత్రమే లూజు గోధుమ పిండి 1 కిలో
₹41.50* మాత్రమే లూజు చక్కెర 1 కిలో
₹48* మాత్రమే లూజు సోనా మసూరి కర్నూల్ రైస్ 1 కిలో
₹34* మాత్రమే లూజు ఇడ్లీ రవ్వ 1 కిలో

సంక్రాంతి స్పెషల్

₹157* మాత్రమే లూజు తెల్ల నువ్వులు 1 కిలో
₹75* మాత్రమే లూజు శనగపప్పు 1 కిలో
₹105* మాత్రమే లూజు పెసరపప్పు 1 కిలో
₹141* మాత్రమే లూజు వేరుశనగ 1 కిలో
₹42* మాత్రమే లూస్ మైదా 1 కిలో
₹105* మాత్రమే లూజు వేయించిన శెనగపప్పు 1 కిలో
₹69* మాత్రమే లూజు గుండ్రని బెల్లం 1 కిలో

నిత్యావసర వస్తువులు

₹449* మాత్రమే జీడిపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 675
₹239* మాత్రమే దేశవాళీ కిస్మిస్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 374
₹399* మాత్రమే స్వాద్ బాదంపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 503
₹299* మాత్రమే మిక్స్‌డ్ డ్రై ఫ్రూట్స్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 407
₹37*/₹89* మాత్రమే ఇలాచి గ్రీన్ ఇకో 10/25 గ్రాములు ఎంఆర్‌పి ₹ 54/ ₹ 130
₹47* మాత్రమే ప్రీమియా బియ్యపు పిండి 1 కిలో ఎంఆర్‌పి ₹ 62
₹79* మాత్రమే ప్రీమియా శనగపిండి 1 కిలో ఎంఆర్‌పి ₹ 102

₹585* మాత్రమే క్రీమ్‌లైన్ జెర్సీ ఆవు నెయ్యి పౌచ్ 1 లీ ఎంఆర్‌పి ₹ 749
కొనండి 1 పొందండి 1 ఉచితంగా పావక్ బెల్లం క్యూబ్స్ జార్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 110*
₹49* మాత్రమే దావత్ పులావ్ బాస్మతి రైస్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 90
₹145* మాత్రమే ఆశీర్వాద్ మిరప పొడి 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 250
కొనండి 1 పొందండి 1 ఉచితంగా ఈస్టర్న్ చికెన్ మసాలా 100 గ్రాములు ఎంఆర్‌పి ₹ 63*
₹295* మాత్రమే బ్రూక్ బాండ్ తాజ్ మహల్ టీ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 380
₹380* మాత్రమే బ్రూ ఇన్‌స్టెంట్ కాఫీ 200 గ్రాములు ఎంఆర్‌పి ₹ 500
₹380* మాత్రమే డాబర్ హనీ 1.3 కిలో ఎంఆర్‌పి ₹ 635

₹79* మాత్రమే సన్‌ఫీస్ట్ యిప్పీ మ్యాజిక్ మసాలా నూడుల్స్ 544 గ్రాములు ఎంఆర్‌పి ₹ 120
₹125* మాత్రమే ఎమ్ టి ఆర్ గులాబ్ జామున్ మిక్స్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 196
₹105* మాత్రమే బాంబినో వెర్మిసెల్లి 1.4 కిలో ఎంఆర్‌పి ₹ 145
₹145* మాత్రమే లోట్టే చోకో పై బిస్కెట్లు 504 గ్రాములు ఎంఆర్‌పి ₹ 205
కొనండి 1 పొందండి 1 ఉచితంగా సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ కాజు అండ్ బాదం బిస్కెట్లు 584 గ్రాములు ఎంఆర్‌పి ₹ 142*
₹75* మాత్రమే థమ్స్ అప్ బాటిల్ 1.75 లీ ఎంఆర్‌పి ₹ 100
₹110* మాత్రమే అంబికా దర్బార్ బత్తి 220 గ్రాములు ఎంఆర్‌పి ₹ 135
₹117* మాత్రమే శుభ్ కార్య దర్శన కాంఫర్ పూజ ఆయిల్ 900 మి.లీ ఎంఆర్‌పి ₹ 207

కొనండి 1 పొందండి 1 ఉచితంగా బెల్లా విటా పెర్ఫ్యూమ్ యూనిసెక్స్ గిఫ్ట్ ప్యాక్ 4N x20 మి.లీ ఎంఆర్‌పి ₹649*
₹509* మాత్రమే పారాచూట్ కొబ్బరి నూనె 1 లీ ఎంఆర్‌పి ₹ 713
₹240* మాత్రమే డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ వ్యాల్యూ ప్యాక్ 600 గ్రాములు ఎంఆర్‌పి ₹ 351
కొనండి 1 పొందండి 1 ఉచితంగా వాసెలిన్ డీప్ మాయిశ్చర్ బాడీ లోషన్ 400 మి.లీ ఎంఆర్‌పి ₹515*
₹253* మాత్రమే పియర్స్ ప్యూర్ మరియు జెంటిల్ సాఫ్ట్ సబ్బు 4x125 గ్రాములు + 125 గ్రాములు ఉచితంగా ఎంఆర్‌పి ₹ 363
₹220* మాత్రమే లైజాల్ సిట్రస్ సర్ఫేస్ క్లీనర్ 1 లీ ఎంఆర్‌పి ₹ 260
₹210* మాత్రమే హార్పిక్ పవర్ ప్లస్ ఒరిజినల్ టాయిలెట్ క్లీనర్ 1 లీ ఎంఆర్‌పి ₹ 235
₹235* మాత్రమే ఆల్ అవుట్ అల్ట్రా పవర్ + రీఫిల్స్ 4U x45 మి.లీ ఎంఆర్‌పి ₹ 325

కిచెన్‌వేర్

₹29*# నుంచి స్టీల్ ఫెస్టివల్ స్పెషల్
₹39*# నుంచి ప్లాస్టిక్ కంటెయినర్ అసార్టెడ్
₹99* మాత్రమే ఈజీ లాక్ 300 మి.లీ 6 పీస్‌లు ఎంఆర్‌పి ₹ 150
₹29*# నుంచి మెలమైన్ ట్రే 19.05 సెం.మీ x15.24 సెం.మీ
₹19*# నుంచి గ్లాస్ జార్
₹445*# మాత్రమే పిజియన్ స్టార్మ్ ఇండక్షన్ బేస్ దోస తవా ఎంఆర్‌పి ₹ 1,025
₹1,489*# మాత్రమే బటర్‌ఫ్లై స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్ 3 లీ ఎంఆర్‌పి ₹ 3,415
₹1,749*# నుంచి బ్రాండెడ్ మిక్సర్లు BAJAJ Crompton WONDERCHEF

వివాహ సీజన్‌కి సిద్ధమవ్వండి

శీతాకాలపు దుస్తులు అందుబాటులో ఉన్నాయి.



₹199*# నుంచి గర్ల్స్ ఫ్యాషన్ ఫ్రాక్
₹79*# నుంచి బాయ్స్ మరియు గర్ల్స్ టీ-షర్ట్
₹299*# నుంచి గర్ల్స్ కుర్తీ
₹149*# నుంచి బాయ్స్ షర్ట్
₹199*# నుంచి బాయ్స్ డెనిమ్



₹99*# నుంచి లేడీస్ టీ-షర్ట్
₹149*# నుంచి లేడీస్ ఫ్యాన్సీ టాప్
₹349*# నుంచి లేడీస్ జీన్స్
₹74*# నుంచి లేడీస్ చెప్పులు మరియు శాండల్స్
₹199*# నుంచి లేడీస్ లాంగ్ కుర్తీలు
₹99*# నుంచి లేడీస్ దుపట్టా
₹199*# నుంచి లేడీస్ యాంకిల్ కాటన్ స్ట్రెచ్ లెగ్గింగ్స్
₹599*# నుంచి కుర్తీ సెట్

₹299*# నుంచి మెన్స్ స్వెటర్
₹299*# నుంచి మెన్స్ ఎత్నిక్ కుర్తా అండ్ పైజామా
₹449*# నుంచి మెన్స్ కాటన్ చినోస్
₹499*# నుంచి మెన్స్ జాగర్స్ అండ్ కార్గో
ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు అన్నీ బ్రాండెడ్ మెన్స్ అండర్‌గార్మెంట్స్



₹99*# నుంచి మెన్స్ ఫ్యాన్సీ టీ-షర్ట్
₹199*# నుంచి మెన్స్ ఫార్మల్ మరియు క్యాజువల్ షర్ట్
₹349*# నుంచి మెన్స్ ఫార్మల్ ట్రౌజర్
₹349*# నుంచి మెన్స్ ఫ్యాషన్ జీన్స్
₹299*# నుంచి మెన్స్ క్యాజువల్ షూస్
₹365*# నుంచి మెన్స్ ఫార్మల్ షూస్

కనీసం 6% డిస్కౌంట్

విజయవాడ: 0866-2434671 • విజయవాడ - 2 ఎయిర్‌పోర్ట్ రోడ్: 0866-2841026 • బెంజ్ సర్కిల్: 0866-2473752 • గొల్లపూడి: 0866-2410021 • నున్న: 0866-2411080 • మచిలీపట్నం: 0867-2254001 • గుడివాడ: 9989903522 • కుంచిపల్లి గుంటూరు డిమార్ట్: 7794946598
నాజ్ సెంటర్ గుంటూరు: 0863-2228329 • గుంటూరు రింగ్ రోడ్: 0863-2335002 • మధురవాడ (వైజాగ్ 1): 0891-2524270/ 275 • మర్రిపాలెం: 0891-2976630 • గాజువాక: 0891-2744230 • సూర్యబాగ్: 0871-265188 • విజయనగరం: 8922294861
కాకినాడ: 0884-2371630 • ఏలూరు(గోదావరి): 08812-242993 • రాజమండ్రి (హుకుంపేట): 7416271451 • రామచంద్రపురం: 0883-2475777 • తుని-వైజాగ్: 8985251174/9440552385 • భీమవరం: 812106325 • తణుకు: 08819-295903 • తూరంగి కాకినాడ: 088-2944895
కర్నూలు: 08518-256670 • అనంతపురం: 0855-4249980 • కంచెరపాలెం, వైజాగ్: 9154837509 • జోహరాపురం, కర్నూలు-2: 8333998757 • అనకాపల్లి: 9063793582 • ఖమ్మం (తెలంగాణ): 08742-220003 • ఒంగోలు: 0859-2234057 • గోపాలపట్నం వైజాగ్: 8125038242
గంగూరు: 0866-2580018 • నరసరావుపేట: 0864-7231077 • శిలా నగర్: 7075449530 • తాడేపల్లిగూడెం: 8712402565 • నూజివీడు: 8712402562 • అనంతపురం-2:7799770454 • చీరాల: 8500162842

**విజయవాడ మరియు విశాఖపట్నంలో మాత్రమే లభిస్తోంది

ఫోటోలు చూపించడానికి మాత్రమే ఇవ్వబడ్డాయి • ప్రోడక్ట్ ఆఫర్లు స్టాక్స్ ఉన్నంత వరకే చెల్లుతాయి • ధరలు మరియు ఆఫర్లు లొకేషన్ల ప్రకారం మారిపోవచ్చు
ప్రదర్శించిన బ్రాండ్‌లు సంబంధిత బ్రాండ్ యజమానులకు చెందినవి • ^ ధరలు మార్చడానికి మరియు ఉత్పాదనలను తన విచక్షణ మేరకు విక్రయించడానికి మేనేజ్‌మెంట్‌కి హక్కు ఉంది • నియమ నిబంధనలు వర్తిస్తాయి • *రిటైల్ వర్తకం ధర • # 1N

Impulse/01/26

బుద్ధి, జ్ఞానం ఉండే మాట్లాడుతున్నారా?

- ముఖ్యమంత్రి ఎక్కడుంటే అదే రాజధాని అంటారా!
- మెడికల్‌లో పీపీపీ వద్దు.. ఎయిర్‌పోర్టు ముద్దా..
- జగన్‌పై నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, రాజమహేంద్రవరం: 'పీపీపీ అంటే ఆయనకు అర్థం కాదేమో. మెడికల్ కళాశాలలు ఆ విధానంలో నిర్మిస్తామంటే వద్దని బెదిరిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక భోగాపురం పూర్తి చేస్తే అప్పుడు విధ్వంసం చేసి, ఇప్పుడు ఆ క్రెడిట్ తనదని అంటున్నారు. పీపీపీలో మెడికల్ కళాశాలలు వద్దు.. పీపీపీలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం మాత్రం ముద్దా?' అని సీఎం చంద్రబాబు వైకాపా అధినేత జగన్‌పై నిప్పులు చెరిగారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం సభలో సీఎం ప్రసంగించారు. తెలుగు జాతి మధ్య విద్వేషాలు పెట్టుకోవడం తమ విధానం కాదని వెల్లడించారు. ఇప్పుడు పెద్దవీరుడు బయలుదేరాడని, నీళ్లు కావాలా.. గొడవలు కావాలా? అంటే గొడవలే కావాలనుకునే రకం ఆయన (జగన్) అని అన్నారు. తనకు మాత్రం తెలుగు జాతి ప్రయోజనాలే ముఖ్యమన్నారు. నదులను అనుసంధానం చేసుకుంటే ఏపీని మించిన రాష్ట్రం ఉండదని చెప్పారు. అవసరమైతే తెలంగాణ కూడా ఉపయోగించుకోవచ్చన్నారు.

> 'ముఖ్యమంత్రి ఎక్కడుంటే అక్కడే రాజధాని అంట.. ఆయన బెంగళూరులో కూర్చుంటే అక్కడ.. ఇడుపులపాయ వెళ్తే అక్కడ రాజధానా? బుద్ధి, జ్ఞానం ఉన్నవాళ్లు ఎవరైనా ఇలా మాట్లాడతారా?.. ముఖ్యమంత్రి ఉండే ప్రాంతమే రాజధాని అంటారా? ప్రపంచంలో ఎక్కడా ఇలా లేదని చెప్పే వివేకం ఉండాలి. రాజధాని అనేది స్థిరంగా ఉండాలని చెప్పారు. రాజ్యాంగంలో ఎక్కడా రాజధాని పేరు లేదంట.. సీఎం ఎక్కడ కూర్చుంటే అదే రాజధాని అని ఆయన అంటుంటే నాకేం అర్థం కావట్లేదు. నది పక్కన వచ్చింది.. రాజమహేంద్రవరం, దిల్లీ, లండన్ వంటివి ఎక్కడున్నాయి? కనీస ఇంగితజ్ఞానం లేనివాళ్లు రాజకీయాలు చేస్తే ఏం మాట్లాడాలి?'
> – మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం

తప్పు చేసి ఇతరులపై తోసేస్తారా..: గత ప్రభుత్వంలో తిరుమలలో నెయ్యిని కల్తీ చేశారని.. దర్శనాలను అక్రమాలమయం చేశారని చంద్రబాబు ఆరోపించారు. తాము తిరుమలను పవిత్రంగా నిర్వహిస్తున్నామని, ఇది భరించలేక ఖాళీ మద్యం సీసాలు తీసుకెళ్లి పెట్టి సాక్షి టీవీ, పత్రికలో తప్పుడు ప్రచారం చేశారని.. హోలోగ్రామ్ ఆధారంగా దర్యాప్తు చేస్తే దొంగలు పట్టుబడ్డారని చెప్పారు. డాక్టర్ సుధాకర్‌ను చిత్రహింసలు పెట్టి రోడ్డుపై నిలబెట్టి పిచ్చోడని ముద్రవేసి చనిపోయేలా చేశారన్నారు. తాము ఆయన కుమారుడికి పదోన్నతి ఇచ్చి, కుటుంబానికి రూ.కోటి సాయం చేసి ఆదుకున్నామని తెలిపారు.


మూడోసారి పుష్కరాలు నిర్వహించే అవకాశం..: గత గోదావరి పుష్కరాల్లో అఖండ హారతి ప్రారంభించానని.. వచ్చే ఏడాది మూడోదఫా పుష్కరాలు నిర్వహించే అదృష్టం తనకు దక్కిందని సీఎం తెలిపారు. మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని.. గత ఎన్నికల్లో ఓడిపోకపోతే 2021లోనే పూర్తయ్యేదన్నారు.

భూమన స్క్రిప్ట్ ప్రకారమే.. కౌస్తుభం కాటేజీల వద్ద మద్యం బాటిళ్లు

- తితిదే బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు

ఈనాడు, అమరావతి: వైకాపా నేత భూమన కరుణాకరరెడ్డి స్క్రిప్ట్ ప్రకారమే తిరుమలలోని కౌస్తుభం అతిథి గృహం వద్ద ఆ పార్టీ కార్యకర్తలు మద్యం బాటిళ్లను పడేసి, రచ్చ చేశారని తితిదే బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు ఆరోపించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో రాజు మాట్లాడుతూ.. ఈ కుట్రలో సాక్షి ఫొటోగ్రాఫర్, వైకాపా కార్యకర్త కోటి, ఆ పార్టీ సోషల్ మీడియా ప్రతినిధి ప్రధాన పాత్రధారులని తెలిపారు. వాళ్లు ముందస్తుగా ఖాళీ మద్యం సీసాలు అక్కడ వేసి.. విషప్రచారం చేశారని మండిపడ్డారు. ఆ తర్వాత భూమన మీడియా ముందుకొచ్చి తిరుమలలో అపవిత్రం జరిగిందంటూ హైడ్రామా సృష్టించారని పేర్కొన్నారు.

మీ భూమికి మాదీ పూచీ



తూర్పుగోదావరి జిల్లా రాయవరం సభలో ఓ రైతుకు పట్టాదారు పాస్‌పుస్తకం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో 6,688 పోట్ల రీసర్వే పూర్తవగా 4,783 గ్రామాలకు సంబంధించి 22.33 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధం చేశామని ఆయన తెలిపారు. 1.18 లక్షల పుస్తకాల్లో లోపాలు గుర్తించామని, వాటిని సరి చేసి పంపిణీ చేస్తామని చెప్పారు. "గత ముఖ్యమంత్రికి అహంకారం తలకెక్కి, ప్రజల ఆస్తులపైనా, సర్వేరాళ్ల పైనా తన చిత్రాలు వేయించుకుని స్వామిలా వెళ్లారు. అదో విచిత్రమైన ఆలోచనా విధానం. ప్రజల ఆస్తులపై ప్రైవేటు వ్యక్తుల పెత్తనం చెలాయించేలా ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చారు. సర్వే రాళ్లపై తన బొమ్మలకు రూ.660 కోట్లు, పాస్ పుస్తకాల్లో బొమ్మలకు రూ.22 కోట్లు ఖర్చు చేశారు. ఆ సొమ్ముతో రెండు వైద్య కళాశాలలు పూర్తయ్యేవి. మా భూమిలో ఆయన బొమ్మ ఎందుకని రైతులు ప్రశ్నిస్తే.. 77 లక్షల సర్వే రాళ్లపై ఉన్న ఆ బొమ్మలను తొలగించేందుకు మరికొన్ని కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది" అని చంద్రబాబు తెలిపారు. 'కూటమి ప్రభుత్వం రాకపోతే మీ ఆస్తులన్నీ గోవిందా అయ్యేవి. అవునా కాదా' అని సీఎం ప్రశ్నించగా, అంతా అవునన్నట్లు చేతులెత్తి తమ అభిప్రాయం తెలిపారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్‌పై ఆగ్రహం..

పట్టాదారు పుస్తకాలు అందుకున్న రైతులంతా చేతులెత్తండని ముఖ్యమంత్రి సూచించగా కొందరు మాత్రమే ఎత్తడంతో తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ మేఘాస్వరూప్‌పై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ ఇవ్వలేదా? ఎంతమందికి ఇచ్చారు? అని ప్రశ్నించారు. ఈ పంచాయతీకి 2,033 పుస్తకాలు రాగా, 1,873 సరిగ్గా ఉన్నాయని, 900 ఈకేవైసీ చేసి పంపిణీ చేశామని జేసీ తెలిపారు. వారు ఇక్కడెందుకు లేరని ప్రశ్నించగా జేసీ సమాధానం చెప్పలేదు. ఇచ్చిన తర్వాత వారిని సభకు తీసుకురావాల్సిన బాధ్యత లేదా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రెవెన్యూ శాఖలో లోపాలు సరి చేసుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ వచ్చి ఉంటే సంతోషంగా ఉండేదన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీతో దస్త్రాలు భద్రం

బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటి వరకు ఉన్న దస్త్రాలన్నింటినీ సేకరించి క్లౌడ్‌లో భద్రపరుస్తామని, భవిష్యత్తులో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదని సీఎం చెప్పారు. ప్రపంచంలోనే మేలైన బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో భూమిని ఎవరైనా కబ్జా చేసేందుకు వచ్చేవారని, సొంతం కాకపోతే నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బంది పెట్టేవారన్నారు. అలాంటివాటిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నామని చెప్పారు. తనకు వచ్చే అర్జీల్లో 80 శాతం రెవెన్యూ సంబంధిత అంశాలు ఉంటున్నాయని తెలిసిన సీఎం మరో ఏడాదిలో రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని వివరించారు.

మాది ట్రిపుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్..

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. దేశంలో అత్యధికంగా రాష్ట్రానికి 25 శాతం పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. తాను, పవన్ కల్యాణ్, మోదీ కలిసి ట్రిపుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్‌లా దూసుకెళ్తున్నామన్నారు. చిన్నచిన్న భూవివాదాల కారణంగా అన్నదమ్ములు, తల్లీకొడుకులు పోలీసు స్టేషన్లకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని.. దానివల్ల కుటుంబ గౌరవం తగ్గుతుందన్నారు. తానూ గ్రామస్థాయి నుంచి వచ్చానని, సెంటు భూమి పోయినా ఫర్వాలేదు కానీ బంధువులతో వివాదాలు వద్దని హితవు పలికారు.

ప్రభుత్వ ఉత్సవంగా కోనసీమ ప్రభల తీర్థం

కోనసీమలోని జగ్గన్నతోట ప్రభల తీర్థానికి 400 ఏళ్ల వారసత్వ, ఆధ్యాత్మిక చరిత్ర ఉందని, అందుకే ప్రభుత్వ ఉత్సవంగా నిర్వహించేందుకు నిర్ణయించామని సీఎం తెలిపారు. ఏకాదశ రుద్రులు ఒకేచోట దర్శనమివ్వడం ఇక్కడి ప్రత్యేకత అని, ఈ ప్రాంత వారసత్వాన్ని కాపాడతామని భరోసా ఇచ్చారు.

సరదాకే కోడిపందాలు.. జూదాలొద్దు

గోదావరి జిల్లాల్లో సంక్రాంతి అంటే కోడి పందేలు గుర్తొస్తాయని సీఎం అన్నారు. వాటిని వినోదంగానే చూడాలని.. జూదాల జోలికి వెళ్లొద్దని చంద్రబాబు హితవు పలికారు. అంతకుముందు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాబోయే తరాలు బాగుండాలని కోరుకుంటున్నారని, అందుకు మంచి పునాదులతో సంస్కరణలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్, మండపేట ఎమ్మెల్యే జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పొలంలో ఉన్న రైతులను కలిసేందుకు కాలువ దాటి వెళ్తున్న సీఎం చంద్రబాబు



రాయవరం సభలో తమకు అందిన పాస్‌పుస్తకాలు చూపిస్తున్న రైతులు

దొంగచాటుగా సంతకాలు చేయడానికి సిగ్గులేదా?

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటారా అని నిలదీశారు. నిజంగా మీకు ప్రజా మద్దతు ఉందని భావిస్తే 11 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఎన్నికలకు రావాలంటూ జగన్‌కు సవాలు విసిరారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్ధాలు, నేర ఆలోచనలతో జగన్ రాజకీయ మనుగడ సాగించాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికే అవమానకరమని దుయ్యబట్టారు. 'నోట్లో వేలుపెడితే కొరకలేనంత మృదువుగా, పాలు తాగే పసి పిల్లాడిలా జగన్ నటిస్తున్నారు. ఆయన కర్కశత్వాన్ని రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదు. వైకాపా ఐదేళ్ల పాలనలో డ్రగ్స్, గంజాయిని పెంచి పోషించారు. యువతను మత్తుకు బానిసలుగా చేశారు' అని ఆనం ఆరోపించారు.

ట్యాంకర్ నీళ్లతో కుప్పంలో డ్రామా: పూర్తికాని ప్రాజెక్టుల వద్ద శిలాఫలకాలతో ఫొటోలు దిగడం జగన్‌కే చెల్లిందని ఆనం రామనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. 'మీ ఐదేళ్ల హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు రెండు శాతమైనా చేయలేదు. హంద్రీ-నీవా ఒక్క అడుగూ ముందుకు సాగలేదు. కుప్పం దగ్గర సగం తవ్విన కాలువలో ట్యాంకర్‌తో నీళ్లు తెచ్చి పోసి.. గేట్ సెట్టింగ్ వేసి ఫొటోలు దిగారు. మీరు వెళ్లిపోయిన అర గంటలో ఆ సెట్టింగ్ కూడా తీసేశారు. తర్వాత కాళ్లు కడుక్కుందామన్నా అక్కడ నీళ్లు లేవు. పైపెచ్చు కుప్పానికి నీళ్లిచ్చినట్టు గొప్పలు చెప్పారు. చుక్కనీరు లేక దోర్నాల ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతుంటే వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశానని చెప్పడానికి సిగ్గుగా లేదా?' అని మంత్రి మండిపడ్డారు. కాటన్ తర్వాత ఏపీకి సాగునీరు ఇచ్చింది తానే అన్నట్టు విలేకరుల సమావేశంలో జగన్ నటించారని విమర్శించారు. అబద్ధాలతో పబ్బం గడపడమే జగన్, ఆయన పత్రిక సాక్షి పనని విరుచుకుపడ్డారు.

డ్రాయర్ల తయారీ కంపెనీపైనా కసి: 'వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమా రాలేదు. పైగా ఉన్న పరిశ్రమలను తరిమికొట్టారు. బనియన్లు, డ్రాయర్లు తయారుచేసే కంపెనీలు కూడా జగన్ అరాచకాలు భరించలేక ఏపీ నుంచి పారిపోయాయి' అని ఆనం ఉదహరించారు. 'గతంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఎందుకు అని ప్రశ్నించిన జగన్.. ఇప్పుడు తనవల్లే ఆ విమానాశ్రయం నిర్మాణమైనట్లు చెబుతున్నారు. ఉత్తరాంధ్రకు అన్యాయం చేసిన ద్రోహి.. కూటమి ప్రభుత్వంలో అక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి సిగ్గుపడాలి' అని వ్యాఖ్యానించారు.

రఘురామకృష్ణరాజుపై వేధింపుల కేసులో..

ఐజీ సునీల్ నాయక్‌కు ముందస్తు బెయిల్ నిరాకరణ

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజుపై 2021లో గుంటూరు సీఐడీ కార్యాలయంలో జరిగిన కస్టోడియల్ టార్చర్ కేసులో అప్పటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్‌కు ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ గుంటూరు రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వై.నాగరాజా శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రస్తుతం నాయక్ బిహార్‌లో హోంగార్డు విభాగానికి ఐజీగా కొనసాగుతున్నారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వైకాపా ప్రభుత్వ హయాంలో నరసాపురం ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజు.. నాటి ముఖ్యమంత్రి జగన్, ఆయన కుటుంబసభ్యులను దూషించారంటూ సీఐడీ పోలీసులు రాజద్రోహం సహా మరికొన్ని నేరాల కింద కేసు పెట్టారు. ఆయన్ను హైదరాబాద్‌లో అరెస్టు చేసి, గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించి దాడికి పాల్పడ్డారన్నది అభియోగం. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ఉదంతంపై రఘురామ.. గుంటూరులోని నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఇప్పటికే కొంతమంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో కీలకంగా ఉన్న నాటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్‌ను విచారణకు హాజరు కావాల్సిందిగా గతేడాది ఫిబ్రవరిలో దర్యాప్తు అధికారి, ఎస్పీ దామోదర్ సమాచారమిచ్చారు. అయితే.. ఆయన పట్నా హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు (బిహార్ క్యాడర్‌కు చెందిన నాయక్ 2021లో డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి రాగా, నాటి జగన్ ప్రభుత్వం సీఐడీ డీఐజీగా నియమించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు). నాయక్‌పై తీవ్ర చర్యలు తీసుకోరాదని పట్నా హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ కేసులో పోలీసు దర్యాప్తులో కీలక విషయాలు బయటపడడం, నాయక్ పాత్ర ప్రధానంగా ఉందని తేలడంతో దర్యాప్తు అధికారి ఆయన్ను మరోసారి విచారణకు పిలిచారు. ఆ కేసులో తన పాత్ర లేదని, ఉన్నతాధికారుల సూచనల మేరకే పనిచేశానని, రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదులో తన పేరు లేదని పేర్కొంటూ నాయక్ గుంటూరు రెండో అదనపు న్యాయస్థానంలో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. అయితే, ఈ కేసులో నాయక్ పాత్ర కీలకంగా ఉన్నట్లు పోలీసు విచారణలో తేలిందని, దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ న్యాయమూర్తి నాగరాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేలా, నీరూ యూరియానే

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని 2024 సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు (సీజీడబ్ల్యూబీ) నివేదిక వెల్లడిస్తోంది. అధిక యూరియా వాడకం దీనికి ప్రధాన కారణం. ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థజలాలు, లైనింగ్ లేని మురుగునీటి పారుదల వ్యవస్థలూ ఇతర కారణాలని వివరించింది.

పశువుల మేతకు, సుబాబుల్ తోటలకూ యూరియానే..

వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం సిఫారసు చేసిన మోతాదు కంటే జొన్నలో ఏకంగా 400 శాతం అదనంగా యూరియా వేస్తున్నారు. వరి, మిర్చి, పసుపు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న సహా అన్ని పంటలకు యూరియా, ఇతర ఎరువుల వాడకం పరిమితికి మించిపోతోంది. ఆఖరికి పశువుల మేత కోసం వాడే నేపియర్ గడ్డి పెంపకానికి, సుబాబుల్ తోటలకు కూడా ఇష్టారాజ్యంగా యూరియా చల్లేస్తున్నారు.

ధర తక్కువని..

రసాయన ఎరువుల్లో యూరియా ధర అతి తక్కువ. 45 కిలోల బస్తా రూ.266 మాత్రమే. కాంప్లెక్స్ ఎరువులు 50 కిలోల బస్తా రూ.1,400 నుంచి రూ.1,900 పైమాటే. కాంప్లెక్స్ ఎరువుల్లోనూ నత్రజని ఉన్నప్పటికీ రైతులు వాటికి మరో యూరియా బస్తా కలిపి పొలంలో చల్లేస్తున్నారు. దీంతో పరిమితికి మించి యూరియా పొలంలోకి చేరుతోంది.

పైరుకు నష్టం.. భూమికి కష్టం

- యూరియా మోతాదుకు మించి చల్లితే మొక్క సహజ రోగనిరోధకశక్తిని కోల్పోయి పురుగులు, తెగుళ్ల తీవ్రత పెరుగుతుంది. వాటి నివారణకు రసాయనాలు పిచికారీ చేయాలి. ఖర్చు పెరుగుతుంది. దిగుబడి తగ్గుతుంది. పైగా పర్యావరణానికి మరింత హాని.
- నేలలో ఆమ్లత్వం పెరుగుతుంది. దీంతో ఉపయోగకరమైన బ్యాక్టీరియా, శిలీంధ్రాలు జీవించలేవు. భూమి సారాన్ని కోల్పోతుంది.
- మొక్కలు పీల్చుకోగా మిగిలిన లవణాలు నేలలోకి చేరతాయి. దీంతో భూమి ఉప్పుగా మారుతుంది. నేల గట్టిపడుతుంది. మొక్కల వేర్లు నీటిని, ఇతర పోషకాల్ని పీల్చుకోవడం కష్టమవుతుంది. ఇది తెచ్చిపెట్టుకున్న నీటిఎద్దడి లాంటిదే.
- నేలలోని జింక్, ఇనుము ఇతర పోషకాలు హరించుకుపోతాయి. ఒక పోషకం అధికంగా ఉంటే అది మొక్క మరో పోషకాన్ని గ్రహించకుండా అడ్డుకుంటుంది.
- నేలలో సేంద్రియ కర్బన శాతం తగ్గిపోతుంది. మట్టి కణాలు ఒకదానికొకటి అంటుకుని ఉండవు. దీనివల్ల గాలి పీల్చుకునే శక్తి తగ్గుతుంది. నీటినిల్వ సామర్థ్యమూ పడిపోతుంది.
- గాలిలోని నత్రజనిని గ్రహించి మొక్కలకు అందించే రైజోబియం, అజిటోబాక్టర్ వంటి లాభదాయక సూక్ష్మజీవులకు హాని కలుగుతుంది. నేలను గుల్లబరిచే వానపాములు కూడా కనుమరుగవుతాయి.

యూరియా సిఫారసు, రైతులు వాడుతున్నది (హెక్టారుకు కిలోల్లో)

పంట	సిఫారసు	వాడుతున్నది
వరి	120	161
మొక్కజొన్న	200	389
పత్తి	150	208
మిరప	300	535
అరటి	500	559
పశువుల మేత	150	575
సుబాబుల్	125	114
యూకలిప్టస్	125	230
వేరుశనగ	30	121
పప్పుధాన్యాలు	20	73
జొన్న	80	414
పసుపు	188	377

పిల్లల ఎదుగుదల, మానసిక వికాసానికీ దెబ్బ

- అధికంగా వాడే నత్రజని నీటితో కలిసి నేలలోకి ఇంకుతుంది. దీంతో భూగర్భజలాలు కలుషితమవుతాయి. తాగునీటి ద్వారా మన శరీరంలోకి చేరుతుంది.
- కొన్ని రకాల ఎరువుల్లోని కాడ్మియం, ఆర్సెనిక్ వంటి భారలోహాలు నేలలో కలుస్తున్నాయి. దీంతో మూత్రపిండాల వ్యాధులు, ఎముకల బలహీనత, చర్మ వ్యాధులు, నాడీ వ్యవస్థపై ప్రభావం, పిల్లల్లో పెరుగుదల మందగించడం, క్యాన్సర్ తదితర ప్రమాదాలు తలెత్తుతాయి.
- ఎరువుల్లోని రసాయన అవశేషాలు క్యాన్సర్‌కు కారణమవుతాయి.
- స్త్రీ, పురుషుల్లో హార్మోన్ల సమతుల్యత దెబ్బతిని, సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. గర్భిణుల ద్వారా శిశువులకు చేరే ప్రమాదం ఉంది.
- ఆరు నెలల్లోపు శిశువులు బ్లూబేబీ సిండ్రోమ్ బారిన పడే ప్రమాదం ఉంది. పెదాలు, నాలుక, చేతులు, కాళ్లు నీలంగా మారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, బలహీనత, అలసట, వాంతులు, తీవ్రమైతే స్పృహ కోల్పోవడం తదితర లక్షణాలు ఉంటాయి. పిల్లల జీర్ణ వ్యవస్థలో నైట్రేట్లుగా మారతాయి. ఇవి రక్తం ఆక్సిజన్‌ను మోసుకెళ్లే సామర్థ్యాన్ని తగ్గిస్తాయని వైద్య నివేదికలు వెల్లడిస్తున్నాయి.
- పిల్లల ఎదుగుదల, మానసిక వికాసంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.
- నీటిలోని నత్రజని, ఫాస్ఫరస్ కారణంగా నాచు పెరిగి ఆక్సిజన్ తగ్గుతుంది. ఫలితంగా చేపలు, ఇతర జలచరాలు చనిపోతాయి.

'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతి

ఈనాడు, అమరావతి: చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి ఈ నెల 11న రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య ప్రత్యేక షో వేసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ 'షో'కు జీఎస్టీతో కలిపి టికెట్ ధర రూ.500గా నిర్ణయించింది. ఈ నెల 12 నుంచి పది రోజుల పాటు ప్రస్తుతమున్న టికెట్ ధరలపై సింగిల్ స్క్రీన్లలో రూ.100 చొప్పున, మల్టీప్లెక్స్‌ల్లో రూ.125 చొప్పున పెంచుకునేందుకు అనుమతిచ్చింది. రోజుకు 5 షోల ప్రదర్శనకు వీలు కల్పించింది.

ప్రైవేటు బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలుచేస్తే చర్యలు

ఈనాడు, అమరావతి: సంక్రాంతికి సొంతూళ్లకు తరలివచ్చే వారితో ఏర్పడే రద్దీని ఆసరాగా తీసుకుని ప్రైవేటు బస్సుల యజమానులు అధిక ఛార్జీలు వసూలుచేస్తే చర్యలు తీసుకుంటామని, ధరలు పెంచకుండా పర్యవేక్షిస్తున్నామని రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా తెలిపారు. ఆర్టీసీ టికెట్ ఛార్జీల కంటే గరిష్ఠంగా 50% వరకు మాత్రమే టికెట్ ధర పెంచేందుకు వీలుందని, అంతకంటే ఎక్కువ వసూలుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా అన్ని జిల్లాల్లోని రవాణాశాఖ అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. అభి బస్, రెడ్ బస్ వంటి యాప్‌ల ద్వారా కూడా ఆయా ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు ఎంత టికెట్ ధరలు వసూలు చేస్తున్నాయో పర్యవేక్షిస్తున్నామని, అధిక ధరలు ఉంటే కేసులు పెడతామని చెప్పారు. ఈ నెల 18 వరకు అన్ని జిల్లాల్లో నిత్యం తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ప్రైవేటు బస్సులో రవాణాశాఖ హెల్ప్‌లైన్ నంబరు 9281607001ను డిస్‌ప్లే చేయాలని యజమానులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి)

వానలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటి వర్షం కురవొచ్చని చెప్పింది. శని, ఆదివారాల్లో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ వెల్లడించింది.

ఆదివారమైనా 1నే బడ్జెట్!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. 29వ తేదీ సాయంత్రం పార్లమెంటుకు సమీపంలోని విజయ్ చౌక్‌లో ఏటా గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే బీటింగ్ రిట్రీట్ కార్యక్రమం ఉన్నందున ఆ రోజు సెలవు ప్రకటించారు. 30వ తేదీన ఆర్థిక సర్వేను ఆర్థిక మంత్రి సభలో ప్రవేశపెడతారు. 31వ తేదీన శనివారం కావడంతో ఉభయ సభలకు సెలవు. ఆదివారం సెలవే అయినప్పటికీ సంప్రదాయానికి ఇబ్బంది లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సభ సమావేశమవుతుంది. ఉదయం 11 గంటలకు బడ్జెట్‌ను మంత్రి ప్రవేశపెడతారు. ఆ తర్వాత సభ మరుసటి రోజుకు వాయిదా పడుతుంది. తదుపరి రోజుల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, బడ్జెట్‌పై చర్చించి ఫిబ్రవరి 13న తొలి విడత సమావేశాలను ముగిస్తారు. ఆ తర్వాత బడ్జెట్ పద్దులపై పార్లమెంటు స్థాయీ సంఘాలు అధ్యయనం చేసి నివేదికలు తయారు చేస్తాయి. అనంతరం మార్చి 9వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ రెండో విడత బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. అప్పుడు బడ్జెట్ పద్దులపై శాఖలవారీగా చర్చించి ఆమోదిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఐదేళ్లపాటు 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమల్లోకి రావాల్సి ఉన్నందున.. ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్ సమావేశాల్లోనే దాని నివేదికనూ సభ ముందుంచుతారు. అది ఆమోదం పొందే అవకాశం ఉంది.



అలాంటి వారితో మిమ్మల్ని పోల్చుకోండి

ఏ విషయంలోనూ ఇతరులతో మిమ్మల్ని పోల్చుకోకండి. అది సాధ్యం కాకపోతే కనీసం మీకు స్ఫూర్తిని, ప్రేరణను కలిగించే వ్యక్తులతో పోల్చుకోండి. అప్పుడు వారి స్థాయికి ఎదగాలంటే ఏం చేయాలో ఆలోచించి ఆ దిశగా మీరు కృషి చేస్తారు. అలా కాకుండా సంపదను ప్రదర్శించేవారితోనూ, విలాసవంతమైన జీవితాన్ని గడిపేవారితోనూ పోల్చుకుంటే మీకెలాంటి ఉపయోగం ఉండకపోగా అసంతృప్తి మిగులుతుంది.

– మార్క్ మాన్సన్, రచయిత

గ్రహం అనుగ్రహం

10-1-2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
సప్తమి: ఉ. 11-12 తదుపరి అష్టమి
హస్త: సా. 6-36 తదుపరి చిత్త
వర్జ్యం: తె. 3-12 నుంచి 4-56 వరకు
అమృత ఘడియలు: మ.12-16 నుంచి 1-58 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-37 నుంచి 8-05 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.38

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	8.7	27.8
మెదక్	9.0	27.6
హనుమకొండ	10.5	28.0
రామగుండం	11.0	28.2
హైదరాబాద్	12.4	26.8
విజయనగరం	14.0	27.0
విశాఖపట్నం	15.6	26.8
శ్రీకాకుళం	16.0	27.0
రాజమహేంద్రవరం	16.0	33.5
విజయవాడ	16.5	28.4
అనంతపురం	17.0	29.3
నరసాపురం	17.0	30.0
కడప	18.0	27.0
గుంటూరు	18.0	28.0
తాడేపల్లిగూడెం	18.0	28.0
కర్నూలు	18.5	30.4
ఒంగోలు	18.9	28.8
తిరుపతి	20.1	26.7
నెల్లూరు	20.5	27.9

ఇదీ సంగతి!



కూటమిని బలహీనపర్చే పనులొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అపారమైన అవగాహన ఉందన్నారు. ఇద్దరి మధ్య ఎలాంటి అరమరికలు, విభేదాలు లేవని.. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం అంతా సమష్టి కృషేనని స్పష్టం చేశారు. 'గత పాలకులకు బూతులు తిట్టడం, కేసులు పెట్టడం, ప్రజలకు మనశ్శాంతి లేకుండా చేయడమే తెలుసు. మళ్లీ ఆ పాత పద్ధతినే పిఠాపురంలో మొదలుపెట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి అభద్రతా భావానికి గురిచేస్తే ఉపేక్షించవద్దని పోలీసులకు చెబుతున్నా. రాజకీయంగా విమర్శలు చేస్తే తీసుకుంటాం.. అంతే తప్ప వ్యవస్థలకు అతీతంగా ఉంటాం, కులాలు, మతాల మధ్య గొడవలు పెట్టి ప్రజల్లో వైషమ్యాలు సృష్టిస్తామంటే సహించం. పిఠాపురానికి వచ్చి గొడవలు పెడదామంటే ఇక్కడ కూర్చునే ఏరేస్తా' అని రాజకీయ ప్రత్యర్థులను పవన్ హెచ్చరించారు.

బాబాయిని చంపేస్తే వార్త కాదు గానీ

'పులివెందులలో సొంత బాబాయిని చంపినా అక్కడ వార్త రాదు. అదే పిఠాపురంలో ఇద్దరు చిన్నపిల్లలు కొట్టుకుంటే కులాలు, మతాలు తీసుకొచ్చేస్తున్నారు. ఇక్కడ కొబ్బరాకు రాలినా, తాటాకు ఊడినా, పక్షి వెంట్రుక నేల రాలినా దారుణాలు జరిగిపోయాయంటున్నారు. ఒకరు చెడగొడుతుంటే మీరు ఎదురు ప్రశ్నించకుంటే బలహీనులైపోతారు. పనిచేసే నాయకుల వెన్నంటి మీరు లేకపోతే పరిణామాలు వేరేగా ఉంటాయి. నేను అలాగే అనుకుంటే ఈ రోజు ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ ముందుకు వెళ్లేదా? గతంలో మా ప్రాంతాల్లోకి అడుగుపెట్టనీయమని ఛాలెంజ్‌లు చేశారు. ఇప్పుడు వాళ్లు పిఠాపురం నియోజకవర్గానికి వచ్చి వ్యతిరేకంగా చేస్తున్నారు. నేను మెత్తగా కనిపిస్తున్నానని అనుకుంటున్నారు. నా గట్టిదనం వాళ్లకు తెలియదు. గొడవ పెట్టుకోవాలంటే సిద్ధంగానే ఉన్నా. మరీ మెత్తగా ఉంటే నెత్తికెక్కి నాట్యమాడుతున్నారు. ఇలాంటి వారిని అడ్డుకోకుంటే నియంతృత్వ పోకడలే వస్తాయి' అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

సంస్కృతి మూలాల పరిరక్షణకే వేడుకలు

మన సంస్కృతి మూలాలను పరిరక్షించడానికి పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఇవి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ జరగాలని పవన్ కల్యాణ్ అన్నారు. సంక్రాంతి రైతుల పండగ అని, వారికి అండగా నిలిచిన ప్రభుత్వం ఇది అని చెప్పారు.

మార్చి 14న పిఠాపురంలో ఆవిర్భావ సభ

'మంగళగిరి కేంద్రంగా పార్టీ పరిపాలనా కార్యాలయం ఉంటుంది. పార్టీకి కేంద్ర స్థానం పిఠాపురమే. మార్చి 14న ఇక్కడే పార్టీ ఆవిర్భావ సభ నిర్వహిస్తాం' అని పవన్ కల్యాణ్ ప్రకటించారు. 'శ్రీపాద వల్లభుడి ఆశీర్వాదంతో ఇక్కడ పోటీ చేసి గెలిచా. ఈ ప్రాంతం యుద్ధ కళలకు ప్రసిద్ధి. నా ట్రస్ట్ ద్వారా మార్షల్ ఆర్ట్స్, గ్రామీణ కళలను ప్రోత్సహించేలా ఫైన్ ఆర్ట్స్‌తో కలిపి సమీకృత అకాడమీని పిఠాపురంలో ఏర్పాటు చేస్తా' అని హామీ ఇచ్చారు.

అరాచకం నుంచి అభివృద్ధి వైపు: పి.నారాయణ, పురపాలకశాఖ మంత్రి

కూటమి ప్రభుత్వం వైకాపా అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తోంది. గతంలో జైళ్లు, అరెస్టులు, కేసులతో ప్రజలు ఇబ్బందిపడేవారు. ఇప్పుడు సాఫీగా ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారు.

పవన్ త్యాగాల వల్లే కూటమి: కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి

పవన్ కల్యాణ్ త్యాగాల వల్లే కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ విధంగా రాష్ట్రంలో అభివృద్ధికి దారి చూపింది ఆయనే. పంచాయతీరాజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. జలజీవన్ మిషన్ అమలుకు కేంద్రంతో మాట్లాడి ఇంటింటికీ తాగునీరు అందేలా కృషి చేస్తున్నారు.



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి జ్యోతి వెలిగించి పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రులు కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, నారాయణ. చిత్రంలో నటుడు ఆర్కే సాగర్, ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, భాజపా నాయకుడు కృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్యే వర్మ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి

కూటమి ఏర్పాటులో ఆయనే కీలకం: నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాలశాఖ మంత్రి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ది 16 ఏళ్ల ప్రస్థానం. వైకాపా విచ్ఛిన్నం చేసిన ఏపీని కాపాడేందుకు కేంద్ర నాయకులతో మాట్లాడి కూటమిని ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర వహించారు. ఇలాగే 15 ఏళ్ల పరిపాలన అందించాలనేది ఆయన ధ్యేయం. గత ప్రభుత్వం వ్యవస్థలను నాశనం చేసింది, ఆర్థిక ఇబ్బందులు సృష్టించింది. ఇప్పుడు సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో పయనిస్తోంది.

★ కార్యక్రమంలో మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే వర్మ, నటుడు హైపర్ ఆది, జనసేన కరీంనగర్ ఇన్‌ఛార్జి ఆర్కే నాయుడు, ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వ భరత్ తదితరులు పాల్గొన్నారు.

గోదారి జిల్లాలండీ.. కోడిపందేలండీ!

- సంక్రాంతి సంబరాల్లో పవన్ నోట గోదారి యాస
- జూదాలకే పండగ పరిమితం కాకూడదని హితవు

ఈనాడు- కాకినాడ, న్యూస్‌టుడే- పిఠాపురం: 'గోదారి జిల్లాలండీ.. కోడిపందేలండీ.. జూదాలండీ అని ఎక్కువ మంది అంటుంటారు' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గోదారి యాసలో మాట్లాడి సభికులను ఉత్తేజపరిచారు. ఆయన గోదారి యాస అందుకోగానే సభా ప్రాంగణమంతా చప్పట్లతో మార్మోగింది. అయితే సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు, పేకాటేనా? సరదా కాదనడం లేదని.. వాటికే పండగ పరిమితమైపోతే సమాజానికి తప్పుడు సంకేతం వెళుతుందని పవన్ హితవు పలికారు. 'గతంలో తెలంగాణలోని నా మిత్రులు కూడా సంక్రాంతి సమయంలో భీమవరం, తూర్పుగోదావరి వెళతాం. అక్కడ కోడిపందేలు డబ్బులకు ఆడతారు అనేవారు. నాకు అప్పట్లో తెలీదు. పండగంటే కోడిపందేలకు, పేకాటకు పరిమితమైపోతే ఎలా? గోదావరి జిల్లాల్లో సంక్రాంతి అంటే కోడిపందేలు, రూ.కోట్లు చేతులు మారతాయనే మాటను భోగి మంటల్లో కలిపేయాలి' అని అన్నారు. మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలను ప్రారంభించేందుకు శుక్రవారం పిఠాపురం వచ్చిన పవన్‌కు కూచిపూడి నృత్యకళాకారులు ఘనస్వాగతం పలికారు. గరగ నృత్యాలు, కోలాటాలు, కొమ్ముకోయల నృత్యాలు, పులివేషాల ప్రదర్శనలను ఆయన ఆస్వాదించారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసా కళాకారులతో పాదం కలిపి నృత్యం చేశారు. అనంతరం హరిదాసులకు స్వయంపాకం దానం చేశారు. చిన్నారులపై భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు. చేనేత స్టాల్‌లో పులగుర్తలో నేసిన వస్త్రంతో తయారైన కోటు ధరించారు. మన సంస్కృతిని భావితరాలకు అందించేలా సంక్రాంతి ఉత్సవాలకు పిఠాపురం కేంద్రం కావాలన్నారు. గోదావరి జిల్లాల ప్రేమను తెలంగాణకు తీసుకెళ్లాలని కరీంనగర్ జనసేన ఇన్‌ఛార్జి, టీవీ సీరియల్ నటుడు ఆర్కేనాయుడిని ఉద్దేశించి అన్నారు.



కళాకారులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న పవన్‌కల్యాణ్



హరిదాసులకు స్వయంపాకం ఇస్తున్న ఉపముఖ్యమంత్రి

ఏంటీ చెత్త? నేనొచ్చి చీపురు పట్టుకుని తుడవాలా?

అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పట్టణంలోని కాలనీల్లో పర్యటించారు. 'ఇందిరానగర్ కాలనీలో పారిశుద్ధ్యం ఇంత అధ్వానంగా ఉంది. మురుగుపారేచోట మీరైతే నివాసం ఉంటారా' అంటూ జనసేన జిల్లాఅధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మున్సిపల్ అధికారులపై డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతి సంబరాల ప్రారంభోత్సవం అనంతరం పురపాలకశాఖ మంత్రి నారాయణతో కలిసి పట్టణంలోని కాలనీలను పవన్ పరిశీలించారు. పారిశుద్ధ్య లోపాలపై అధికారులను నిలదీశారు. పార్టీ తరపున రాజకీయ ఫిర్యాదులు నా దృష్టికి తీసుకువస్తున్నారు కానీ ప్రజల ఫిర్యాదులెందుకు తేవడం లేదని రామస్వామిపైనా మండిపడ్డారు. ఏంటీ చెత్త.. నేనొచ్చి చీపురు పట్టుకుని తుడవాలా? రాజకీయంగా సమస్యలుంటే అందరూ కూర్చొని మాట్లాడాలి. లేకుంటే కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకుని పనులు చేయాలి కదా అని నిలదీశారు. శివరాత్రి నాటికి ఈ సమస్య పరిష్కారం కావాలని ఆదేశించారు. పాడా ఉన్నది ఎందుకని ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వభరత్‌ను ప్రశ్నించారు.

ఏపీ టెట్‌లో 39.27% ఉత్తీర్ణత

- గతంతో పోల్చితే భారీగా తగ్గిన అర్హత
- రాసినవారూ తక్కువే

ఈనాడు, అమరావతి: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో 39.27% మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలను శుక్రవారం సాయంత్రం విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19న విడుదల చేయాల్సి ఉండగా.. 10 రోజుల ముందే ఫలితాలు ఇచ్చారు. డిసెంబరు 10 నుంచి 21 వరకు పది రోజులపాటు నిర్వహించిన పరీక్షలకు 2,48,427 మంది హాజరయ్యారు. వీరిలో 97,560 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు రెండేళ్లలో టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఈసారి టెట్‌లో వారికీ అవకాశం కల్పించారు. ఈ పరీక్షలకు 31,886 మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు హాజరవగా 15,239 మంది (47.82%) ఉత్తీర్ణులయ్యారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://tet2dsc.apcfss.in, http://cse.ap.gov.in ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చని టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. వాట్సప్ నంబరు 9552300009 నంబరుకు హాయ్ మెసేజ్ పెట్టి కూడా ఫలితాలు తెలుసుకోవచ్చు.

ఇన్ సర్వీస్ వారే అత్యధికం

టెట్‌లో నిరుద్యోగ అభ్యర్థుల కంటే ఇన్ సర్వీస్ టీచర్లే ఎక్కువ మంది అర్హత సాధించారు. నిరుద్యోగ అభ్యర్థులు 39.27% మంది ఉత్తీర్ణులు కాగా.. ఇన్ సర్వీస్ టీచర్లు 47.82% మంది అర్హత సాధించారు. నిరుద్యోగ అభ్యర్థులు 2024 ఫిబ్రవరిలో 58.4%, జులైలో 50.79% మంది టెట్‌కు అర్హత సాధించగా.. ఈసారి ఉత్తీర్ణత భారీగా పడిపోయింది. గతేడాది జులై టెట్‌తో పోల్చితే రాసే అభ్యర్థుల సంఖ్యా తగ్గిపోయింది. గతేడాది జులైలో 3,68,661 మంది టెట్‌కు హాజరుకాగా ఈసారి 2,48,427కి తగ్గారు.



మీ శరీరానికీ మెయింటెనెన్స్ అవసరం

మీ కారుకు మరమ్మతులు చేయించే అవసరం లేకపోయినా మెయింటెనెన్స్ కోసం సర్వీసింగ్‌కు ఇస్తుంటారు కదా. వాహనం పాడవకుండా కండీషన్‌లో ఉండాలంటే అది తప్పనిసరి. అదే విధంగా మీ శరీరానికి కూడా మెయింటెనెన్స్ అవసరం. క్రమం తప్పకుండా వ్యాయామాలు, తగినంత నిద్ర, సమతులాహారం.. ఇవన్నీ అందులో భాగమే. అప్పుడే రోజంతా ఉత్సాహంగా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు.

– లింకన్, ఫిట్‌నెస్ కోచ్

థియేటర్లు, ఓటీటీ శత్రువులు కావు

పరస్పర భాగస్వాములుగా ఎదుగుతున్నాయ్

- సినీ రంగంలోకి సంస్థాగత పెట్టుబడులు రావాలి
- మౌలిక వసతులపరంగా చాలా వెనుకబడ్డాం
- దేశంలో రామోజీ ఫిలింసిటీ వంటి స్టూడియో మరొకటి లేదు
- 'ఆవకాయ్' ఉత్సవంలో 'ఓటీటీ యుగంలో సినిమా'పై నిపుణులు



'ఓటీటీ యుగంలో సినిమా' అంశంపై చర్చాగోష్ఠిలో రీనా యాదవ్, షాగతా ముఖర్జీ, శివాశిష్ సర్కార్, సునీల్ చైనాని, సుప్రియ యార్లగడ్డ, శ్రీరూపామిత్రా

ఈనాడు, అమరావతి: ఓటీటీలు వంటి టెక్నాలజీలు ఎన్ని వచ్చినా సినిమా థియేటర్ల మనుగడకు ముప్పేమీ లేదని వినోదరంగ ప్రముఖులు పేర్కొన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల వినోద అవసరాల్ని ఒక మాధ్యమమే తీర్చలేదని వారు అభిప్రాయపడ్డారు. ఓటీటీలు, థియేటర్లు శత్రువులు కావన్నారు. 'కొన్ని కథల్ని పెద్ద తెరపైనే చూడాలి. ప్రైవేట్ స్క్రీన్‌పై (ఓటీటీల్లో) చూసే కథలు మరికొన్ని ఉంటాయి. అవి రెండూ సమాంతరంగా ఎదుగుతూనే ఉంటాయి' అని పేర్కొన్నారు. ఆవకాయ్ ఉత్సవంలో భాగంగా 'ఓటీటీ యుగంలో సినిమా' అన్న అంశంపై శుక్రవారం చర్చాగోష్ఠి జరిగింది. నిర్మాత, పబ్లిక్ పాలసీ అడ్వైజర్ శ్రీరూప మిత్రా మోడరేటర్‌గా వ్యవహరించారు.



ఉత్సవాల్లో భాగంగా పున్నమి ఘాట్‌లో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన

సంస్థాగత పెట్టుబడులు రావాలి

– శివాశిష్ సర్కార్, గ్రూప్ సీఈఓ, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్

ఓటీటీల వల్ల భారతీయ కథలు ప్రపంచవ్యాప్తంగా చేరాయి. మన ప్రేక్షకులు గ్లోబల్ కంటెంట్ చూస్తున్నారు. త్వరలోనే మన దగ్గర నుంచి పారాసైట్, స్క్విడ్‌గేమ్ వంటి సిరీస్‌లు వస్తాయి. గడచిన 100-120 ఏళ్లుగా భారతీయ సినిమా పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో, వారి డబ్బు, రిస్క్‌తోనే నడుస్తోంది. ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపా, దక్షిణ కొరియా, చైనా వంటి చోట్ల జేపీ మోర్గాన్, గోల్డ్‌మన్ శాక్స్ వంటి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. మనదగ్గర మౌలిక వసతుల్లోనూ ప్రైవేట్ పెట్టుబడులు లేక బాగా వెనుకబడ్డాం. రామోజీ ఫిల్మ్‌సిటీ వంటి ప్రపంచస్థాయి స్టూడియో దేశంలో మరొకటి లేదు.

సృజనాత్మక స్వాతంత్ర్యం విస్తరించలేదు

– రీనా యాదవ్, రచయిత, దర్శకురాలు, ఎడిటర్

నా మొదటి సినిమా 'శబ్‌మంగ్' జ్యూడా సావధాన్ సంప్రదాయేతర సబ్జెక్ట్. అయితే పెద్ద పెద్ద నటీనటులు ఉండటం వల్ల మా సృజనాత్మక నిర్ణయాల్ని బాక్స్ ఫీస్ ఒత్తిళ్లతో ఆగిపోయాయి. ఓటీటీలు వచ్చాక ఆ సంకెళ్లు తెగిపోయాయి. అయితే నిజానికి సృజనాత్మక స్వాతంత్ర్యం విస్తరించలేదు. గతంలో ఇలా చేస్తే టికెట్లు తెగవేమో అనే ఒత్తిళ్లు ఉండేవి. ఇప్పుడు డ్యాష్ బోర్డులు, అల్గరిథమ్స్‌తో కుస్తీలు పట్టాల్సి వస్తోంది.

ఓటీటీల వల్ల యువ రచయితలు పెరిగారు

– షాగతా ముఖర్జీ, హెడ్ ఆఫ్ కంటెంట్, సోనీ లివ్

ఈ వ్యాపారంలో డేటాను పరిగణనలోకి తీసుకోకుండా ఉండలేం. అయితే దాన్ని గుడ్డిగా అనుసరించకూడదు. ఎక్సెల్‌షీట్‌ల ఆధారంగా సినిమాలు, షోలు తీయలేం. స్కామ్, రాకెట్ బాయ్స్, మహారాణి, గుల్లక్ వంటి షోలు డేటా నుంచి పుట్టలేదు. అవి రచయితల మస్తిష్కాల నుంచి వచ్చిన కథలు. ఓటీటీల వల్ల ఇప్పుడు యువ రచయితలు వస్తున్నారు.

హాల్‌లో సినిమా చూడటం ఓ భావోద్వేగం

– సునీల్ చైనాని, ప్రొడ్యూసర్, మీడియా ఎగ్జిక్యూటివ్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్

సినిమా హాళ్లు, ఓటీటీ శత్రువులు కావు. అవి భాగస్వాములు. థియేటర్లు కనుమరుగవడం లేదు. వాటిని కొత్తగా ఆవిష్కరించుకుంటున్నాయి. హాల్‌లో సినిమా చూడటం ఒక భావోద్వేగం. ట్వల్త్ ఫెయిల్, బేబీ, సీతారామం వంటి చిన్న సినిమాలు హాళ్లలో సంచలనాలు సృష్టించాయి. ఓటీటీలు సినిమాలకు దీర్ఘాయుష్షును ఇస్తాయి. థియేటర్స్ మేజిక్ అనుభూతినిస్తాయి.

వేర్వేరు సోర్సుల నుంచి కథలు తయారు చేయాలి

– సుప్రియ యార్లగడ్డ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అన్నపూర్ణ స్టూడియోస్

ఓటీటీలకు లోతైన రచనాశైలి, అనేక లేయర్లున్న క్యారెక్టర్లు, దీర్ఘమైన ఎమోషనల్ ఆర్క్స్ కావాలి. మన రచయితలు దానిలో శిక్షణ పొందలేదు. వివిధ సోర్సుల నుంచి కథలు తయారు చేయడం నేర్చుకోవాలి. దక్షిణాది సినిమా మొత్తాన్ని 'సౌత్' పేరుతో ఒకే గాటన కట్టొద్దు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ.. ఇలా ప్రతి సంస్కృతీ విభిన్నం. ఓటీటీ వీటన్నింటినీ ప్రతిబింబించాలి.

నవల సారాన్ని తీసుకొనే సినిమా తీయాలి

మూలకథ చెదరకుండా సినిమాటిక్ స్క్రీన్‌ప్లే జోడించాలి • అభిలాష సినిమా అలా తీసిందే

- 'ఆవకాయ్.. అమరావతి' వేడుకల్లో కోదండరామిరెడ్డి, యండమూరి వీరేంద్రనాథ్

ఈనాడు, అమరావతి: "నవలను యథాతథంగా సినిమాగా తీస్తే ఆడదు. దాంట్లోని సారాన్ని తీసుకోవాలి. దానికి పాటలు, డ్యాన్సులు, ఫైట్స్, హాస్యం ఇలా సినిమాటిక్ అంశాల్ని జోడించాలి. మూలకథ, రచయిత లక్ష్యం చెదరకూడదు. యండమూరి వీరేంద్రనాథ్ రాసిన 'అభిలాష' నవలను అదే పేరుతో చిరంజీవి హీరోగా సినిమాగా తీశాను. అది ఘనవిజయం సాధించింది" అని సినీ దర్శకుడు కోదండరామిరెడ్డి అన్నారు. 'ఆవకాయ్.. అమరావతి' ఉత్సవాల్లో యండమూరి వీరేంద్రనాథ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. 'అభిలాష.. నవల నుంచి సినిమా' వరకు అనే అంశంపై వారు మాట్లాడారు. నవలను సినిమాగా రూపొందించే క్రమంలో ఎదురయ్యే సవాళ్లు, వారి అనుభవాల్ని పంచుకున్నారు. "వీరేంద్రనాథ్ నవల ఇతివృత్తంగా తీద్దామని కేఎస్ రామారావు ప్రతిపాదించారు. అప్పుడే మొదటిసారి వీరేంద్రనాథ్‌ను కలిస్తే అభిలాష కథ చెప్పారు. మూలకథకు ఎక్కడా నష్టం జరగలేదు" అని కోదండరామిరెడ్డి తెలిపారు. ఆ తర్వాత అభిలాష, ఛాలెంజ్, రాక్షసుడు, మరణమృదంగం, దొంగమొగుడు, ఒక రాధ ఇద్దరు కృష్ణులు, రక్తాభిషేకం తదితర చిత్రాలు యండమూరితో కలిసి తీసినట్టు వివరించారు.

డబ్బులు పోయినా పర్లేదంటే సినిమాలు తీస్తా

డబ్బులు పోయినా పర్లేదు... మీతో సినిమా తీస్తామని ఎవరైనా నిర్మాతలు ముందుకొస్తే ఇప్పటికైనా సినిమా తీయడానికి తాను సిద్ధమని కోదండరామిరెడ్డి తెలిపారు. "సార్ మీ దర్శకత్వంలో ఓ సినిమా తీద్దాం. రూ.7-8 కోట్ల వరకూ పెడతాం అని చాలామంది వస్తుంటారు. ఆ డబ్బులు పోయినా పర్లేదంటే చేస్తానని చెబుతా. నేను లైమ్‌లైట్‌లో లేను. నన్ను పెట్టి సినిమా తీస్తే బిజినెస్ అవుతుందో లేదో తెలియదు. ఇప్పటివరకూ ఎవరూ ఓకే అనలేదు" అని కోదండరామిరెడ్డి అన్నారు. "సెంటిమెంట్ ఎప్పుడూ మారదు. అప్పుడైనా ఇప్పుడైనా తల్లి తల్లే. చెల్లి చెల్లే. సినిమాలో సెంటిమెంట్ సీన్ వీరి మధ్యే పెట్టాలి" అన్నారు.



చర్చాగోష్ఠిలో రచయిత యండమూరి వీరేంద్రనాథ్, సినీ దర్శకుడు కోదండరామిరెడ్డి, వల్లి పద్మాంజలి

ఒక్క నవలా చదవకుండా 11 సినిమాలు

"కోదండరామిరెడ్డి నా ఒక్క నవల కూడా చదవకుండా 11 సినిమాలు తీశారు" అని యండమూరి వీరేంద్రనాథ్ చమత్కరించారు. "ఆయన సింగిల్ లైన్ డైరెక్టర్. 'తుపాకీలో గుండ్లు లేవనుకొని హీరో పేలుస్తాడు. కానీ అవతల వ్యక్తి చనిపోతాడు. హీరోకు యావజ్జీవ కారాగార శిక్ష పడుతుంది' దీనిమీద స్టోరీ రాయమంటారు కోదండరామిరెడ్డి. అదే 100 రోజులు ఆడిన బాలయ్య రక్తాభిషేకం సినిమా. 'చక్రాల బండిలో చిరంజీవి దేక్కుంటూ వస్తారు'.. కథ రాయండి అన్నారు. అదే దొంగమొగుడు సినిమా. 'చిరంజీవి కళ్లకు గంతలు కట్టుకొని గుర్రం మీద వెళతాడు. వెనకాల కుక్క ఫాలో అవుతుంది' కథ రాయండి అంటారు. అలా కోదండరామిరెడ్డి నాతో ఎన్నో కథలు రాయించారు" అని యండమూరి వివరించారు.

కొత్త దర్శకులు ఫెయిలయ్యేందుకు ఇదే కారణం

"కొన్ని సినిమాల వరకూ ఓకే గానీ, దర్శకుడు తానే మాటలు రాసి, స్క్రీన్‌ప్లే చేసి, స్టోరీ చెబితే రెండో సినిమాకు ఏమీ ఉండదు. ఇటీవల చాలా మంది కొత్త దర్శకులు రెండు, మూడు సినిమాల తర్వాత విఫలం అవ్వడానికి ఇదే కారణం. తినేవాడు ఎప్పుడూ వండకూడదు" అని యండమూరి తెలిపారు. "ఇళయరాజా అప్పుడప్పుడే తెలుగు సినిమాలకు సంగీతం ఇస్తున్నారు. ఆయన గొంతు కొంత భిన్నంగా ఉంటుంది. ఆయన హార్మోనియం మీద వాయిస్తుంటే ఏ పాట హిట్ అవుతుందో జడ్జ్ చేయడం చాలా కష్టం. ఆయనే 'అభిలాష'కు సంగీతం అందించారు. బంతీ చామంతీ ముద్దాడుకున్నాయిలే, సందెపొద్దుల కాడ సంపంగి నవ్వింది లాంటి పాటలు సూపర్‌హిట్ అయ్యాయి" అని యండమూరి గత స్మృతుల్ని గుర్తుచేసుకున్నారు.

తితిదే బోర్డు సభ్యత్వానికి జంగా కృష్ణమూర్తి రాజీనామా

సీఎం, తితిదే ఛైర్మన్‌కు రాజీనామా లేఖలు



ఈనాడు, అమరావతి: తితిదే ధర్మకర్తల మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను సీఎం చంద్రబాబు, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడులకు పంపినట్లు వెల్లడించారు. తిరుమలలో అతిథిగృహం నిర్మాణానికి స్థల కేటాయింపు పునరుద్ధరిస్తూ బోర్డు తీసుకున్న నిర్ణయంపై ఓ పత్రికలో వచ్చిన కథనాలు మనస్తాపం కలిగించడం వల్లే రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. జంగా కృష్ణమూర్తి శుక్రవారం విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. గతంలో రెండుసార్లు తిరుమలలో అతిథిగృహం నిర్మించేందుకు తనకు స్థలం కేటాయించారని, వైకాపా హయాంలో దాన్ని వ్యక్తిగతంగా కాకుండా ట్రస్టు పేరిట కేటాయించాలని కోరితే.. అప్పటి బోర్డు అందుకు అంగీకరించిందని చెప్పారు. రూ.60 లక్షలు చెల్లించిన తర్వాత, తాను తెదేపాలో చేరనున్నట్లు తెలియడంతో స్థల కేటాయింపును అప్పటి తితిదే అదనపు ఈవో ధర్మారెడ్డి రద్దు చేయించారని వెల్లడించారు. తెదేపా అధికారంలోకి వచ్చాక మళ్లీ అభ్యర్థిస్తే.. స్థలాన్ని కేటాయించేందుకు ప్రస్తుత బోర్డు గత ఏడాది ఆమోదం తెలిపిందని చెప్పారు. బోర్డు సభ్యుల్లో భానుప్రకాశ్‌రెడ్డి ఒక్కరే అభ్యంతరం చెప్పారని తెలిపారు. ఇప్పుడీ దస్త్రం సీఎం వద్ద ఉండగా, దీనిపై ఓ పత్రికలో కథనాలు వచ్చాయని, మనస్తాపం చెంది పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబుకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

మాలాంటి వాళ్లు తిరుమలలో ఉండటం ధర్మారెడ్డికి ఇష్టం లేదు

'గతంలో అతిథిగృహానికి స్థలం కేటాయింపు రద్దుకు ధర్మారెడ్డి కారణం. మాలాంటివాళ్లు అక్కడ ఉండటం ఆయనకు ఇష్టంలేదు. పైన ఎందరో ఇంద్రభవనాలు కట్టుకున్నారు. గత ప్రభుత్వంలో వేలంపాటల్లా పెట్టి.. కొండపై స్థలాలు కేటాయించారు. రియల్‌ఎస్టేట్ చేశారు. దీన్ని నేను వ్యతిరేకించాను. అందుకే ధర్మారెడ్డి నా ట్రస్టుకు స్థల కేటాయింపు రద్దు చేయించారు. ఆ ట్రస్టు ఛైర్మన్‌గా నేనే ఉంటాను. అతిథిగృహంలోని 12 గదులూ తితిదే ఆధీనంలోనే ఉంటాయి. నిర్వహణ మాత్రం ట్రస్టు చూస్తుంది. అదనంగా నిర్మించే మరో గది మాత్రమే ట్రస్టుకు ఉంటుంది' అని కృష్ణమూర్తి తెలిపారు. మరోపక్క, కృష్ణమూర్తి శనివారం సీఎం చంద్రబాబును క్యాంప్ కార్యాలయంలో కలవనున్నారు.

డేటా సెంటర్లకు తక్కువ ధరకే విద్యుత్

- వాటి ఖర్చులు తగ్గించేందుకు మరిన్ని పరిష్కారాలు చూపుతాం
- పుణెలో పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌లో మంత్రి లోకేశ్ వెల్లడి



ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు అవసరమైన పునరుత్పాదక విద్యుత్‌ను అతి తక్కువ ధరకు ఇవ్వబోతున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. వాటి ఖర్చులు ఆదా చేసేందుకు మరిన్ని పరిష్కారాలను చూపిస్తామన్నారు. దీనివల్లే రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకొస్తున్నాయని వెల్లడించారు. మహారాష్ట్రలోని పుణెలో గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనమిక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌లో లోకేశ్ కీలకోపన్యాసం చేశారు. 'రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వాల కొనసాగింపు ముఖ్యం. ఈ విషయంలో ప్రజలు చైతన్యవంతులు కావాలి. వైకాపా ప్రభుత్వం విద్యుత్ పీపీఏలు రద్దు చేస్తామనడంతో 2019-24 మధ్య చాలా కంపెనీలు భయంతో పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయి. మా ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్న పరిశ్రమల గ్రౌండింగ్‌కు సంబంధించి రాబోయే రెండేళ్లలో పురోగతి చూపిస్తాం. చంద్రబాబు దార్శనిక పాలనతోనే హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ, మైక్రోసాఫ్ట్, ఐఎస్‌బీ వంటి సంస్థలు ఏర్పాటయ్యాయి. వాటి ద్వారా లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 36 శాఖలకు సంబంధించి వెయ్యి రకాల సేవలు అందిస్తున్నాం. నైపుణ్యం పోర్టల్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నాం. దీనికోసం నైపుణ్య సర్వే నిర్వహిస్తాం. గూగుల్, ఆర్సెలార్ మిత్తల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తోనే ఇది సాధ్యమైంది. రాష్ట్రానికి వచ్చే కంపెనీలకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానంలో అనుమతులు ఇస్తాం. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, నీరు, విద్యుత్ అందుబాటులో ఉన్నాయి. నైపుణ్యాలున్న యువత సిద్ధంగా ఉన్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం. స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, కంప్రెస్డ్ బయో గ్యాస్, మెడికల్ డివైజెస్ తయారీ.. ఇలా 22 సెక్టార్లతో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అనుసంధానిస్తాం' అని పేర్కొన్నారు.

మూడు కళలు మేళవించి.. రామాయణమై మెప్పించి!



తోలు బొమ్మలాట ప్రదర్శన పక్కనే చిత్రం గీస్తున్న కళాకారిణి సంగీత

ఈనాడు, అమరావతి: 'ఆవకాయ్- అమరావతి' ఉత్సవాల్లో భాగంగా విజయవాడలోని భవానీ ద్వీపంలో శుక్రవారం నిర్వహించిన 'కథా కాలక్షేపం' సాంస్కృతిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇంగ్లాండ్ నుంచి వచ్చిన నీలిమ పెనుమర్తి, ఆమె తల్లి జాహ్నవితో పాటు చిత్రకారిణి సంగీత కీర్తి, హైదరాబాద్‌కు చెందిన సురభి నాటక కళాకారులు సంయుక్తంగా ఈ ప్రదర్శన ఇచ్చారు. ఒకరు నాటకం, మరొకరు తోలుబొమ్మలాట, ఇంకొకరు చిత్రలేఖనం వేస్తూ ఒకే ప్రదర్శనగా ఈ మూడింటినీ మిళితం చేసి చూపించారు. నీలిమ, ఆమె తల్లి తోలుబొమ్మలతో రామాయణ గాథను హృద్యంగా చెబుతుంటే.. అందుకు తగ్గట్టుగా కీర్తి చిత్రాన్ని గీశారు. అదే సమయంలో సురభి కళాకారులు సూర్య, మాధవ్ తదితరులు రావణాసురుడు, ఆంజనేయుడి పాత్రలతో నాటకం వేశారు. రామాయణ కథను పావుగంటలో తోలుబొమ్మలతో చెబుతూ తయారుచేసిన వీడియోను ప్రదర్శించారు. ఇది బ్రిటన్‌లో అత్యంత ఎక్కువ వీడియోలు అమ్ముడైన ప్రదర్శన అని నీలిమ తెలిపారు. 'రామాయణ గాథను తోలుబొమ్మలతో ఆకట్టుకునేలా మేం ఈ వీడియో రూపొందించాం. విదేశాల్లోనూ మా ప్రదర్శనలకు మంచి ఆదరణ లభించింది. తొలిసారి ఏపీలో.. అదీ మూడు కళారూపాలను కలిపి ప్రదర్శించడం ఆనందంగా ఉంది'ని ఆమె చెప్పారు.



పిల్లలు నేర్చుకొనేది మీ లెక్చర్లతో కాదు

అబద్ధాలు చెప్పడం మంచి లక్షణం కాదంటూ మీరు మీ పిల్లలకు గంట సేపు లెక్చర్ ఇవ్వొచ్చు. కానీ మీరు ఫోన్‌లో మీ స్నేహితులకో లేదంటే మీ బాస్‌కో అబద్ధం చెప్పడం మీ పిల్లలు విన్నారనుకోండి. అప్పటివరకూ మీరు చేసిన నీతిబోధనలను మరిచిపోయి, అబద్ధాలు చెప్పడం తప్పేం కాదని వారు భావిస్తారు. కాబట్టి మీరు చెప్పే మాటల కన్నా మీ ప్రవర్తనే మీ పిల్లల వ్యక్తిత్వంపై ఎక్కువ ప్రభావం చూపుతుందని తెలుసుకోండి.

– ఆర్.ఎల్.నారాయణన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పర్ట్

విజయభాస్కరరెడ్డి తీసుకున్న లంచం రూ.82.50 లక్షలు

- తితిదేకు కల్తీనెయ్యి సరఫరాలో కీలకపాత్ర
- సిట్ తరఫున వాదనలు వినిపించిన ఏపీపీ జయశేఖర్
- ముందస్తు బెయిల్‌ను తిరస్కరించిన అనిశా కోర్టు

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తిరుమల తిరుపతి దేవస్థానానికి (తితిదే) నెయ్యి సరఫరాలో డెయిరీ నిపుణుడిగా వ్యవహరించిన విజయభాస్కరరెడ్డి (ఏ34) ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ నెల్లూరు అనిశా కోర్టు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై ఈ నెల ఏడో తేదీన వాదనలు ముగియగా తాజాగా కోర్టు నిర్ణయాన్ని వెలువరించింది. లడ్డూ తయారీకి కల్తీనెయ్యి సరఫరా అవుతోందని తెలిసినా డెయిరీలతో కుమ్మక్కై అనుమతించడంలో విజయభాస్కరరెడ్డి కీలకపాత్ర పోషించారని సిట్ తరఫున ఏపీపీ జయశేఖర్ ఈ నెల 7న వాదనలు వినిపించారు. భోలేబాబా డెయిరీ ప్రతినిధి నుంచి 2022, 2023లో హవాలా ఏజెంట్ ద్వారా హైదరాబాద్‌లో రూ.75 లక్షల లంచం తీసుకున్నారని, ఇందుకు ఆధారాలు లభించాయని ఆయన తెలిపారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ నుంచి మరో రూ.7.50 లక్షలు ముట్టిందన్నారు. నగదు రూపేణా రూ.82.50 లక్షలు తీసుకుని రూ.118 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని తితిదేకు పంపించారని వాదించారు. ఆల్ఫా కంపెనీ నుంచి 8 గ్రాముల బంగారం తీసుకున్నట్లు విచారణలో వెలుగు చూసిందన్నారు. ఇందులో రూ.34 లక్షలను సిట్ సీజ్ చేసిందని కోర్టు న్యాయాధికారి సరస్వతికి విన్నవించారు. భోలేబాబా, వైష్ణవి, ఆల్ఫా, ప్రీమియర్, మాల్‌గంగా సంస్థలను విజయభాస్కరరెడ్డి ప్రోత్సహించారని తెలిపారు. 2014- 24 మధ్య రెండేళ్లు మినహా ఎనిమిది సంవత్సరాలు తితిదేలో డెయిరీ నిపుణుడిగా పనిచేశారని, ఆయన ప్రజాసేవకుడు (పబ్లిక్ సర్వెంట్) నిర్వచనం పరిధిలోకి వస్తారని వివరించారు.

అది ప్రామాణికం కాదంటూ..

నెయ్యి నమూనాలను మైసూరులోని సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్‌కు పంపిన తర్వాత అది కల్తీ అని తేలిందని ఏపీపీ జయశేఖర్ తెలిపారు. వెజిటబుల్ ఆయిల్ కలిసినట్లు నిర్ధారించారన్నారు. ఇదేమీ ప్రామాణికం కాదని.. లడ్డూ తయారీకి నెయ్యిని అనుమతించవచ్చని విజయభాస్కరరెడ్డి సిఫార్సు చేశారని వెల్లడించారు. డెయిరీ ప్లాంట్లను తూతూమంత్రంగా తనిఖీ చేసి అవి సక్రమంగా ఉన్నాయని నివేదిక ఇచ్చారన్నారు. ఇలా అడుగడుగునా డెయిరీ నిర్వాహకులతో కుమ్మక్కై తితిదేకు నష్టం కలిగించారని, కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఏపీపీ తన వాదనలు వినిపించారు. ఇలాంటి పరిస్థితుల్లో నిందితుడికి ముందస్తు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని విన్నవించారు. కుట్రపూరితంగా వ్యవహరించిన ఆయనకు బెయిల్ మంజూరు చేయడం తగదన్నారు. ఈ వాదనలతో న్యాయాధికారి ఏకీభవించి విజయభాస్కరరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. ప్రస్తుతం నిందితుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు తిరుపతికి సీబీఐ జేడీ

కీలక దశకు చేరుకున్న కల్తీ నెయ్యి సరఫరా కేసు విచారణ

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తితిదేకు కల్తీ నెయ్యి సరఫరా కేసు కీలక దశకు చేరుకుంది. ఈ నెలాఖరుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ముగిసే అవకాశం ఉన్నట్లు సమాచారం. సంక్రాంతి తర్వాత వారం లేదంటే నెలాఖరులోగా నెల్లూరు అనిశా కోర్టులో మలివిడత ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ నేపథ్యంలోనే మొత్తం విచారణ, కేసుకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించడానికి సీబీఐ డీఐజీ మురళీరాంబా, విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టీ శుక్రవారం తిరుపతికి వచ్చారు. శనివారం సీబీఐ జేడీ వీరేశ్ ప్రభు, గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎఫ్ఎస్ఎస్ఏఐ సలహాదారు డా. సత్యేన్‌కుమార్ పాండా రానున్నారు.

ఒక్క ఏడాదిలో 1,000 అక్రమ రిజిస్ట్రేషన్లు

- కడియం సబ్‌రిజిస్ట్రార్ నిర్వాకం
- నిబంధనలకు విరుద్ధంగా పూర్వార్జితం ఆస్తుల బదలాయింపు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎక్కడి నుంచైనా ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చనే విధానం అక్రమార్కులకు వరంగా మారింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో కొందరు సబ్‌రిజిస్ట్రార్లకు కాసులు కురిపిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కడియం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్వార్జితం ఆస్తులను నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు చేసేస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు అందడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ అంబేడ్కర్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారిణిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ సీహెచ్ జానకీదేవిని నియమించారు. ఆమె ఆ శాఖ కాకినాడ ఆడిట్ విభాగం జిల్లా రిజిస్ట్రార్‌తో కలిసి విచారణ చేపట్టారు. కడియంలో సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మి 2024 సెప్టెంబరు నుంచి 2025 సెప్టెంబరు వరకు చేసిన రిజిస్ట్రేషన్లను తనిఖీ చేయగా విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ఏడాది కాలంలోనే ఆమె ఏకంగా 1000 వరకు పూర్వార్జిత ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిబంధనలకు విరుద్ధంగా చేసినట్లు గుర్తించారు. విచారణ నివేదికను త్వరలో ఐజీకి సమర్పించనున్నారు.



కడియం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఎక్కడ తిరస్కరించినా.. ఇక్కడ రిజిస్ట్రేషన్లు

ఇంటి పన్ను, కరెంటు బిల్లు, పొజిషన్ సర్టిఫికెట్ ఉంటేనే పూర్వార్జితం ఆస్తులు, స్థలాల రిజిస్ట్రేషన్లు చేయాలి. ఇవేవీ లేకుండానే కేవలం ఆధార్ కార్డు ఆధారంగా కడియం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు గుర్తించారు. కాకినాడ, బిక్కవోలు, సామర్లకోట, తుని, పిఠాపురం ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎక్కడ తిరస్కరించినా వాటికి ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేస్తుండటం గమనార్హం. కడియం సబ్‌రిజిస్ట్రార్ ఇ.లక్ష్మి గతంలో కాకినాడ, సామర్లకోట, అమలాపురం వంటి ప్రాంతాల్లోనూ విధులు నిర్వర్తించారు. కొందరు అక్కడి నుంచి వచ్చి కూడా ఇక్కడ అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు గుర్తించారు.

ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి..

కడియంలో అధికారి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్లు ఏజీ ఆడిట్, స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ ఆడిట్ విభాగం గుర్తించింది. స్టాంపు డ్యూటీ విలువ తగ్గించి, పార్టీల దగ్గర సొమ్ములు నొక్కేసినట్లు తేల్చారు. రూ. లక్ష కన్నా ఎక్కువ మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేసిన రిజిస్ట్రేషన్లను గుర్తించారు. ఆ అధికారి గతంలో పనిచేసిన చోటా ఇదే విధంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలకు సిఫార్సు

కడియం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ఇ.లక్ష్మి ఏడాది కాలంలో 1000 వరకు పూర్వార్జితం ఆస్తులను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు తేల్చాం. ఆమెపై చర్యలకు సిఫార్సు చేస్తున్నాం. లక్ష్మి గతంలో ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేకూర్చేలా చేసిన ఆస్తుల రిజిస్ట్రేషన్లపైనా శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నాం. ఈ మేరకు పార్టీలకు నోటీసులు ఇచ్చాం.

– సీహెచ్.జానకీదేవి, డీఐజీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, కాకినాడ

స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించండి

విశాఖ దీపస్తంభ ఉత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు, సర్బానంద సోనోవాల్, కందుల దుర్గేష్, ఎంపీ సీఎం రమేష్

ఈనాడు, విశాఖపట్నం: వారసత్వ ప్రదేశాలుగా గుర్తింపు పొందిన దీపస్తంభాలు (లైట్‌హౌస్) గొప్ప పర్యాటక కేంద్రాలుగా నిలుస్తాయని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. అవి పర్యాటక రంగానికి దిక్సూచిగా పనిచేస్తాయన్నారు. వాటి కేంద్రంగా ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర జలరవాణా, ఓడరేవుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖలో దీపస్తంభ ఉత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విహారయాత్రలకు వెళ్లేవారు స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలన్నారు. దేశంలోని అద్భుత పర్యాటక ప్రదేశాలను వదిలి వేరే దేశాలకు వెళ్లాలనుకోవడం సరికాదని చెప్పారు.

విశాఖలో షిప్‌డిజైన్ టెక్నాలజీ సెంటర్

ఉత్సవంలో పాల్గొన్న కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ "విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం షిప్‌బిల్డింగ్ కోర్సు సెంటర్‌ను 'నేషనల్ షిప్‌డిజైన్ టెక్నాలజీ సెంటర్'గా ఏర్పాటుచేస్తున్నాం. ఇందుకోసం కేంద్రం రూ.305 కోట్లు ఖర్చుచేస్తుంది. ఏపీ మారిటైం బోర్డు, విశాఖ పోర్టు సంయుక్త సహకారంతో దుగరాజపట్నంలో కొత్త పోర్టు, మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ నిర్మిస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల దిల్లీ పర్యటనలో దీనిపై చర్చించడంతో ఆ దిశగా నిర్ణయం తీసుకున్నాం. షిప్‌బిల్డింగ్‌లో 2030 నాటికి ప్రపంచంలోని మొదటి పదిదేశాల్లో, 2047 నాటికి మొదటి ఐదు దేశాల్లో ఒకటిగా భారత్ నిలుస్తుంది. రాష్ట్రంలో సాగరమాల ప్రాజెక్టు కింద 110 ప్రాజెక్టులను రూ.1.14 లక్షల కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. దేశంలో దీపస్తంభాలను సందర్శిస్తున్నవారి సంఖ్య బాగా పెరిగింది. 2014లో ఏడాదికి 4లక్షల మంది సందర్శిస్తే 2024లో ఆ సంఖ్య 20లక్షలకు చేరింది. దేశంలో 205 దీపస్తంభాలుంటే అందులో 75చోట్ల ప్రత్యేక పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నాం. అందులో ఏపీలో పది ఉన్నాయి" అని తెలిపారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏపీలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, విశాఖ పోర్టు ఛైర్మన్ అంగముత్తు, కేంద్ర నౌకాయాన, జలరవాణా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

EENADU Vol: 52, Issue: 151 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
సంక్రాంతి సంబరాలు
70%
వరకు తగ్గింపు
ఇప్పుడు అందుబాటులో
vijay sales
గవర్నర్ పేట, ఏలూరు రోడ్, విజయవాడ
విజయ్ సేల్స్ vijay sales
SANSUI
32 (80 cm)
QLED
PRICE ₹20,990/-
OFFER PRICE ₹9,990/-
DOWN PAYMENT ₹1,998 | EMI ₹999 x 8 MONTHS
LG 55 (138 cm)
4K QNED webOS
CASHBACK UPTO ₹7,500
EMI STARTS FROM ₹5,983
SONY 65 (164 cm)
4K UHD Google TV
CASHBACK UPTO ₹5,000
EMI STARTS FROM ₹6,500
IFB Set yourself free
TOP LOAD WASHING MACHINE (7.5 KG)
UPTO ₹7,790 OFF
CASHBACK UPTO ₹2,500*
(UE)
Whirlpool
TOP LOAD WASHING MACHINE (10 KG)
UPTO ₹11,100 OFF
CASHBACK UPTO ₹4,500*
(UE)
GET FREE
Fire-Boltt Smart Watch worth Rs. 2000/-
OR
Kent Multi Cooker worth Rs. 2900/-
On Purchase of AC, Refrigerator & Washing Machine.
SAMSUNG
FRONT LOAD WASHING MACHINE (9 KG)
UPTO ₹14,490 OFF
CASHBACK UPTO ₹8,000*
(UE)
LG
FRONT LOAD WASHING MACHINE (12 KG)
UPTO ₹18,990 OFF
CASHBACK UPTO ₹10,000*
(UE)
AIR CONDITIONERS
RANGE AVAILABLE FROM 1 T TO 3 T
UPTO 40% OFF
CASHBACK 10% UPTO ₹4,000*
Whirlpool
DIRECT COOL REFRIGERATOR (192 LITRES)
UPTO ₹3,500 OFF
Cashback Upto ₹2,500*/-
SAMSUNG
FROST FREE REFRIGERATOR (236 LITRES)
UPTO ₹6,500 OFF
Cashback Upto ₹2,500*/-
Godrej
SIDE BY SIDE REFRIGERATOR (600 LITRES)
UPTO ₹30,000 OFF
Cashback Upto ₹12,000*/-
LG
SIDE BY SIDE REFRIGERATOR (650 LITRES)
UPTO ₹40,000 OFF
Cashback Upto ₹10,000*/-
iPhone 16
PRICE ₹69,900
VSP ₹62,990
Cashback Upto ₹3,000
Effective Price ₹59,990*
EMI Starting At ₹5,249
realme
16 Pro Series 5G
200MP Portrait Master
Available now
Powered by NEXT AI
JUST ₹399 PAY ₹16
AS PROCESSING FEES AND OWN IT
ZERO DOWN PAYMENT | 12 MONTH EMIs
SHOP ON EMIS STARTING ₹1,523*
WITH YOUR EMI NETWORK CARD
mi
REDMI Note 15 5G
Segment's Slimmest Smartphone*
Starting from ₹22,999
Available now
₹3,000* Instant Bank Discount
AXIS BANK SBI card
Bank offers available at stores only.*
IT & MOBILE ACCESSORIES
UPTO 70% OFF
MacBook Air M4
PRICE ₹99,900
VSP ₹90,990
Cashback ₹10,000
Effective Price ₹80,990*
EMI Starting At ₹3,791
hp
OMNIBOOK, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cashback upto ₹15,000/-*
• Hyper X CloudX Stinger 2 Core Wired Headset @ ₹499/-*
• 1 Year Warranty + 3 Years Antivirus @ ₹1999/-*
Lenovo
LENOVO GAMING, YOGA SERIES, SLIM 5 & FLEX 5, LOQ
• Cashback upto ₹10,000/-*
• Exchange Bonus Upto ₹15,000/-*
• 2 Years Warranty + 2 Years Premium Care + 1 Year ADP @ ₹1,999/-*
DELL Technologies
INSPIRON, INSPIRON GAMING, XPS, ALIENWARE
• Cashback upto ₹10,000/-*
• 1 Year Extended Warranty and 2 Year ADP @ ₹1299/-*
• Dell Wireless Keyboard & Mouse Combo @ ₹799/-*
ASUS
ROG, STRIX, ZENBOOK, TUF GAMING, ZEPHYRUS DUO
• Asus CW101 Keyboard + Mouse @ ₹999/-*
• Laptop Warranty Starting @ ₹99/-*
• Upto 15 Months Paper Finance Offer*
LED TVs | Large Appliances | Air Conditioners
Mobiles | Laptops | Accessories
Kitchen Appliances
For special discounts on corporate and builder enquiries, please email us at b2b@vijaysales.com
ICICI Bank
INSTANT DISCOUNT UP TO ₹15,000*
ON CREDIT CARDS NON EMI, CREDIT & DEBIT CARDS EMI
HDFC BANK
INSTANT DISCOUNT UP TO ₹7,500*
WITH EASYEMI ON HDFC BANK CREDIT CARDS
AMERICAN EXPRESS
INSTANT DISCOUNT UPTO ₹15,000*
ON AMERICAN EXPRESS EMI TRANSACTIONS
UP TO ₹15,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE
onecard BOBCARD YES BANK AU pnb DBS
VIJAY SALES (INDIA) PVT. LTD.
ANDHRA PRADESH | HYDERABAD | WARANGAL | MUMBAI | PUNE | AHMEDABAD | SURAT | VADODARA | DELHI | GURUGRAM | NOIDA | INDIRAPURAM | FARIDABAD | GHAZIABAD
SCAN FOR STORES
Vijayawada - Eluru Road: Prasanna Kumar - 91549 03539, Srinivas - 87126 12331
Vijayawada - M G Road: Rajani kumar - 96665 03755, Durga Bhavani - 9154903667
Vijayawada - NTR Circle: Eshwar - 88866 53042, Chakrapani - 91333 16947
Rajahmundry - J N Road: Gowtham - 91549 03693, Praveen - 8712032656
Rajahmundry - Innispet: Sathish - 88866 74548, Ananth - 7337376206
Tirupathi - M R Palli: Kiran - 99482 28111, Kalyan - 8712600111
Tirupathi -Leela Mahal: Venu - 73373 76215, Venkatesh - 91543 85029
Kakinada - Beside Apollo Hospital: Siva Gangadar - 91543 16627, Nagasri - 73373 76220
Vizag - Dondaparthy: Ramesh - 99482 41112, Kiran kumar - 91549 03528
Scan to Shop Online
www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier Bank. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Convenience fees will be applicable for HDB finance Cashback. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. *Cashback Applicable Select Banks & Cards. Upto off on select brands and models only.



సంక్రాంతి
సంబరాలు
జనవరి 15 వరకు
FREE SILVER
సంక్రాంతి షాపింగ్ చేయండి...
వెండి ఉచితంగా పొందండి
స్పాట్ గిఫ్ట్స్
1500 పైబడి వస్త్రాల కొనుగోలు పై ఉచిత బహుమతులు
safari
HDFC BANK
5% DISCOUNT*
Get upto 5% Instant Discount* using EMI on HDFC Bank Credit Cards and HDFC Bank Debit Cards
Min Txn Rs.5,000 - Max Cap Rs.4,000
సంక్రాంతి కాంబో ఆఫర్స్
A Unit of
marri Retail Private Limited
ది చెన్నయ్ షాపింగ్ మాల్
1800 309 9989 | 9000 999 444
ఎం.జి. రోడ్, విజయవాడ



సంక్రాంతి సంబరాలు
CMR SHOPPING MALL
The joy of life
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Sankranti BIG SALE
UPTO 51% Off
CMR తో సంక్రాంతిని మరింత వైభవంగా జరుపుకుందాం
1+1 ఆఫర్స్ కాంబో ఆఫర్స్ ఇంకా మరెన్నో!
FANCY SAREES
SUNFLOWER SAREE BUY 2 @ ₹299*
THAMANNA SAREE BUY 2 @ ₹599*
FANCY SAREE BUY 2 @ ₹649*
FANCY SAREE BUY 2 @ ₹699*
FANCY SAREE BUY 2 @ ₹749*
FANCY BOX SAREE ₹949 ₹749*
SAMANTHA SAREES BUY 2 @ ₹799*
FANCY SAREE BUY 2 @ ₹849*
JASMINE SILK SAREE BUY 2 @ ₹899*
VRINDAVAN FANCY SAREE BUY 2 @ ₹999*
ANMOL SILK SAREE BUY 2 @ ₹1099*
• చీరలు • చుడీదార్స్ • గాగ్రాస్ • ఉమెన్స్ వేర్ • మెన్స్‌వేర్ • కిడ్స్ రెడీమేడ్స్ • కాస్మెటిక్స్
Pattu Sarees
AKSHARA PATTU BUY 2 ₹899*
PATTU SAREE BUY 2 ₹1199*
PATTU SAREE BUY 2 ₹1299*
SANKRATHI BUY 2 ₹1599*
VAISHALI BUY 2 ₹1899*
KANJEEVARAM BUY 2 ₹2999*
SRIDEVI PATTU BUY 2 ₹999*
VARAHI BUY 2 ₹3499*
KAUSHALYA BUY 2 ₹4999*
PATTU FANCY ₹4299 ₹2999*
KANCHI SAREE ₹5799 ₹3999*
Women's Wear
KURTA BUY 3 ₹299*
KURTA BUY 2 ₹499*
KURTA BUY 2 ₹699*
WESTERN DRESS BUY 3 ₹999*
NIGHTIES BUY 2 ₹499*
JEANS BUY 3 ₹999*
CO-ORD SETS BUY 3 ₹1499*
Cotton & Catalogue Sarees
COTTON SAREE ₹879 ₹699*
COTTON SAREE ₹949 ₹749*
BANARAS FANCY SAREE BUY 2 ₹2399*
Chudidhar & Dress Material
DRESS MATERIAL BUY 2 ₹999*
CHUDIDHAR ₹1469 ₹1099*
FASHION CHUDIDHAR ₹1759 ₹1299*
FANCY CHUDIDHAR BUY 2 ₹1299*
FANCY CHUDIDHAR BUY 2 ₹1499*
FANCY CHUDIDHAR BUY 2 ₹1699*
Gagra
FANCY GAGRA BUY 2 ₹1499*
KIDS WEAR
BOYS JEANS BUY 2 ₹899*
COTTON FROCKS BUY 3 ₹599*
GIRLS SKIRTS BUY 2 ₹799*
BOYS SHIRTS BUY 2 ₹499*
BOYS SHIRTS BUY 2 ₹699*
GIRLS PALAZZO BUY 4 ₹499*
GIRLS NIGT SUIT BUY 2 ₹699*
GIRLS SKIRTS BUY 3 ₹999*
Handloom Sarees
COTTON SAREE BUY 2 @ ₹699*
KANCHI COTTON BUY 2 @ ₹799*
VENKATAGIRI BUY 2 @ ₹999*
YELLAMPALLI BUY 2 @ ₹999*
KUPPADAM BUY 2 @ ₹1599*
UPPADA BUY 2 @ ₹2999*
HI Fancy Saree
ROYAL QUEEN BUY 2 @ ₹3299*
SPACE SILK BUY 2 @ ₹3499*
KHATAN SILK BUY 2 @ ₹3699*
HASTHAKALA SILK BUY 2 @ ₹3899*
JAHNAVI SILK BUY 2 @ ₹4299*
CHINAN SILK BUY 2 @ ₹4599*
MENS WEAR
SHIRTS BUY 4 ₹999*
SHIRTS BUY 3 ₹999*
SHIRTS BUY 2 ₹1199*
SHIRTS BUY 2 ₹1299*
TROUSERS BUY 2 ₹1299*
TROUSERS BUY 2 ₹1499*
JEANS BUY 2 ₹1299*
JEANS BUY 2 ₹1499*
KILLER THINC MONTE CARLO CRIMSOUNE CLUB BUY 3 @ 50% OFF BUY 2 @ 40% OFF BUY 1 @ 30% OFF
Pepe Jeans UNITED COLORS OF BENETTON BUY 2 GET 2 Free BUY 2 @ 40% OFF BUY 1 @ 30% OFF
Cavallo TURTLE LINEN CLUB BUY 3 @ 50% OFF BUY 2 @ 40% OFF BUY 1 @ 25% OFF
RARE RABBIT BUY 3 @ 50% OFF BUY 2 @ 30% OFF BUY 1 @ 20% OFF
INDIAN TERRAIN BUY 3 @ 50% OFF BUY 2 @ 40% OFF BUY 1 @ 20% OFF
CITRUS BUY 2 @ 30% OFF BUY 1 @ 20% OFF
JACK & JONES spykar BUY 2 @ 50% OFF BUY 1 @ 40% OFF
Henila ITALIAN COUTUR Flat 50% OFF
mufti BUY 2 @ 50% OFF BUY 1 @ 25% OFF
celio* BUY 2 @ 50% OFF BUY 1 @ 30% OFF
OXEMBERG SHOP FOR ₹2999 GET A BACK PACK @ ₹199
rock.it BUY 2 @ 50% OFF BUY 1 @ 30% OFF
Celebrity Flat 15% OFF
FLYING MACHINE BUY 1 GET 1 Free BUY 1 @ 20% OFF
Levi's BUY 5 @ 50% OFF BUY 2 GET 2 Free BUY 1 GET 1 Free
BLACKBERRYS BUY 4 @ 50% OFF BUY 2 @ 30% OFF BUY 1 @ 20% OFF
U.S. POLO ASSN. ARROW parx BUY 2 GET 2 Free BUY 2 @ 30% OFF BUY 1 @ 20% OFF
BEYOND BLUE JEANS CLOUD 9 BUY 3 @ 40% OFF BUY 2 @ 30% OFF BUY 1 @ 20% OFF
LIGHT HOUSE CLOUD 9 BUY 3 @ ₹1599* TWILLS OXEMBERG COOL COLORS OTTO
ఎం.జి.రోడ్, విజయవాడ 91333 87124 బస్టాండ్ ఎదురుగా, మచిలీపట్నం 7799971833 నెహ్రూ చౌక్ సెంటర్, గుడివాడ 7799971839

సంస్కృతీ పరిమళం..
సకల జన పరవశం

సందడిగా ఆవకాయ్.. అమరావతి
తరలివచ్చిన నగర వాసులు


ఆకట్టుకున్న భారీ తోలుబొమ్మలు

ఈనాడు, ఈనాడు డిజిటల్, అమరావతి - న్యూస్‌టుడే, భవానీపురం : పున్నమిఘాట్‌లో 'ఆవకాయ్-అమరావతి' వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. విద్యుత్తు దీపాల వెలుగులతో కృష్ణా తీరానికి కొత్త వెలుగులొచ్చాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కృష్ణా నది మధ్యలో ఉన్న భవానీ ద్వీపంలో ప్రత్యేక సదస్సులు, మార్షల్ ఆర్ట్స్, నగాడా, తోలుబొమ్మలాట శిక్షణ శిబిరాలు జరిగాయి. సినిమాల్లో ప్రతినాయకుల పాత్ర, కథ చెప్పే విధానంలో పరిణామం, కథాకాలక్షేపం, ఓటీటీ యుగంలో సినిమాపై చర్చా కార్యక్రమాలు జరిగాయి. అభిలాష పేరుతో 'నవల నుంచి సినిమా వరకూ..' అనే అంశంపై సదస్సు నిర్వహించగా.. ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, సినీ దర్శకుడు ఎ.కోదండరామిరెడ్డి చర్చలో పాల్గొన్నారు.

సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు.

. ఉత్సవాల రెండో రోజు.. శుక్రవారం సాయంత్రం పున్నమిఘాట్‌లో జరిగిన సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మొదట చందన బాల కల్యాణ్ గ్రూప్ కర్ణాటిక్, భక్తి పాటలను


గానామృతం

పాడారు. త్యాగ రాజ స్వామి, అన్నమాచార్య, రామదాస్, బాలమురళీకృష్ణ గీతాలను లయబద్ధంగా ఆలపించారు. వనశ్రీ రావు కూచిపూడి నృత్యం, రస యునైటెడ్ బృందం చేసిన నాట్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సాధు, అఘోరా, అర్ధనారీశ్వర, మహిషాసురమర్దిని తదితర నృత్య భంగిమలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ఆద్యంతం చూపరులను కట్టి పడేసింది.

❖ భారీ తోలుబొమ్మల ప్రదర్శన, నృత్యాలను పిల్లలు ఆసక్తిగా తిలకించారు. డప్పు వాయిద్య కళాకారులు.. తమ ప్రదర్శనతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. ❖ రాజస్థాన్ కళాకారుల నగాడా ప్రదర్శన రెండో రోజు కూడా కొనసాగింది.


ఉత్సవాలు వీక్షిస్తున్న ప్రముఖులు, ప్రజలు


వాయిద్యాలు వాయిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ


ఎంపీ కేశినేని, షరీఫ్, మంత్రి సత్యకుమార్


పప్పెట్ల తయారీ అనంతరం వాటితో చిన్నారులు


ఫ్రెంచ్ నృత్యకళాకారుడు గిల్లెస్ చయినేతో యువతకు డ్యాన్స్ శిక్షణ


ఆవకాయ్ ఉత్సవాల్లో విద్యార్థినుల జోష్

అతిక్రమిస్తే ప్రమాదం..
తేగలరా ప్రాణం..




మొగల్రాజపురంలో..

ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి ప్రయాణాలు చేస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. పాఠశాల విద్యార్థులను ఆటోలో కిక్కిరిసి ఎక్కిస్తున్నారు. వెనుక ప్రమాదకర రీతిలో కూర్చోబెట్టి తీసుకెళ్తున్నారు. తగదని చెబుతున్నా ద్విచక్ర వాహనంపై రాంగ్‌రూట్‌లో నలుగురు విద్యార్థులు శిరస్త్రాణం ధరించకుండా వస్తున్న దృశ్యమిది. - ఈనాడు, అమరావతి

అక్షర ప్రపంచంలో.. ఆత్మీయ నేస్తాలు

మరో మూడ్రోజులే ప్రదర్శన


నూతన పుస్తకాలతో చిన్నారుల సందడి

ఈనాడు, అమరావతి: 36వ విజయవాడ పుస్తక మహోత్సవం మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఈనెల 2 నుంచి ఆరంభమైన ప్రదర్శన.. 12 వరకు కొనసాగుతుంది. ఎనిమిది రోజులుగా జరుగుతున్న పుస్తక ప్రదర్శనకు.. ఈ ఏడాది అనూహ్య స్పందన వచ్చింది. మొదటి రోజు నుంచే పుస్తక ప్రియులు తండోపతండాలుగా తరలివచ్చి కొంటున్నారని నిర్వాహకులు వెల్లడించారు. కొనుగోళ్లు సైతం అనూహ్యంగా పెరిగాయని తెలిపారు.

'ఈనాడు'
సాయంత్రం 5గంటలకు: నవ్వుల విందు హాస్య ప్రసంగం. కృష్ణకుమారి, సుబ్రహ్మణ్యబాబు హాస్యప్రసంగ కర్తలు **సాయంత్రం 6 గంటలకు:** పాటిశెట్టి నాటక రంగం సదస్సు.. సభాధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ.
❖ **నేటి ప్రదర్శన వేళలు:** మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 9గంటల వరకు.

రాయితీ పుస్తకాలు... అన్ని స్టాళ్లలోనూ 10 శాతం రాయితీ ఇస్తున్నారు. కొన్ని దుకాణాల్లో.. ప్రత్యేక రాయితీల పేరుతో అదనంగా మరి కొంత మొత్తం ఇస్తున్నారు. మరికొన్ని పుస్తకాలను ఆరేసి కలిపి.. ధర బాగా తగ్గించి విక్రయిస్తున్నారు. దీంతో పుస్తక ప్రియులు పెద్దసంఖ్యలో కొంటున్నారు.

లొంగుబాటలో... ప్రియాంక!

దిల్లీ ముఠాలో ఈమె కింగ్‌పిన్

ఈనాడు, అమరావతి

పిల్లల విక్రయాల కేసులో తప్పించుకు తిరుగుతున్న దిల్లీ ముఠాలో కీలక సూత్రధారి ప్రియాంక లొంగిపోనున్నట్లు తెలిసింది. నిందితురాలిని అరెస్టు చేసేందుకు విజయవాడ నుంచి ప్రత్యేక బృందం.. దిల్లీకి, తర్వాత మేరఠ్‌కు వెళ్లింది. పోలీసులు వెళ్లే ముందే ప్రియాంక ఉత్తరాఖండ్‌కు పరారైంది. అన్ని వైపులా దారులు మూసుకుపోవడంతో లొంగిపోయేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. మేరఠ్‌లో ఆమె అత్తమామలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో మాట్లాడుకుని విజయవాడ వచ్చి పోలీసుల లొంగిపోవాలని నిర్ణయం తీసుకుంది. త్వరలో న్యాయవాదితో కలసి నగరానికి రానున్నట్లు తెలిసింది.



పిల్లల అమ్మకాలతో భారీ ఆర్జన..

ఈమె... శిశు విక్రయాల ద్వారా భారీగా ఆర్జించినట్లు గుర్తించారు. ఈమె ఆర్థిక లావాదేవీలపై పోలీసులు దృష్టి పెట్టారు. ఖాతాల వివరాల కోసం సంబంధిత బ్యాంకులకు లేఖలు రాశారు. వివరాలు రాగానే లావాదేవీలను పరిశీలించనున్నారు. తదుపరి లావాదేవీలకు తావులేకుండా ఖాతాలను స్తంభింపజేయనున్నారు. వీటి విశ్లేషణతో ఇంకా ఎవరెవరితో లింకులు ఉన్నాయో బయటకు వచ్చే వీలుంది.

నిందితులపై రౌడీషీట్లు...

ఈ కేసులో నిందితులు బయటకు వచ్చినా పదేపదే ఈ నేరాలకు పాల్పడుతుండడంతో వీరిపై త్వరలో రౌడీ షీట్లు తెరవనున్నారు. ఇతర రాష్ట్రాల్లో నిందితులపై ఉన్న రౌడీషీట్లు తెరిచి, వాటిని సంబంధిత స్టేషన్లకు పంపనున్నారు. ముంబయి, అహ్మదాబాద్, దిల్లీకి చెందిన ఆరుగురిపై వెంటనే తెరవనున్నారు. దీంతో వీరిపై నిఘాకు ఆస్కారం ఏర్పడనుంది.

అనిల్‌కు రిమాండ్... పిల్లల విక్రయాల కేసులో నిందితుడు అనిల్‌కు న్యాయస్థానం రిమాండ్ విధించింది. శుక్రవారం సాయంత్రం మహారాష్ట్ర నుంచి పీటీ వారెంట్‌పై విజయవాడకు తెచ్చారు. గత ఏడాది మార్చిలో నమోదైన పిల్లల విక్రయాల కేసులో మహిళా స్టేషన్‌లో నమోదైన కేసులో అనిల్‌ను నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో.. కిడ్నాప్‌లో అరెస్టయి మహారాష్ట్రలోని జైలులో రిమాండ్‌లో ఉన్న అనిల్‌ను పీటీ వారెంట్‌పై నగరానికి ప్రత్యేక బృందం తెచ్చింది. మహిళా స్టేషన్ పోలీసులు నిందితుడిని న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. రిమాండ్ విధించడంతో కారాగారానికి తరలించారు. విక్రయాలలో కిరణ్ పెదనాన్న ప్రమేయం కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కస్టడీకి తీసుకున్న తర్వాత మరిన్ని వివరాలు రాబట్టే వీలుంది. ఇంకా అరెస్టు కావాల్సిన నూరి కోసం మరో బృందం థానే వెళ్లనుంది. మరో నిందితురాలు ఫరీనా కస్టడీ కోసం నున్న పోలీసులు పిటిషన్ వేయగా.. 1, 2 రోజుల్లో ఉత్తర్వులు వెలువడే వీలుంది.

12న మునగచర్లకు ఉప ముఖ్యమంత్రి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ మండలం మునగచర్లలో వీబీ జీ రామ్ జీ నిధులు రూ.10 లక్షలతో పైలట్ ప్రాజెక్టుగా నిర్మించిన సామూహిక పశువుల వసతిగృహం ప్రారంభానికి ఈనెల 12న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రానున్నారని డ్వామా జిల్లా పీడీ ఎ.రాము తెలిపారు. శుక్రవారం మునగచర్లలో పశువుల వసతి గృహాన్ని పరిశీలించారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని, సభా వేదిక ఏర్పాటుచేసే ప్రదేశాన్ని పర్యవేక్షించారు. ఎంపీడీవో ఆర్వీఎస్ ప్రసాదరావుకు సూచనలు చేశారు. వీబీ జీ రామ్ జీ నందిగామ ఏపీడీ బీఎల్.లక్ష్మీకుమారి, ఏపీవో శరత్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న పీడీ రాము తదితరులు

సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

విజయవాడ నేరవార్తలు: ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం లేకుండా ముందస్తు భద్రతాచర్యల్లో భాగంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు తెలిపారు. ఈనెల 10 నుంచి ఏప్రిల్ 9 వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు.

రూ.కోట్లు మింగేశారు..
మీకు కనిపిస్తోందా..?!

✦ మెప్మా పరిధిలో నకిలీ గ్రూపులతో రుణాలు
✦ వైకాపా జమానాలో ఐదేళ్లు సాగిన అక్రమం



ఈనాడు, అమరావతి

'తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట మున్సిపాలిటీల పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పరిధిలో నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసి భారీగా దోచేశారు. వైకాపా హయాంలో రూ.50 కోట్లు పైగా విచ్చలవిడిగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీటిలో చాలావరకూ తిరిగి చెల్లించడం లేదు. ఒక్క తిరువూరులోనే రూ.17 కోట్ల వరకూ నకిలీ గ్రూపుల పేరుతో బ్యాంకుల నుంచి తీసుకున్నారు. నందిగామ, జగ్గయ్యపేటల్లోనూ రూ.30-40 కోట్లు తినేసినట్లు సమాచారం. ప్రధానంగా ఆర్పీలు, సీవోలు, సీఎంఎంలే కీలక పాత్రధారులు.. వీరు పై అధికారుల సహకారంతో విచ్చలవిడిగా దోపిడీకి తెర తీశారు. కొందరు బ్యాంకు సిబ్బంది కూడా వీళ్లకు పూర్తిగా సహకరించారు.'

ఆర్పీలే గ్రూపులు పెట్టేసి దందా..

గ్రూపుల నిర్వహణను చూసే రిసోర్స్‌పర్సన్లే కీలకంగా ఉండి.. విచ్చలవిడిగా నకిలీ పేర్లతో.. గ్రూపులను సృష్టించారు. ఇలా ఒకే మహిళ పేరును నాలుగైదు గ్రూపుల్లో ఉంచి... ఆర్పీలు కూడా 5-10 గ్రూపుల్లో తమ పేర్లను నమోదు చేయించినట్లు తెలిసింది. పది మంది సభ్యులుండే ఒక్కో గ్రూపు మొత్తానికి కలిపి రూ.20 లక్షల రుణాలు తీసుకున్నారు. కానీ.. ఈ సభ్యుల్లో చాలామందికి అసలు రుణం తీసుకున్న విషయమే తెలియకుండా.. అందరూ కలిసి దోచేసి.. పంచుకున్నారు.

అక్రమాలు కోకొల్లలు...

* తిరువూరు చింతలకాలనీ మహిళా ఆర్పీ పది గ్రూపుల్లో సభ్యురాలిగా ఉండి.. రూ.3 కోట్లు వివిధ బ్యాంకుల్లో రుణం తీసుకున్నట్లు సమాచారం. వీటిలో చాలావరకూ తిరిగి చెల్లించడం లేదు.
* శాంతినగర్‌లో మరో మహిళా ఆర్పీ ఐదు గ్రూపుల్లో సభ్యురాలు. 50 మందిని సభ్యులుగా చూపిస్తూ రూ.కోటిన్నర రుణం తీసుకోగా.. చాలామంది సభ్యులకు రుణం తీసుకున్నట్లే తెలియదు.
* లంబాడీతండాలో ఒక ఆర్పీ గ్రూపు సభ్యులు కట్టిన డబ్బులను బ్యాంకుకు చెల్లించకుండా రూ.9 లక్షలు తినేయగా.. సదరు గ్రూపు సభ్యులకు కొత్త రుణాలు ఇవ్వడం లేదు. * సుగాలికాలనీలో స్వయంకృషి గ్రూపు రూ.12 లక్షలు బ్యాంకు నుంచి తీసుకుంది. రూ.9 లక్షలు కట్టకుండా బకాయి పెట్టారు. * భారతీ అనే మరో గ్రూపు పేరుతో రూ.15 లక్షలు తీసుకుని.. ఇప్పటికి రూ.లక్ష మాత్రమే కట్టారు. * పాత తిరువూరులో కనకమహాలక్ష్మి గ్రూపు రూ.20 లక్షలు తీసుకుని.. ఇప్పటికీ ఒక్క రూపాయి చెల్లించలేదు.

అధికారులకు ఫిర్యాదుల వెల్లువ...

జిల్లా ఉన్నతాధికారులు అందరికీ ఈ దందాపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా సహ చట్టం ద్వారా వివరాలు కోరుతూ.. సామాజిక కార్యకర్తలు దరఖాస్తులను పెడుతున్నారు. తిరువూరు పరిధిలో 27 మంది ఆర్పీల్లో.. సగం మంది అక్రమాలకు పాల్పడిన ఆరోపణలున్నాయి. సీపీఎం పి.టి.కొత్తూరు కార్యదర్శి ఎం.తిరుపతిరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి పెరగనున్న రైళ్ల వేగం

విజయవాడ రైల్వే: విజయవాడ డివిజన్ పరిధిలో రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగం శనివారం నుంచి పెరగనుంది. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రైలు నంబరు 17479/17480 తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్, 17481 బిలాస్‌పూర్-తిరుపతి, 17259 విజయవాడ-నెల్లూరు, 17260 విజయవాడ-గూడూరు, 13433 బెంగళూరు-మాల్డాటౌన్, 12665 హౌరా-కన్యాకుమారి, 22817 హౌరా-మైసూర్, 13434 మాల్డాటౌన్-బెంగళూరు, 22807 సంత్రాగచి-చెన్నై, 22841 సంత్రాగచి-తాంబరం, 18567 విశాఖపట్నం-కొల్లాం, 22859 పూరి-చెన్నై, 13352 అల్లపూజ-ధన్‌బాద్, 18190,18189 ఎర్నాకులం-టాటా, 17267 కాకినాడటౌన్-విశాఖపట్నం, 17257 విజయవాడ-కాకినాడ టౌన్, 12842 చెన్నై-హౌరా, 17656 పాండిచ్చేరి-కాకినాడ టౌన్, 17209 బెంగళూరు-కాకినాడ.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



ముగ్గులకు రంగులు అద్దుతున్న విద్యార్థినులు



విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ ఏడుకొండలు, డైమండ్ నెస్ట్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్, కళాశాల అధ్యాపకులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పరిటాల సమీపంలోని ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనాడు-ఈఎఫ్ఎం 91.9 ఆధ్వర్యంలో శుక్రవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. కళాశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని తలపించింది. సంక్రాంతి నేపథ్యంలో వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. నేటి తరం విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగించేలా ఈనాడు - ఈఎఫ్ఎం ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ యు.ఏడుకొండలు అన్నారు. విద్యార్థినులు పి.అశ్విని - బి.స్నేహ (మొదటి), ఎన్.యోగీశ్వరి- ఎం.రోషిణిదత్ (ద్వితీయ), వి.సుశీల-సిహెచ్.ఛార్మి (తృతీయ) బహుమతులు సాధించారు. విజేతలకు డైమండ్ నెస్ట్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపల్ యు.ఏడుకొండలు బహుమతులు అందజేశారు. మిగిలిన విద్యార్థినులకు ప్రియా ఓచర్లను బహుమతిగా అందజేశారు. కార్యక్రమానికి ప్రధాన స్పాన్సర్‌గా డైమండ్ నెస్ట్, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించాయి.

91.9 FM VIJAYAWADA

23 నుంచి శిర్డీలో అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య మహాసభలు



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్, రమణ, జగదీశ్వరరావు, భారతీప్రసాద్, జానకి, శివప్రసాద్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని శిర్డీలో ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఎన్జీవో హోంలో శుక్రవారం కార్యక్రమ గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 60 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సమాఖ్య దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 80 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు నేతృత్వం వహిస్తోందని తెలిపారు. జాతీయ కౌన్సిల్ సమావేశాలకు అన్ని రాష్ట్రాల నుంచి దాదాపు 1,200 మంది ప్రతినిధులు హాజరవుతారని, వివిధ దేశాల నుంచి కూడా ఆత్మీయ అతిథులు కూడా రానున్నారని చెప్పారు. మహాసభల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సీపీఎస్ అంశం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వివిధ రాష్ట్రాల్లో ఉన్న వేతన సవరణ సమస్యలు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లు, అంతర్జాతీయంగా జరుగుతున్న వివిధ పరిణామాలపై చర్చించి పలు తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగినులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక రోజంతా చర్చ ఉంటుందని తెలిపారు. ఈనెల 26న అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గానికి ఎన్నికలు కూడా జరుగుతాయని, ఇందులో జాతీయ ఉపాధ్యక్షుడిగా తిరిగి పోటీచేస్తున్నట్లు విద్యాసాగర్ వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ, రాజ్యలక్ష్మి, జగదీశ్వరరావు, భారతీప్రసాద్, జానకి, శివప్రసాద్, సుబ్బారెడ్డి, నాగభూషణం, సరస్వతి, డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, సీవీఆర్ ప్రసాద్, ఎస్కే నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న ఏపీ ఐకాస అమరావతి రాష్ట్ర మహాసభ



ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న బొప్పరాజు, దామోదరరావు, శివకుమారిరెడ్డి, విజయలక్ష్మి, శాస్త్రి, ఫణి పేర్రాజు తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ ఐకాస అమరావతి (ఉద్యోగ సంఘాల) నాలుగో రాష్ట్ర మహాసభను ఫిబ్రవరి 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఐకాస ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఐకాస రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నగరంలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. మహాసభ ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ సభ్యులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌యాదవ్‌లను మహాసభలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఉద్యోగులు పెద్ద ఎత్తున మహాసభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. మహాసభలో ఉద్యోగుల బకాయిలు, పీఆర్సీ, ఐఆర్ తదితరాలపై చర్చిస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఐకాస సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ.. 2017 ఫిబ్రవరి 5న 17 ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాల కలయికతో ఏర్పడిన ఐకాస నేడు 96 శాఖలతో విస్తరించినట్లు తెలిపారు. ఏపీ ఐకాస మహిళా విభాగ కమిటీ ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ సైకం శివకుమారిరెడ్డి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, ఐకాస రాష్ట్ర నాయకులు ఫణిపేర్రాజు, బి.సురేష్‌కుమార్, పి.ఎస్.ఎస్.ఎన్.శాస్త్రి, ఎస్.మల్లేశ్వరరావు, టి.జయప్రకాశ్, డి.జి.ప్రసాద్, ఎ.అర్లయ్య, బి.శ్రీనివాసరావు, సుమన్, గరికపాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి భాజపా కృషి



అర్జీలు స్వీకరిస్తున్న రాజ్యసభ సభ్యుడు వెంకట సత్యనారాయణ

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి భాజపా చర్యలు చేపడుతుందని రాజ్యసభ ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో జనతా వారధి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య భాజపా వారధిగా పని చేస్తుందన్నారు. ఏపీ భాజపా తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి శుక్రవారం వారధి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వీబీ-జీ రామ్‌జీ పథకంపై వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు విష ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఈ పథకాన్ని స్వాగతిస్తే వామపక్షాలు, కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. పశ్చిమ బంగాల్‌లో ఈడీ అధికారులను అడ్డుకునే ప్రయత్నం సీఎం మమతాబెనర్జీ చేయడం తగదన్నారు. ప్రజాస్వామ్యాన్ని సీఎం మమతా బెనర్జీ ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, లక్ష్మీప్రసన్న, ఆదిలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసిన పాలతో శ్రీచక్రానికి అభిషేకం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడిలో గడువు ముగిసిన పాలు విరిగిపోవడంతో శుక్రవారం శ్రీచక్ర నవావరణార్చన సేవలో ఉభయదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీచక్ర నవావరణార్చన సేవకు విశిష్టత ఉంది. శంకరాచార్యులు స్వయంగా ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఇక్కడ నిత్యం పూజ చేశారు. ఆర్జిత సేవ కావడంతో ఉభయదాతలు రూ.1000 టికెట్ రుసుము చెల్లించి పూజలో పాల్గొంటారు. శ్రీచక్రంపైన ఉన్న తొమ్మిది ఆవరణలను ఆవు పాలు(టెట్రా)తో పూజ చేయడానికి వినియోగిస్తారు. శ్రీచక్రంపైన వాటిని పోయగానే నీళ్లు, పాలుగా విడిపోవడంతో అక్కడ ఉన్న భక్తులు ముక్కున వేలేసుకున్నారు. టెట్రా ప్యాకెట్లను సిబ్బంది గమనించడం లేదని సమాచారం.

★ ఈ విషయంపై ఏఈవో వెంకటరెడ్డిని సంప్రదించగా పాలు విరిగిపోవడంపై సంబంధిత గుత్తేదారుతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్యాకెట్లు లీకైనప్పుడు ఈ విధంగా జరిగే అవకాశం ఉందన్నారు. ఇటువంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యాయమిత్ర స్టైఫండ్ విడుదల చేయాలి



ప్రదర్శనగా బయలుదేరిన న్యాయవాదులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: జూనియర్ న్యాయవాదులకు ఇవ్వాల్సిన న్యాయమిత్ర స్టైఫండ్ రూ.10 వేలను తక్షణం విడుదల చేయాలని బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఏపీ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని కోరారు. ఏపీ బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు శుక్రవారం బీబీఏ న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాష మాట్లాడుతూ రాష్ట్ర న్యాయవాద సంఘం పిలుపుమేరకు విధులను బహిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, భాజపా లీగల్‌సెల్ అధ్యక్షుడు ఉప్పలపాటి శ్రీనివాసరాజు, అరిగెల శివరామ్‌ప్రసాద్, పిల్లా శ్రీనివాస్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను ప్రగతిపథాన నడుపుదాం



ఏపీ ఎన్జీవో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పారదర్శక పాలనలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ప్రగతిలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకెళుతోందని, ఈ లక్ష్యాల సాధనలో ఉద్యోగులు కీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ..నవ్య రాజధాని అమరావతికి గేట్‌వేగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాలో ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సంఘం జిల్లా సహాధ్యక్షుడు వేమూరి ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి వి.సతీశ్‌కుమార్, నాయకులు జి.రామకృష్ణ, వి.నాగార్జున, కె.శివలీల, శ్రీదేవి పాల్గొన్నారు.

జగన్మాత సేవలో విదేశీ బృందం



ఆశీర్వచన మండపంలో పోలాండ్ వాసులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను పోలాండ్ దేశం నుంచి వచ్చిన బృందం శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మంగళగిరి రాజు వారికి అమ్మవారి విశిష్టత తెలియజేశారు. ఆశీర్వచన మండపంలో వారికి వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం వారికి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. రాష్ట్ర పర్యటన నిమిత్తం వచ్చి అమ్మవారిని దర్శించుకున్నామని బృంద సభ్యులు తెలిపారు. హిందూ సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఆసక్తి కనబరిచారు.

అమ్మవారిని దర్శించుకున్న సచ్చిదానందస్వామి



స్వామిని ఆహ్వానిస్తున్న ఈవో, ఛైర్మన్

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను విజయవాడ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి శిష్య బృందంతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఆలయ అర్చకులు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

సుదర్శన్ మధ్యంతర బెయిల్ ఉత్తర్వులు వాయిదా

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడు సుదర్శన్ (ఏ 21) దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా పడింది. తన భార్య గర్భిణి అని, ఆమెకు దగ్గర ఉండాల్సిన అవసరం ఉందని.. మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని నిందితుడి పిటిషన్‌పై శుక్రవారం ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. సుదర్శన్ పోలీసు కస్టడీకి ఇచ్చినందున తీర్పును ఈనెల 16కి వాయిదా పడింది.

అందుబాటులో యూరియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ పంటలకు రాబోయే ఆరు రోజులకు 1,364 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 3,390 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయకుమారి తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.

'రాజధాని అమరావతిపై విషం కక్కుతున్న జగన్'



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: పులివెందుల ఎమ్మెల్యే జగన్, అతని సొంత పత్రిక, రాజధాని అమరావతిపై విషం కక్కుతున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. జగన్, అతని సొంత పత్రిక చెప్పేవన్నీ అబద్ధాలని, ఆ మాటలు ప్రజలు నమ్మరని తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... రాజధాని విజయవాడ, గుంటూరు మధ్యలో కట్టాలని జగన్ చెబుతున్నారని, ప్రస్తుత రాజధాని ఆ రెండు నగరాలకు సమీపంలో ఉందన్న విషయం అతనికి తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలు ఎప్పుడూ బాధపడాలనే జగన్ కోరుకుంటారన్నారు. మంగళగిరి, విజయవాడ, గుంటూరు కలిపి మహా నగరాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో రూ.925 కోట్లు తన సొంత మనుషులకు కట్టబెట్టారని ఆరోపించారు. జగన్ హయాంలోనే ఆ పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చరిత్రలో అత్యంత హీనమైన ఓటమి జగన్‌దే అని, వైకాపా చరిత్ర ముగిసిపోయిందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చంద్రబాబు ఏపీలో విద్యుత్తు ఛార్జీలు తగ్గించారని తెలిపారు.

పీపీపీకి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి




మాట్లాడుతున్న రామకృష్ణ, వేదికపై రుద్రరాజు, ఈశ్వరయ్య, లక్ష్మణరెడ్డి, తులసిరెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, బాబూరావు తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయడానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలంతా పార్టీలకతీతంగా ఉద్యమించాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నాచౌక్‌లో సామూహిక దీక్షా శిబిరం నిర్వహించారు. శిబిరంలో మాజీ మంత్రి పేర్ని నాని, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యలు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ విధానానికి వ్యతిరేకంగా వంద మంది మేధావుల సంతకాలు సేకరించి రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆలా వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దేవీప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, మస్తాన్‌వలీ, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వసుంధర, గిడుగు రుద్రరాజు, జి.కోటేశ్వరరావు, సి.హెచ్.బాబూరావు, కె.ఎం.ఎ.సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

12న జిల్లా స్థాయి సంప్రదాయ క్రీడా పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు తెలిపారు. స్త్రీ, పురుషులకు కర్రసాము, తాడు లాగుడు (టగ్ ఆఫ్ వార్), మహిళలకు తాడాట (స్కిప్పింగ్), తొక్కుడు బిళ్ల, పురుషులకు ఏడు పెంకులాట, గాలి పటాల ఎగురవేయడంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్కిప్పింగ్ రోప్స్, గాలిపటాలను పోటీదారులు సమకూర్చుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు స్టేడియంలో హాజరుకావాలని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో ఍కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -152 రిటైల్ ధర 179 చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

కొండపల్లి బొమ్మల కళాకారుల కృషి అభినందనీయం



గొబ్బెమ్మల పాటకు నృత్యం చేస్తున్న అంబాసిడర్ డెల్ఫిన్, కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

కొండపల్లి, న్యూస్‌టుడే: శతాబ్దాలుగా ఉన్న హస్త కళా నైపుణ్యాన్ని కాపాడుకుంటూ భావితరాలకు కొండపల్లి బొమ్మను అందించాలని కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని యూరోపియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్ అన్నారు. కొండపల్లి కళాకారుల వీధిలోని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను శుక్రవారం ఆయన జిల్లా అధికారులతో కలసి సందర్శించారు. అక్కడి బొమ్మల తయారీ విధానాన్ని, రంగులు అద్దే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. సాధారణ చెక్కతో జీవం ఉట్టిపడే బొమ్మలను తయారు చేయడం ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. కొంత సమయం కళాకారులతో గడిపి బొమ్మల తయారీని తిలకించారు. బొమ్మలను దుకాణాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా సంక్రాంతి రంగవల్లుల వద్ద మహిళలు చేసిన నృత్యం తిలకించి.. వారితో పాటు నృత్యం చేశారు. కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, పర్యాటక అధికారులు సైతం కాసేపు నృత్యం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, బొమ్మల కళాకారులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై కేక్ కటింగ్‌ను అడ్డుకున్న పోలీసులు



పోలీసుల రాకతో కేకును క్యారీ బ్యాగ్‌లో పెట్టిన దుకాణం నిర్వాహకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొందరు దుకాణదారులు, సెక్యూరిటీ సిబ్బంది బాధ్యతా రహితంగా కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మల్లికార్జున మహా మండపంలో దేవస్థానంలో దుకాణాలు నిర్వహించే నిర్వాహకుల పుట్టిన రోజు పురస్కరించుకొని శుక్రవారం కేక్ ఆర్డర్ ఇచ్చి అంతా సిద్ధం చేశారు. ఈ సమాచారం విలేకరులకు తెలియడంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి కేక్ కట్టింగ్ కార్యక్రమం నిలిపి వేయించారు. పుట్టిన రోజు వేడుకలు మల్లికార్జున మహా మండపంలో నిర్వహించడం పట్ల దుర్గమ్మ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేక్‌లు ఆలయ ప్రాంగణంలోకి వచ్చేంత వరకు సెక్యూరిటీ, పోలీసులు గమనించకపోవడం గమనార్హం.

బాలికపై అఘాయిత్యం.. నిందితుడికి 20 ఏళ్ల జైలు

భవానీపురం, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి... భవానీపురంలో బాలిక కుటుంబ సభ్యులతో కలిసి ఉంటూ ఆరో తరగతి చదువుతుంది. 2024 ఆగస్టు 14న బాలిక ఇంట్లో నీరసంగా ఉండడంతో కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుడికి చూపించారు. బాలికను లైంగికంగా వేధించినట్లు వైద్యుడు తెలిపారు. కుటుంబ సభ్యులు ప్రశ్నించగా.. ఇంటి సమీపంలో నివాసం ఉండే చింతాడ దుర్గారావు(58) అసభ్యంగా ప్రవర్తించి, అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఆగస్టు 15న తెలపగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించి దుర్గారావును పోలీసులు అరెస్టు చేశారు. 12 మంది సాక్షులను విచారించి ఆధారాలు కోర్టుకు సమర్పించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.4 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గద్దం రాజేశ్వరరావు, వి.కృష్ణవేణి, మహిళా పోలీసుస్టేషన్ ఏసీపీ దైవప్రసాద్, ప్రస్తుత నార్త్ ఏసీపీ కె.స్రవంతి రాయ్, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు పర్యవేక్షణలో విచారణ సాగింది.

తిరుమలలో దర్శనాల పేరిట మోసం
మాజీ ఎంపీ పేరు చెప్పి నగదు వసూలు

పటమట, న్యూస్‌టుడే: తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం చేయిస్తామంటూ అమాయకులను నమ్మించి, వేలాది రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఘటన తాజాగా విజయవాడలో వెలుగులోకి వచ్చింది. రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ పేరు చెబుతూ తిరుమల దర్శనం చేయిస్తానంటూ శివాజీ జోషి అనే వ్యక్తి కొంతమందిని నమ్మబలికాడు. వారు విడతల వారీగా శివాజీ పంపించిన వివిధ నంబర్లకు ఆన్‌లైన్‌లో రూ. 40 వేల వరకు బదిలీ చేశారు. అనంతరం అతను ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు విషయాన్ని కనకమేడల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించారు. తన పేరును దుర్వినియోగం చేస్తూ... మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తన వ్యక్తిగత సహాయకుడు డీవీడీ ప్రసాద్ ద్వారా శుక్రవారం పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తిరుపతి దర్శనాల పేరుతో మధ్యవర్తులను నమ్మవద్దని, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి డబ్బులు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పటమట సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

11న అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ ఎన్ఆర్ఐ ప్రాపర్టీ ఎక్స్‌పో

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని ప్రముఖ స్థిరాస్తి సంస్థ అయిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ ఈ నెల 11న (ఆదివారం) విజయవాడ ఎంజీ రోడ్డులోని లెమన్ ట్రీ హోటల్‌లో ఉదయం 9.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఎన్ఆర్ఐ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతికి నగరానికి ఎన్ఆర్ఐలు రానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో అత్యంత ఆకర్షణీయమైన, వారు కోరుకునే ఆధునిక హంగులతో 123 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లో హైరేంజ్ అపార్టుమెంట్లు, ప్రీమియం బంగ్లాలు ఉన్నాయని తెలియజేశారు. ఇందులో హైస్ట్రీట్ రిటైల్ జోన్, షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్ సౌకర్యాలు ఉంటాయని వివరించారు.

అధిక ఛార్జీలు వసూలు చేస్తే కేసులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ప్రయాణికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని, వాహనాల్లో తప్పనిసరిగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని సంయుక్త రవాణా కమిషనర్ ఎ.మోహన్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు, ప్రతినిధుల సమావేశం జరిగింది. సంక్రాంతి పండగను ఆసరాగా చేసుకుని కొంత మంది ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా అధిక ఛార్జీలు వసూలు చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల పూర్తి వివరాలు, వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహన యజమానులు, డ్రైవర్ల నుంచి ఎలాంటి ఇబ్బంది కలిగినా 9281607001 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని జేటీసీ మోహన్ ప్రయాణికులకు సూచించారు.

ఉపాధి హామీ చట్టాన్ని మార్చాల్సిన అవసరం ఏమిటి: సీపీఎం

రాఘవయ్యపార్క్, కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కేంద్రం బీజీ జీరామ్‌జీ పథకాన్ని తేవడాన్ని నిరసిస్తూ 'ఇంటింటికీ ఉపాధి' పేరుతో సీపీఎం ఈనెల 18 నుంచి 21 వరకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వెల్లడించారు. బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పని దినాల పెంపు పేరుతో గతంలో ఉన్న చట్టాన్ని మార్చినట్లు చెబుతున్నారని, దీనికి చట్టాన్ని మార్చాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. దీనిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేయాలని సీపీఎం నిర్ణయించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రం అందించడంతోపాటు అవగాహన కల్పించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే రాజధాని అనే విషయంలో ఎలాంటి సందేహం లేదని, దానిని వివాదం చేయడానికి తాము అంగీకరించబోమని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బాబూరావు మాట్లాడుతూ విశాఖ ఎకనమిక్ రీజియన్ పేరుతో ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లోని భూములను ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తోందని విమర్శించారు.

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

అమరావతిపై జగన్ అబద్ధాల ప్రచారం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి అభివృద్ధిని చూడలేక మాజీ సీఎం జగన్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి శుక్రవారం ఆరోపించారు. ఆయన ఎన్ని కుట్రలుచేసినా అమరావతి అభివృద్ధిని ఆపలేరన్నారు. కేసులు వేయించి అభివృద్ధిని అడ్డుకోవాలని చూడటం ఆయన సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమన్నారు.

ముగ్గుల పోటీలు రేపు

జగ్గయ్యపేట గ్రామీణం: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఈ నెల 11న కాకతీయ కమ్మసేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పోటీలు నిర్వహిస్తున్నామని, మొదటి బహుమతి రూ.5,116, రెండో బహుమతి రూ.3,116 మూడో బహుమతి రూ.2,116 అందిస్తున్నట్లు తెలిపారు.

అందంగా బాలరాముడు



జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పెద్దరామాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బాలరాముణ్ని అందంగా అలంకరించారు. దీపోత్సవంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

108 సంఘ ప్రధాన కార్యదర్శి యుగంధర్

నందిగామ, న్యూస్‌టుడే: టీఎన్‌టీయూసీ 108 ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శిగా నందిగామ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన జిల్లేపల్లి యుగంధర్ ఎన్నికయ్యారు. మంగళగిరిలోని తెదేపా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర టీఎన్‌టీయూసీ సంఘ గొట్టెముక్కల రఘురాంరాజు ఆధ్వర్యంలో సంఘ రాష్ట్ర సమావేశం జరిగింది. మంత్రి ఆనం రామానారాయణరెడ్డి యుగంధర్‌ను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందన: ★ తాటిగుమ్మి గ్రామ శివారులో పేడ దిబ్బలు, చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు ఈనాడు 'మేమున్నాం..మీకు తోడుగా..'కు తెలిపారు. ఈ విషయాన్ని కార్యదర్శి రత్నాకర్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఆయన పొక్లెయిన్ సాయంతో చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. ★ జుజ్జూరు బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికుడు వెంకట్రావు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా కార్యదర్శి మీర్జావలికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వీధి దీపాలకు మరమ్మతులు చేయించాడు. ★ అల్లూరు శివారులో 11కేవీ విద్యుత్తు తీగలకు చెట్లు తగులుతున్నాయని గ్రామస్థులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా ఇన్‌ఛార్జి ఏఈ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సిబ్బందిని పంపి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

డిజిటలైజేషన్‌తోనే రెవెన్యూ దస్త్రాలకు భద్రత

నందిగామ, పెనుగంచిప్రోలు (న్యూస్‌టుడే)

తహసీల్దారు కార్యాలయాల్లో రెవెన్యూ రికార్డుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. కంచికచర్ల తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రికార్డులకు సరైన రక్షణ లేక దగ్ధమయ్యాయి. కార్యాలయంలో కొన్ని సీసీ కెమెరాలు పని చేయట్లేదు. ప్రమాదానికి కారణాలు తెలుసుకునేందుకు పక్కనున్న కేడీసీసీ బ్యాంకు కెమెరాల ఫుటేజీపై ఆధారపడాల్సిన పరిస్థితి. రికార్డులు ఉన్న కార్యాలయ గదులు పక్కనే చెత్తాచెదారం ఉంది. ఈ చెత్తకు నిప్పంటుకుంటే కార్యాలయం అగ్నిప్రమాదానికి గురవడం ఖాయం. ఈ నేపథ్యంలో రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్‌తోనే సరైన భద్రత లభిస్తుందని అర్థమవుతోంది.



కంచికచర్ల తహసీల్దారు కార్యాలయంలో దస్త్రాలు

నందిగామ రెవెన్యూ డివిజన్‌లో ఎక్కువ తహసీల్దారు కార్యాలయాలు బ్రిటిష్ కాలం నాటి భవంతుల్లోనే ఉన్నాయి. నందిగామ, జగ్గయ్యపేట కంచికచర్ల కార్యాలయాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కనీసం రికార్డు గదులకు కిటికీలు, తలుపులు సక్రమంగా లేవు. విద్యుత్తు వైర్లు, బోర్డులు బాగా లేవు. ఈ కార్యాలయాల్లో భూములకు సంబంధించిన ఆర్.ఎస్.ఆర్., ఎఫ్ ఎమ్‌బీ , పాత అడంగళ్లు, అసైన్‌మెంట్, ఇనాం, గృహాల స్థలాలతోపాటు ఇతర రికార్డులు ఉంటున్నా వీటి భద్రత గురించి ఎవరూ పట్టించుకోవట్లేదు. కొన్ని భూముల రికార్డులను కొందరు సిబ్బంది తమకు అవసరమైన వాటిని సరిచేసుకుంటున్నారు. వీటిల్లో ఆర్ఎస్ఆర్, పాత అడంగళ్లు, అసైన్‌మెంట్ భూములు రికార్డులు చాలా ముఖ్యమైనవి. ఈమేరకు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు రెవెన్యూ రికార్డులు అన్ని డిజిటలైజేషన్ చేయాలని ఆదేశించారు. ఇంకా ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు. అప్పటివరకు రికార్డులున్న గదుల భద్రతను పర్యవేక్షించాల్సి ఉంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

★ విద్యుత్తు షార్టు సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు జరగకుండా పాత వైర్లు తొలగించాలి. ★ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పూర్తిగా పని చేసేలా చూడాలి. ★ అగ్నిప్రమాదాల నివారణ పరికరాలు అందుబాటులో ఉంచాలి. ★ సాయంత్రం ఐదు గంటల లోపే సిబ్బంది ఆయా రికార్డుల గదుల్లోకి వెళ్లేలా చూడాలి. ★ గదులకు తలుపులు, కిటీకల తలుపులు బాగుండేలా చూడాలి ★ పరిసర ప్రాంతాల్లో చెత్త, చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలి.

రికార్డులను భద్రపరుస్తాం

తహసీల్దారు కార్యాలయాల్లో రికార్డులన్నీ సీఎం ఆదేశాలు మేరకు డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభిస్తాం. కార్యాలయాల్లో రికార్డులకు తగిన భద్రత ఏర్పాట్లు చేస్తాం. కంచికచర్ల కార్యాలయంలో విలువైన రికార్డులన్నీ భద్రంగా ఉన్నాయి. **-బాలకృష్ణ, ఆర్డీవో**

పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీలకు నిధులు కావాలని కోరిన వెంటనే స్పందించి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన జనసేన నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. త్వరలోనే జనసేన సభ్యత్వాలు ప్రారంభిస్తామని తెలిపారు. తిరువూరు ఇన్‌ఛార్జి మనుబోలు శ్రీనివాసరావు, గాదెవారిగూడెం సర్పంచి శ్రీనివాసరావు బాల్యానాయక్, కనగాల శ్రీనివాసరావు, రామారావు, కోటేశ్వరరావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం


నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ, అనాసాగరం, తొర్రగుడిపాడు విద్యుత్తు ఉప కేంద్రాల్లో మరమ్మతులు చేసేందుకు శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ స్టాలిన్‌కుమార్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంటు సరఫరా ఉండదన్నారు.

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, నవాబుపేట గ్రామాల్లోని విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటకృష్ణ తెలిపారు.

కంచికచర్ల: పరిటాల విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరిటాల, పరిటాల క్వారీ ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ దిబ్బయ్య తెలిపారు.

జగ్గయ్యపేట గ్రామీణం: మిట్టగూడెం, నాగమయ్యబజార్, మంగలిబజార్, బ్రాహ్మణబజార్, విశ్వబ్రాహ్మణబజార్, అద్దాలబజార్, ముక్త్యాలరోడ్డు, చాకలిబజార్, రంగస్వామిబజార్, విలియంపేట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జగ్గయ్యపేట ఏఈఈ వి.ప్రమీల తెలిపారు.

మున్నేరు నీటి సరఫరాకు హామీ



తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో మాట్లాడుతున్న బాలాజీ

పెనుగంచిప్రోలు: పోలంపల్లి వద్ద మున్నేరు ఆనకట్ట నుంచి ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూస్తానని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. శుక్రవారం మధిరలో డిప్యూటీ సీఎం విక్రమార్కను మున్నేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పొన్నం బాలాజీ కలిసి సమస్య వివరించారు.

న్యాయవాదుల నిరసన

జగ్గయ్యపేట గ్రామీణం, నందిగామ:, న్యూస్‌టుడే: జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర స్టైపెండ్ అందజేయాలని, న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణం అమలు చేయాలని, వారి హక్కులకు భంగం కలిగించే హైకోర్టు సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరరావు, న్యాయవాదులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గోపినాథ్, నరసింహారావు, ఆంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నందిగామలో జరిగిన నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబువిద్యాసాగర్, ప్రధానకార్యదర్శి అద్దంకి మణిబాబు, న్యాయవాదులు జీవరత్నం, శ్రీరామూర్తి, రమేష్, వజ్రయ్య, దాదాహుస్సేన్, సాంబశివరావు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



నందిగామలో కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

హాకీలో మెరిసిన విద్యార్థిని

గని ఆత్కూరు(కంచికచర్ల), న్యూస్‌టుడే: ఈ నెల 2 నుంచి 7 వరకూ గ్వాలియర్‌లో నిర్వహించిన అండర్-14 హాకీ అంతర్రాష్ట్ర టోర్నమెంట్‌లో తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎస్‌కె.అఫ్రీన్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు గని ఆత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ తెలిపారు. విద్యార్థిని అఫ్రీన్‌ను పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఓంకార్, ఫిజికల్ డైరెక్టర్ మోహనలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.



అఫ్రీన్

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

జగ్గయ్యపేట గ్రామీణం: వత్సవాయి మండలం డబ్బాకుపల్లి గ్రామంలో తెదేపా వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించి నివాళులు అర్పించారు. విగ్రహదాత మునగాల సుబ్బయ్య, వారి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నబాబు, రామలక్ష్మి, లక్ష్మణరావు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో తాతయ్య, శ్రీరామ్, రఘురాం

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



శ్రీవిద్య పాఠశాలలో కోలాటం ప్రదర్శిస్తున్న బాలికలు



చందాపురంలో గాలిపటాలను ఎగురవేస్తున్న విద్యార్థులు



నందిగామ నెహ్రూనగర్‌లో చిన్నారులకు భోగి పండ్లు..



రామన్నపేట పాఠశాలలో భోగి మంట వేసి నృత్యం చేస్తూ..



దూలాస్ పాఠశాల విద్యార్థుల నృత్యప్రదర్శన



రోటిలో పిండి దంచుతున్న ఎమ్మెల్యే సౌమ్య, కృష్ణకుమారి



విశ్వవాణి విద్యాలయంలో భోగి మంటల వద్ద నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. పల్లెసంస్కృతిని కళ్లకు కట్టేలా వేడుకలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వేడుకలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. కోలాటం, బొమ్మలకొలువు, కోడిపందేలు, వంటలు తయారీ, గాలిపటాలను ఎగురవేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భోగిపళ్లు పోయడం, మంటలు వేయడం నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు. **న్యూస్‌టుడే యంత్రాంగం**



జగ్గయ్యపేట బాలికోన్నత పాఠశాలలో..

కోడి పందేలు చట్టరీత్యా నేరం

జగ్గయ్యపేట గ్రామీణం, పెనుగంచిప్రోలు, నందిగామ, వీరులపాడు, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పరిధిలో కోడి పందేలు నిర్వహించవద్దంటూ మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణారావు, తహసీల్దార్ మనోహర్ శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బరులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెనుగంచిప్రోలులో తహసీల్దారు కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు శాంతలక్ష్మి, ఎంపీడీవో శ్రీను, సర్పంచి పద్మకుమారి పాల్గొన్నారు.
నందిగామలో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. ఎస్సై సూర్యవంశీ పాల్గొన్నారు. వీరులపాడులో పోలీసులు బరులు నిర్వహిస్తున్న, అందుకు సహకరిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అప్రమత్తత అవసరం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం రాత్రి చెర్వు కొమ్ముపాలెం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సంక్రాంతికి కోడిపందేలు నిర్వహించవద్దని చెప్పారు. నందిగామ సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీ, ఉపసర్పంచి సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు విష్ణు పాల్గొన్నారు.

కాటిల్ అండర్ పాస్ ఏర్పాటుకు హామీ

కంచికచర్ల: నక్కలంపేట సమీపంలోని నక్కలవాగు వద్ద బైపాస్‌కు అండర్ పాస్ ఏర్పాటు చేయాలని స్థానికులు చేసిన విజ్ఞప్తి మేరకు హైవే అధికారులు శుక్రవారం బైపాస్‌ను పరిశీలించారు. నక్కలవాగు ప్రాంతంలో కాటిల్ అండర్ పాస్ ఏర్పాటుకు అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. అమరావతి ప్రాజెక్టు డైరెక్టర్(ఎన్‌హెచ్ఏఐ) పార్వతీశం, రైతులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన యలమంచలి వెంకటరామప్రతాప్, ప్రియాంక దంపతులు తమ కుమార్తె బ్రాహ్మణి పేరుతో రూ.10,116 విరాళం అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్‌కు అందజేశారు.

బాలుడి వైద్యానికి సాయం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన కండక్టర్ బొడ్డు పరమేశ్వరరావు కుమారుడు దీపక్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆర్టీసీ డిపోకు చెందిన సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ చిలకా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రైవర్లు రూ.20 వేలు అందజేశారు.

పాఠశాలకు ఎన్ఆర్ఐ వితరణ

కంచికచర్ల: మోగులూరు జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ కొండపనేని శ్రీనివాసరావు అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం ప్రకటించారు. విద్యార్థులకు టూత్ పేస్టు, బ్రష్‌లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద అధికారుల పరిశీలన

కంచికచర్ల, న్యూస్‌టుడే: 'పంట కొనరు.. గోడు వినరు' శీర్షికన పెసర రైతుల దుస్థితిపై ఈ నెల 9న ఈనాడు ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెసల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. నిబంధనలతో సంబంధం లేకుండా పెసలు కొనుగోలు చేయాలని రైతులు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఏపీ మార్క్‌ఫెడ్ జీఎం(ప్రొక్యూర్‌మెంట్) లక్ష్మణ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ కిషోర్, జిల్లా మేనేజర్ నాగమల్లిక, మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి పెసలను పరిశీలిస్తున్న అధికారులు

మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నందిగామ గ్రామీణం, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: నల్లతామర పురుగుతో నష్టపోయిన మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ. ప్రసాద్ డిమాండు చేశారు. శుక్రవారం రామిరెడ్డిపల్లి గ్రామం, పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల గ్రామంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమందరావు, కార్యదర్శి చుండూరు వెంకటసుబ్బారావుతో కలిసి నల్లతామర పురుగు ఆశించిన మిరప తోటలను పరిశీలించారు. రైతులు ఎకరానికి రూ.1.30 లక్షలు పెట్టుబడి, రూ.25 వేలు కౌలు చెల్లించారన్నారు. మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేనందున పెట్టుబడి ఖర్చులురావని చెప్పారు. ఎకరాకు రూ.75 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. రైతులు అబ్బూరి చౌదరిబాబు, ఆలపాటి శ్రీనివాసరావు, దర్శనాల బాలయ్య, నాగమల్లేశ్వరరావు, కొండానాయక్, అబ్బూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.శుక్రవారం పైరును ఏపీ రైతు సంఘం ప్రధానకార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ పరిశీలించారు. అధిక వర్షాలు, వైరస్ తెగుళ్ల వల్ల పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులకు ఎకరానికి రూ.75 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు.



తోటను పరిశీలిస్తున్న కేవీవీ ప్రసాద్, జమలయ్య, యలమందరావు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని చేగు విద్యాలయం 32వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు. చిన్నారులు వేసిన నృత్యాలు అలరించాయి.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, స్టేజ్ మీద ప్రముఖులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం చింతకాని మండలం బసవాపురం గ్రామానికి చెందిన మంచాల వెంకటేశ్వర్లు(58) మృతి చెందారు. ఆదే వాహనంపై ఉన్న సాయికుమార్, పర్మిళ అనే చిన్నపాపకు స్వల్ప గాయాలయ్యాయి. వీరు ద్విచక్ర వాహనంపై చందర్లపాడు మండలం బ్రహ్మబొట్లపాలెం గ్రామం వెళ్లి వస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందారు.

ఒకరి ఆత్మహత్య

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బూదవాడ గ్రామానికి చెందిన పటాపంచుల మహాలక్ష్మయ్య(58) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మహాలక్ష్మయ్య పురుగుమందు తాగి గ్రామంలో ఉన్న పాలేరు వద్ద గుంటలో పడి మృతిచెందాడు. స్థానికులు శుక్రవారం మృతదేహాన్ని గుర్తించి చిల్లకల్లు పోలీసులకు సమాచారం అందించారు.

నందిగామ అభివృద్ధికి భారీగా నిధులు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వ విప్ సౌమ్య తెలిపారు. స్థానిక ఐదో వార్డులో సీఆర్డీఏ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.27.76 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రెయిన్, అశోక్‌నగర్‌లో సీఆర్డీఏ నిధులు రూ.14.59 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆమె శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఏఐబీ నుంచి రూ.110 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, వార్డు కౌన్సిలర్లు రత్నకుమారి, రాము, అమరయ్య, ం ప్రవీణ, రామకృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న విప్ సౌమ్య

అమ్మవారికి ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు నుంచి రంగుల మహోత్సవానికి శ్రీగోపయ్యసమేతశ్రీలక్ష్మీతిరుపతమ్మ పరివార దేవతలు జగ్గయ్యపేట విచ్చేశారు. అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి వివిధ పూలతో అందంగా అలంకరించారు. అమ్మవారిని వందల సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వివిధ పూలతో అలంకరించిన శ్రీగోపయ్యసమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారు

పాఠశాల బస్సులను బాధ్యతతో నడపాలి

నందిగామ, న్యూస్‌టుడే: విద్యార్థులను తీసుకెళ్లే పాఠశాలల బస్సులు నడిపేటప్పుడు డ్రైవర్లు క్రమశిక్షణతో, బాధ్యతతో ఉండాలని స్థానిక ఆర్టీవో పద్మావతి తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాంతీయ రవాణా శాఖా కార్యాలయం వద్ద శుక్రవారం స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. బస్సుల్లో తప్పనిసరిగా ప్రథమ చికిత్స కిట్టు ఉండాలని చెప్పారు. ఎమ్‌వీఐ ఎం.పూర్ణిమ మాట్లాడుతూ స్కూలు బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకూడదని, కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్నవారే డ్రైవింగ్ చేయాలని కోరారు. విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. కార్యాలయ ఏవో ప్రభాకరలింగం, శ్రీరామ డ్రైవింగ్ స్కూలు అధ్యక్షుడు రామారావు, స్కూళ్ల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

గొప్ప లక్ష్యంతో ఎదగాలి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నప్పటినుంచి గొప్ప లక్ష్యం ఏర్పరచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని స్థానిక అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.వందన అభిలషించారు. శుక్రవారం సాయంత్రం నందిగామ గౌతమ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో 'డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొడదాం' అనే నినాదంతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో ముందుకెళ్లాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మహిళా ఎస్సై మహతి, పాఠశాల ఛైర్మన్ రవీంద్రరాజు, కరస్పాండెంట్ సాయిఅఖిల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబూవిద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, గ్రంథపాలకుడు షేక్ ఆజాద్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి వందన, పక్కన ఎస్సై మహతి

ఉత్తమ అధ్యాపక ప్రదర్శన పురస్కారం అందజేత

కంచికచర్ల, న్యూస్‌టుడే: 2025(జూలై - డిసెంబరు) ఎన్‌పీటీఈఎల్ సెషన్‌లో తమ కళాశాల అధ్యాపకులు ప్రదర్శించిన విశేష ప్రతిభకు ఉత్తమ అధ్యాపక ప్రదర్శన అవార్డు లభించిందని మిక్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.టి.వంశీ కిరణ్ తెలిపారు. ఈ సెషన్‌లో తమ కళాశాల అధ్యాపకులు ఎన్‌పీటీఈఎల్ కోర్సులలో చురుగ్గా పాల్గొని, ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు.



అధ్యాపకులతో మిక్ కళాశాల ప్రిన్సిపల్ వంశీ కిరణ్


పున్నమిఘాట్‌లో స్టాళ్ల వద్ద జనం సందడి


బోటులో షికారు.. భవానీద్వీపంలో హుషారు..


కళాకారుల విన్యాసాలు

కృష్ణా తీరం.. కళల వైభవం..

అట్టహాసంగా ఆవకాయ్ వేడుకలు

న్యూస్‌టుడే, భవానీపురం

విజయవాడలో అట్టహాసంగా జరుగుతున్న ఆవకాయ్ వేడుకలు ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. రెండో రోజైన శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం భవానీ ద్వీపంలో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు పున్నమిఘాట్‌లో కళాకారులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి. వివిధ ఉత్పత్తులు, ఆహార స్టాళ్ల వద్ద సందర్శకుల రద్దీ కనిపించింది.

పాటల రచనలో మార్పొచ్చింది...



భవానీపురం: యువతకు సినిమా రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, తక్కువ సమయంలోనే ఎక్కువ గుర్తింపు తెచ్చుకునే అవకాశముందని సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్ పేర్కొన్నారు. 'ఆవకాయ్ అమరావతి' కార్యక్రమాల్లో శుక్రవారం సినిమాల్లో సంగీతం, కవిత్వంపై 'కథల శబ్దం' పేరుతో చర్చా కార్యక్రమాన్ని పున్నమిఘాట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో ప్రతి చిన్న విషయం ప్రాచుర్యం పొందుతుందని.. యువత చేసే రీల్స్‌తో చాలా మందికి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. గతంలో సినీ రచయితలు పాటలు రాయగానే సంగీత దర్శకులు సంగీతం సమకూర్చేవారని తెలిపారు. ప్రస్తుతం ట్యూన్ ఇస్తే తదనుగుణంగా పాటలు రాయాల్సి వస్తుందని వెల్లడించారు. ఆ విధంగా రాయడం గీత రచయితకు ఒక ఛాలెంజింగ్‌గా ఉంటుందని తెలిపారు. సంగీత దర్శకుడు శేఖర్ రవ్‌జియానీ మాట్లాడుతూ.. ప్రతి పాట విజయం వెనుక సంగీత దర్శకుడితో పాటు అందరి కృషి ఉంటుందని చెప్పారు. గాయని ప్రియాసారయ్య మాట్లాడుతూ.. ఆవకాయ్ అమరావతి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం తెలుగు చిత్ర గీతాలు ఆలపించారు. శ్యాం రక్షంద జలీల్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అలరించిన సంగీత విభావరి



'ఆవకాయ్ అమరావతి' కార్యక్రమంలో భాగంగా పున్నమిఘాట్ వద్ద శుక్రవారం నిర్వహించిన 'అజ్‌రంగ్ హై' సంగీత విభావరి ఆకట్టుకుంది. ఏవీజీ, నిజామీ బంధు బృందాలు వివిధ రకాల పాటలు పాడుతూ అలరించారు. ★ మెహ్ఫిల్-ఎ-సుఖన్ పేరుతో ముషైరా(కవి సమ్మేళనం) కార్యక్రమం నిర్వహించారు. అజర్ ఇక్బాల్, ఇక్బాల్ అష్హర్, ఖుష్బీర్ సింగ్‌షాద్, నుస్రత్ మెహదీ, మురళీకృష్ణ, సైఫ్ నిజామి, సర్దార్ సలీమ్ తదితరులు కవితలు వినిపించారు. కళాకారులను, రచయితలను మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని శివనాథ్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫారూఖ్ షుబ్లీ తదితరులు సన్మానించారు.


వీనుల విందుగా సంగీత కచేరీ..


పున్నమిఘాట్‌లో వేదికపై ముషైరా..


భవానీద్వీపంలో కరాటే శిక్షణ శిబిరం..

ఆవకాయ్ అమరావతిలో నేటి కార్యక్రమాలు...

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణానది ఒడ్డున ఉన్న పున్నమిఘాట్, నది మధ్యలో ఉన్న భవానీ ద్వీపంలోని వేదికలపై 'ఆవకాయ్ అమరావతి' కార్యక్రమాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శనివారం జరిగే కార్యక్రమాల వివరాలు..

సంగీతం జోరు.. కట్టిపడేసే సార్వత్రిక కథలు

భవానీద్వీపంలో (సమావేశాలు).. ★ **ఉదయం 11–11:50: కథాకాలక్షేపం:** స్టోరీ అవర్ యూకే వారి సంగీతం, మాటలతో సార్వత్రిక కథలు ★ **మధ్యాహ్నం 12–12:50 గంటలకు:** నీటిపై రాతలు-తెలుగులో కథ చెప్పే కళ శ్రీకరుణతో బ్నిం, నన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి సంభాషణ ★ **మధ్యాహ్న 1–1:50 గంటలకు:** శుక్రవారం విడుదల: సినిమా అండ్ పాత్రికేయ వృత్తి. చల్లా భాగ్యలక్ష్మితో వరముళ్లపూడి, వడ్డి ఓంప్రకాష్ నారాయణ సంభాషణ ★ **మధ్యాహ్నం 2:30–3:20:** సుందరమైన తెలుగు-తెలుగు సాహిత్యం అండ్ సినిమా వైభవం. మోతాలీ అనురాధతో కసూర్తి మురళీకృష్ణ, మామిడి హరికృష్ణ, మౌనశ్రీ మల్లిక్, శ్రీపతి శర్మవేదాంతం గార్ల సంభాషణ ★ **సాయంత్రం 3:30–4:15:** అనువాద కళ: సరిహద్దులు లేని పదాలు

శిక్షణ శిబిరాలు.. ★ **ఉదయం 11–11:50:** తుహోస్ ఆదిత్యరాయ్‌తో మర్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం ★ **మధ్యాహ్నం 12–12:50:** ప్రముఖ నగాడా వాయిద్యకారులు నాథూలాల్ సోలంకితో నగాడా శిక్షణ శిబిరం ★ **మధ్యాహ్నం 1–1:50:** ప్రముఖ తోలుబొమ్మలాట కళాకారుడు షమీమ్‌తో తోలుబొమ్మల తయారీలో శిక్షణ ★ **మధ్యాహ్నం 2:30–3:20:** ప్రఖ్యాత ఫ్రెంచ్ నృత్య కళాకారులు గిల్లెస్ చుయెన్‌తో నృత్య శిక్షణ శిబిరం

పున్నమిఘాట్ వద్ద...

★ **సాయంత్రం 4:30–5:30:** చౌరాస్తా వారి సంగీత ప్రదర్శన ★ **5:45–6:30:** నటసార్వభౌమ ఎన్టీఆర్, నటనా విశ్వరూపానికి నివాళి ★ **6:45–8:15** ప్రేమకథ(ఒక సంగీత నాటకం) ★ **రాత్రి 8:30–9గంటలకు:** ఉత్సవ ముగింపు ★ **రాత్రి 9:30–11గంటలకు:** జావేద్ అలీ-సంగీత కచేరీ

కథావస్తువుల్లో విస్తృత మార్పులు


మాట్లాడుతున్న పాపినేని శివశంకర్

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: గత పాతికేళ్లలో కథావస్తువుల్లో విస్తృత మార్పులు వచ్చాయని, పర్యావరణం, విభిన్న లైంగికత వంటి అంశాలు కథల్లో ప్రతిబింబిస్తున్నాయని ప్రసిద్ధ కథకుడు పాపినేని శివశంకర్ అన్నారు. పుస్తక మహోత్సవంలో శుక్రవారం మూడో సభగా బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదిక మీద 'పాతికేళ్ల కథ' పై చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ మంచి కథ ఎద్దినా తనదైన తీరులో సమాజంలో వస్తున్న మార్పు, ఆలోచనకు అద్దం పడుతుందన్నారు. సమాజంలో మరుగున పడుతున్న విషయాల వైపు దృష్టి మరల్చి ఆలోచింపజేయడంలో కథకులు విజయవంతమవుతున్నారన్నారు. డా.ఎం.ఎస్.కె.కృష్ణజ్యోతి కథ నిర్మాణం, శిల్పం గురించి వివరిస్తూ, కథ సంక్షిప్తంగా ఉండి పాఠకుడికి అనుభూతిని మిగల్చాలన్నారు. సభకు వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహించారు.

అమరావతి చరిత్ర భావితరాలకు తెలియాలి


మాట్లాడుతున్న ఆలపాటి సురేష్, వేదికపై పోతుల బాలకోటయ్య తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: విభజనానంతరం రాష్ట్ర రాజధాని ఏర్పాటుకు ఎదురైన ఆటంకాలు, రాజధాని సాధనకు చేసిన పోరాటం చరిత్రలో పొందుపరచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ అన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవం ఎనిమిదో రోజు శుక్రవారం మొదటి సభగా బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై పోతుల బాలకోటయ్య రాసిన 'నేను నా అమరావతి' పుస్తక పరిచయ సభ నిర్వహించారు. దీనిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ అమరావతి చరిత్ర భావితరాలకు తెలియడానికి 'నేను నా అమరావతి' పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వాలు మారినపుడల్లా రాజధానిపై ఆలోచనలు మారడం దురదృష్టకరమని, ఇది ప్రగతిని అడ్డుకుంటుందని వ్యాఖ్యానించారు. ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్ మాట్లాడుతూ అమరావతిని రాజధానిగా కొనసాగించాలనే ఉద్యమంలో పోతుల బాలకోటయ్య కీలక పాత్ర పోషించారని చెప్పారు. అమరావతి ఏ ఒక్క వర్గానికి చెందిన రాజధాని కాదన్నారు. సభకు గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించగా, పేరం భుజంగరావు, హైకోర్టు న్యాయవాది నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

8 రోజులు... 4 లక్షల మంది!

- రూ.5 కోట్లకు పైగా పుస్తక విక్రయాలు
- వీబీఎఫ్ఎస్ అధ్యక్షులు టి.మనోహర్‌నాయుడు

ఈనాడు - అమరావతి



'విజయవాడ పుస్తక మహోత్సవంలో ఈ ఏడాది సరికొత్త ఒరవడి కనిపిస్తోంది. యువత, విద్యార్థులు ఆదర్శించారా పుస్తక మహోత్సవానికి తరలివస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది కనిపించింది. వస్తున్న సందర్శకుల్లో 70 శాతం మంది యువతే ఉంటున్నారని' విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం (వీబీఎఫ్ఎస్) అధ్యక్షులు టి.మనోహర్‌నాయుడు వెల్లడించారు. 36వ పుస్తక మహోత్సవం ఎనిమిది రోజులు పూర్తయింది. మరో మూడు రోజులే ప్రదర్శన ఉంటుంది. చివరి మూడు రోజులు సెలవులు కావడంతో భారీగా పుస్తక ప్రియులు తరలిరానున్నారు. దీనికి తగ్గట్టుగా భద్రత, పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు మనోహర్ 'ఈనాడు' ముఖాముఖిలో వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

ఆరంభం నుంచి అదిరింది: గత ఏడాది వరకు పుస్తక మహోత్సవంలో చివరి ఐదు రోజులు రద్దీ ఎక్కువ ఉండేది. కానీ.. ఈసారి మొదటి రోజు నుంచి పుస్తక ప్రియులు భారీగా తరలివస్తున్నారు. అందుకే కొనుగోళ్లు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

ఐదు ప్రవేశమార్గాలు: గతంలో రెండు ప్రవేశమార్గాలు మాత్రమే ప్రదర్శనకు ఉండేవి. ఇప్పుడు ఐదు మార్గాలలోంచి లోపలకు వచ్చేలా ఏర్పాట్లు చేశాం. అన్నింటి నుంచి రద్దీగా రాకపోకలు ఉంటున్నాయి.


పార్కింగ్ నిండిపోతోంది: పుస్తక మహోత్సవంలో దినాలు, సెలవు రోజుల్లో.. ఈ ఏడాది పార్కింగ్ మొత్తం నిండిపోయి.. ఎదురుగా ఉన్న పోలీసు శిక్షణ కేంద్రం స్థలంలోనూ నిలుపుతున్నాం. పుస్తక ప్రియుల ఆదరణ విపరీతంగా పెరుగుతోందనడానికి ఇదే నిదర్శనం.

ప్రముఖ సంస్థలన్నీ రావడంతో: దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలు ఈసారి తరలివచ్చాయి. అంతర్జాతీయ స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ ఉన్న ప్రచురణ సంస్థలు కూడా ఈసారి అన్ని రకాల పుస్తకాలు కొలువుదీర్చడంతో కొనుగోళ్లు పెరిగాయి.

చివరి మూడు రోజులు భారీగా: చివరి మూడు రోజులైన.. శని, ఆది, సోమ సెలవులు కావడంతో.. ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో రద్దీ ఎక్కువైతే గేట్లను మూసేయాల్సి వచ్చింది. ఆ పరిస్థితి లేకుండా ముందే అప్రమత్తమయ్యాం.


విక్రయాలు పెరిగాయి: గతంతో పోలిస్తే ఈసారి పుస్తకాల విక్రయాలు పెరిగాయి. ఎనిమిది రోజుల్లో 4 లక్షల మంది తరలివచ్చారు. రూ.5 కోట్ల వరకూ విక్రయాలు జరిగాయి. చివరి మూడు రోజుల్లో కనీసం మరో రెండు మూడు లక్షల మంది వస్తారని భావిస్తున్నాం.

ప్రపంచీకరణ యుగంలో అనువాదాలే సాంస్కృతిక వారధులు


మాట్లాడుతున్న సత్యరంజన్

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మార్పులను అవగాహన చేసుకోవాలంటే అనువాద రచనలు ఎంతో అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. పుస్తక మహోత్సవంలో శుక్రవారం నాలుగో సభగా బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై పాతికేళ్ల అనువాద సాహిత్యంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. గోష్ఠికి అధ్యక్షత వహించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ అనువాదకుడు కె.సత్యరంజన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజల ఐక్యతకు అనువాదాలు కీలక పాత్ర పోషించాయన్నారు. అనువాదాలకు కేంద్ర ప్రభుత్వ మద్దతు బలహీనంగా ఉందన్నారు. ఛాయా పబ్లికేషన్స్ సంపాదకులు అరుణాంక్ లత మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత రచనలను తెలుగులోకి తీసుకురావడంలో అనుమతులు, ప్రచురణల సవాళ్లను వివరించారు. వికీపీడియా నిర్వాహకుడు, బాల సాహిత్య అనువాదకుడు రహమానుద్దీన్ మాట్లాడుతూ ఇంటర్‌నెట్‌తో అనువాద పరిధి విస్తరించిందని, అయినా నాణ్యతాప్రమాణాలు ఇంకా స్థిరపడలేదన్నారు.

నవలలు సామాజిక స్పృహను ప్రతిబింబించాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మొహియుద్దీన్, రమాసుందరి తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో అల్పసంఖ్యాకులు, అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలకు 'సయ్యోదా ఎక్స్' పుస్తకం అద్దం పడుతుందని ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో శుక్రవారం రెండో సభగా బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై రమాసుందరి అనువాద రచన 'సయ్యోదా ఎక్స్(ఓ అపరిచిత భారతీయురాలు)' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవలలు పాఠకుల మనసుల్లో నిలిచిపోవాలంటే అవి సామాజిక స్పృహను ప్రతిబింబించాల్సిన అవసరం ఉందన్నారు. అనువాదకురాలు రమాసుందరి మాట్లాడుతూ రచయిత్రి నేహా దీక్షిత్ పాత్రికేయురాలిగా పనిచేసి రచయిత్రిగా ఎదిగారన్నారు. సమకాలీన సామాజిక పరిణామాలను నిష్పక్షపాతంగా ఈ రచనలో ప్రతిబింబించారని తెలిపారు. దిల్లీలో గృహపరిశ్రమల్లో పనిచేసే అసంఘటిత కార్మికుల జీవితాల్లో ప్రభుత్వ విధానాలు, సామాజిక మార్పుల ప్రభావాన్ని హృద్యంగా చిత్రీకరించారన్నారు.

తడబడితే క్షణం.. తల్లడిల్లదా బంధం..



పరిగెత్తి ఎక్కుతూ.. బస్సులో వేలాడుతూ..


పైకి లాగుతూ..

భవానీపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు పెద్ద ప్రమాదం తప్పింది. విజయవాడలోని బస్టాండ్ నుంచి మైలవరానికి సర్వీస్ నం.350 ఆర్టీసీ బస్సు శుక్రవారం రాత్రి వెళ్తుంది. బస్టాండ్‌లోనే బస్సు ప్రయాణికులతో నిండిపోయింది. భవానీపురం స్వాతి సెంటర్ వద్ద కళాశాల విద్యార్థులు భారీ సంఖ్యలో ఎక్కారు. బస్సు లోపల ఖాళీ లేకపోవడంతో విద్యార్థులు ఫుట్‌బోర్డుపైనే నిలబడ్డారు. కొందరు విద్యార్థులు గాల్లోనే వేలాడుతూ తోటి వారిని పట్టుకున్నారు. విద్యార్థులు ప్రమాదకరంగా వేలాడాన్ని రహదారిపై కార్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వాహన చోదకులు డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో భవానీపురం దర్గా సమీపంలో బస్సును ఆపి విద్యార్థులను కండక్టర్ కిందకు దింపేశాడు. ఆర్టీసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించకుండా చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

విజయవాడ.. పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి రంగం అభివృద్ధి


జ్యోతి వెలిగించే కార్యక్రమంలో ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు రామ్మోహన్, ఉమామహేశ్వరరావు, ప్రసాద్, క్రెడాయ్ ప్రతినిధులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : విజయవాడ, పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపార రంగం అభివృద్ధి చెందుతోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నగరంలోని బృందావన కాలనీ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో క్రెడాయ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ప్రాపర్టీ షోని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావులతో కలిసి శుక్రవారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ.. గతంలో హైదరాబాద్ చుట్టూ స్థిరాస్తి రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని అన్నారు. ప్రస్తుతం రాజధాని అమరావతి చుట్టూ అనేక రహదారులు, పైవంతెనల నిర్మాణం జరుగుతోందని, అవి పూర్తయితే ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రామ్మోహన్ మాట్లాడుతూ.. ఉచిత ఇసుక పథకం ద్వారా నిర్మాణ రంగ కార్మికులు, స్థిరాస్తి సంస్థల ప్రతినిధులకు మేలు జరిగిందని గుర్తు చేశారు. బోడే ప్రసాద్ మాట్లాడుతూ.. గతేడాది నుంచి స్థిరాస్తి వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదని, ప్రవాసాంధ్రులు కొనేవారని, వారూ ముందుకు రావడం లేదని, వారిని ఆకర్షించేందుకు స్థిరాస్తి ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. క్రెడాయ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రాంబాబు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చాక స్థిరాస్తి రంగం ఊపందుకుందని తెలిపారు. క్రెడాయ్ విజయవాడ ఛాప్టర్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మోహన్‌రావు, ఛైర్మన్ సి.సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి కె.రఘురామ్, కోశాధికారి జి.సత్య సాయిరామ్, ప్రాపర్టీ షో ప్రధాన స్పాన్సర్ పి.కిరణ్ నాయుడు మాట్లాడుతూ.. సొంతింటి కల సాకారం చేసుకొనే వారి కోసం ప్రాపర్టీ షో ఏర్పాటు చేశామని తెలిపారు. ఫ్లాట్, విల్లా, ఓపెన్ ప్లాట్ కొనుగోలుదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు రాయితీలు ఇస్తున్నట్లు వెల్లడించారు.

వివిధ లోగోలతో మూతలు సరఫరా చేశా!

విచారణలో వెల్లడించిన నిందితుడు ధారబోయిన ప్రసాద్

నకిలీ మద్యం కేసులో కస్టడీకి వచ్చిన నలుగురు నిందితులు

ఈనాడు - అమరావతి: 'తొలుత.. మనోజ్ కుమార్‌కు నేనే మూతలు సరఫరా చేశాను. అతను ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో తయారీ కేంద్రాలకు పంపాడు. ఆ తర్వాత నేనే స్వయంగా ఆర్డర్ తీసుకుని సరఫరా చేశానని' నకిలీ మద్యం కేసులో నిందితుడు ధారబోయిన ప్రసాద్ విచారణలో చెప్పాడు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఎక్సైజ్ పోలీసులు నలుగురు నిందితులను కస్టడీకి తీసుకున్నారు. విజయవాడ కారాగారంలో ఉన్న ప్రసాద్‌ను శుక్రవారం ఉదయం జైలు నుంచి అదుపులోకి తీసుకుని ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. మిగిలిన నిందితులు బాలాజీ, సుదర్శన్, తలారి రంగయ్యను నెల్లూరు కారాగారం నుంచి తేవడంలో ఆలస్యమైంది. వీరు సాయంత్రం రావడంతో తొలి రోజు వీరి విచారణ సాగలేదు.

★ ప్రసాద్‌కు ఎక్సైజ్ అధికారుల బృందం పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టింది. మనోజ్‌తో ఎలా పరిచయమైందని ప్రశ్నించారు. అతని సోదరుడితో తనకు పరిచయం ఉందన్నాడు. అలా అతనితో పరిచయమైందని వివరించాడు. 2022 నుంచి నకిలీ మద్యం తయారీ కోసం అల్యూమినియం మూతలు సరఫరా చేస్తున్నట్లు చెప్పాడు. మనోజ్ సరఫరా చేయలేక తప్పుకొన్న తర్వాత పలు బ్రాండ్ల లోగోలతో మూతలను అద్దేపల్లి సోదరులకు అందజేసినట్లు వెల్లడించాడు. సరఫరా చేసిన మూతలకు జనార్దనరావు తరఫున రవి తనకు చెల్లింపులు చేసినట్లు చెప్పాడని తెలిసింది. శనివారం నుంచి మిగిలిన ముగ్గురిని లోతుగా విచారించనున్నారు.

ప్రాక్టీస్ బిట్స్

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

1. 20మీ.ఎత్తు ఉన్నభవనంపైనుంచి 0.5కిలోల బంతిని వదిలారు. అది నేలను తాకే ముందు దాని గతిశక్తి?
   1) 50J 2) 70J 3) 190J 4) 100J
2. 40 కిలోల బరువున్న ఒక అమ్మాయి 5 మీటర్ల ఎత్తు ఉన్న మెట్ల వరుసను 4 సెకన్లలో ఎక్కుతుంది. ఈ క్రమంలో ఆమె పొందే సామర్థ్యం?
   1) 200W 2) 500W 3) 250W 4) 100W
3. తలపై 50 కిలోల బరువు మోసే వ్యక్తి కదలకుండా నిశ్చలంగా ఉన్నాడు. అతడు చేసే పని?
   1) 25J 2) 10J 3) 0 4) 50J
4. వర్షాకాలంలో రోడ్లపై పడిన నూనెపై రంగులు కనబడటానికి కారణం?
   1) కాంతి విక్షేపణ 2) సంపూర్ణాంతర పరావర్తనం
   3) కాంతి పరిక్షేపణం 4) కాంతి వ్యతికరణం
5. కిందివాటిలో సరికానిది?
   ఎ) పొగమంచు పట్టినపుడు వీధి దీపాల చుట్టూ కనిపించే రంగులు వలయాలకు కారణం - ధృవణం
   బి) అతిధ్వనులతో చేసే స్కానింగ్ ప్రక్రియ ద్వారా శరీర అంతరనిర్మాణం తెలుసుకోవడం - వివర్తనం
   సి) 3డీ ఫొటోగ్రఫీని హోలోగ్రఫీ అంటారు.
   డి) రాత్రిపూట ఆకాశం నల్లగా ఉంటుంది. కారణం కాంతి లేక పరిక్షేపణం జరగకపోవడం.
   1) ఎ 2) ఎ, సి 3) ఎ, డి 4) ఎ, బి

సమాధానాలు: 1-4; 2-2; 3-3; 4-4; 5-1.

ఇంటి ఖర్చుల లెక్కలు, వ్యాపార లావాదేవీలు, సమయపాలన, ఏదైనా నిర్ణయం తీసుకోవడం తదితర నిత్య జీవిత వ్యవహారాల్లో కూడికలు, తీసివేతలు, భాగహారాలు, గుణకారాల వంటి గణిత పద్ధతులను తప్పకుండా ఉపయోగించాల్సి వస్తుంది. ఈ క్రమంలో సంఖ్యల మధ్య సంబంధాలను గ్రహించి, గణిత సూత్రాలను వాడి సమస్యలను తార్కికంగా పరిష్కరిస్తుంటారు. ఆ ప్రక్రియలనే సంఖ్యా పరిక్రియలు అంటారు. ఇందులో ఇచ్చిన ప్రశ్నలోని సంఖ్యల మధ్య నిర్దిష్ట నియయం లేదా నమూనా ఉంటుంది. దానిని గుర్తించి, ప్రశ్నకు అన్వయించి సమాధానాన్ని కనుక్కుంటే సులభంగా మార్కులు సాధించుకోవచ్చు. ఇందులో భాగంగా నంబర్ సిరీస్, మిస్సింగ్ నంబర్లు, సంఖ్యా సాదృశ్యం, గణిత గుర్తుల మార్పులపై పోటీ పరీక్షల్లో ప్రశ్నలు వస్తుంటాయి. వాటికి వేగంగా జవాబులు రాయాలంటే ప్రాథమిక గణిత సూత్రాలు, వర్గాలు, ఘనాలు, ప్రధాన సంఖ్యల మొదలైన వాటి గురించి అభ్యర్థులు తెలుసుకోవాలి.



గుర్తించి.. అన్వయించి.. కనిపెడితే!



జనరల్ స్టడీస్ - రీజనింగ్

సంఖ్యా పరిక్రియలు

సాధారణంగా గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు అనేవి ప్రాథమిక పరిక్రియలు. వీటిని వివిధ రకాల సంఖ్యలపై అనువర్తింపజేసి పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతారు. మొదటి రెండు పదాల్లో ఉపయోగించిన నియమాన్ని గుర్తించి, దానిని ఇచ్చిన ప్రశ్నకు అనువర్తింపజేయడం ద్వారా సమాధానాన్ని గుర్తించవచ్చు.



మాదిరి ప్రశ్నలు

1. 5 @ 3 = 34, 7 @ 2 = 53 అయితే 10 @ 6 = ?

1) 64 2) 100 3) 36 4) 136

వివరణ: $a @ b = a^2 + b^2$ ని అనుసరించి

$5 @ 3 = 5^2 + 3^2 = 25 + 9 = 34$

$7 @ 2 = 7^2 + 2^2 = 49 + 4 = 53$

$10 @ 6 = 10^2 + 6^2$

$= 100 + 36 = 136$ జ: 4

2. 23 # 21 = 22, 57 # 25 = 41 అయితే 36 # 18 = ?

1) 27 2) 54 3) 28 4) 45

వివరణ: $a \# b = \frac{a+b}{2}$ ని అనుసరించి

$23 \# 21 = \frac{23+21}{2} = \frac{44}{2} = 22$

$57 \# 25 = \frac{57+25}{2} = \frac{82}{2} = 41$

$36 \# 18 = \frac{36+18}{2} = \frac{54}{2} = 27$ జ: 1

3. 9 ★ 4 = 173, 12 ★ 6 = 330 అయితే 17 ★ 4 = ?

1) 440 2) 441 3) 445 4) 454

వివరణ: $a ★ b = (a + b)^2 + b$ ని అనుసరించి

$9 ★ 4 = (9 + 4)^2 + 4 = 13^2 + 4 = 169 + 4 = 173$

$12 ★ 6 = (12 + 6)^2 + 6 = 18^2 + 6 = 324 + 6 = 330$

$17 ★ 4 = (17 + 4)^2 + 4 = 21^2 + 4 = 441 + 4 = 445$

జ: 3



4. 16 ₹ 8 = 192, 10 ₹ 11 = 111 అయితే 15 ₹ 4 = ?

1) 301 2) 181 3) 201 4) 221

వివరణ: $a ₹ b = a^2 + b^2 - ab$ ని అనుసరించి

$16 ₹ 8 = 16^2 + 8^2 - 16 \times 8 = 256 + 64 - 128 = 320 - 128 = 192$

$10 ₹ 11 = 10^2 + 11^2 - 10 \times 11 = 100 + 121 - 110 = 221 - 110 = 111$

$15 ₹ 4 = 15^2 + 4^2 - 15 \times 4 = 225 + 16 - 60 = 241 - 60 = 181$ జ: 2

5. 20 $ 10 = 27000, 5 $ 3 = 512 అయితే 15 $ 5 = ?

1) 6200 2) 9000 3) 8000 4) 27000

వివరణ: $a \$ b = (a + b)^3$ ని అనుసరించి

$20 \$ 10 = (20 + 10)^3 = 30^3 = 27000$

$5 \$ 3 = (5 + 3)^3 = 8^3 = 512$

$15 \$ 5 = (15 + 5)^3 = 20^3 = 8000$ జ: 3



6. 75 + 25 = 2500, 26 + 24 = 625 అయితే 14 + 16 = ?

1) 525 2) 445 3) 625 4) 225

వివరణ: $a + b = \left(\frac{a+b}{2}\right)^2$ ని అనుసరించి

$75 + 25 = \left(\frac{100}{2}\right)^2 = 50^2 = 2500$

$26 + 24 = \left(\frac{50}{2}\right)^2 = (25)^2 = 625$

$14 + 16 = \left(\frac{30}{2}\right)^2 = 15^2 = 225$ జ: 4

7. 143 – 123 = 6, 256 – 122 = 56 అయితే 786 – 234 = ?

1) 213 2) 312 3) 321 4) 322

వివరణ: $abc - def = a \times b \times c - d \times e \times f$ ని అనుసరించి



$143 - 123$

$= 1 \times 4 \times 3 - 1 \times 2 \times 3$

$= 12 - 6 = 6$

$256 - 122 = 2 \times 5 \times 6 - 1 \times 2 \times 2$

$= 60 - 4 = 56$

$786 - 234 = 7 \times 8 \times 6 - 2 \times 3 \times 4$

$= 336 - 24 = 312$ జ: 2

8. 72 ÷ 8 = 136, 84 ÷ 10 = 184 అయితే 146 ÷ 3 = ?

1) 155 2) 515 3) 115 4) 511

వివరణ: $a \div b = a + b^2$ ని అనుసరించి

$72 \div 8 = 72 + 8^2 = 72 + 64 = 136$

$84 \div 10 = 84 + 10^2 = 84 + 100 = 184$

$146 \div 3 = 146 + 3^2 = 146 + 9 = 155$ జ: 1



9. 7 × 5 × 3 = 101, 4 × 6 × 2 = 60 అయితే 8 × 9 × 10 = ?

1) 1245 2) 1145 3) 1415 4) 1545

వివరణ: $a \times b \times c = a^2 + b^2 + c^3$ ని అనుసరించి

$7 \times 5 \times 3 = 7^2 + 5^2 + 3^3$

$= 49 + 25 + 27$

$= 49 + 52 = 101$

$4 \times 6 \times 2 = 4^2 + 6^2 + 2^3$

$= 16 + 36 + 8 = 60$

$8 \times 9 \times 10 = 8^2 + 9^2 + 10^3$

$= 64 + 81 + 1000 = 1145$

జ: 2






రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

సీనియర్ ఇంటర్ వృక్షశాస్త్రం

బ్యాక్టీరియమ్‌లు

ఫైనల్ పరీక్షలు 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు



1. మానవుడి పేగుల్లో సాధారణంగా నివసించే బ్యాక్టీరియమ్ ఏది? దానిని జీవ సాంకేతికశాస్త్రంలో ఎలా ఉపయోగిస్తారు?

జ: 1) ఎశ్చరీషియాకోలై (ఎ.కోలై) 2) ఇన్సులిన్ హార్మోన్ తయారీలో ఉపయోగిస్తారు.

2. బహురూప బ్యాక్టీరియమ్‌లు అంటే ఏమిటి? ఉదాహరణ ఇవ్వండి.

జ: వాతావరణ పరిస్థితి, లభ్యమయ్యే పోషకాలను బట్టి వాటి ఆకారాన్ని మార్చుకునే బ్యాక్టీరియమ్‌లను బహురూప బ్యాక్టీరియమ్‌లు అంటారు. ఉదా: అసిటో బ్యాక్టర్

3. లైంగిక పైలస్ అంటే ఏమిటి? వాటి విధిని తెలపండి.

జ: 1) బ్యాక్టీరియమ్‌లో సంయుగ్మం జరగడానికి కావలసిన సంయుగ్మనాళాన్ని లైంగిక పైలస్ అంటారు. 2) దాత కణం నుంచి DNAను గ్రహీత కణంలోకి బదిలీ చేయడానికి సంయుగ్మ నాళం తోడ్పడుతుంది.

4. జీనోఫోర్ అంటే ఏమిటి?

జ: బ్యాక్టీరియమ్‌లోని ప్రధాన జన్యుపదార్థాన్ని జీనోఫోర్ అంటారు. ఇది రెండు పోగుల వలయాకార DNA.

5. ప్లాస్మిడ్ అంటే ఏమిటి? దాని ప్రాముఖ్యత?

జ: 1) బ్యాక్టీరియం కణద్రవంలో అదనంగా ఉన్న చిన్న వలయాకార రెండు పోగుల DNAను ప్లాస్మిడ్ అంటారు. 2) జెనిటిక్ ఇంజినీరింగ్‌లో ప్లాస్మిడ్ క్లోనింగ్ వాహకంగా ఉపయోగపడుతుంది.

6. సంయుగ్మం అంటే ఏమిటి? దాన్ని ఎవరు ఏ జీవిలో కనుగొన్నారు?

జ: 1) ఈ ప్రక్రియలో రెండు సజీవ బ్యాక్టీరియమ్‌లు దగ్గరగా చేరి దాత కణం నేరుగా DNAను గ్రహీత కణంలోకి బదిలీ చేస్తుంది. 2) ఈ విధానాన్ని లెడర్‌బర్గ్, టాటమ్‌లు ఎ.కోలైలో పరిశీలించారు.

7. జన్యు పరివర్తన అంటే ఏమిటి? దాన్ని ఎవరు ఏ జీవిలో కనుగొన్నారు?

జ: 1) జన్యు పరివర్తన అంటే నగ్న DNA ఖండితాలను పరిసర వాతావరణం నుంచి గ్రహించి, గ్రహీత కణంలో దాని జన్యు సమాచారం వ్యక్తమవడం. 2) గ్రిఫిత్, స్ట్రెప్టోకోకస్ న్యూమోనియేలో కనుగొన్నారు.

8. జన్యువహనం అంటే ఏమిటి? దాన్ని ఎవరు ఏ జీవిలో కనుగొన్నారు?

జ: 1) బ్యాక్టీరియోఫాజ్ ద్వారా జన్యుపదార్థం ఒక బ్యాక్టీరియం నుంచి వేరొక బ్యాక్టీరియమ్‌కు బదిలీ చెందడాన్ని జన్యువహనం అంటారు.
2) ఈ విధానాన్ని లెడర్‌బర్గ్, జిండర్‌లు సాల్మోనెల్లా టైఫిమ్యూరియమ్‌లో కనుగొన్నారు.

అనువంశికతా సూత్రాలు, వైవిధ్యత (2 మార్కుల ప్రశ్నలు)



రచయిత: టి.నాగరాజు


అక్కడ పాఠశాలల్లో అన్ని రకాల శిక్షలు రద్దు!

కరెంట్ అఫైర్స్

వ్యవసాయ భూముల్లో అడవుల పెంపకం కోసం రైతులకు ఆర్థిక ప్రోత్సాహాన్ని ఇచ్చే కార్బన్ క్రెడిట్ పథకం ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రారంభమైంది. పాఠశాలల్లో అన్ని రకాల శారీరక, మానసిక శిక్షలను మహారాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. హైడ్రోజన్ ఇంధన సెల్‌తో నడిచే ప్రయాణికుల నౌక వారణాసిలో అందుబాటులోకి వచ్చింది. మహాత్మా గాంధీ ఉపాధిహామీ చట్టాన్ని కేంద్రం రద్దు చేసి దాని స్థానంలో 'వీబీ- జీ రామ్ జీ' పేరుతో కొత్త బిల్లు తెచ్చింది. కృత్రిమ మేధ వినియోగంలో అమెరికా, చైనా తర్వాతి స్థానంలో భారత్ నిలిచింది. ప్రాధాన్యం ఉన్న ఇలాంటి వర్తమాన వ్యవహారాలన్నింటినీ వాటి పూర్వాపరాలతో సహా పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఇటీవల భారత్‌లో మెస్సీ, విదేశాల్లో మోదీ పర్యటనల విశేషాలు, వార్తల్లో నిలిచిన ప్రాంతాలు, వ్యక్తులు, కీలక నియామకాలు, క్రీడల విజేతలు, అవార్డుల గ్రహీతలు, ముఖ్య సదస్సుల వివరాలనూ గుర్తుంచుకోవాలి.

మాదిరిప్రశ్నలు

1. సమాచార ప్రధాన కమిషనర్ (సీఐసీ)గా ఇటీవల ఎవరు ప్రమాణ స్వీకారం చేశారు?
   1) జయవర్మ సిన్హా
   2) సంజీవ్‌కుమార్ జిందాల్
   3) రాజ్‌కుమార్ గోయల్
   4) స్వాగత్‌దాస్



రాజ్‌కుమార్ గోయల్

2. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పరిమితిని 74% నుంచి ఎంత శాతం పెంచే బిల్లుకు కేంద్రమంత్రి మండలి ఆమోదం లభించింది?
   1) 80% 2) 90% 3) 78% 4) 100%
3. పండ్ల తోటల సాగులో 2024–25లో 1.93 కోట్ల టన్నుల ఉత్పత్తితో దేశంలోనే తొలిస్థానంలో నిలిచిన రాష్ట్రం ఏది?
   1) తెలంగాణ 2) మహారాష్ట్ర
   3) ఆంధ్రప్రదేశ్ 4) మధ్యప్రదేశ్

నోట్: ✦ దేశవ్యాప్తంగా 71.70 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 8.07 లక్షల హెక్టార్లలో పండ్లు పండిస్తున్నారు.
✦ 1.68 కోట్ల టన్నుల ఉత్పత్తితో మహారాష్ట్ర 2వ స్థానంలో, 1.02 కోట్ల టన్నుల ఉత్పత్తితో మధ్యప్రదేశ్ 3వ స్థానంలో ఉంది.
✦ తెలంగాణ 15వ స్థానంలో నిలిచింది. (1.81 లక్షల హెక్టార్లలో పండ్లు పండిస్తున్నారు)
✦ ఆంధ్రప్రదేశ్‌లో 1.11 లక్షల హెక్టార్లలో అరటి పండిస్తున్నారు.

4. 5వ స్క్వాష్ ప్రపంచకప్ 2025ను గెలిచిన దేశం ఏది?
   1) ఇండియా 2) రష్యా 3) అమెరికా 4) కెనడా

నోట్: ✦ స్క్వాష్ వరల్డ్‌కప్ డిసెంబరు 9 నుంచి డిసెంబరు 14 వరకు చెన్నైలో జరిగింది. వరుసగా 3వ సారి ఈ వరల్డ్‌కప్ ఇండియా (చెన్నై 2011, 2023, 2025)లో జరిగింది.
✦ 2025 స్క్వాష్ ప్రపంచకప్ రన్నర్ - హాంకాంగ్.
✦ 1996లో మొదటి స్క్వాష్ వరల్డ్‌కప్ జరగ్గా ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. రెండోది 1999లో జరగగా విజేత- ఇంగ్లండ్. 3వ (2011), 4వ (2023) విజేత ఈజిప్ట్, 5వది 2025లో జరగ్గా విజేత- ఇండియా.

5. ఇటీవల ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ భారత్ పర్యటన సందర్భంగా 70 అడుగుల ఎత్తైన అతని ఇనుప విగ్రహాన్ని ఎక్కడ ఆవిష్కరించారు?
   1) హైదరాబాద్ 2) ముంబయి
   3) దిల్లీ 4) కోల్‌కతా
6. భారతదేశంలో 95, 96వ రామ్‌సర్ సైట్స్ గుర్తించండి.
   1) కోప్ర రిజర్వాయర్ (ఛత్తీస్‌గఢ్), సిలిసెర్స్ లేక్ (రాజస్థాన్)
   2) ఉదయ్‌పూర్ లేక్ (బిహార్), కోప్ర రిజర్వాయర్ (ఛత్తీస్‌గఢ్)
   3) మినార్ వెట్‌లాండ్ కాంప్లెక్స్ (రాజస్థాన్), గోకుల్ రిజర్వాయర్ (బిహార్)
   4) కిచ్చన్ వెట్‌లాండ్ (రాజస్థాన్), సిలిసెర్స్ లేక్ (రాజస్థాన్)
7. తొలి ఫెమీనా మిస్‌ఇండియా మెహర్ కాస్టలినో ఇటీవల మరణించారు. ఏ సంవత్సరంలో ఆమె ఫెమీనా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకున్నారు?
   1) 1971 2) 1974 3) 1964 4) 1969
8. కిందివాటిలో సరైంది.
   ఎ) భారత ప్రధాని నరేంద్ర మోదీ 2025, డిసెంబరు 15-18 తేదీల్లో జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ పర్యటనకు వెళ్లారు.
   బి) జోర్డాన్ ప్రధాని - అబి అహ్మద్ అలీ.
   సి) జోర్డాన్ రాజు - అల్ హుసేన్ బిన్ అబ్దుల్లా-2.
   డి) జోర్డాన్ - భారత్ మధ్య దౌత్య సంబంధాలు మొదలై 75 సంవత్సరాలు పూర్తయింది.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి

నోట్: ✦ జోర్డాన్ దేశ ప్రధాని - జాఫర్ హసన్
✦ అబి అహ్మద్ అలీ - ఇథియోపియా ప్రధాని

9. 'ది వన్ క్రికెట్, మై లైఫ్ అండ్ మోర్' పుస్తక రచయిత?
   1) సచిన్ 2) రోహిత్ శర్మ
   3) విరాట్ కోహ్లీ 4) శిఖర్ ధావన్
10. ఫిఫా–2025 ఉత్తమ ఫుట్‌బాలర్లుగా ఎవరు ఎంపికయ్యారు?



ఉస్మాన్ డెంబెల్



ఐతానా బొన్మాటి

   1) ఉస్మాన్ డెంబెల్ (పురుషుల) - ఫ్రాన్స్, ఐతానా బొన్మాటి (మహిళల) - స్పెయిన్
   2) కైలియన్ ఎంబప్పే (ఫ్రాన్స్), అలెక్సా పుటెల్లాస్ (స్పెయిన్)
   3) ఎర్లింగ్ హాలండ్ (నార్వే), సామ్ కెర్ (ఆస్ట్రేలియా)
   4) వినిసియస్ జూనియర్ (బ్రెజిల్), లారెన్ జేమ్స్ (ఇంగ్లండ్)

నోట్: ఐతానా బొన్మాటికి వరుసగా మూడో ఏడాది ఈ అవార్డు వచ్చింది.

11. కిందివాటిలో సరైనవి.
   ఎ) 47వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ డిసెంబరు 13-15 తేదీల్లో దేహ్రాడూన్‌లో జరిగింది.
   బి) జెరియాట్రిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సదస్సు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో డిసెంబరు 12-14 తేదీల్లో జరిగింది.
   సి) మొదటి బ్రిడ్జ్ సమావేశం డిసెంబరు 8-11 తేదీల్లో అబుదాబిలో జరిగింది. (ప్రపంచంలోనే అతిపెద్ద మీడియా కార్యక్రమం).
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
12. కెనడాకు చెందిన ప్రపంచ ఆర్థిక సలహా సంస్థ అర్టన్ క్యాపిటల్ 2025 సంవత్సరానికి గాను, విడుదల చేసిన పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో మొదటి స్థానంలో నిలిచిన దేశం?



   1) సింగపూర్ 2) యూఏఈ
   3) స్పెయిన్ 4) ఇండియా

నోట్: ✦ సింగపూర్, స్పెయిన్ 2వ ర్యాంక్.
✦ బెల్జియం, ఫ్రాన్స్, స్వీడన్, నెదర్లాండ్స్, లక్సెంబర్గ్ 3వ ర్యాంక్.
✦ ఇండియా 67వ ర్యాంక్.

13. కిందివాటిలో సరైంది.
   ఎ) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో 'వికసిత్ భారత్ రోజ్‌గార్, అజీవికా హామీ మిషన్' (గ్రామీణ్) (వీబీ - జీ రామ్ జీ) బిల్లు - 2025ను కేంద్రం తీసుకొచ్చింది.
   బి) జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని 2005, సెప్టెంబరు 7న చేశారు.
   సి) ఉపాధిహామీ పథకం - 2006, ఫిబ్రవరి 2న అనంతపురం జిల్లా బండ్లపల్లిలో అమల్లోకి వచ్చింది.
   డి) 2009లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పేరును మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంగా మార్చారు.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి
14. కిందివాటిలో సరైనవి.
   ఎ) ఇటీవల మోదీని ఇథియోపియా ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో సత్కరించింది.
   బి) ఇథియోపియా రాజధాని - అడిస్ అబాబా.
   సి) ఇథియోపియా కరెన్సీ - బిర్ర్
   డి) ఆఫ్రికన్ యూనియన్ ప్రధాన కార్యాలయం అడిస్ అబాబాలో ఉంది.
   1) ఎ, బి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, సి



15. ఏఐ (కృత్రిమమేధ) సాంకేతిక అభివృద్ధి వినియోగంలో అంతర్జాతీయంగా భారత్ ఏ స్థానంలో నిలిచింది?
   1) 2 2) 1 3) 3 4) 4

నోట్: ✦ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ '2025 గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ టూల్ నివేదిక వెల్లడించింది.
✦ అమెరికా, చైనా మొదటి, రెండో స్థానాల్లో ఉన్నాయి.

16. డిసర్ట్ సైక్లోన్-II సంయుక్త సైనిక విన్యాసాలు 2025, డిసెంబరు 18 నుంచి 30 వరకు యూఏఈలోని అబుదాబిలో ఏయే దేశాల మధ్య జరిగాయి?
   1) భారత్ - యూఏఈ 2) భారత్ - కువైట్
   3) భారత్ - ఖతర్ 4) భారత్ - మలేసియా

నోట్: ✦ ఏక్తా: భారత్ - మాల్దీవులు మధ్య నావికాదళ విన్యాసాలు.

17. ఎస్‌బీఐ కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌గా కిందివారిలో ఎవరు నియమితులయ్యారు?
   1) కిరణ్ గుప్తా 2) రంజిత్ రంజన్
   3) రవికిరణ్ 4) రవిరంజన్

నోట్: ✦ ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా తొలి మహిళా అధ్యక్షురాలిగా సంగీతా బారువా పిశారోటి ఎన్నికయ్యారు.

18. రైతుల కోసం కార్బన్ క్రెడిట్ పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం ఏది?
   1) రాజస్థాన్
   2) గుజరాత్
   3) ఉత్తర్‌ప్రదేశ్ 4) మధ్యప్రదేశ్
19. ఇటీవల వార్తల్లో నిలిచిన బోండీ బీచ్ ఏ దేశంలో ఉంది?
   1) ఆస్ట్రేలియా 2) కెనడా
   3) రష్యా 4) అమెరికా

నోట్: ✦ న్యూ సౌత్‌వేల్స్‌లోని సిడ్నీ నగరంలో ఉన్న ఈ బీచ్‌లో హనుక్కా వేడుకల్లో ఉగ్ర దాడి జరిగింది.

20. ప్రముఖ శిల్పి రామ్ సుతార్ ఇటీవల మరణించారు. ఆయనకు ఏ సంవత్సరంలో పద్మభూషణ్ అవార్డు వచ్చింది?
   1) 2014 2) 2016 3) 2020 4) 2018

నోట్: ✦ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (వల్లభాయ్ పటేల్), స్టాచ్యూ ఆఫ్ ప్రాస్పెరిటీ (కెంపెగౌడ), పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీ ముందు కూర్చొని ఉండే గాంధీ విగ్రహాలు ఈయన రూపొందించినవే.
✦ 1999లో పద్మశ్రీ, 2016లో ఠాగూర్ అవార్డు, 2024లో మహారాష్ట్ర భూషణ్ అవార్డులు వచ్చాయి.

21. ఔషధ నాణ్యత ప్రమాణాలపై సహకారాన్ని పెంపొందించేలా భారతదేశంతో ఏ దేశానికి ఇటీవల అవగాహన ఒప్పందం జరిగింది?
   1) ఫిజీ 2) లైబీరియా
   3) సోమాలియా 4) జింబాబ్వే

నోట్: ✦ భారత్, ఇటలీ ఇటీవల ఆర్థిక సహకార ఉమ్మడి కమిషన్ ప్రొటోకాల్‌పై సంతకం చేశాయి.

22. యూఎన్ఈపీ ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డు 2025లో ఎవరికి వచ్చింది?
   1) నందిని శర్మ 2) సుప్రియా సాహు
   3) కీర్తి సాహు 4) అనంతరావు
23. భారతదేశం తన మొదటి స్వదేశీ తయారీ హైడ్రోజన్ ఇంధన సెల్ ప్రయాణికుల నౌకను ఎక్కడ ప్రారంభించింది?
   1) చెన్నై
   2) వారణాసి
   3) కోల్‌కతా
   4) కొచ్చిన్



నోట్: ✦ ఈ నౌకను కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ రూపొందించింది. ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా దీన్ని నిర్వహిస్తోంది.

24. ఇటీవల ఏ రాష్ట్రం పాఠశాలల్లో అన్ని రకాల శారీరక, మానసిక శిక్షలను నిషేధించింది?
   1) ఆంధ్రప్రదేశ్ 2) తెలంగాణ
   3) కేరళ 4) మహారాష్ట్ర
25. ఇండియన్ మిలిటరీ అకాడమీ నుంచి గ్రాడ్యుయేట్ అయిన మొదటి మహిళ?
   1) సాయి జాదవ్
   2) సాధన ఎస్ నాయర్
   3) దీపికా మిశ్రా
   4) లోరీ రాబిన్సన్



రచయిత: బి.ధన్‌మోహన్‌రెడ్డి

సమాధానాలు

1-3, 2-4, 3-3, 4-1, 5-4, 6-1, 7-3, 8-2, 9-4, 10-1, 11-4, 12-2, 13-1, 14-2, 15-3, 16-1, 17-4, 18-3, 19-1, 20-2, 21-2, 22-2, 23-2, 24-4, 25-1.

ఈనాడు బిజినెస్

మరో రూ.4.50 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ ▼605	నిఫ్టీ ▼194
83576	25683

దేశీయ స్టాక్ మార్కెట్ వరసగా అయిదో రోజూ నష్టాలను చవిచూసింది. అమెరికా భారీ సుంకాల హెచ్చరికలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల మదుపర్లు జాగ్రత్తగా వ్యవహరించడం ఇందుకు కారణం. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలూ మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 28 పైసలు తగ్గి 90.18 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడిచమురు ధర 2.9% పెరిగి 63.79 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.50 లక్షల కోట్లు తగ్గి రూ.467.74 లక్షల కోట్ల (5.19 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ ఐపీఓకు మొదటి రోజు ముగిసేసరికే 8.09 రెట్లు అధికంగా బిడ్లు దాఖలయ్యాయి.

చిన్న స్టాక్ బ్రోకర్లకు ఉపశమనం

సాంకేతిక లోపాల నియమావళిలో సడలింపులు



దిల్లీ: తక్కువ పరిమాణంలో క్లయింట్లు ఉండే స్టాక్ బ్రోకర్లకు ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని సెబీ తీసుకుంది. స్టాక్ బ్రోకర్ల ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ వ్యవస్థల్లో సాంకేతిక లోపాలు తలెత్తితే, అమలు చేయాల్సిన నియమావళి విషయంలో సడలింపులు ఇచ్చింది. బ్రోకర్ నియంత్రణలో లేని లోపాలకు వారికి ఎటువంటి సంబంధం ఉండదు. ఇకపై స్టాక్‌బ్రోకర్ల నియమావళి 10,000 కంటే ఎక్కువ మంది నమోదిత క్లయింట్లు ఉన్న బ్రోకర్లకు మాత్రమే వర్తిస్తుంది. దీంతో ఈ విధాన నిబంధన నుంచి దాదాపు 60% మంది బ్రోకర్లకు మినహాయింపు లభించనుంది. ఏదైనా సంఘటన జరిగితే ఎక్స్ఛేంజీలు, క్లయింట్లకు బ్రోకర్లు రెండు గంటల్లోగా సమాచారం ఇవ్వాలి. ఎక్స్ఛేంజీలు ఆ సమాచారాన్ని వారి వెబ్‌సైట్‌లో ఉంచుతాయి. బ్రోకర్లు వారి ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్‌లు, ఎస్ఎంఎస్, ఇ-మెయిల్, పాప్ అప్ అలెర్ట్‌ల ద్వారా క్లయింట్‌లకు తెలియజేయాలి. ఘటన జరిగిన టీ+1 రోజులోగా ఎక్స్ఛేంజీకి ప్రాథమిక నివేదిక సమర్పించాలి. మరుసటి రోజు సెలవు దినం అయితే పొడిగింపులు లభిస్తాయి.

కోడి గుడ్లు

10న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	560
వరంగల్	562
విజయవాడ	600
తూ/ప గోదావరి	585
విశాఖపట్నం	585
చిత్తూరు	603

ఇనుప ఖనిజం ధర తగ్గించిన ఎన్ఎండీసీ

ఈనాడు, హైదరాబాద్: గనుల రంగంలోని ప్రభుత్వ సంస్థ ఎన్ఎండీసీ, ముడి ఇనుము ధరలను తగ్గించింది. జనవరి నెలకు సంబంధించి ముడి ఇనుము ధరను టన్నుకు రూ.1,000 తగ్గించింది. దీంతో టన్ను ధర రూ.5,600 నుంచి రూ.4,600కు చేరుకుంది. ఫైన్స్ ధరను టన్నుకు రూ.850 తగ్గించడంతో, కొత్త ధర రూ.3,900గా పేర్కొంది. తగ్గిన ధరలు ఈనెల 9 నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపింది.

వాల్యూల్యాబ్స్‌లో మెజారిటీ వాటా సీవీసీ క్యాపిటల్ చేతికి?



హైదరాబాద్: ఏజెంటిక్ ఏఐ (కృత్రిమ మేధ), డిజిటల్ సేవలను అందించే హైదరాబాద్ సంస్థ వాల్యూల్యాబ్స్‌లో మెజారిటీ వాటాను ఐరోపా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ప్రైవేటు ఈక్విటీ సంస్థ సీవీసీ క్యాపిటల్ పార్ట్‌నర్స్ కొనుగోలు చేయనుందని సమాచారం. ఈ లావాదేవీ విలువ రూ.9,000-10,000 కోట్లు (1- 1.25 బి.డాలర్లు)గా ఉండొచ్చని అంచనా. సీవీసీ క్యాపిటల్, వాల్యూల్యాబ్స్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఇరు సంస్థల మధ్య ఒప్పందం దాదాపుగా కుదిరినట్లు సమాచారం. 1997లో అర్జున్‌రావు స్థాపించిన వాల్యూల్యాబ్స్ అంచెలంచెలుగా వృద్ధి చెందుతూ అంతర్జాతీయ స్థాయికి చేరింది. తాజా ఒప్పందం ప్రకారం వాల్యూల్యాబ్స్ ప్రమోటర్లు 15-20% వాటాను తమ వద్దే ఉంచుకోనున్నారు. ఒప్పందం పూర్తయ్యాక కూడా ప్రస్తుత యాజమాన్య బృందమే, సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షించనుంది. వాల్యూల్యాబ్స్‌ను దక్కించుకునేందుకు ఈక్వాటీ గ్రూప్, బ్లాక్‌స్టోన్, పీఏజీ వంటి అంతర్జాతీయ ప్రముఖ పెట్టుబడి సంస్థలూ పోటీపడ్డాయని సమాచారం.

7,000 మంది ఉద్యోగులు

వాల్యూల్యాబ్స్‌లో 7,000 మందికి పైగా నిపుణులు పని చేస్తున్నారని సమాచారం. 300కు పైగా అంతర్జాతీయ క్లయింట్లకు వీరు సేవలు అందిస్తున్నారని కంపెనీ వెబ్‌సైట్ వెల్లడిస్తోంది.

ఏఐ, డిజిటల్ సేవలకు గిరాకీ వల్లే

ప్రస్తుతం పారిశ్రామిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సేవల వినియోగం పెరిగింది. ఈ విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థలకు గిరాకీ అధికమైంది. ఈ రంగంలో పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో వాల్యూల్యాబ్స్ పోటీపడుతోంది. సీవీసీ క్యాపిటల్‌తో కుదుర్చుకోబోతున్న ఈ ఒప్పందం.. సంస్థ తదుపరి వృద్ధి, విస్తరణకు మరింత దోహదం చేయనుంది.

రిలయన్స్ జియో

రూ.40,000 కోట్ల ఐపీఓ!



● సంస్థ విలువ రూ.16.20 లక్షల కోట్లు ● 2.5% వాటా విక్రయించే అవకాశం

దేశంలోనే అతిపెద్ద తొలి పబ్లిక్ ఆఫర్‌కు ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాదిలోనే తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గత నవంబరులో రిలయన్స్ జియో విలువను 180 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16.20 లక్షల కోట్లు)గా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫ్రీస్ అంచనా వేసింది. జియోలో 2.5% వాటా విక్రయించాలన్నది రిలయన్స్ ప్రణాళిక. అంటే ఈ స్వల్ప వాటా విక్రయంతోనే 4 - 4.5 బిలియన్ డాలర్లు (రూ.36,000 - 40,500 కోట్లు) వరకు సంస్థ సమీకరించే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఇప్పటివరకు మనదేశంలో అతిపెద్ద ఐపీఓగా రిలయన్స్ జియో రికార్డు సృష్టించనుంది. ప్రస్తుతం 50 కోట్ల మందికి పైగా చందాదారులతో దేశంలో అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా జియో ఉంది. జియో ఐపీఓ కోసం మదుపర్లు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు.

✦ గత ఆరేళ్లలో కృత్రిమ మేధ (ఏఐ) వంటి వైవిధ్య విభాగాల్లోకి జియో అడుగుపెట్టింది. కేకేఆర్, జనరల్ అట్లాంటిక్, సిల్వర్ లేక్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ వంటి అంతర్జాతీయ పెట్టుబడిదార్ల నుంచి ఈ సంస్థ నిధులు సమీకరించింది కూడా.

ఇప్పటివరకు పెద్ద ఐపీఓలు

2024	హ్యుందాయ్	రూ.27,870 కోట్లు
2022	ఎల్ఐసీ	రూ.21,008 కోట్లు
2021	పేటీఎం	రూ.18,300 కోట్లు
2017	జీఐసీ	రూ.11,176 కోట్లు
2017	ఎన్ఐఏ	రూ.9,600 కోట్లు
2021	జొమాటో	రూ.9375 కోట్లు

ఐపీఓ కోసం ఇద్దరు బ్యాంకర్లు

రిలయన్స్ జియో ఐపీఓ ముసాయిదాను సిద్ధం చేసేందుకు ప్రముఖ బ్యాంకర్లు మోర్గాన్ స్టాన్లీ, కోటక్ పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. 2026 ప్రథమార్ధంలోనే జియో ఐపీఓ ఉండొచ్చని గత ఏడాది జరిగిన రిలయన్స్ ఏజీఎంలో ముకేశ్ అంబానీ ప్రకటించారు. అయితే మార్కెట్ పరిస్థితులను అనుసరించి ఈ ఐపీఓ ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పెద్ద కంపెనీల ఐపీఓ పరిమాణ నిబంధనలు మారడం కోసం రిలయన్స్ ఎదురుచూస్తోందని వెల్లడించాయి.

అతిపెద్ద కంపెనీలు, పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించాలంటే, సంస్థలో కనీసం 5% వాటా విక్రయించాలన్నది నిబంధన. దీన్ని 2.5 శాతానికి తగ్గించాలన్న సెబీ ప్రతిపాదనకు ఆర్థిక శాఖ అనుమతి లభించాల్సి ఉంది. జియో కంపెనీ భారీ పరిమాణం నేపథ్యంలో, ఐపీఓ ద్వారా 2.5% వాటానే విక్రయించాలని మాతృసంస్థ రిలయన్స్

ఆర్థిక శాఖ ఆమోదం తరవాతే

ఇండస్ట్రీస్ భావిస్తోంది. జియో విలువను 200-240 బి.డాలర్లు (సుమారు రూ.18- 21.60 లక్షల కోట్లు)గా లెక్కకట్టాలని కొంత మంది బ్యాంకర్లు కోరుతున్నట్లు సమాచారం. దీనిపై రిలయన్స్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

✦ జియో ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)గా రానుందా అనే దానిపై స్పష్టత లేదు. కొత్త షేర్ల జారీ లేదా ప్రస్తుత వాటాదార్ల షేర్ల విక్రయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దక్షిణ కొరియా సంస్థ హ్యుందాయ్ అనుబంధ హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్ల ఐపీఓ కూడా పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలోనే వచ్చింది.

కేవీబీలో మూలధన లాభాల ఖాతా

ఈనాడు, హైదరాబాద్: తమ ఖాతాదారుల్లో మూలధన లాభాలు ఆర్జించిన వారి కోసం, ప్రత్యేక ఖాతా 'క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీం'ను ప్రారంభించినట్లు కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) వెల్లడించింది. ఈ ఖాతాలో మూలధన లాభాన్ని జమ చేయడం ద్వారా, ఆదాయపు పన్ను చట్టం 1961 ప్రకారం పన్ను మినహాయింపు అర్హత లభిస్తుంది. భూమి లేదా స్థిరాస్తి, సెక్యూరిటీల వంటి ఆస్తిని విక్రయించినప్పుడు వచ్చిన సొమ్మును నిర్ణీత వ్యవధిలోగా తిరిగి పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. కొత్త ఆస్తిని కొనేందుకు సమయం కావాల్సి వస్తే, ఈ ఖాతాలో డబ్బును జమ చేయొచ్చు. ఖాతాదారులు తమ పెట్టుబడులపై సరైన నిర్ణయం తీసుకునే వరకు, పన్ను నిబంధనలకు అనుగుణంగా డబ్బు జమ చేసేందుకు ఈ ఖాతా ఉపయోగపడుతుందని కేవీబీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రమేష్ బాబు తెలిపారు. ఇందులోని నిధులపై వడ్డీ కూడా లభిస్తుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాలు మినహా, మిగిలిన అన్ని శాఖల్లో ఈ సదుపాయం అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు.

మరింత పెరిగిన బంగారం, వెండి ధరలు

ఈనాడు వాణిజ్య విభాగం: అమెరికా - ఇరాన్ మధ్య ఉద్రిక్తతలకు తోడు, ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించిన క్షిపణి నాటో దేశాల సమీపాన తాకడం వంటి పరిణామాలు శుక్రవారం అంతర్జాతీయంగా ఆందోళనలు పెరిగేందుకు కారణమయ్యాయి. ఫలితంగా సురక్షితమని భావించే బంగారం, వెండిలోకి పెట్టుబడులు మరింతగా వస్తున్నాయి. తొలిసారిగా ఔన్సు (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర 4500 డాలర్లను మించింది. ఔన్సు వెండి మళ్లీ 80 డాలర్లను దాటింది. ఔన్సు బంగారం ధర ఒక్కరోజులో 56 డాలర్లు, వెండి ధర 4.6 డాలర్లు దూసుకెళ్లాయి. దీంతో దేశీయంగానూ ఈ లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ విపణిలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయానికి 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,42,500కు చేరగా, కిలో వెండి ధర రూ.2,54,000ను తాకింది.

వొడాఫోన్ ఐడియాకు భారీ ఊరట

● వచ్చే ఆరేళ్లలో ఏటా రూ.124 కోట్లు కడితే చాలు ● వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం

దిల్లీ: అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియాకు భారీ ఊరట కలిగించే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. వచ్చే ఆరేళ్ల పాటు, ఏటా చెల్లించాల్సిన బకాయిలకు రూ.124 కోట్ల పరిమితి విధించింది. 2032 మార్చి నుంచి 2035 మార్చి వరకు, ఏటా రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మేరకు టెలికాం విభాగం (డాట్) నుంచి సమాచారం అందిందంటూ ఎక్స్ఛేంజీలకు వొడాఫోన్ ఐడియా సమాచారం ఇచ్చింది. అంటే పదేళ్లలో కలిపి రూ.1,144 కోట్లు మాత్రమే ఈ సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) బకాయిల్లో మిగతా మొత్తాన్ని 2036 మార్చి నుంచి, ఆరేళ్ల పాటు సమాన వాయిదాల రూపంలో కట్టాల్సి ఉంటుందనీ అందులో తెలిపింది.



కేంద్ర ప్రయోజనాల కోసమే: వొడాఫోన్ ఐడియా బకాయిలను రూ.87,695 కోట్ల వద్ద ఫ్రీజ్ చేస్తూ, వాటిని 2031-32 నుంచి 2040-41 మధ్య కట్టొచ్చని పేర్కొంటూ, డిసెంబరు 31న పాక్షిక మారటోరియానికి కేంద్రం అనుమతులిచ్చిన సంగతి తెలిసిందే. ఈ మొత్తాన్ని కూడా ఆడిట్ ఆధారంగా ఒక కమిటీ తిరిగి మదింపు చేస్తుంది. ప్రభుత్వానికి వొడాఫోన్ ఐడియాలో 48.9% వాటా ఉండడం, 20 కోట్ల మంది వినియోగదార్లు, కేంద్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఊరట చర్యలను ప్రకటించింది.

ఈ వార్తల నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో ఉదయం ట్రేడింగ్‌లో 9% లాభపడింది. అయితే 5జీ విస్తరణ ప్రణాళికలకు సంస్థ నిధులు ఖర్చు చేయాల్సి ఉందంటూ, విశ్లేషకులు పేర్కొనడంతో, చివరకు 2% నష్టంతో రూ.11.27 వద్ద ముగిసింది.

500 దుప్పట్లు పంచిన బికారి.. ప్రధాని కితాబు పొందిన రాజు



ఉత్తర భారతాన్ని వణికిస్తున్న చలిగాలులు గూడు లేని నిరుపేదల కష్టాలు పెంచుతున్నాయి. ఇటువంటి వారికి పఠాన్‌కోట్‌కు చెందిన ఓ దాత వేడి చాయ్‌తోపాటు 500 దుప్పట్లు పంపిణీ చేశారు. ఇంత పెద్ద మనసును చూపిన వ్యక్తి ధనవంతుడు కాదు.. ఆయన కూడా బిచ్చగాడే. రెండు కాళ్ల వైకల్యం ఉన్న రాజు బికారి వీల్‌ఛైర్ సాయంతో వీధుల్లో తిరిగి పోగుచేసిన డబ్బుతో సాటి పేదలకు ఈ సాయం చేశారు. కొవిడ్ కష్టకాలంలో మాస్కులు ధరించమని ప్రచారం చేస్తూ.. పేదల ఇళ్ల వద్దకు రేషను, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన రాజుపై గతంలో స్వయానా ప్రధాని మోదీ తన 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రశంసలు కురిపించారు. నిరాశ్రయుల కోసం ఓ భవనం నిర్మించే పనిలో ప్రస్తుతం తాను ఉన్నట్లు రాజు తెలిపారు.

ఈటీవీ భారత్

ఆరు రోజుల స్కేటింగ్‌తో అయోధ్య చేరిన చిన్నారి



ఉత్తర్‌ప్రదేశ్‌లో తీవ్రమైన చలిగాలులకు వణుకుతున్న జనం ఇల్లు కదలకుండా దుప్పట్ల నుంచి బయటకు రావడానికి జంకుతుండగా.. తొమ్మిదేళ్ల వంశికా యాదవ్ అనే చిన్నారి ఆరు రోజుల స్కేటింగ్‌తో అయోధ్యకు చేరింది. ఫిరోజాబాద్ జిల్లాలోని శికోహాబాద్ నుంచి జనవరి 3వ తేదీన బయలుదేరిన వంశిక ఆరు రోజుల్లో 450 కి.మీ.ల మేర స్కేటింగ్ చేస్తూ శుక్రవారం అయోధ్యకు చేరి శ్రీరాముడి దర్శనం చేసుకొంది. విశ్వాసం, పట్టుదలే తనను నడిపించాయంటున్న వంశిక హైవేతోపాటు పలు పట్టణ రహదారుల మీదుగా కూడా పయనించింది. తండ్రి శివశంకర్ యాదవ్‌తోపాటు మరో సమీప బంధువు ఆమెను కారులో అనుసరించారు. దారి పొడవునా మైలురాళ్లపై ఉన్న దుమ్మును, ముళ్ల పొదలు.. శిథిలాలను శుభ్రం చేస్తూ అయోధ్య చేరుకొన్న వంశికకు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్రం ట్రస్టీ డాక్టర్ అనిల్ మిశ్ర స్వాగతం పలికి సత్కరించారు.



రష్యా దాడిలో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ధ్వంసమైన ఓ భవనం

'ఒరెష్నిక్'తో రష్యా దాడి

● ఉక్రెయిన్‌లో అలజడి
● కీవ్‌లో నలుగురి మృతి

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో మాస్కో అత్యాధునిక ఒరెష్నిక్ క్షిపణిని ప్రయోగించింది. ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా దూసుకెళ్లే ఈ క్షిపణితో గురువారం అర్ధరాత్రి పశ్చిమ లవీవ్ ప్రాంతంపై దాడి చేసింది. ఉత్తర అట్లాంటిక్‌లో ఓ చమురు ట్యాంకర్‌ను అమెరికా జప్తు చేయడంతో రష్యా అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. ఈ మిసైల్‌తో కీలక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు మాస్కో పేర్కొంది. వివరాలు మాత్రం వెల్లడించలేదు. లవీవ్ ప్రాంతంలో భూగర్భ సహజ వాయువు నిల్వలను ఈ క్షిపణి ధ్వంసం చేసిందని రష్యా మీడియా కథనాలను వెల్లడించింది. ఈ పరిణామాలపై ఉక్రెయిన్ స్పందించింది. కీవ్‌లో నలుగురు ప్రాణాలు కోల్పోగా, 25 మంది గాయపడినట్లు తెలిపింది. ఒరెష్నిక్‌తో పాటు మొత్తం 36 క్షిపణులు, 242 డ్రోన్లను రష్యా ప్రయోగించిందని కీవ్ ఆరోపించింది. గత నెల రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇంటిపై ఉక్రెయిన్ డ్రోన్లు నిర్వహించిన దాడికి ప్రతీకారంగానే తాము విరుచుకుపడినట్లు రష్యా రక్షణశాఖ తెలిపింది. నాటో సరిహద్దుకు సమీపంలో ఒరెష్నిక్ పడిందని, ఐరోపా భద్రతకు ఇది పెనుముప్పు అని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి అన్నారు. ఈ క్షిపణిలో ఆరు వార్‌హెడ్‌లు ఉన్నాయని పేర్కొన్నారు.

ట్రంప్‌నకు మోదీ ఫోను చేయనందునే

వాణిజ్య ఒప్పందం కుదరలేదు

అమెరికా మంత్రి సంచలన వ్యాఖ్యలు



హొవార్డ్ లుట్నిక్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడకపోవడంతోనే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరలేదని అగ్రరాజ్య వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ పేర్కొన్నారు. 'మామూలుగా అయితే ఒప్పందం కొలిక్కి వచ్చింది. స్పష్టంగా చెప్పాలంటే.. ఇది ఆయన (ట్రంప్) ఒప్పందం. దానికి ముగింపు రావాలంటే.. ట్రంప్‌నకు మోదీ కాల్ చేయాల్సి ఉంది. అయితే ఇది భారత ప్రభుత్వానికి రుచించలేదు. మోదీ చివరకు ఫోన్ చేయలేదు. మేము ఇండోనేసియా, ఫిలిప్పైన్స్, వియత్నాంలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాం. భారత్‌తో వాటి కంటే ముందే ఒప్పందం జరుగుతుందని ఊహించాం. అలా జరగకపోవడంతో ఇంతకు ముందు అంగీకరించిన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా వెనక్కి తీసుకుంది. దానిపై ఇప్పుడు మేం ఆలోచించడం లేదు. బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పంద చర్చలు కొలిక్కి వస్తున్న సమయంలో ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ ట్రంప్‌నకు కాల్ చేశారు. ఆ రోజే డీల్ ముగింపునకు వచ్చింది' అంటూ ఆయన భారత్, బ్రిటన్ మధ్య పోలిక తెచ్చారు.

ఆ వ్యాఖ్యల్లో నిజం లేదు: భారత్

లుట్నిక్ చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. వివిధ అంశాల్లో గతేడాది ప్రధాని మోదీ, ట్రంప్ 8 సార్లు ఫోన్‌లో సంభాషించుకున్నారని విదేశాంగశాఖ స్పష్టం చేసింది. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అదనపు ఆంక్షలు విధించే బిల్లుపైనా అవగాహన ఉందని, పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. 'అమెరికా వాణిజ్య మంత్రి వ్యాఖ్యలు చూశాం. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చించేందుకు గతేడాది ఫిబ్రవరి 13 నాటికే ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయి. అప్పటి నుంచి పరస్పర ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం ఇరుపక్షాలు పలుమార్లు సంప్రదింపులు జరిపాయి. ఇప్పటికీ దీనిపై ముందుకు వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్నాం' అని భారత విదేశీవ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

లాలూ కుటుంబం నేర ముఠాలా వ్యవహరించింది

• రైల్వే ఉద్యోగాల కుంభకోణం కేసులో దిల్లీ కోర్టు వ్యాఖ్య
• అభియోగాల నమోదుకు జడ్జి ఆదేశం

దిల్లీ: ఆర్జేడీ అధినేత, కేంద్ర రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులపై రైల్వే ఉద్యోగాల కుంభకోణం కేసులో అభియోగాల నమోదుకు దిల్లీ కోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ సందర్భంగా ప్రత్యేక జడ్జి విశాల్ గొగ్నే కీలక వ్యాఖ్యలు చేశారు. రైల్వే శాఖను లాలూ యాదవ్ సొంత జాగీరుగా భావించి కుటుంబ సభ్యులతో కలిసి క్రిమినల్ చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. రైల్వే అధికారులు, సన్నిహితులతో కుమ్మక్కై ఉద్యోగాలను అంగడి సరుకులుగా విక్రయాలకు పెట్టి తద్వారా భూములు సొంతం చేసుకున్నారని తెలిపారు. సీబీఐ తుది నివేదిక విస్తృత కుట్రను బహిర్గతం చేసిందన్నారు. ఈ మేరకు తీర్పులోని కొంత భాగాన్ని మౌఖికంగా వినిపించారు. తమపై నమోదైన కేసు కొట్టివేయాలన్న లాలూ, ఆయన కుటుంబ సభ్యుల వినతిని తిరస్కరించారు. రైల్వే అధికారులు కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనీ స్పష్టం చేశారు. ఛార్జిషీటులో పేర్కొన్న నిందితుల్లో 41 మందిపై అభియోగాలను కోర్టు నమోదు చేసింది. 52 మందిని నేరారోపణల పరిధి నుంచి తొలగించింది. అధికారికంగా అభియోగాల నమోదుకు విచారణను ఈ నెల 23వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అభియోగాల నమోదుకు జడ్జి ఆదేశించిన వారిలో.. లాలూ, ఆయన భార్య రబ్రీ దేవి, కుమారులు తేజస్వి, తేజ్ ప్రతాప్ , కుమార్తె మిసా భారతి, కొందరు రైల్వే అధికారులు, ఇతరులు ఉన్నారు.

రోమియో-జూలియెట్ నిబంధన చేర్చండి

కేంద్రానికి సుప్రీం సూచన

దిల్లీ: కఠిన నిబంధనలు ఉన్న పోక్సో చట్టంలో నిజమైన నవ యవ్వన దశ (టీనేజీ) అనుబంధాల రక్షణకు గాను రోమియో-జూలియెట్ నిబంధనను చేర్చాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. చిన్నారులపై లైంగిక వేధింపులను నిరోధించడం కోసం తీసుకొచ్చిన పోక్సో చట్టం తరచూ దుర్వినియోగానికి గురవుతోందని, నిజమైన టీనేజీ ప్రేమికుల భవిత ప్రమాదంలో పడుతోందని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం అభిప్రాయపడింది. నవ యవ్వన దశలో అంకురించే స్వచ్ఛమైన స్నేహబంధాలను కఠినమైన ఈ చట్ట నిబంధనల కోరల నుంచి మినహాయింపునివ్వాల్సిన అవసరాన్ని న్యాయస్థానాలకు వచ్చిన పలు పోక్సో వ్యాజ్యాలు తెలియజేస్తున్నాయని శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ కేసుపై తీర్పు వెలువరిస్తూ పేర్కొంది. కక్ష సాధింపు చర్యల కోసం కూడా కొందరు పోక్సో చట్టాన్ని దుర్వినియోగపరుస్తున్నారని తెలిపింది. ఈ చట్టం ప్రకారం నమోదైన కేసుల్లో బెయిల్ మంజూరు దశలో బాధితుల వయసును వైద్యపరంగా నిర్ధారించుకోవడం హైకోర్టులు తప్పనిసరి చేయరాదని ఆదేశించింది. బెయిల్ దశపై విచారణను మినీ ట్రయల్‌గా మార్చరాదని పేర్కొంది. ఈ తీర్పు ప్రతిని కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శికి, అలహాబాద్ హైకోర్టుకు పంపించాలని కోర్టు రిజిస్ట్రీకి సూచించింది.

ఐఎస్ఎస్‌లో వ్యోమగామికి అనారోగ్య సమస్య..

వాషింగ్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో మెడికల్ ఎమర్జెన్సీ తలెత్తింది. ఓ వ్యోమగామికి అనారోగ్యసమస్య రావడంతో షెడ్యూల్ చేసిన స్పేస్‌వాక్‌ను నాసా నిరవధికంగా వాయిదా వేసింది. ఆ వ్యోమగామిని భూమి మీదకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేపట్టింది. ఈ ఏడాది తొలి స్పేస్‌వాక్‌ను నాసా ఇటీవల ప్రకటించింది. జనవరి 8న (అమెరికా కాలమానం ప్రకారం) వ్యోమగాములు మైక్ ఫిన్కీ, జెనా కార్డ్‌మన్ 6.5 గంటల పాటు స్పేస్‌వాక్ చేయనున్నట్లు వెల్లడించింది. చివరి నిమిషంలో దీన్ని నాసా నిలిపివేసింది. క్రూ-11 మిషన్‌లో వెళ్లిన ఓ వ్యోమగామికి మెడికల్ ఎమర్జెన్సీ తలెత్తడంతో స్పేస్‌వాక్‌ను వాయిదా వేసినట్లు ప్రకటించింది.

హిమాచల్‌ప్రదేశ్‌లో

ఘోర ప్రమాదం..

● బస్సు లోయలో పడి 14 మంది మృతి
● 52 మందికి గాయాలు

నహాన్: హిమాచల్‌ప్రదేశ్‌లోని సిర్‌మౌర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేటు బస్సు 500 అడుగుల లోతు లోయలో పడి 14 మంది మృత్యువాతపడ్డారు. మరో 52 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం శిమ్లా నుంచి కుప్వికి వెళ్తున్న బస్సు హరిపుర్‌ధర్ వద్ద అదుపుతప్పి లోయలో పడింది. దీన్ని గుర్తించిన స్థానికులు బస్సులో ఉన్న క్షతగాత్రులను బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న సహాయక సిబ్బంది గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ రూ.2లక్షల పరిహారం ప్రకటించారు.



ప్రమాద స్థలంలో సహాయక చర్యలు

మరో వెనెజువెలా నౌక స్వాధీనం



వాషింగ్టన్: కరీబియన్ సముద్రంలో మరో వెనెజువెలా నౌకను అమెరికా స్వాధీనం చేసుకుంది. శుక్రవారం అమెరికా బలగాలు ఈ నౌకపై దిగి సోదాలు జరిపి సీజ్ చేశాయి. దీంతో ఇప్పటిదాకా 5 వెనెజువెలా నౌకలను అమెరికా స్వాధీనం చేసుకున్నట్లయింది. తెల్లవారడానికి ముందు మెరీన్లు, నౌకాదళ సెయిలర్లు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ నుంచి ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఒలీనా అనే చమురు నౌకపై హెలికాప్టర్లు దిగుతున్న వీడియోను అమెరికా సైన్యం విడుదల చేసింది. ఈ నౌక చమురుతో వెనెజువెలా నుంచి బయలుదేరిందని అధికారులు తెలిపారు. గతంలో మినర్వా ఎం అని పేరున్న ఈ నౌక పనామా జెండాతో ఉండేదని, తాజాగా తీమూర్-లెస్టే జెండాతో రష్యా చమురును రవాణా చేస్తోందని వివరించారు. హాంకాంగ్ కంపెనీతో రిజిస్టరు చేసినట్లు మేనేజరు తప్పుడు వివరాలిచ్చారని తెలిపారు.

ముగ్గురు భారతీయ సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరం: అమెరికా సీజ్ చేసిన మ్యారినెరా చమురు ట్యాంకర్ నౌకలో పని చేస్తున్న ఇద్దరు రష్యన్ జాతీయులను విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించింది. మిగిలిన సిబ్బంది పరిస్థితిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నౌకలో ముగ్గురు భారతీయులతోపాటు 17 మంది ఉక్రేనియన్లు, ఆరుగురు జార్జియన్లు, ఇద్దరు రష్యన్లున్నారు.

బంగారు తాపడం కేసు.. శబరిమల ప్రధాన పూజారి అరెస్టు

తిరువనంతపురం: శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శబరిమల తంత్రి (ప్రధాన పూజారి) కందరారు రాజీవరును సిట్ అధికారులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం సిట్ అధికారుల బృందం ఆయన్ను అదుపులోకి తీసుకొని.. విచారణ అనంతరం అరెస్టు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. పొట్టిని శబరిమలకు తీసుకొచ్చింది కూడా పూజారి కందరారు రాజీవరేనని ఇతర నిందితులు తమ వాంగ్మూలంలో పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. తాపడాల చోరీ కేసులో రాజీవరు పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలడంతో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేసింది. మరోవైపు.. ప్రస్తుత సీజన్‌లో శబరిమల ఆలయానికి రాజీవరు ప్రధాన పూజారి కాదని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) అధ్యక్షుడు కె. జయకుమార్ నాయర్ స్పష్టంచేశారు.

ఒకే వేదిక.. రుణం సులువిక!



వ్యవసాయ, విద్య, గృహ రుణాలైనా.. వ్యాపారానికి సంబంధించినవైనా సరే.. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేదు. రోజూ తిరగాల్సిన పని అంతకంటే లేదు. www.jansamarth.in వెబ్‌సైట్‌లో నమోదైతే చాలు.. నేరుగా బ్యాంకులు, ఆర్థికసంస్థలతో కనెక్ట్ అవుతారు. కాగితాల పని కూడా తగ్గుతుంది. రుణ మంజూరు ప్రక్రియ వేగంగా జరుగుతుంది.
అంతేకాదు దరఖాస్తు సమయంలోనే కేంద్రం ఏ జిల్లాలో ఏ పథకాలు అమలు చేస్తోంది? రాయితీలేంటో కనిపిస్తాయి. మొత్తం యూనిట్ వ్యయమెంత? అనేవీ తెలుస్తాయి.
వాటికి అనుగుణంగానే రుణమంజూరు ఉంటుంది. దీనికోసమే కేంద్రం జనసమర్థ్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఇందులో 8 విభాగాలకు సంబంధించి 15 రకాల పథకాల్ని పొందుపరిచారు.
రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ పోర్టల్‌తో అనుసంధానం అవుతున్నాయి.

అంతా డిజిటల్ రూపంలోనే...

కేంద్రం అమలు చేసే క్రెడిట్ లింక్ పథకాలన్నిటినీ ఒకే వేదికపైకి తెచ్చింది. అదే జనసమర్థ్.. దీనిద్వారా రుణాలు పొందడం సులువవుతుంది.
- ఈ పోర్టల్ ద్వారా తాము అర్హులో కాదో తనిఖీ చేసుకోవచ్చు. అక్కడే ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేయొచ్చు.
- బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు.. వాటి వెబ్‌సైట్లు వెదుక్కోవాల్సిన పనిలేదు.
- వివిధ రుణాలకు ఇక్కడి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత పత్రాలు ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేయాలి.
- ఇతర వేదికలపై దరఖాస్తులిస్తే.. వాటి పరిష్కారానికి ఎన్నాళ్లు పడుతుందో చెప్పలేం. ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేస్తే సంబంధిత ఆర్థిక సంస్థలు కూడా దరఖాస్తు పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తు సమయంలోనే పాన్, జీఎస్టీ, ఉద్యమ్, సిబిల్ తదితర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో తనిఖీ చేస్తుంది. తద్వారా అన్నీ సక్రమంగా ఉంటే రుణ ఆమోదం కూడా వేగవంతంగా జరుగుతుంది.
- బ్యాంకు బ్రాంచిలకు పదేపదే వెళ్లాల్సిన పని ఉండదు. జవాబుదారీతనం మెరుగవుతుంది.
- మీ దరఖాస్తుపై రియల్‌టైమ్ అప్‌డేట్స్ ఇస్తారు. దరఖాస్తు ఎక్కడ ఉందో ట్రాకింగ్ విధానం కూడా ఉంటుంది. మీకు నచ్చిన బ్యాంకును ఎంచుకోవచ్చు.

ఎలాంటి రుణాలిస్తారు?

విద్యారుణాలు
- కేంద్ర ప్రభుత్వ వడ్డీ రాయితీ (సీఎస్ఐఎస్).
- పఢో పరదేశ్ పథకం.
- ఓబీసీ, ఈబీసీ విద్యార్థులకు డాక్టర్ అంబేడ్కర్ సీఎస్ఐఎస్.

వ్యవసాయం, వ్యవసాయ మౌలిక సౌకర్యాల నిధి రుణాలు
- వ్యవసాయ మౌలిక సౌకర్యాల అభివృద్ధి నిధి (ఏఐఎఫ్).
- అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్ కేంద్రాలు (ఏసీఏబీసీ).
- కిసాన్ క్రెడిట్ కార్డులు
- కిసాన్ క్రెడిట్ కార్డు(మత్స్య).

ఈ కిసాన్ ఉపాజ్ నిధి
వ్యవసాయ ఉత్పత్తుల్ని డబ్ల్యూడీఆర్ఏ (వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ) పరిధిలోని గోదాముల్లో నిల్వ చేసి.. సంబంధిత రశీదులపై రుణాలు తీసుకోవచ్చు.

గృహ రుణాలు
పట్టణప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస యోజన(పీఎంఏవై-యు 2.0)

రూఫ్‌టాప్ సోలార్
పీఎం సూర్యఘర్ పథకం కింద ఇందులో నమోదు చేసుకోవచ్చు.

ఎగుమతిదారులకు క్రెడిట్ గ్యారంటీ స్కీమ్
చిన్న, సూక్ష్మస్థాయి పరిశ్రమలు సహా అర్హులైన ఎగుమతిదారులకు అదనపు రుణం లభిస్తుంది. రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేయొచ్చు.

ఇతర వ్యాపార కార్యకలాపాల రుణాలు
- ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ)
- నేతన్నలకు ముద్ర పథకం (డబ్ల్యుఎంఎస్)
- ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై)
- ప్రధానమంత్రి వీధివ్యాపారుల ఆత్మనిర్భర్ పథకం (పీఎం స్వనిధి)
- నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ (నమస్తే)
- స్టార్టప్ రుణాలు.

జనసమర్థ్.. భాగస్వాములెవరు?

ఈ వేదిక ద్వారా మొత్తం 250 ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులతోపాటు వివిధ ఆర్థిక, ఆర్థికేతర సంస్థల నుంచి రుణాలు పొందే వీలుంటుంది.

ప్రభుత్వరంగ బ్యాంకులు	12
ప్రైవేటు రంగ బ్యాంకులు	19
నాన్‌బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలు	7
గ్రామీణ బ్యాంకులు	43
స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు	5
జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు	164

అర్హత పరిశీలించుకోవాలి

- పోర్టల్‌లో మొబైల్/ఈమెయిల్ ద్వారా లాగిన్ అయి.. ఓటీపీ ధ్రువీకరణ ద్వారా ప్రొఫైల్ సృష్టించుకోవాలి.
- తొలుత అర్హత పరిశీలించుకోవాలి. తర్వాతే దరఖాస్తు చేయాలి.

అవసరమయ్యే పత్రాలు: ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా/స్టేట్‌మెంట్, ఆదాయ ధ్రువీకరణ, గుర్తింపు, విద్య, వ్యాపార సంబంధ పత్రాలు

- ఈనాడు, అమరావతి



జోడెడ్ల బండి.. భలే ఉందండి!



బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వ్యక్తి.. నేడు కుటీర పరిశ్రమకు యజమాని అయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం పాలూరుకు చెందిన శంకర్ విద్యాభ్యాసం తర్వాత పొట్టకూటి కోసం విదేశాలకు వెళ్లారు. కొన్నాళ్లు అక్కడ కష్టపడ్డాక తనకొచ్చిన కళనే నమ్ముకోవాలని భావించి సొంతూరుకు వచ్చేశారు. చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉన్న బొమ్మల తయారీపై దృష్టిపెట్టారు. ప్రస్తుతం ట్రెండ్‌గా మారిన చెక్క ఎద్దుల బండి బొమ్మల తయారీని ఎంచుకున్నారు. ఫైబర్, కలప వాడి ఒక అడుగు పరిమాణం నుంచి ఏడడుగుల ఎత్తు వరకు వీటిని రూపొందిస్తున్నారు. ఈ బొమ్మలు అందంగా, ఆకర్షణీయంగా ఉండటంతో ఇళ్లు, ఫాంహౌస్‌లలో అలంకరణ వస్తువుగా పెట్టుకోవడానికి చాలా మంది కొనుగోలు చేస్తున్నారు. సోదరుడు కృష్ణ సహకారంతో ఆన్‌లైన్లోనూ ఆర్డర్లు తీసుకొని విదేశాలకు పంపిస్తున్నారు. కొనుగోళ్లు పెరగడంతో మరికొందరికి వీటి తయారీపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తుండటం విశేషం.

- ఈనాడు, అత్తిలి


భవిష్యత్తు ఆవాసం



ప్రస్తుత సాంకేతిక యుగంలో యువతరం అభిరుచులకు తగినట్లు కంపెనీలు తమ ఉత్పత్తులను ఆవిష్కరిస్తేనే వారిని ఆకట్టుకోగలవు. సరిగ్గా ఈ ధోరణిని అందిపుచ్చుకున్న విజయవాడకు చెందిన ఎకోపాలిస్టోన్ సంస్థ 'స్టారీ స్కై రూమ్స్' పేరుతో ఆధునిక ఇళ్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. నగరంలో జరుగుతున్న క్రెడాయ్ ప్రాపర్టీ షోలో వీటిని ప్రదర్శనకు ఉంచింది. ఇంటి మేడల మీద, విల్లాల్లో, ఖాళీ స్థలాల్లో ఇలా ఎక్కడైనా ఈ ఇంటిని ఒక్క రోజులోనే ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ రూమ్‌లను పూర్తిగా స్వచ్ఛమైన పాలీకార్బొనేట్ షీట్లతో రూపొందించడంతో పాటు యూవీ కోటింగ్ వేయడంతో ఎండ, వాన నుంచి రక్షణ అధికంగా ఉంటుంది. దీనికి అల్యూమినియం ఫ్రేమ్, తలుపు వాడారు. లోపల మంచం, సోఫా, ఫ్యాన్ ఏర్పాటు చేశారు. రెండు రకాలున్న ఇళ్లను ప్రదర్శనలో ఉంచారు. వాటిలో ఒకదానికి అటాచ్డ్ బాత్‌రూం ఉండటం విశేషం. ఇగ్లూ శైలిలో ఉన్న స్టారీ స్కై రూంలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

- ఈనాడు, అమరావతి

నా వయసు ఎప్పటికీ 197 ఏళ్లే..



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి ప్రకృతి వనంలో ప్రదర్శనకు ఉంచిన ఈ టేకు చెట్టు వయసు 197 ఏళ్లు. హాజీపూర్ మండలం ర్యాలి గ్రామ పంచాయతీ అటవీ ప్రాంతంలో రెండు శతాబ్దాల కిందట పెద్ద టేకు వనం ఉండేది. అలాంటి అడవిలో పెరిగిన చెట్టును 1993లో నరికివేశారు. 5.08 మీటర్ల చుట్టుకొలత ఉన్న వృక్షం వయసు అప్పటికి 197 ఏళ్లు అని గుర్తించిన అటవీ అధికారులు మొదలును కొన్నేళ్లు మంచిర్యాలలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ప్రదర్శనగా పెట్టారు. రెండేళ్ల కిందట గాంధారి ప్రకృతి వనానికి తీసుకొచ్చారు.

-న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం

పురాణాల చిత్రరూపం



గుంటూరులో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ) మేళాలో ఒడిశా రాష్ట్రానికి చెందిన వారసత్వ పట్టచిత్రకళ ఎంతగానో ఆకట్టుకుంటోంది. పురాణాలు, కావ్యాల్లో పేర్కొన్న పలు ఘట్టాలను తాళపత్రాలపై చిత్రాల రూపంలో వివరించే ఈ కళ వన్నె తగ్గలేదు. పూరి జిల్లా రఘురాజ్‌పుర్ గ్రామంలో వందల కుటుంబాలు ఇప్పటికీ వీటిని అద్భుతంగా రూపొందిస్తున్నారు. తొలుత శుద్ధమైన తాటాకులు సేకరించి వేపాకు, పసుపు నీళ్లలో ఉడకబెడతారు. తర్వాత మూడు నెలల పాటు నీడలో ఆరబెట్టి నాణ్యమైన తాళపత్రాలను తయారు చేసుకుంటారు. సిద్ధం చేసుకున్న తాటాకులపై ఘంటంతో రామాయణ, మహాభారతం, జగన్నాథ క్షేత్రమహత్యం, గణేశ్ చరిత్ర, శ్రీకృష్ణ లీలల్లో పేర్కొన్న ఘట్టాలను అత్యంత నైపుణ్యంగా చెక్కుతారు. ఒక్కో చిత్ర సమూహాన్ని పూర్తిచేయడానికి 10 రోజుల నుంచి ఏడాదిన్నర వరకు పడుతుందని చిత్రకారులు ఆలోక్ రంజన్ సాహో తెలిపారు. ఈ తాళపత్రాలు ఒక్కోటి రూ.1,500 నుంచి రూ.3.5 లక్షల వరకు పలుకుతాయన్నారు.



- ఈనాడు, అమరావతి

అలంకార చేపలు.. ఆదాయానికి బాటలు!

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం పెదమడికి చెందిన అన్నదమ్ములు వీరేంద్ర సాయివర్మ, సురేంద్రవర్మలు స్థానికంగా ఆర్నమెంటల్ ఫిష్ కల్చర్ (అలంకార చేపల పెంపకం)లో రాణిస్తున్నారు. చేపల సంతానోత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు అన్నీ వారే చూసుకుంటూ నెలకు రూ.3 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. 'ఆక్వా కల్చర్‌తో పోల్చితే అలంకార చేపల పెంపకం లాభదాయకం. దాణా పెద్దగా తినవు. విద్యుత్తు ఖర్చులూ తక్కువే. రెండు, మూడు నెలల్లోనే చేపలు విక్రయించేందుకు సిద్ధమవుతాయి. ప్రస్తుతం ఏపీ, తెలంగాణల్లోని అక్వేరియం దుకాణాలకు సరఫరా చేస్తున్నాం. హోటళ్లు, రెస్టారెంట్లలో అలంకరణకూ పెద్ద చేపలు విక్రయిస్తున్నాం. పెద్దవి ఒక్కొక్కటి రూ.5 వేల నుంచి రూ.25 వేలకు ఇస్తున్నాం. ప్రస్తుతం 6 ఎకరాల్లో 22 రకాల చేపలు పెంచుతున్నాం. దీన్ని విస్తరించాలని చూస్తున్నాం' అని ఈ కోనసీమ కుర్రాళ్లు తెలిపారు.

- ఈనాడు, కాకినాడ



దిల్లీలో గద్దలకు చికెన్



గణతంత్ర దిన వేడుకల నాడు దేశ రాజధాని నగరంలో నిర్వహించే విమానాల విహంగ విన్యాసాలకు ఆటంకం లేకుండా చూసేందుకు దిల్లీ అటవీశాఖ సిద్ధమవుతోంది. ఈ సారి 1,275 కిలోల బోన్‌లెస్ చికెన్ ముక్కలతో గద్దలకు ఎర వేసి, ఎయిర్ షో వేళ అవి ఆకాశంలో ఎగరకుండా చూడాలని అధికారులు భావిస్తున్నారు. "గతంలో ఇందుకోసం గేదె మాంసాన్ని ఉపయోగించేవాళ్లం. మొదటిసారిగా ఈ ఏడాది చికెన్ వాడాలని నిర్ణయించాం. జనవరి 15 నుంచి 26 దాకా నగరంలోని 20 చోట్ల ఈ ఏర్పాట్లు చేస్తాం. ఇలా చేయడం వల్ల ఎయిర్ షోలో కిందిస్థాయిలో ఎగిరే విమానాలకు పక్షులు అడ్డురాకుండా ఉంటాయి" అని అధికారులు వివరించారు.

-దిల్లీ

బరువు కాదు.. ముంచేది మాత్రే!

హైదరాబాద్‌కు చెందిన యువతి ఓ 5 కిలోల బరువు పెరిగింది. వైద్యుడిని సంప్రదిస్తే వ్యాయామం, ఆహారంతో బరువు తగ్గాలని సూచించారు. కానీ ఆ యువతి ఇంటర్నెట్‌లో బరువు తగ్గడానికి వినియోగించే ఔషధాల గురించి తెలుసుకుంది. 'జీఎల్‌పీ 1 ఎనలాగ్' మాత్రలు వాడింది. రెండు నెలల్లో బరువు కొద్దిగా తగ్గింది. మందులు మానేసిన నాలుగు నెలల్లో మళ్లీ బరువు పెరిగింది. ఎంతలా అంటే ఉండాల్సిన బరువు కంటే ఏకంగా 10 కిలోలు అధికమైంది. తీవ్ర అలసటతో పాటు ఇతర అనారోగ్య సమస్యలూ చుట్టుముట్టాయి. ఈసారి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాల్సి వచ్చింది.



80-90 శాతం మంది యువత ఊబకాయాన్ని సాధారణ పద్ధతుల ద్వారానే తగ్గించుకోవచ్చు. వీరిలో జీవక్రియలు మెరుగ్గా ఉంటాయి. అందుకే సహజసిద్ధంగా బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలే తప్ప.. ఇలాంటి ఔషధాల జోలికి వెళ్లొద్దు. ఒకవేళ ఊబకాయంతో ఇబ్బంది పడుతుంటే.. వైద్యుడి సలహా మేరకు మాత్రమే వాడాలి. - డాక్టర్ రాకేశ్ కలపాల.

నాజూగ్గా కనిపించాలనుకోవడం... బరువు తగ్గాలనుకోవడం తప్పుకాదు. కానీ తొందరగా ఫలితం సాధించాలన్న ఆత్రుతే కొంప ముంచుతుంది. సరైన వైద్య సలహా లేకుండా వాడే మందులే ప్రాణాంతకవుతాయి. మంచి అలవాట్లు, చక్కటి వ్యాయామ ప్రణాళికతో చక్కటి శరీరాకృతి సొంతం చేసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.



- '30 రోజుల్లో 10 కిలోలు తగ్గా... జీరోసైజ్ సాధించేశా.. దానికి ఫలానా మందులు వాడా...' అంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ చేస్తున్నారు. వాటిని చూసి కొందరు యువత ఆహారం, వ్యాయామం, జీవనశైలిలో మార్పులతో కాకుండా ఔషధాలతో బరువు తగ్గే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఏమాత్రం మంచి ధోరణి కాదు.
- జంక్‌ఫుడ్ వాడకాన్ని తగ్గించుకోలేక.. వ్యాయామాన్ని క్రమం తప్పకుండా చేయలేక.. ప్రత్యామ్నాయంగా ఈ ఔషధ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. మందులతో కొంత వరకు ఫలితాలు రావచ్చు... కానీ శరీరానికి, జీవక్రియలకు శాశ్వత నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ఏంటీ... జీఎల్‌పీ I ఎనలాగ్స్?



- 'జీఎల్‌పీ 1 ఎన్‌లాగ్' ఓ ఔషధం. ఇది 'జీఎల్‌పీ' అనే షుగర్ వ్యాధి హార్మోన్‌పై నేరుగా పనిచేసి షుగర్ వ్యాధిని నియంత్రిస్తుంది. ఈ ఔషధం.. ఆకలిని తగ్గించేస్తుంది. కొంచెం తినగానే ఎక్కువ తిన్నట్టు అనిపిస్తుంది. జీర్ణక్రియ కూడా నెమ్మదిస్తుంది. దీంతో ఇన్సులిన్ పనితీరు మెరుగై షుగర్ స్థాయులు నియంత్రణలోకి వస్తాయి. దీనివల్ల బరువు కూడా తగ్గవచ్చని తేలడంతో ఊబకాయులకు ఈ ఔషధాన్ని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా షుగర్, ఊబకాయం.. రెండూ ఉన్నవారిలో ఇది బాగా పనిచేస్తుంది.
- వైద్యుల సలహా లేకుండా దీన్ని వాడకూడదు. కానీ, కొందరు యువత ప్రిస్క్రిప్షన్ లేకుండా, ఇష్టానుసారంగా మెడికల్ షాపుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. బరువు తగ్గించుకోవడానికి మూణ్నాలుగు ఇంజక్షన్లు తీసుకోవడం.. తర్వాత ఆపేయడం చేస్తున్నారు. ఫలితంగా తాత్కాలికంగా బరువు తగ్గినా ఔషధాలు ఆపేయగానే.. ఆకలి రెట్టింపై, ఎక్కువ తినేస్తున్నారు. మళ్లీ బరువు పెరుగుతున్నారు. మందులు వాడి 2 కిలోలు తగ్గితే.. ఆపేసిన తర్వాత 5 కిలోలు పెరుగుతున్నారు.



- బరువు తగ్గించుకోవడం కోసం 'జీఎల్‌పీ-1 ఎనలాగ్' ఔషధాలను ఇప్పుడు వినియోగించడం ట్రెండ్‌గా మారింది. వీటితో ఎంత వేగంగా బరువు తగ్గుతారో.. ఆపేస్తే అంతకంటే వేగంగా తిరిగి బరువు పెరుగుతారు. దీనివల్ల ప్రయోజనం కంటే.. అనర్థాలే ఎక్కువ అంటున్నారు ఏఐజీ హాస్పిటల్స్‌లో సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ రాకేశ్ కలపాల.

సైడ్ ఎఫెక్ట్‌లు చాలా...?

- కండర పుష్టి దెబ్బతినే అవకాశం ఉంది.
- బాగా నీరసం ఆవహిస్తుంది.
- కఠిన వ్యాయామాలను చేయలేరు.
- పొట్ట ఉబ్బరం, తేన్పులు, వికారం
- తీవ్రమైన నీరసం, మలబద్ధకం
- పోషకాహార లోపం ఏర్పడే అవకాశం ఉంది.
- ఇప్పటికే జీర్ణకోశ సమస్యలున్న వారు ఈ ఔషధాలను అసలు తీసుకోకపోవడం మంచిది.
- ఎక్కువ రోజులు వాడితే కొందరిలో 'ఆప్టిక్ న్యూరైటిస్' అనే కంటి సమస్య కూడా వస్తుందని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది.
- పిల్లలకు ఈ ఔషధాలను వినియోగించడం మంచిది కాదు.
- థైరాయిడ్ క్యాన్సర్, క్లోమగ్రంథి క్యాన్సర్ ఉన్నవారు కూడా ఈ ఔషధాలను వాడొద్దు.

– లండన్‌లోని 'కింగ్స్ కాలేజ్' పరిశోధకులు వెల్లడించిన అధ్యయనంలో, కాస్మెటిక్ కారణాలతో మందులు వాడిన యువతలో 60 శాతం మంది.. మందులు మానేశాక ఆరు నెలల్లో పూర్వంకంటే ఎక్కువ బరువు పెరిగినట్లు వెల్లడైంది.

సహజ మార్గాలే మేలు...



- ప్రొటీన్స్, ఫైబర్, హెల్దీ ఫ్యాట్స్ ఉండే సమతులాహారాన్ని తీసుకోవాలి.
- సాధ్యమైనంత వరకూ జంక్‌ఫుడ్‌కు, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.
- రోజూ క్రమం తప్పకుండా కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- నిద్ర, మానసిక ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి.

ఇలా చేస్తే 3-6 నెలల్లో ఆరోగ్యకరంగా బరువు తగ్గవచ్చు.

– గుర్తుంచుకోండి... అధిక బరువు తగ్గడానికి మందులు చివరి ప్రయత్నం మాత్రమే. అది కూడా వైద్యుల సలహా మేరకే వాడాలి.

- ఈనాడు, హైదరాబాద్

రాష్ట్రంపై 'పట్టు' చిక్కేలా!



పొందూరు ఖద్దరు.. ఉప్పాడ చీరలు.. మంగళగిరి సిల్క్.. ధర్మవరం పట్టు.. ఇలా రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాంతం ఒక్కో రకమైన వస్త్రానికి పేరు గాంచింది. ఈ వైవిధ్యం అందరికీ తెలిసేలా రాష్ట్ర చేనేత, జౌళిశాఖ అధికారులు ఏ జిల్లా ఏ వస్త్రానికి ప్రత్యేకమో తెలుపుతూ రాష్ట్ర చిత్రపటాన్ని రూపొందించారు. ప్రస్తుతం పిఠాపురంలోని సంక్రాంతి సంబరాల స్టాల్‌లో సందర్శకులకు అందుబాటులో ఉంచారు.

- ఈనాడు, కాకినాడ

తెరవెనుక అపచారం.. తెర ముందు విచారం

- తిరుమల పవిత్రతపై పక్కా ప్రణాళికతో దాడి
- కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకేనా?

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుమల క్షేత్రం ప్రశాంతతకు, పవిత్రతకు మారుపేరు. అలాంటి చోట కొద్ది రోజులుగా జరుగుతున్న వరుస ఘటనలు చూస్తుంటే.. ఇవి యాదృచ్ఛికంగా జరుగుతున్నవి కావని, దీని వెనుక ఏదో 'కనిపించని హస్తం' ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలమయ్యాయని, హిందూ ధర్మానికి రక్షణ లేదని చిత్రీకరించేందుకు ఓ వర్గం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉన్నప్పుడు కూడా తిరుమలలో ఇలాంటి అపశ్రుతులే చోటుచేసుకున్నాయి. అప్పట్లో రమణదీక్షితుల వ్యవహారంలో అనేక ఆరోపణలతో ప్రభుత్వాన్ని బదనాం చేశారు. తాజాగా భూదేవి కాంప్లెక్స్ వద్ద మద్యం సీసాలు దొరకడం, శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించడం, తిరుమలలో అన్యమత ప్రార్థనలు చేయడం, అలిపిరి వద్ద మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి లేవనెత్తిన విష్ణుమూర్తి విగ్రహం వివాదం.. వంటివి చాలానే జరిగాయి. ఈ ఘటనలన్నీ ప్రభుత్వాన్ని, తితిదే పాలకమండలిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్నవేనని, దీని వెనుక వైకాపా సానుభూతిపరుల హస్తం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

పటిష్ఠ నిఘాలోనూ చొరబాట్లా?

అలిపిరి తనిఖీ కేంద్రం కట్టుదిట్టమైన భద్రతా ప్రదేశాల్లో ఒకటి. అయినా వందల సంఖ్యలో మద్యం సీసాలు, వేల గుట్కా ప్యాకెట్లు కొండపైకి ఎలా వెళ్తున్నాయి? తనిఖీ సిబ్బంది కళ్లుగప్పారా? లోపలి నుంచి ఎవరైనా సహకరిస్తున్నారా? అన్న కోణంలో విచారణ సాగుతోంది. మరోవైపు తితిదే విజిలెన్స్ విభాగం 2025-26లో సేకరించిన డేటా సైతం తీవ్రతకు అద్దం పడుతోంది. అలిపిరి తనిఖీ కేంద్రంలో మద్యం, గంజాయితోపాటు 161 డ్రోన్ కెమెరాలు పట్టుపడటం, అంతకు మించి కళ్లజోడులో అమర్చిన 46 స్పై కెమెరాలు దొరకడం పరిస్థితికి అద్దం పడుతోంది. సాధారణ భక్తులు స్పై కెమెరాలతో ఎందుకు వస్తారు? తిరుమలలో రహస్య వీడియోలు తీసి, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేందుకే వీటిని తెస్తున్నారా? అన్నది ప్రధాన ప్రశ్న. తిరుమల మద్యం సీసాల కేసులో పట్టుబడిన నిందితులను విచారిస్తున్న పోలీసులు.. వారు ఎవరి ప్రోద్బలంతో ఈ పనులు చేస్తున్నారనే కూపీ లాగుతున్నారు.

ఎగురుతూ నేల రాలుతున్న కాకులు

- చెన్నైవాసుల్లో భయాందోళన


నేలపై పడి మృతిచెందిన కాకి

చెన్నై, న్యూస్‌టుడే: గాల్లో ఎగురుతున్న కాకులు ఉన్నట్టుండి నేల రాలుతున్న ఘటనలు చెన్నైలోని అడయారు ప్రాంతంలో చోటుచేసుకుంటున్నాయి. ఇందిరానగర్ పార్కులో కొన్ని రోజులుగా..ఎగురుతున్న కాకులు అకస్మాత్తుగా నేలపై పడిపోతున్నాయి. ఎగరలేని పరిస్థితిలో ఉంటూ అవి ఒకట్రెండు రోజుల్లో చనిపోతున్నాయి. ఇదేదో వైరస్ వల్ల జరుగుతోందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చెన్నై మహానగర పాలక సంస్థ (జీసీసీ) అధికారులు చనిపోయిన కాకులను పరీక్షల నిమిత్తం తమిళనాడు యూనివర్సిటీ ఆఫ్ వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ (తానువాస్)కు పంపారు. విషాహారం, కలుషిత నీరు తాగటం వాటి మరణానికి కారణం కావచ్చని జోన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షీలా అభిప్రాయపడ్డారు.

మారుమూల ప్రాంతాల్లో పోలీస్ కమ్యూనికేషన్‌కు 'రేస్' వాహనాలు

ఈనాడు, అమరావతి: మొబైల్ నెట్‌వర్క్ కవరేజీ, కమ్యూనికేషన్ సరిగ్గా లేని ప్రాంతాల్లో వాటిని మెరుగుపరుచుకునేందుకు వీలుగా రిమోట్ ఏరియా కమ్యూనికేషన్ ఎన్‌హాన్స్‌మెంట్ వాహనాలు, కమ్యూనికేషన్ పరికరాలను (రేస్) డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా శుక్రవారం ప్రారంభించారు. రూ.2 కోట్లతో కొనుగోలు చేసిన కార్లు, ద్విచక్రవాహనాలతో పాటు కమ్యూనికేషన్ పరికరాలను 8 జిల్లాలకు పంపిణీ చేశారు. డీజీపీ మాట్లాడుతూ.. ఈ వాహనాలు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా పోలీసు కమ్యూనికేషన్‌కు ఆటంకం లేకుండా ఉండేందుకు దోహదపడతాయని చెప్పారు. శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


జెండా ఊపి వాహనాలు ప్రారంభిస్తున్న హరీశ్‌కుమార్ గుప్తా

ఏడు నిమిషాల్లోనే శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్ పూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం తితిదే శుక్రవారం ప్రారంభించిన శ్రీవాణి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో రోజువారీ కోటా 800 టికెట్లు జారీ చేయగా.. భక్తులు ఏడు నిమిషాల్లోనే కొనుగోలు చేశారు. టికెట్లు పొందిన భక్తులకు సాయంత్రం 4 గంటల నుంచి దర్శనం కల్పించారు. తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో ఆఫ్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ విధానంలో రోజుకు 200 శ్రీవాణి టికెట్ల జారీని కొనసాగిస్తున్నారు.

నూతన విధానం ఇలా..: భక్తులు నేరుగా తితిదే యాప్ ttdevasthanams, లేదా వెబ్‌సైట్ http://ttdevasthanams.ap.gov.in లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో శ్రీవాణి టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్లాట్ అందుబాటులో ఉంటుంది. ఒక టికెట్‌పై గరిష్ఠంగా నలుగురు మాత్రమే బుక్ చేసుకోవాలి. ఆధార్ ధ్రువీకరణ అనంతరం రూ.10,500 చెల్లించి టికెట్ పొందిన భక్తులు అదేరోజు సాయంత్రం 4 గంటల్లోగా తిరుమలలోని క్యూలైన్ ప్రవేశ ద్వారం వద్ద రిపోర్ట్ చేయాలి. అంటే.. నిర్దేశిత సమయానికి తిరుమలకు చేరుకొనే వారికి మాత్రమే శ్రీవాణి కోటా ఉపయోగపడనుంది.

వసుంధర

vasundhara@eenadu.in

ఫ్రీలాన్సర్లు పెరుగుతున్నారోచ్..!



పెళ్లి, పిల్లలు, కుటుంబ బాధ్యతలు ఇలా అమ్మాయిలు, మహిళల కెరియర్‌కు అడ్డుకట్టలెన్నో. ఈతరం ఆ సవాళ్లను దాటి ముందుకు సాగుతోంది. తమ తమ రంగాల్లో ఫ్రీలాన్సింగ్ ఆప్షన్లను వెతుకుతోంది. దీనివల్ల వాళ్ల పనికీ బ్రేక్ పడటం లేదు. రెజ్యూమెలోనూ గ్యాప్‌లకు చోటుండటం లేదు. తాజా అధ్యయనాల ప్రకారం... గిగ్ వర్కర్లుగా పనిచేస్తున్న ప్రతి ఐదుగురిలో ఒకరు మహిళే. దాదాపు అన్ని విభాగాల్లో 84శాతం మంది మహిళలు ఫ్రీలాన్సర్లుగా ఉన్నారు. మార్కెటింగ్, వెబ్, గ్రాఫిక్ డిజైనింగ్ రంగాల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా సంపాదిస్తున్నారట. వీళ్ల సేవలు పొందడానికి కొన్ని సంస్థలు ప్రత్యేక విభాగాల్ని కూడా రూపొందిస్తున్నాయి. వీళ్లలో 80శాతం మంది ఇంటి నుంచి పనిచేస్తుంటే, 17శాతం మంది కాఫీ షాపులు, కోవర్కింగ్ స్పేస్‌లు, లైబ్రరీల్లో పనిచేస్తున్నారట. అంతేకాదు స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి పథకాల ద్వారా వ్యాపారాలను ప్రారంభిస్తూ... ఫ్రీలాన్సింగ్ చేయడానికి మక్కువ చూపిస్తున్న మహిళలూ ఎక్కువేనట. వీళ్లలో 70శాతం మంది 35ఏళ్లలోపు వారు కాగా, 21 శాతం మంది 25 ఏళ్లలోపు వారేనట. వ్యక్తిగత జీవితంకోసం వృత్తిగత జీవితాన్నీ, వృద్ధినీ వదిలేసుకోకుండా... మీరు పనిచేస్తున్న రంగాల్లో ఫ్రీలాన్సింగ్ అవకాశాలు ఉన్నాయేమో వెతికేయండి మరి!



రమ్య

అంతరిక్ష లోతుల్ని సైతం జల్లెడపట్టేసే మనిషి... కొన్నిసార్లు అంతరంగాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక చతికిలపడతాడు. ఇదే విషయం రమ్య ఎల్లాప్రగడని ఆలోచనల్లో పడేసింది. మెదడుపైన పరిశోధించేలా ప్రేరేపించింది. ఆమె ఆవిష్కరించిన పరికరం మానసిక చికిత్సలో కీలకంగా మారింది. ఫోర్బ్స్ ఇండియా సైతం ఈమెకు 30 అండర్-30లో చోటు కల్పించింది. వసుంధరతో తన ప్రయాణాన్ని రమ్య పంచుకున్నారిలా...

మనసు లోతుల్ని చూడాలని..!

ఇంజినీరింగ్ రెండో సంవత్సరం తర్వాత దిల్లీ అడోబీలో ఇంటర్న్‌షిప్ చేశా. వాళ్లు చేస్తున్న పని, ఆ వాతావరణం అద్భుతంగా అనిపించాయి. ఉద్యోగం కోసం ఫైనలియర్‌లోనూ ఇంటర్న్‌షిప్ చేయాలనుకున్నా. రెండోసారి అదే పని బోరింగ్‌గా అనిపించింది. ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ కలిగించడమే కాదు, వృత్తిలో ప్రతి ప్రయోజనం ఉండాలనిపించింది. తర్వాత నా ప్రయాణం ఓ కొత్త మలుపు తీసుకుంది.

నాన్న వేణుగోపాల్ ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్‌గా చేశారు. అమ్మ లక్ష్మి గృహిణి. తాత వాళ్లది రాజమహేంద్రవరం. నాన్న ఉద్యోగ రీత్యా దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాలు తిరిగాం. 6-8 తరగతులు హైదరాబాద్‌లో, తొమ్మిది నుంచి ఇంటర్మీడియట్ వరకూ వైజాగ్‌లో చదువుకున్నా. ఐఐటీ దిల్లీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చేశా. నాకు అంతరిక్షం కంటే కూడా మనల్ని మనం తెలుసుకోవడమే ముఖ్యమనిపిస్తుంది. ఇంజినీరింగ్‌లో కంప్యుటేషనల్ బయాలజీని ఎంచుకుని న్యూరోసైన్స్ బ్రెయిన్ పనితీరుమీద పరిశోధించా. మా కుటుంబంలోనూ ఒకరు మానసిక సమస్యతో ఇబ్బంది పడటంతో దానిపైనే పనిచేయాలని ఆంత్రప్రెన్యూర్‌షిప్ దారిని ఎంచుకున్నా.

మందులకంటే మిన్నగా

2019లో ఇంజినీరింగ్ పూర్తయింది. దిల్లీలోని 'ఫ్లక్ష్ యూనివర్సిటీ', యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా-బర్కిలీతో కలిసి నిర్వహించే 'టెక్ లీడర్స్ ఫెలోషిప్'కి 2020లో ఎంపికయ్యా. అక్కడ మంచి మెంటార్‌షిప్ దొరికింది. ఏం చేయాలనేదానిపైన స్పష్టత వచ్చింది. లక్ష్య సహగల్ పరిచయమైంది అప్పుడే. ఇద్దరం ఈ ప్రాజెక్టుమీద పనిచేయాలనుకున్నాం. మెదడు ఒక విద్యుత్, రసాయన అవయవం. మానసిక సమస్య వస్తే రసాయన, విద్యుత్‌తోపాటు బిహేవియర్ అంశాల్లో చిక్కులు ఏర్పడతాయి. వైద్యులు సాధారణంగా మందులతో రసాయన విభాగానికే చికిత్స చేసి, మౌలిక సదుపాయాల్లేక విద్యుత్ విభాగాన్ని నిర్లక్ష్యం చేస్తారు. దాంతో మెదడులో కొంత అసమతుల్యత అలానే ఉంటుంది. మందులతోపాటే సురక్షితమైన విద్యుదుత్తేజాన్నీ మెదడుకు అందిస్తే తొందరగా కోలుకుంటారు. దీన్నే న్యూరో మాడ్యులేషన్ అంటారు. కుంగుబాటు, ఒత్తిడి, వ్యసనం, ఓసీడీ లాంటి అన్ని మానసిక చికిత్సల్లోనూ ఇది భాగం. ఈ తరహా చికిత్సను టీడీసీఎస్(ట్రాన్స్‌క్రేనియల్ డైరెక్ట్ కరెంట్ స్టిమ్యులేషన్) అంటారు. ఈ పరికరం ఖరీదు రూ.కోటిపైనే ఉంటుంది. దాంతో పెద్ద హాస్పిటల్స్‌లో మాత్రమే ఉంటున్నాయి. దీనికి చాలా ఎక్కువ మొత్తం చెల్లించాలి. ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకే ఓ పరికరాన్ని చేయాలనుకున్నాం.

పదోవంతుకే చికిత్స

2021... కొవిడ్ తీవ్రంగా ఉంది. అయినా, దిల్లీలోని ఓ ప్రఖ్యాత హాస్పిటల్‌లో నాలుగు నెలలు పరిశోధనను కొనసాగించాం. మా నమూనా పరికరాన్ని అక్కడ ప్రయోగించాం. 25 మందిమీద పది రోజులపాటు రోజుకు రెండు సార్లు విద్యుత్తేజాన్ని కలిగిస్తే... 63.8 శాతం డిప్రెషన్ స్కోరు తగ్గడం గుర్తించాం. దీన్లో సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఈ ఫలితాలు రావడానికి మందులతో కొన్ని వారాలు పడుతుంది. హెడ్‌సెట్‌లాగా ఉండే ఈ పరికరం పేరు 'ఈజ్'. దీని డిజైన్‌పైన మాకు పేటెంట్లు ఉన్నాయి. గురుగ్రామ్‌లోనే తయారుచేస్తున్నాం. మార్కెట్ ధరలో పదోవంతుకే సేవల్ని అందిస్తున్నాం. కొందరు వైద్యులతో కలిసి పనిచేస్తున్నాం. కొన్నిచోట్ల టెక్నీషియన్‌ను మేమే పంపి సేవలు అందిస్తాం. దీనికి భారత్, అమెరికా వైద్య మండలి అనుమతులు ఉన్నాయి. పక్షవాతం వంటి న్యూరాలజీ సమస్యల్ని దృష్టిలో పెట్టుకుని రెండో ఉత్పత్తిని తేబోతున్నాం. స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని శ్రమిస్తే వయసుతో సంబంధంలేకుండా ఎవరైనా విజయం సాధించవచ్చు.

పరిఘాసనం



దీన్ని గేట్‌పోజ్ అనీ అంటారు. ముందుగా యోగామ్యాట్‌పైన వజ్రాసనంలో మోకాళ్లపైన కూర్చోండి. మోచేతులను తుంటి పక్కనే పెట్టండి. ఇప్పుడు ఎడమ కాలిని, కుడి మోకాలికి అనుగుణంగా పక్కకు చాపండి. అలాగే ఎడమ కాలి వేళ్లను నేలమీద ఆనించిపెట్టండి. ఎడమ మోకాలు దగ్గర వంగకుండా జాగ్రత్త పడండి. కుడి తుంటిని నేరుగా మోకాలిపై ఉండేట్టు సమాంతరంగా వంచండి. గాలి తీసుకుంటూ కుడి చేతిని పైకి లేపండి. ఇప్పుడు గాలి వదులుతూ కటి భాగం, ఛాతీని సాగదీస్తూ ఎడమ పక్కకు వంగండి. ఎలాంటి కుదుపులు లేకుండా నిదానంగా వెళ్లండి. ఎడమ చేతిని, ఎడమ కాలిపై నిలువుగా చాచి కాలిని పట్టుకోండి. వెన్నెముకను సాగదీయండి. ఆసనంలో ఉంటూ 5-10 శ్వాసలు తీసుకోండి. తర్వాత వెళ్లిన మార్గంలోనే మెల్లగా వెనక్కి వచ్చి ఆసనాన్ని విరమించేయండి. 2 నిమిషాలు విశ్రాంతి తీసుకున్నాక రెండోవైపు ప్రయత్నించండి.

ఉపయోగాలు: కటి భాగంలో ఉన్న కొవ్వును కరిగిస్తుంది. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది. పట్టేసిన ఛాతీ కండరాలను విడుదల చేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలర్జీలను తగ్గిస్తుంది.

జాగ్రత్తలు: పక్కటెముక, భుజం, మోకాళ్లలో గాయాలున్న వాళ్లు, వెన్ను, గుండె సర్జరీలు అయినవాళ్లు చేయకూడదు.

ఆహారం: దాల్చిన చెక్కను ఆహారంలో చేర్చండి. ద్రాక్షపండ్లు, పుచ్చకాయతోపాటు ఫైబర్ అధికంగా ఉండే వాటినీ తీసుకోండి.

- శిరీష, యోగ గురు

ఊరేగింపు... బుట్ట బొమ్మలు!



సంక్రాంతి ముచ్చట్లు

నేను పుట్టింది తణుకు అయినా పెరిగిందీ, చదువుకుందీ నర్సాపురంలో. ఆ రోజుల్లో ఊళ్లల్లో కరెంటు లేదు. అయినా ధనుర్మాసం రోజుల్లో భోగి మంటలతో వెలుగులు నిండేవి. తెల్లవారుజామున 4గంటలకే ఆవు పేడతో చేసిన పిడకలతో పిల్లలు భోగిమంటలు వేసేవాళ్లు. తరవాత పెద్ద వాళ్లు పెద్ద పెద్ద దుంగలు వేసేవాళ్లు. స్నానాదికాలు పూర్తిచేశాక ఎంబెరుమానార్ కోవెలకు వెళ్లేవాళ్లం. శ్రీరంగం నుంచి స్వామివారిని తెచ్చిమరీ ఇక్కడ ప్రతిష్ఠ చేశారట. ఇది నర్సాపురం ప్రత్యేకత. సాయంత్రం గొబ్బిళ్లు పెట్టి, అమ్మాయిలమంతా గొబ్బి తట్టి పాటలు పాడేవాళ్లం. చిన్నపిల్లలకు భోగి పళ్లు పోయడంతో ఆరోజు పూర్తి. సంక్రాంతికి బొమ్మల కొలువులు... పేరంటాళ్లు, పిల్లలతో ఇళ్లు కళకళలాడేవి. సంక్రాంతి, కనుమ, ముక్కనుమకు కోవెలకు వెళ్లడం తప్పనిసరి. అక్కడ పిల్లలకు దేవుడికి విసరమని వింజామరలు ఇచ్చేవాళ్లు. అలా విసిరి, కట్టెపొంగలి ప్రసాదం తెచ్చుకోవడం, తెల్లవారుజామునే పోటీపడి పెద్ద పెద్ద ముగ్గులేయడం, కనుమనాడు రథం ముగ్గు పక్కవాళ్లతో కలపడం... ప్రతిదీ ప్రత్యేకమే! ఈ పండుగ రోజుల్లో తెల్లవారు జామున దేవుడి ఊరేగింపు వచ్చేది. దీంట్లో బుట్ట బొమ్మలు వగైరా వచ్చేవి. ఇవి కూడా మా నర్సాపురం ప్రత్యేకతే!



- యెండూరి హనుమావతి, కాకినాడ

బానోతు నీహా, హైదరాబాద్... జ్ఞాపకం ఈ-పేపర్‌లో!

ఎలా ప్రారంభించాలి?

మనీ మంత్ర

చాలామంది మహిళలు ఉద్యోగ, వ్యాపారాల్లో సంపాదిస్తున్నారు. ఆర్థిక స్వతంత్రం కోసం పొదుపుతోపాటు పెట్టుబడులకూ సిద్ధమవుతున్నారు. కానీ ఏదో భయం, అపనమ్మకం వాళ్లను ముందడుగు వేయనీయడంలేదు. ఆ పరిస్థితిని అధిగమించాలంటే...



- ముందు తెలిసిన ఒక మదుపు విధానాన్ని ఎంచుకుని అడుగు వేయండి. అందుకు మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమం.
- ఒకట్రెండు నెలల ఖర్చులకు సరిపడా మొత్తాన్ని మీ దగ్గర ఉంచుకున్నాకే పెట్టుబడులకు సిద్ధమవ్వండి.
- స్పష్టత ఉంటేనే ప్రణాళికలు వేయగలరు. ముందు మీ ఆర్థిక లక్ష్యాలను ఒకచోట రాసుకోండి.
- నిస్సందేహంగా ప్రశ్నలు అడగండి. నిపుణులు కూడా ఏదో ఒక రోజు ఒకటి నుంచీ మొదలుపెట్టినవాళ్లే.
- పనిచేసే చోట ఇన్సూరెన్స్, పీఎఫ్, ఇతర రకాల ప్రయోజనాలనూ అడిగి తెలుసుకోండి.
- వీలైతే మహిళలకు మాత్రమే అందుబాటులో ఉండే అవగాహన సదస్సులకు హాజరవ్వండి. మార్కెట్ నిపుణులు వాడే పదాలకు బెదిరిపోకండి. నిర్మొహమాటంగా ప్రతిదాని గురించీ విడమరచి చెప్పమనండి. పథకం పూర్తిగా అర్థమైతేనే అటుగా వెళ్లండి.
- మూడు నెలలకోసారి మీ ప్రణాళికల్ని బేరీజు వేసుకోండి. కొత్త విషయాలు తెలుసుకుంటూనే ఉండండి. అనుభవం సాధించినకొద్దీ ధైర్యంగా అడుగులు వేయగలరు. మహిళలు ఆర్థిక విజయం సాధిస్తే, కుటుంబాలూ ఆర్థికంగా బలోపేతమవుతాయి.

రంగవల్లిక



19 చుక్కలు
19 వరుసలు



మద్దుల పద్మావతి, తెనాలి

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.

9154091911కు వాట్సాప్ చేయొచ్చు.
vasundhara@eenadu.in

గీతారెడ్డి, శ్రీవర్షిణిల ముగ్గులను ఈ-పేపర్‌లో చూడవచ్చు

బంగారం - వెండి



9న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,41,900	1,27,550	2,50,357
విజయవాడ	1,36,670	1,27,180	2,47,000
ప్రొద్దుటూరు	1,40,700	1,29,440	2,49,200
రాజమహేంద్రవరం	1,39,310	1,27,700	2,68,000
విశాఖపట్నం	1,39,300	1,27,700	2,51,000
తమిళనాడు	-----	1,28,000	2,68,000

పండక్కి వెళ్తుంటే..



కాలేజ్ హాస్టల్ క్రమశిక్షణ నుంచి.. పీజీల్లో ఇరుకైన గదుల నుంచి.. షేరింగ్ రూమ్స్‌లో వంట తిప్పల నుంచి.. సిటీల్లో ట్రాఫిక్ కష్టాల నుంచి.. వచ్చే వీకంతా విముక్తి!

పల్లెటూర్లో ఫ్రెండ్స్‌తో సరదాలు.. అమ్మ చేతి పిండి వంటలు.. సినిమాలు, షికార్లు.. బంధువులతో బాతాఖానీలకు.. ఇప్పటికే మనం బ్యాగేసుకుని రెడీ అయిపోయుంటాం.

అయితే ఈ సంక్రాంతిలో వీటితోపాటు ఇంకొన్ని చేద్దామా!

సంక్రాంతి అంటే చాలు.. బ్యాచిలర్లకు ఊరి బెంగ పట్టుకుంటుంది. కొత్తజంటలకు బంధువుల పిలుపులందుతాయి. అందుకే చదువుతున్నా, జాబ్స్ చేస్తున్నా మనలో చాలామంది పండక్కి సొంతూళ్లకు వెళ్తుంటారు. అయితే ఈ పండగ కేవలం సంప్రదాయమే కాదు, మనల్ని రీఛార్జ్ చేసే ఓ అద్భుతమైన అవకాశం! రోజువారీ ఒత్తిళ్ల నుంచి తేరుకుని.. మళ్లీ వచ్చే ఏడాది వరకూ ఫుల్ జోష్‌లో పనిచేయగలిగేలా దీన్ని ఉపయోగించుకోవచ్చు అంటారు సైకాలజిస్ట్ క్రాంతికార్. అది ఎలా అంటే..

డిజిటల్ దూరం: ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు లేకపోతే మనకి ఎక్కడ గడుస్తుంది చెప్పండి? కానీ ఈసారి పండగ మూడు రోజులైనా ఆ డిజిటల్ ప్రపంచానికి కాస్త దూరంగా ఉందాం. మనుషులకు దగ్గరగా, ప్రకృతితో మమేకమై గడుపుదాం. రోజూ చేయనివి, కొత్త కొత్త పనులు చేస్తే ఎలా ఉంటుందో ట్రై చేద్దాం. సంతోషం, ఎంగ్జైట్‌మెంట్ కలగలిసేలా ఉండటానికి ఈ సమయం చక్కని వేదిక. ఫోన్లో ఏఐ చిన్నపిల్లల వీడియోలు చూడటం కంటే.. వీధిలో ఉన్న పిల్లలతో నేరుగా ఆటలాడితే కలిగే ఆనందం ఏంటో తెలుసుకుందాం. డిజిటల్ డీ అడిక్షన్‌కి దారులేద్దాం!



రోల్‌మోడల్స్ : మనకు చిన్నప్పుడు పాఠం చెప్పిన టీచర్లు, ఊరికి పెద్దదిక్కుగా ఉండే వయోధికులు, ఒంటరిగా వ్యాపారాలను నడిపించే మహిళలు.. ఇలా ఊళ్లలో ఎంతోమంది నుంచి మనం కొత్త జీవితపాఠాలు నేర్చుకునే అవకాశం ఉంది. ఇలాంటి వారిని పలకరించి మాట్లాడాలి. ఇది మన కమ్యూనికేషన్ స్కిల్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌ను పెంచేందుకు ఉపయోగపడుతుంది.

బంధమెంత గట్టిదో..: తిన్నామా పడుకున్నామా తెల్లారిందా అనే కాన్సెప్ట్‌కి పండగ రోజుల్లో చెల్లుచీటీ ఇచ్చేయాల్సిందే. మైండ్‌ను రీసెట్ చేసుకోవడానికి, లైఫ్‌స్టైల్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవడానికి ఇదో చక్కని సమయం. కుటుంబం, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు.. వీరందరితో అనుబంధాన్ని మరింత పదిలం చేసుకోవడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఒంటరితనం ఆవహించకుండా మిగతా టైమ్‌లో మనల్ని కాపాడేది.. ఈ పండగల్లో మనం చేసుకునే స్నేహాలే కావొచ్చు! అలాగే పెద్దవాళ్ల దగ్గర కూర్చోవాలి. వారి జీవితగాథలు వినాలి. పనుల్లో సాయం చేయాలి. పొలాల్లో, తోటల్లో, ప్రకృతి మధ్య తిరగాలి. మన మూలాలను మరోసారి తాకి రావాలి. 'స్ట్రాంగ్ రూట్స్ క్రియేట్స్ స్ట్రాంగ్ మైండ్స్' అనేది ఓ జీవన విధానం. అందుకే మన పునాదులను మరింత బలోపేతం చేసుకుందాం.

ఊరిని..: మన ఊరిని, అక్కడ ఉండే మనుషుల జీవన విధానాన్ని గమనించడం ద్వారా.. సిటీల్లో మనం ఎదుర్కొనే చాలా సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవచ్చు. వ్యవసాయ, పాడిపరిశ్రమ, అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు, స్టార్టప్ ఆలోచనలకు దీని ద్వారా బీజం పడవచ్చు. ఇప్పటికే ఎందరో యువత ఇలా సంప్రదాయ రంగాలవైపు మళ్లుతూ తాము అధిక లాభాలు ఆర్జించడంతోపాటు పది మందికి ఉపాధి సైతం కల్పిస్తున్నారు. పల్లెల ఆర్థిక వ్యవస్థలో టెక్నాలజీ ఆవిష్కరణలకు అవకాశాలున్నాయనేది నిపుణుల మాట. దీని ద్వారా కెరియర్‌ను కొత్త బాటలో నడిపించే వీలుందేమో పరిశీలించవచ్చు.



ఒక్కమాటలో చెప్పాలంటే.. ఈ సంక్రాంతి మనలో కొత్త కాంతిని నింపాలి. చేసేద్దామా మరి!

'నువ్వు బలహీనుడివి కాదు
నీకు నువ్వు తక్కువగా అనుకోవడమే నీ సమస్య
నేను భయాన్ని
అసహ్యించుకుంటా
బలహీనతను
పాపంగా భావిస్తా
ఉరకలేసే
ఉత్సాహంలో శక్తి,
ప్రేమలు నింపు
సేవ అంటే దానం కాదు, బాధ్యత
వేగంగా నడువు, కానీ ఓపికతో ఉండు
తప్పు చేయడానికి ధైర్యం ఉండకూడదు
సత్యం కోసం లేని తెగువ తెచ్చుకో
ఏది చేయాలి? ఏది వదిలేయాలి? ఎక్కడ మొదలుపెట్టాలి? తెలుసుకో!
భయమే అపజయం
నిశ్శబ్దంగా నిలబడు
నిన్ను నువ్వు నమ్ము
ఈరోజు నువ్వు
నీ భయాన్ని ఓడించావా?
నీ శక్తిని ఉపయోగించావా?
ఇతరులకు సాయం చేశావా?
ఈ ప్రశ్నలకు నీ సమాధానం అవునయితే..
నిన్నే నేను చూడాలనుకున్నది!!!'

జనవరి 12 - జాతీయ యువజన దినోత్సవం

...వివేకానందుడు చూపిన పథం ఇదే!

- జియోలక్ష్మణ్

ఈతరం

youthpage@eenadu.in

దానికీ ఓ లెక్కుంది



నచ్చినవారితో డేట్ చేయడం.. పెళ్లి వరకూ ప్రయాణించాలి అనుకోవడం మనలో చాలామంది చేసేదే. అయితే రిలేషన్‌షిప్ ఏ సమయంలో, ఏ దశలో ఉంటుంది అనడానికి ఒక లెక్క ఉంది అంటున్నారు నిపుణులు. ఇది తెలుసుకుంటే నిర్ణయాలను తదనుగుణంగా తీసుకోవచ్చు. ఇదే 3-6-9 డేటింగ్ రూల్.

★ డేటింగ్‌లో ఉన్న మొదటి మూడు నెలలు ఉత్సాహంగా ఉంటూ.. ఆకర్షణ, ఆసక్తులు, వివరాలు తెలుసుకోవడానికే సరిపోతుంది. దీనిని ఎట్రాక్షన్ దశగా చెబుతున్నారు. ఈ సమయంలో ఎదుటివారి తప్పులు అంతగా కనపడవు. అందువల్ల మెల్లగా వ్యక్తిత్వాన్ని గమనించడానికి ప్రయత్నించాలి.

★ తర్వాత వారిలో ఉన్న లోపాలను ఒక్కొక్కటిగా చూడటం మొదలుపెడతాం. కొన్నిసార్లు విభేదాలు తలెత్తడం, చిన్న చిన్న గొడవలు జరగడం కూడా అవుతూ ఉంటుంది. ప్రతి కాన్‌ఫ్లిక్ట్ నుంచి ఓ పాఠం నేర్చుకుంటాం. ఈ దశలో కొంత నమ్మకం, మానసిక అనుబంధం ఏర్పడుతుంది. వారి స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులతో పరిచయాలు జరుగుతాయి. దీన్ని ఒకరినొకరు అర్థం చేసుకునే దశగా చెప్పొచ్చు. ఇదంతా మూడు నుంచి ఆరు నెలల్లో జరుగుతుంది.

★ తర్వాత మరో మూడు నెలలు, అంటే మొత్తం తొమ్మిది నెలలు గడిచాక కెరియర్, ఆర్థిక పరిస్థితులు, జీవన విధానం, భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారు. ఈ దశ మీదనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఈ మొత్తం ప్రక్రియకు తగిన సమయం కేటాయించి, నిర్ణయాలు తీసుకోవడానికి తొందర పడకుండా నిదానంగా వ్యవహరించడం మేలంటున్నారు నిపుణులు.

ఆక్సిజన్‌తో నడిచే ఇంజిన్!

ఓవైపు చుక్కల్లో ఇంధనం ధరలు.. మరోవైపు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న భూమి.. వాహనదారులు, జనం బాధలు పందొమ్మిదేళ్ల కౌశిక్‌ని కలవరపాటుకు గురిచేశాయి.. తను ఆలోచించాడు.. అంతర్జాలాన్ని శోధించాడు, నిపుణులతో చర్చించాడు.. మూడున్నరేళ్లు తపస్సే చేశాడు.. 64 ప్రయత్నాలు విఫలమైనా పట్టువదలక ప్రయత్నించాడు.. ఆఖరికి ఆక్సిజన్‌తో పరుగులు పెట్టే ఇంజిన్‌ని రూపొందించాడు.. ఆ ఆవిష్కరణ మాకివ్వమంటూ 'టెస్లా', 'బీవైడీ'లాంటి దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీలు వెంటపడుతున్నాయి!

ఆటో మొబైల్ రంగంలో నిత్యం పరిశోధనలు జరుగుతూనే ఉంటాయి. పరిశోధన, అభివృద్ధి కోసం కంపెనీలు రూ.వేల కోట్లు వెచ్చిస్తూనే ఉంటాయి. వారెవరికీ సాధ్యం కాని ఆవిష్కరణ నేను చేశానంటున్నాడు కౌశిక్. వాతావరణంలో లభించే ఆక్సిజన్‌తో పరుగులు పెట్టే ఇంజిన్ నమూనాను తను రూపొందించాడు. ఇది అందుబాటులోకి వస్తే ఎలాంటి ఇంధనం లేకుండా కార్లు, మోటార్ సైకిళ్లను నడిపించవచ్చు. పెట్రోల్, డీజిల్ వాడాల్సిన పనే లేదు!

కేంద్రీయ విద్యాలయలో అడుగులు..: కౌశిక్ ఆవిష్కరణకు అతడి నేపథ్యమే కారణం. తన సొంతూరు తిరుపతి. నాన్న సీఆర్‌పీఎఫ్‌లో పని చేయడంతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కేంద్రీయ విద్యాలయలో 12వ తరగతి పూర్తి చేశాడు. అక్కడే 'అటల్ టింకరింగ్ ల్యాబ్' ద్వారా పలు ఆవిష్కరణలు చేసి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ ఎంజీ తరపున ఏఐ అసిస్టెంట్ బాట్ కోసం పని చేశాడు. ఈ అనుభవంతో పెట్రోల్, డీజిల్, విద్యుత్తు వినియోగించకుండా వాహనాలను నడిపేందుకు అవసరమైన ఇంజిన్‌ను కనుగొనాలని అనుకున్నాడు. తనను సీనియర్లు, అధ్యాపకులు ప్రోత్సహించారు. వారి సలహాలతో ప్రాజెక్టు మొదలు పెట్టాడు. ఈ-మెయిళ్ల ద్వారా ప్రఖ్యాత ఆటోమొబైల్ నిపుణుల సలహాలు తీసుకున్నాడు. మూడున్నరేళ్ల కిందట పనులు మొదలుపెడితే.. 64 వరకూ ప్రయత్నాలు విఫలమయ్యాయి. రూ.18 లక్షలు ఖర్చయ్యింది. కుమారుడిపై నమ్మకంతో కన్నవాళ్లు అడిగినంతా ఇచ్చారు. ఆఖరికి తను అనుకున్నది సాధించాడు. ఆక్సిజన్‌తో నడిచే నమూనా ఇంజిన్ సిద్ధమైంది. ఈ డిజైన్‌కి ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఇండియా పేటెంట్‌తోపాటు అంతర్జాతీయ పేటెంట్ దక్కింది.

టెస్లా, బీవైడీ సంప్రదించాయి

తను రూపొందించిన 'ఆపరేటింగ్ యాన్ ఆక్సిజన్ పవర్డ్ ఎనర్జీ ఫర్ వెహికిల్ ప్రాజెక్ట్' పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 90శాతం వరకూ కాలుష్యం తగ్గిపోతుంది. ఈ ఇంజిన్ 18ఏళ్ల వరకూ పనిచేస్తుంది. రెండేళ్లకోసారి సర్వీస్ చేయిస్తే చాలు. అంతర్జాతీయ పేటెంట్ దక్కిన తర్వాత దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీలు టెస్లా, బీవైడీలు కౌశిక్‌ను సంప్రదించాయి. మొత్తం ప్రాజెక్టు అప్పజెబితే ఊహించలేనంత మొత్తం ఇస్తామన్నాయి. కానీ అమెరికాలో ఆర్‌అండ్‌డీ చేసేందుకు, ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు మాత్రమే టెస్లాకి అనుమతి ఇచ్చాడు. భవిష్యత్తులో మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు చేయడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.



- పులి అనిల్‌రెడ్డి, సంగారెడ్డి

కులుకులొలికే కుర్తాలు



పండగ అంటే కుర్తాపైజామా వేసుకుని కళకళలాడిపోతుంటారు మన కుర్రాళ్లు. అయితే వీటిలో మనకు ఎక్కువగా దొరికేవి ప్లెయిన్, ఎంబ్రాయిడరీ, సీక్వెన్స్‌తో ఉండేవి. ప్రింటెడ్ ఉన్నా కానీ.. కలెక్షన్ లిమిటెడ్‌గా ఉంటుంది. కానీ ఈసారి ఫెస్టివల్ సీజన్‌లో ప్రింటెడ్ కుర్తాల్లో అదిరిపోయే డిజైన్లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. అంతేకాదు.. భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రింటెడ్ కుర్తాలు ఇప్పుడు ట్రెండింగ్‌లో కూడా ఉన్నాయి. కాటన్, లెనిన్, సిల్క్.. ఇలా రకరకాలైన మెటీరియల్స్‌లో సౌకర్యవంతంగా అలరిస్తున్నాయి. కొన్ని పాటర్న్స్‌లో జిప్పర్స్ కూడా ఉంటూ బ్లెండెడ్ లుక్‌ను తీసుకొస్తున్నాయి. మరి మీక్కూడా నచ్చింది వేసుకుని మెరిసిపోండి!





కొంటె కొటేషన్



1. కారులోన దొర.. కారుపైన సొర.. బతికుంటే అయ్యేవాడు ఎర! - దీప్తి, విజయవాడ
2. కారులో ఊరేగే చేపా.. అబ్బో నువ్వు అంత తోపా -యం.డి.సనా, కరీంనగర్
3. తెచ్చాను చేప మెండుగా.. చేసుకుందాం ఇక పండగ -అశోక్ కుమార్, హైదరాబాద్
4. షార్క్‌తో కావాలంటే సవారీ.. బుక్ చేసుకోండి ఈ ఫెరారీ - నునబర్తి ధనలక్ష్మి, వైజాగ్
5. కారుపై షికారు.. ఫిష్ భలే హుషారు - సన్యాసిరావు, శ్రీకాకుళం



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.